


ఈనాడు
విజయవాడ 9-7-2019 మంగళవారం సిటీ సంపుటి 45 . సంచిక 330
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi




# రైతు బాగుండాలి

## వారి కోసం ఎన్నో పథకాలు

వడ్డీ లేని రుణాలు.. ప్రీమియం కట్టకుండానే పంటల బీమా

5 నాఫెడ్ కేంద్రాల ద్వారా కొబ్బరి కొనుగోళ్లు

మార్కెట్ కమిటీలకు గౌరవ ఛైర్మన్లుగా ఎమ్మెల్యేలు

జమ్మలమడుగు బహిరంగ సభలో సీఎం జగన్ ప్రకటన

సెప్టెంబరు 1 నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు

ఈనాడు డిజిటల్ - కడప

తమది రైతు శ్రేయో ప్రభుత్వమని, అన్నదాత బాగుండాలన్నదే సర్కారు లక్ష్యమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. వైఎస్సార్ జయంతిని రైతు దినోత్సవంగా ఏటా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినందున రైతుల పట్ల తమ బాధ్యత మరింత పెరగనుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ కమిటీలకు ఎమ్మెల్యేలను గౌరవ ఛైర్మన్లుగా నియమిస్తామని ప్రకటించారు. దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని కడప జిల్లా జమ్మలమడుగులో నిర్వహించిన రైతు దినోత్సవ బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ అన్నదాతలపై వరాల జల్లు కురిపించారు. 'రైతులకు రూ.84 వేల కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వారు తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లిస్తే వడ్డీ కట్టక్కర్లేదు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు సక్రమంగా విద్యుత్తు అందలేదు. వ్యవసాయానికి పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే 60 శాతం ఫీడర్లకు పూర్తిగా కరెంటు అందుతోంది. మిగతా 40 శాతం ఫీడర్లకు విద్యుత్తు అందించడానికి రూ.17 వేల కోట్లు మంజూరు చేశాం. పాదయాత్రలో ఆక్వా రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.1.50కే యూనిట్ విద్యుత్తును అందజేస్తాం. పంటల బీమా కోసం రాష్ట్రవ్యాప్తంగా 55 లక్షల మంది రైతుల తరఫున 56 లక్షల హెక్టార్లకు రూ.2163.50 కోట్ల బీమా ప్రీమియం చెల్లింపునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 1.10 లక్షల మంది పామాయిల్ రైతులకు లబ్ధి చేకూర్చేందుకు తెలంగాణతో సమానంగా రైతులకు రూ.80 కోట్లతో మద్దతు ధర కల్పిస్తాం. ఎన్నికల ప్రచారంలో భాగంగా జమ్మలమడుగులో శనగ రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం వారిని ఆదుకునేందుకు క్వింటాలుకు రూ.1,500 నగదు రాయితీ ప్రకటించాం. ఇందుకోసం సుమారు రూ.330 కోట్లు మంజూరు చేయడానికి నిశ్చయించాం. విత్తన కొనుగోలులో గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మిగిలిన బకాయిలకు రూ.384 కోట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 3,57,000 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు పంపిణీ చేశాం. గత ప్రభుత్వం 2018-19కి సంబంధించి ఇవ్వాల్సిన రూ.2 వేల కోట్ల ఇన్‌పుట్ రాయితీని ఇచ్చేందుకు నిర్ణయించాం. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణలో గత ప్రభుత్వం మిగిల్చిన రూ.960 కోట్ల బకాయిలు చెల్లిస్తాం. ఇప్పటికే రూ.360 కోట్లు విడుదల చేశాం. ప్రమాదవశాత్తు మరణించిన, ఆత్మహత్య చేసుకున్న అన్నదాతల కుటుంబాలకు అక్కడి శాసనసభ్యుడు, కలెక్టర్ కలిసి వారి ఇంటికే వెళ్లి రూ.7 లక్షల బీమా అందజేస్తారు. నాఫెడ్ ఏర్పాటు చేసిన 5 కొనుగోలు కేంద్రాల ద్వారా కొబ్బరికి కనీస మద్దతు ధర కల్పిస్తాం.

### ప్రతి అవ్వా తాతకు పింఛను

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక వృద్ధులకు పింఛన్ల పెంపుపైనే తొలి సంతకం చేశాను. అధికారంలోకి వచ్చిన నెల (మిగతా 2లో)



కడప జిల్లా జమ్మలమడుగు బహిరంగ సభలో అభిమానులు బహూకరించిన నాగలితో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు తదితరులు

'రైతు భరోసా పథకం కింద కౌలు రైతులు సహా దాదాపు 70 లక్షల రైతు కుటుంబాలకు ఏటా రూ.12,500 చొప్పున పెట్టుబడి సాయం అందజేస్తాం. అక్టోబరు 15న దీన్ని ప్రారంభిస్తాం. రైతు భరోసాకు మా ప్రభుత్వం రూ.8,750 కోట్లు వెచ్చించనుంది. ఒకే విడతలో అన్నదాతలకు ఇంత భారీ మొత్తం నిధులను దేశంలో ఏ ప్రభుత్వమూ అందించలేదు.

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞాన్ని తలపెట్టారు. ఆ పనులను పరుగులు పెట్టించి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. గోదావరి జలాలను నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్‌లకు తరలించడం ద్వారా కృష్ణా నది ఆయకట్టును స్థిరీకరిస్తాం. దీంతో రాయలసీమ, ప్రకాశం జిల్లాల ప్రజలకు సాగు, తాగునీటి కష్టాలు తీరతాయి. రాజోలి జలాశయం పనులు డిసెంబరులో చేపడతాం.'

- ముఖ్యమంత్రి జగన్

## స్థానిక ఎన్నికలపై వారంలో స్పష్టత

- ఎన్నికల తర్వాతే జిల్లాల విభజన!
- వైకాపా ముఖ్యనేతల బృందం అధ్యయనం
- ముఖ్యమంత్రికి వివరాల నివేదన

2లో



నేడు

## సెమీసైనల్

- ఫేవరెట్‌గా భారత్
- ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌తో ఢీ

లీగ్ దశలో అగ్రస్థానం. దుమ్మురేపుతున్న టాప్ ఆర్డర్. విజృంభిస్తున్న పేస్ దళం. ఉరకలేస్తున్న ఉత్సాహం.. రెట్టించిన ఆత్మవిశ్వాసం. భారీ అంచనాలు.. అంతకు మించిన ఆశలు! మరి కోహ్లీసైన్యం మెరుస్తుందా? కోట్ల అభిమానులను మురిపిస్తుందా? ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌తో సెమీఫైనల్ నేడే. మెరుగైన ఫామ్‌లో ఉన్న టీమ్‌ఇండియానే ఈ మ్యాచ్‌లో ఫేవరెట్!

**భారత్ X న్యూజిలాండ్**

| ముఖాముఖి | | ప్రపంచకప్‌లో.. | |
|---|---|---|---|
| మ్యాచ్‌లు 106 | | మ్యాచ్‌లు 8 | |
| భారత్ గెలిచినవి | న్యూజిలాండ్ గెలిచినవి | భారత్ గెలిచినవి | న్యూజిలాండ్ గెలిచినవి |
| 55 | 45 | 3 | 4 |
| టై/ఫలితం తేలనవి 6 | | టై/ఫలితం తేలనవి 1 | |

6 ఈ టోర్నీకి ముందు వరకు ప్రపంచకప్‌లో భారత్ ఆరుసార్లు సెమీఫైనల్ చేరింది. మూడు సార్లు ఫైనల్లో అడుగుపెట్టింది. 1983, 2011లో కప్పు గెలిచి, 2003 ఫైనల్లో ఓడిపోయింది.

7 న్యూజిలాండ్ ఇంతకుముందు ఏడు సార్లు ప్రపంచకప్ సెమీఫైనల్లో ప్రవేశించింది. ఒక్కసారి మాత్రమే ఫైనల్లో అడుగుపెట్టగలిగింది.



**వాతావరణం**
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జల్లులు పడే అవకాశముంది.

**సెమీస్**
మధ్యాహ్నం 3 గంటల నుంచి..

వివరాలు ఛాంపియన్స్‌లో



## 10 నిమిషాల్లో ఈ-పాన్!

దిల్లీ: ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం జారీ చేసే పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య) పొందటం ఇక సులభం కానుంది. దరఖాస్తు చేసుకున్న పది నిమిషాల్లోపలే ఈ-పాన్(ఎలక్ట్రానిక్ పాన్)ను కేటాయించేందుకు కసరత్తు జరుగుతోంది. ఆధార్ వివరాలు తెలిపిన వెంటనే ఈ-పాన్ మంజూరు చేసే అత్యాధునిక కేంద్రాన్ని నెలకొల్పే యత్నాల్లో ఐటీ విభాగం ఉందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ లోక్‌సభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో వెల్లడించారు.



## ప్రశాంత దర్శన భాగ్యం

తిరుమలలో గంటలకొద్దీ వేచి ఉండే పద్ధతికి స్వస్తి

- ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3ల రద్దు
- వాటికి ప్రత్యామ్నాయ విధానం తెస్తాం
- ఐదేళ్లలో పూర్తి స్థాయి ప్రక్షాళన
- అలిపిరి చేరువలో శాటిలైట్ పట్టణాలు
- అక్కడి నుంచే నేరుగా దర్శనానికి
- కొండపై పర్యావరణానికి ప్రాధాన్యం
- విద్యుత్తు వాహనాలను ప్రవేశపెడతాం

2లో

'ఈనాడు' ముఖాముఖిలో తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

## యూపీలో రహదారుణం

- యమునా ఎక్స్‌ప్రెస్‌వే వంతెన పైనుంచి కాలువలోకి పడిపోయిన బస్సు
- అతివేగం, డ్రైవర్ నిద్రమత్తు వల్లే దుర్ఘటన
- మృతుల్లో అత్యధికులు లఖ్‌నవూ వాసులు

**29 మంది మృతి**

16లో



ఆగ్రా సమీపంలో సోమవారం యమున ఎక్స్‌ప్రెస్‌వే పైనుంచి కాలువలో పడిపోయిన బస్సు. సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు, అధికారులు



## రూ. 1,500 కోట్లతో 3డీ రామాయణం

మూడు భాగాలుగా చిత్ర నిర్మాణం

ఈనాడు సినిమాలో



## ప్రైవేటుకు తేజస్ ఎక్స్‌ప్రెస్

- దిల్లీ-లఖ్‌నవూ మార్గంలో నడిపే యత్నం
- టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగింతకు చర్యలు

2లో

# కాంగ్రెస్ మంత్రుల రాజీనామా

అసమ్మతి నేతలను బుజ్జగించే యత్నం

సంకీర్ణానికి దూరంగా మరో ఇద్దరు స్వతంత్రులు

కర్ణాటకలో 16కు చేరిన అసంతృప్త నేతల సంఖ్య

మరింత క్షీణించిన మిత్రపక్షాల బలం

న్యాయ నిపుణులతో చర్చిస్తున్న కాంగ్రెస్

ఈనాడు డిజిటల్ - బెంగళూరు

వ్యూహప్రతివ్యూహాలతో కర్ణాటక రాజకీయం రసవత్తరంగా మారింది. కుమారస్వామి మంత్రివర్గంలో ఇటీవల చేరిన ఇద్దరు స్వతంత్రులు నగేష్, ఆర్.శంకర్‌లు సోమవారం మంత్రి పదవులకు రాజీనామా చేసి భాజపాకు బహిరంగంగా మద్దతు ప్రకటించారు. అంతకుముందే రాజీనామాలు సమర్పించిన 14మంది సభ్యులతో కలిపి అసమ్మతి నేతల సంఖ్య ఇప్పుడు 16కు చేరింది. అత్యధికులు ముంబయిలో కూర్చొని చక్రం తిప్పుతున్నారు. మరోవైపు అసమ్మతి నాయకుల రాజీనామాకు మంత్రి పదవులే కారణమైతే మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణకు సహకరిస్తామని కాంగ్రెస్ ముఖ్య నేతలు ప్రకటించారు. ఇదే క్రమంలో 21మంది కాంగ్రెస్ మంత్రులు తమ పదవులకు మూకుమ్మడి (మిగతా 5లో)



బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య, ఏఐసీసీ ఇంఛార్జి కేసీ వేణుగోపాల్, కేపీసీసీ అధ్యక్షుడు దినేశ్ గుండూరావు



## పన్నుగట్టుకొని పడేశారు

- భారీగా పతనమైన స్టాక్‌మార్కెట్
- బడ్జెట్లో పన్ను ప్రతిపాదనలపై విదేశీ మదుపర్లలో ఆందోళన
- సెన్సెక్స్‌కు 793 పాయింట్ల నష్టం

స్టాక్ మార్కెట్‌కు బడ్జెట్ రోజు నష్టాలు సోమవారమూ కొనసాగాయి. ఏడాదిలోనే ఇప్పటివరకు అత్యధిక నష్టాన్ని సూచీలు మూటగట్టుకున్నాయి. అధిక సంపన్న వర్గం ఆదాయపు పన్నుపై సర్‌ఛార్జీ పెంపు, కంపెనీల్లో ప్రజల వాటా పరిమితిని 35 శాతానికి పెంచడం లాంటివి ఇందుకు దోహదం చేశాయి. ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలూ ఆజ్యం పోశాయి. బ్యాంకింగ్, వాహన, చమురు-గ్యాస్ ఇలా అన్ని రంగాల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సెన్సెక్స్, నిఫ్టీ భారీగా పతనమయ్యాయి.

- పూర్తి వివరాలు బిజినెస్ పేజీలో

# ప్రశాంత దర్శన భాగ్యం

- తిరుమలలో గంటలకొద్దీ వేచి ఉండే పద్ధతికి స్వస్తి
- 'ఈనాడు' ముఖాముఖిలో తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

ఈనాడు – అమరావతి

తిరుమలలో గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే అవసరం లేకుండా భక్తులు ప్రశాంతంగా శ్రీవారి దర్శనం చేసుకునేలా మొత్తం వ్యవస్థను ఐదేళ్లలో దశలవారీగా ప్రక్షాళన చేయనున్నట్లు తితిదే పాలకమండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఇందుకోసం స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తామని వెల్లడించారు. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 దర్శన విధానాన్ని రద్దు చేసి ప్రత్యామ్నాయ విధానాలను తీసుకొస్తామని, కాలుష్యాన్ని నివారించేందుకు కొండపైకి వెళ్లే వాహనాలన్నింటినీ విద్యుత్తు వాహనాలుగా మారుస్తామని చెప్పారు. అలిపిరి సమీపంలో శాటిలైట్ పట్టణాలను నిర్మిస్తామని, ఇక్కడి నుంచే నేరుగా స్వామివారి దర్శనానికి వెళ్లేలా ఏర్పాటు చేస్తామని, ఆ చుట్టుపక్కల మద్య నిషేధం అమలు చేస్తామని పేర్కొన్నారు. తితిదే ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సుబ్బారెడ్డి సోమవారం సాయంత్రం ఈనాడుకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

### దర్శన అనుమతి ఉంటేనే కొండపైకి...

తిరుమల కొండకు దిగువన అలిపిరి సమీపంలో శాటిలైట్ పట్టణాలను నిర్మిస్తాం. తితిదే భూమి ఎంత ఉందో లెక్కలు తీస్తున్నాం. సామాన్య స్థాయి నుంచి 3 నక్షత్రాల స్థాయి వరకు గదులను నిర్మిస్తాం. అక్కడే ఆహారశాలలు, యోగా కేంద్రాలు, ధ్యాన కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. భక్తులు అక్కడే తలనీలాల సమర్పణ వంటివి పూర్తి చేసుకుంటారు. వారికి దర్శనం ఏ సమయానికి అనేది ఫోన్‌కు సమాచారం వస్తుంది. ఆ సమయానికి కొద్ది ముందుగా వాహనాల్లో కేవలం భక్తులనే తిరుమల కొండపైకి తరలిస్తాం. క్యూలైన్లలో ఎక్కువ సమయం లేకుండానే దర్శనం పూర్తయ్యేలా చేస్తాం. ప్రస్తుతం కొండ దిగువన తిరుపతిలో 1000 గదుల వరకు అందుబాటులో ఉన్నాయి. కొత్తగా మరో 500 గదులు సిద్ధమవుతున్నాయి. వచ్చిన భక్తులందరూ కిందే వసతి పొందేలా ఈ శాటిలైట్ పట్టణాలుంటాయి. దీనిని దశలవారీగా ఐదేళ్లలో చేయాలనుకుంటున్నాం.

### ఎస్కలేటర్ తరహా ఫ్లోర్ల ఏర్పాటు

తిరుమలలో దర్శనానికి 14, 15 గంటల సమయం పట్టకుండా క్యూలైన్ల వ్యవస్థను సంస్కరిస్తాం. 70వేల మందికి దర్శనం కల్పించాల్సి ఉన్నందున ఎక్కడికక్కడ సమయం ఆదా చేయాలి. మహాద్వారం వరకు 2, 3 అంచెల వ్యవస్థను ఏర్పాటు చేద్దామనుకుంటున్నాం. మహాద్వారం తర్వాత ఎస్కలేటర్ తరహా ఫ్లోరింగ్ వ్యవస్థను తెస్తాం. అందరికీ తక్కువ సమయంలో దర్శనం కల్పించడానికే తొలుత ప్రాధాన్యమిస్తాం. ఆ తర్వాత సామాన్య భక్తులు స్వామి వారిని దగ్గరి నుంచి దర్శించుకునే విషయంపై దృష్టి సారిస్తాం. మాకు సామాన్య



భక్తుడే ముఖ్యం. వసతి విషయంలో వారివారి స్థాయిలను బట్టి వివిధ రకాల ఏర్పాట్లున్నా సామాన్య గదులు, ఉచిత గదుల్లోనూ సౌకర్యాలను మెరుగుపరుస్తాం. తిరుమల కొండపై అన్నదానాన్ని మరింత విస్తృతంగా వివిధ చోట్ల అందుబాటులో ఉంచేలా చూస్తాం.

### అలిపిరి సమీపంలో మద్యం, మాంసం నిషేధం

తిరుమల కొండపై ఎప్పుడూ చెప్పులు వేసుకోను. 20 ఏళ్లుగా నాకు ఇదే అలవాటు. కాళ్లు కాలుతున్నా అలాగే తిరుగుతా. ప్రతి భక్తుడికీ పవిత్రత ఉండాలి. ప్రభుత్వపరంగా కొన్ని చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నాం. అలిపిరితోపాటు చుట్టుపక్కల 2 నుంచి 3 కిలోమీటర్ల మేర మద్యం, మాంసంపై నిషేధం అమలు చేద్దామని అనుకుంటున్నాం. ఎలాగూ ఐదేళ్లలో పూర్తి మద్య నిషేధం అమలు చేయాలనుకుంటున్నాం కాబట్టి ఈలోగా చర్యలు తీసుకుంటాం. తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి ఈ ప్రతిపాదన తీసుకొస్తున్నారు.

### దొంగతనమే జరగకూడదు

తిరుమలలో ఈ మధ్య దొంగతనం జరిగింది. కొండపై ఇలాంటి దొంగతనాలు జరగకూడదు. అతిథి గృహంలో ఉన్నవారు తలుపులు వేసుకోకపోవడంవల్లే దొంగతనం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. నిజమే కావొచ్చు. కానీ తిరుమలలో తలుపులు వేసుకోవడం ఏమిటి? అక్కడికి వచ్చేది అంతా భక్తులే కదా.. దొంగలు ఎలా వస్తారు? దొంగలు రాకుండా చూడాల్సిన బాధ్యత మనది. దేవుని సన్నిధానంలో ఇలాంటివి జరగడం మంచి సంప్రదాయం కాదని నా అభిప్రాయం.

### రెండే కేటగిరీలు

ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 దర్శనాలను రద్దు చేయబోతున్నాం. బోర్డు వచ్చిన తర్వాత చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ప్రొటోకాల్ ప్రకారం ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నతాధికారులు తదితరులకు ఒక కేటగిరీ, ప్రొటోకాల్ లేని ముఖ్యులకు ఒక కేటగిరీ.. ఇలా రెండే కేటగిరీల్లో ప్రత్యేక దర్శనాలుంటాయి. వీరికి ఎంత శ్లాబ్ పెట్టాలనేది సమయాన్ని లెక్కించి నిర్ణయిస్తాం. ఈ దర్శనాలను పరిమితం చేస్తాం.

### బాలాజీ జలాశయాన్ని ప్రత్యామ్నాయంగా తీర్చిదిద్దుతాం

తిరుమలలో ప్రస్తుతం తాగునీటికి ఇబ్బందులు లేవు. ఉన్న డ్యాంల నుంచి నీరు సరిపోతుంది. భవిష్యత్తులో ఎప్పుడైనా ఇబ్బంది లేకుండా చూసేందుకు బాలాజీ జలాశయం నుంచి నీటిని ఎలా తీసుకెళ్లాలో కసరత్తు చేస్తున్నాం.

### డీజిల్ వాహనాలకు స్వస్తి

తిరుమలను పర్యావరణహితంగా మార్చి పచ్చదనాన్ని కోల్పోకుండా చూడాలనేది మా ప్రధాన లక్ష్యం. గతంలో వేసవిలో కొద్ది రోజులు తప్ప తిరుమలలో దాదాపు ప్రతి రోజూ వర్షం పడేది. ఇప్పుడు అక్కడి వాతావరణమే మారిపోయింది. ప్రతి రోజూ తిరుమలకు 70వేల నుంచి 85వేల మంది భక్తులు వస్తున్నారు. వీరిలో 15వేల నుంచి 25వేల మంది రెండు మార్గాల్లో నడిచి వెళ్తున్నారు. మిగతా 50వేల నుంచి 60వేల మంది వాహనాల్లో వెళ్తున్నారు. 9000 ప్రైవేటు వాహనాలు రోజూ సగటున కొండపైకి వెళ్తున్నాయి. ఇవన్నీ డీజిల్ వాహనాలే. దీని వల్ల తిరుమల కొండలన్నీ కాలుష్యంతో నిండిపోతున్నాయి. పచ్చదనం పోతోంది. దీనికి ప్రత్యామ్నాయంగా తిరుమలకు వాహనాలను నడిపేవారందరికీ రుణాలపై విద్యుత్తు వాహనాలను సమకూరుస్తాం. ప్రస్తుతం ఉన్నవారికే అవకాశమిస్తాం. దశలవారీగా విద్యుత్తు బస్సులను ప్రవేశపెడతాం.



ప్రస్తుత దలైలామా నుంచి బౌద్ధమతం స్వీకరిస్తున్న దావావంగ్డి

## 15వ దలైలామాగా సత్యసాయి విద్యార్థి

- డార్జిలింగ్‌కు చెందిన దావావంగ్డి ఎంపిక
- 15 సంవత్సరాల శిక్షణ అనంతరం బాధ్యతల స్వీకరణ
- తనను సాయిరాం అని పిలిస్తే పలుకుతానన్న వంగ్డి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: బౌద్ధ మతగురువు పదిహేనవ దలైలామాగా సత్యసాయి విద్యార్థి దావావంగ్డి ఎంపికయ్యాడు. పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్‌కు చెందిన ప్రేమవంగ్డి, పంజూరాయ్ దంపతుల కుమారుడైన దావావంగ్డి పుట్టపర్తిలోని సత్యసాయి ప్రాథమిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ప్రస్తుత 14వ దలైలామా తన తదుపరి దలైలామాగా దావావంగ్డిని వివిధ కోణాల్లో క్షుణ్నంగా పరిశీలించి ఎంపిక చేశారు. ఈ బాలుణ్ని దలైలామాగా పంపేందుకు బౌద్ధగురువులు తల్లిదండ్రులతో చర్చించి ఒప్పించారు. ఇటీవల సత్యసాయి ప్రాథమిక పాఠశాలకు బౌద్ధ ప్రతినిధుల బృందం వచ్చి, అధికార ఉత్తర్వుల ప్రతిని అందజేసి..ఆ బాలుణ్ని తమతో తీసుకెళ్లారు. ఎంపికైన బాలుడు మైసూరు సమీపంలోని బైలుకుప్పే (గోల్డెన్ టెంపుల్) బౌద్ధారామంలో 15 ఏళ్ల పాటు శిక్షణ తీసుకున్న అనంతరం దలైలామాగా బాధ్యతలు స్వీకరిస్తారు. తనను సాయిరాం అని పిలిస్తే పలుకుతానని దావావంగ్డి తన స్నేహితులతో చెప్పి వీడ్కోలు తీసుకోవడం విశేషం.

## నేడు విజయవాడకు గవర్నర్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర గవర్నర్ నరసింహన్ మంగళవారం విజయవాడకు రానున్నారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆయన్ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలవనున్నారు. మధ్యాహ్నం 11-30 నుంచి 12-30 గంటల వరకు గవర్నర్‌తో భేటీ కానున్నారు.

## నెలకు రూ.15వేల వేతనం?

- గ్రామ సచివాలయ ఉద్యోగులపై అధికారుల ప్రతిపాదన

ఈనాడు, అమరావతి: గ్రామ సచివాలయాల్లో నియమించనున్న 10 మంది శాశ్వత ఉద్యోగులకు నెల వేతనంగా రూ.15వేల చొప్పున చెల్లించేందుకు అధికారులు ఆర్థికశాఖకు ప్రతిపాదించారని తెలుస్తోంది. వీరి నియామకాల కోసం ఈనెల 15న నోటిఫికేషన్ జారీ చేసి జిల్లా స్థాయి కమిటీ (డీఎస్సీ) ఆధ్వర్యంలో వారిని ఎంపిక చేయనున్న సంగతి తెలిసిందే. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 2వేల మందికి ఒకటి చొప్పున 18,037గానీ, 5వేల జనాభాకు ఒకటి చొప్పున 9,480గానీ సచివాలయాలను ఏర్పాటు చేయనున్నారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రానుంది.

## స్థానిక ఎన్నికలపై వారంలో స్పష్టత

- ఎన్నికల తర్వాతే జిల్లాల విభజన!

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడు.. ఎలా నిర్వహించాలన్న అంశంపై వారం రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్పష్టతనివ్వనున్నారు. ఎన్నికల నిర్వహణపై పార్టీ ముఖ్యనేతల బృందం అధ్యయనం చేసి ముఖ్యమంత్రికి నివేదించినట్లు తెలిసింది. ఎన్నికలను వెంటనే నిర్వహించడానికే ఆ బృందం నివేదికలో మొగ్గు చూపినట్లు సమాచారం. ఈ వివరాలతోపాటు ప్రభుత్వ యంత్రాంగం ద్వారా రప్పించిన సమాచారాన్నీ క్రోడీకరిస్తున్నారు. వీటి ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలపై ముఖ్యమంత్రి వారంలో స్పష్టతనివ్వనున్నారని వైకాపా ముఖ్యనేత ఒకరు తెలిపారు. పురపాలక ఎన్నికలను వెంటనే నిర్వహించే అవకాశం ఉందని, ఈ ఎన్నికల ప్రకటన నెలాఖరులోగా వెలువడొచ్చని సమాచారం. పంచాయతీ ఎన్నికల విషయంలో రిజర్వేషన్ల అంశం పరిష్కారం కావాల్సి ఉన్నందున దీనిపై చర్చించి తర్వాత నిర్ణయం వెలువరించవచ్చని తెలుస్తోంది.

### కొత్త జిల్లాల ఏర్పాటు ఆలస్యం

మరోవైపు ఒక్కో లోక్‌సభ నియోజకవర్గాన్ని ఒక్కో జిల్లాగా ఏర్పాటు చేసే ప్రక్రియ జాప్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాక కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తే అప్పటికే ఎన్నికైన జిల్లా పరిషత్ ఛైర్మన్ల పరిస్థితి ఏమిటని కొందరు ప్రతినిధులు. . అధ్యయనం సందర్భంగా ముఖ్యనేతల బృందాన్ని ప్రశ్నించినట్లు తెలిసింది. జిల్లాల విభజన ప్రక్రియలో సాంకేతికంగానూ జాప్యం జరిగే అవకాశం ఉంది. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా జిల్లాలను విభజించడంలో భౌగోళికంగానూ కొన్ని సమస్యలున్నాయని బృందం దృష్టికి వచ్చింది. అరకును జిల్లా చేస్తే ఆ నియోజకవర్గం ఇటు తెలంగాణ సరిహద్దు నుంచి అటు ఒడిశా సరిహద్దు వరకు ఉంటుంది. అరకు నియోజకవర్గ కేంద్రం నుంచి సుమారు 360కి.మీ. దూరంలో ఉన్న ప్రాంతాలు కూడా దీని పరిధిలో ఉన్నాయనే అంశం చర్చకు వచ్చింది. ఇలాంటి భౌగోళిక సమస్యలు మరో నాలుగైదు లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ ఎదురవుతున్నాయని గుర్తించారు. అరకు, శ్రీకాకుళంతోపాటు బాపట్ల, నంద్యాల, ఏలూరు, రాజంపేట, తిరుపతి వంటి లోక్‌సభ నియోజకవర్గాలను జిల్లాలుగా చేయడంలో భౌగోళిక, సాంకేతిక ఇబ్బందులు కూడా ఉన్నట్లు అధ్యయన బృందం గుర్తించింది. ఈ నేపథ్యంలో కొత్త జిల్లాల ఏర్పాటు అంత త్వరగా జరిగే అవకాశం లేదని.. రాజకీయ పరిణామాల నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించడమే మంచిదని ఎక్కువ మంది అభిప్రాయపడినట్లు సమాచారం. వీటన్నింటిని అధ్యయన బృందం ముఖ్యమంత్రికి నివేదించింది.






కడప జిల్లా జమ్మలమడుగు సభలో మహిళా రైతు రామసుబ్బమ్మ ప్రసంగిస్తుండగా ఆమె కుమారుడిని ఒడిలో కూర్చోబెట్టుకున్న సీఎం జగన్. చిత్రంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రైతు మిషన్ వైస్ ఛైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, కలెక్టర్ హరికిరణ్ తదితరులు ★ సభకు హాజరైన ప్రజలు


ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

**పంచటం పెంచటమే!**

మనిషి తన జీవితంలో ఎంత ఎక్కువ పంచిపెడతాడో.. తాను అంత ఎక్కువ దాచుకోగలుగుతాడు. అలాగే జీవితాన్ని ఎంత పంచుతాడో.. అంత పెంచుకోగలుగుతాడు కూడా!

– మహాత్మా గాంధీ


# రైతు బాగుండాలి

(మొదటి పేజీ తరువాయి)

రోజుల్లోనే వృద్ధులకు ఇచ్చే పింఛన్లను రూ. 2,250కి పెంచాం. వైకల్య శాతంతో సంబంధం లేకుండా దివ్యాంగులందరికీ రూ.3000 పింఛను ఇచ్చేందుకు శ్రీకారం చుట్టాం. పింఛన్లకు అర్హులుగా ఉండి మిగిలిపోయిన వారందరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటాం. కుల, మత, ప్రాంతం, వర్గం, పార్టీలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రతి 50 కుటుంబాలకు ఒక గ్రామ వాలంటీర్‌ను నియమిస్తున్నాం. సెప్టెంబరు 1 నుంచి వారు లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పథకాల లబ్ధిని అందిస్తారు. గ్రామ వాలంటీర్లు తప్పు చేస్తే విధుల్లో నుంచి తొలగిస్తాం. వీరిపై ఫిర్యాదులకు ఓ ఫోన్ నంబరును కూడా పెడుతున్నాం. దోపిడీ లేని ఇసుక విధానాన్ని తీసుకువస్తున్నాం' అని జగన్ చెప్పారు.

### రూ.2వేల కోట్లతో విపత్తుల సహాయనిధి

రాబోయే సంవత్సర కాలంలో కర్షకుల సంక్షేమం కోసం చేపట్టనున్న కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. రైతుల కోసం రూ. 2 వేల కోట్లతో ప్రకృతి విపత్తుల సహాయ నిధిని, గిట్టుబాటు ధర కల్పించడానికి రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు రబీలో పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. భూయజమానులు, కౌలు రైతులకు నష్టం జరగకుండా కౌలు రైతుల చట్టాన్ని సవరిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో శీతలీకరణ గిడ్డంగులు, అవసరమైన మేరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామంలోనూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి జిల్లాల్లో కోల్డ్‌స్టోరేజీలు, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పుతామని ప్రకటించారు.

### అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శ్రీకారం

సోమవారం ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక విమానంలో కడప విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి జగన్‌కు పలువురు నేతలు, అధికారులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 9గంటలకు కుటుంబ సమేతంగా ఇడుపులపాయకు చేరుకున్న జగన్.. వైఎస్సార్ జయంతి సందర్భంగా వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 10 గంటలకు బయలుదేరి ఇడుపులపాయలోని తన నివాసం చేరుకుని అరగంటసేపు కుటుంబసభ్యులతో గడిపారు. అక్కడి నుంచి గండి క్షేత్రానికి చేరుకుని స్వామి దర్శనానంతరం ఆలయంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పులివెందులలో అరటి పరిశోధన కేంద్రానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మధ్యాహ్నం 12.05 గంటలకు జమ్మలమడుగు రైతు దినోత్సవం బహిరంగ సభ వద్దకు చేరుకున్నారు. సభా ప్రాంగణంలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. మధ్యాహ్నం 1.08కి వేదికపైకి చేరుకుని వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సీఎం ప్రసంగిస్తూ కడపకు సంబంధించి చెన్నూరు చక్కెర కర్మాగారం పునరుద్ధరణ సహా పలు హామీలిచ్చారు. డిసెంబరులో ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేస్తామన్నారు. వివిధ పథకాల లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, వ్యవసాయశాఖ మంత్రి కన్నబాబు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.



ఇడుపులపాయలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

### గ్రహం అనుగ్రహం

**9–7–2019 మంగళవారం**

శ్రీ వికారి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; ఆషాఢ మాసం; శుక్ల పక్షం
సప్తమి: ఉ.9.22 తదుపరి అష్టమి
హస్త నక్షత్రం: రా.9.34 తదుపరి చిత్ర
అమృత ఘడియలు: మ.3.56 నుంచి 5.26 వరకు
వర్జ్యం: ఉ.6.55 నుంచి 8.26 వరకు
తిరిగి తె.5.08 నుంచి
దుర్ముహూర్తం: ఉ.8.10 నుంచి 9.02 తిరిగి
రా.10.57 నుంచి 11.41 వరకు
రాహుకాలం: మ.3.00 నుంచి 4.30 వరకు
సూర్యోదయం: ఉ.5-35; సూర్యాస్తమయం: సా.6.32

### వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| తిరుపతి | 40.4 | 29.1 |
| నెల్లూరు | 40.0 | 31.0 |
| నల్గొండ | 39.4 | 24.4 |
| కడప | 39.0 | 28.0 |
| ఒంగోలు | 38.2 | 30.6 |
| సూర్యాపేట | 38.0 | 30.0 |
| ఖమ్మం | 38.0 | 28.0 |
| విజయవాడ | 37.6 | 26.0 |
| రాజమహేంద్రవరం | 37.0 | 25.5 |
| నరసాపురం | 36.3 | 26.3 |
| కర్నూలు | 36.3 | 25.6 |
| అనంతపురం | 36.1 | 26.5 |
| గుంటూరు | 35.6 | 28.2 |
| రామగుండం | 35.2 | 25.0 |
| శ్రీకాకుళం | 35.0 | 27.0 |
| తాడేపల్లిగూడెం | 35.0 | 26.0 |
| విశాఖపట్నం | 34.4 | 27.0 |
| హైదరాబాద్ | 34.2 | 25.0 |


**CENTRE FOR ECONOMIC AND SOCIAL STUDIES**
Nizamiah Observatory Campus, Begumpet, Hyderabad-500016, Telangana State. Tel : 040-23402789, 23416780, Fax : 23406808. Website : cess.ac.in

**Ph.D PROGRAMME IN DEVELOPMENT STUDIES**
**ADMISSION NOTIFICATION FOR THE ACADEMIC YEAR 2019-20**

The **Centre for Economic and Social Studies, Hyderabad** in collaboration with **Telangana University, Nizamabad** invites applications from candidates below 35 years of age for **Admission into Ph.D Programme in Development Studies** for the **Academic Year 2019-20**. The Programme is offered in the following subjects :

1. Economics
2. Sociology / Anthropology / Social Work
3. Geography / Geo-Informatics
4. Development Statistics (with Specialization in Econometrics)
5. Commerce / Business Management (Related to Research Areas of CESS)

The Last Date for Submission of Application Forms is on 15th August 2019. The Entrance Test will be conducted at CESS, Hyderabad on 30th August 2019 and Interviews will be held on 31st August and 01st September 2019. For all other details, Visit the website : www.cess.ac.in

**Director**


# ప్రైవేటుకు తేజస్ ఎక్స్‌ప్రెస్ రైలు

- దిల్లీ-లఖ్‌నవూ మార్గంలో నడిపే యత్నం
- టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగింతకు చర్యలు

దిల్లీ: రైలు సర్వీసుల నిర్వహణలో తొలిసారిగా ప్రైవేటు రంగం కాలుమోపనుంది. దిల్లీ-లఖ్‌నవూ మార్గం ఇందుకు ప్రయోగాత్మక వేదిక కానుంది. తేజస్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రైవేటు ఆపరేటర్లకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2016లో దిల్లీ-లఖ్‌నవూ మార్గంలో తేజస్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రకటించినప్పటికీ రైల్వే టైంటేబుల్‌లో ఇటీవలే దీనికి చోటు దక్కింది. ప్రస్తుతం ఈ రైలును ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆనంద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో పార్క్ చేసి ఉంచారు. చాలా కాలంగా ఇది నిరీక్షణ స్థితిలో ఉంది. టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తేజస్ రైలు నిర్వహణ ప్రైవేటు ఆపరేటర్ చేతుల్లోకి వెళ్తుంది. రెండు రైళ్లను ప్రైవేటు నిర్వాహకులకు అప్పగించాలన్న రైల్వే శాఖ 100 రోజుల ఎజెండాలో భాగంగా తొలుత తేజస్ రైలు(దిల్లీ-లఖ్‌నవూ)పై నిర్ణయం తీసుకున్నారు. రెండో రైలును త్వరలోనే గుర్తిస్తామని అధికారులు వెల్లడించారు. రైళ్ల నిర్వహణను ప్రైవేటు ఆపరేటర్లకు అప్పగించాలన్న నిర్ణయాన్ని రైల్వే కార్మిక, ఉద్యోగ సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఆందోళనకు దిగుతామని హెచ్చరించాయి.

### ఇవీ తేజస్ రైళ్ల విశేషాలు

- పూర్తిస్థాయి ఏసీ రైలు. అత్యాధునిక, సౌకర్యవంతమైన వసతులు
- 160 కి.మీ.వేగంతో పరుగులు పెట్టాలని లక్ష్యం
- ఎల్ఈడీ తెరలు, వైఫై సదుపాయం
- మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను పెట్టుకొనే పాయింట్లు
- పాకశాస్త్ర ప్రవీణుల ఆధ్వర్యంలో కోరుకున్న ఆహార పదార్థాలు ఆర్డరు మేరకు సరఫరా
- ప్రస్తుతం ముంబయి-కర్మాలి(గోవా), చెన్నై-మధురై మార్గాల్లో తేజస్ రైళ్లు అందుబాటులో ఉన్నాయి.
- దిల్లీ-చండీగఢ్, దిల్లీ-లఖ్‌నవూ మార్గాల్లో తేజస్ సేవలు అందుబాటులోకి రావాల్సి ఉంది.

# వై.ఎస్.ఆర్ పెన్షన్ కానుక పెరిగిన పింఛన్ల పంపిణీ వేడుక



## నవరత్నాలు అమలు దిశగా ముందడుగు

తన ముఖంలోని చిరునవ్వే ప్రతి పేద ముఖంలోనూ కనబడాలన్నది దివంగత నేత, వై.ఎస్.ఆర్ ఆశయం. ఆ ఆశయాన్ని సాధించడమే మన లక్ష్యం. అందుకే ఆ మహానేత జయంతి సందర్భంగా నవరత్నాలను అమలు చేస్తూ పెంచిన పెన్షన్‌లను 'వై.ఎస్.ఆర్ పెన్షన్ కానుక'గా పేదలకు అందిస్తూ...

మీ ముఖ్యమంత్రి







**శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

| గత ప్రభుత్వం గడచిన 5 సంవత్సరాల్లో పింఛన్లపై ఖర్చు చేసిన మొత్తం (రూ. కోట్లలో) | |
|---|---|
| 2014-15 | 3,378.46 |
| 2015-16 | 5,221.73 |
| 2016-17 | 5,270.12 |
| 2017-18 | 5,436.94 |
| 2018-19 | 8,234.64 |
| **2019-20** | **15,675.20** |

2019-20 సంవత్సరంలో మన ప్రభుత్వం
**రూ. 15,675 కోట్లు,**
అంటే గత ప్రభుత్వం పెట్టిన ఖర్చు కంటే
**సగటున మూడు రెట్లు ఎక్కువగా పింఛన్లపై ఖర్చు చేస్తున్నాం.**

### 4 నెలల క్రిందటి వరకు ఇస్తున్న రూ. 1000/- ల పెన్షన్‌ను రూ. 2,250/- లకు పెంచుతూ క్రమంగా రూ.3,000/- లకు పెంపుదల

| | |
|---|---|
| వృద్ధాప్య, వితంతు, చేనేత, మత్స్యకారులు, ఒంటరి మహిళలు గీత కార్మికులు, ART (PLHIV) పింఛన్లు, చర్మకారులు | రూ. 2,250 నుండి క్రమంగా రూ. 3,000 వరకు పెంపు |
| దివ్యాంగులు | రూ. 3,000/- |
| డయాలసిస్ పేషంట్లు | రూ. 10,000/- |
| వృద్ధాప్య పింఛన్లు వయోపరిమితి | 65 నుండి 60 కి తగ్గింపు |

**5.40 లక్షల మందికి నూతనంగా లబ్ది**

ఇంకా గ్రామ వాలంటీర్లు, గ్రామ సచివాలయాల ద్వారా ప్రతి ఒక్కరికీ సంతృప్త స్థాయిలో కొత్త పింఛన్లు మంజూరుచేస్తాం.









**శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి గారు**
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మైనింగ్ మరియు భూగర్భవనరుల శాఖామాత్యులు

## ప్రతి అడుగు... రాజన్న రాజ్యం కోసం...

**గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ SERP పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ**

జారీ చేసిన వారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

## ఈనాడు
### జాతికి జలభాగ్యం కోసం...

అనేక విధాలుగా జాతి నెత్తిన జలగండం ఉరుముతున్న వేళ ఇది. అతివృష్టితో ముంబయి, నాసిక్ మునుగుతుంటే, చెన్నై సహా పలు నగరాలు నీటి కటకటతో అల్లాడుతున్నాయి. కలుషిత నీటి సేవనంతో రోగాలూ రొష్టుల పాలబడి ఏటా రెండు లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని నీతిఆయోగ్ నివేదికే వెల్లడించింది. భారత్ సహా ఎన్నో ప్రపంచ దేశాలు నీటి నిర్వహణ రంగంలో సంక్షుభిత స్థితిని ఎదుర్కొంటున్నాయని ప్రతిష్ఠాత్మక 'స్టాక్‌హోం వాటర్ ప్రైజ్' విజేత ఆచార్య అసిత్ కె.బిశ్వాస్ ఎన్నో ఏళ్ల క్రితం చేసిన వ్యాఖ్యల్లోని వాస్తవం ఇప్పుడే అవగతమైనట్లుగా కేంద్రప్రభుత్వంలో కొత్త కదలిక మొదలైంది. నీటితో ముడివడిన భిన్న విభాగాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి కేంద్రంలో జల్‌శక్తి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసిన మోదీ ప్రభుత్వం- వాన నీటి పరిరక్షణపై స్థానిక సంస్థలకు తాజాగా మార్గదర్శకాల్ని క్రోడీకరించింది. జల్‌శక్తి అభియాన్ కింద ఒక్క నీటి వనరునైనా పునరుద్ధరించేందుకు ప్రతి పట్టణమూ చర్యలు చేపట్టాలంటూ వర్షపునీటిని ఒడిసిపట్టే ప్రక్రియపై గట్టి పర్యవేక్షణ కోసం ఓ విభాగాన్ని ఏర్పాటు చెయ్యాలనీ సూచించింది. భూగర్భ జలాల వెలికితీత, పునఃపూరక (రీఛార్జి) తీరును మున్సిపల్ విభాగాలు పర్యవేక్షించాలని, భవిష్యత్తులో భవన నిర్మాణ అనుమతులకు ఇంకుడు గుంతల నిర్మాణాల్ని తప్పనిసరి చేయాలన్న మార్గదర్శకాలు కేంద్ర గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ నుంచి వెలువడ్డాయి. దేశవ్యాప్తంగా 256 జిల్లాల్లోని 1,592 బ్లాకుల్లో భూగర్భ జలమట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోయినట్లు ఈసరికే గుర్తించిన కేంద్రం వడివడిగా దిద్దుబాటు చర్యలకు సమకడుతోంది. జులై ఒకటి నుంచి సెప్టెంబరు 15 దాకా, అక్టోబరు ఒకటి నుంచి నవంబరు చివరిదాకా రెండంచెల్లో వాన నీటి సంరక్షణ, నీటి వనరుల పునరుద్ధరణ, వ్యర్థ జలాల పునశ్శుద్ధి- వినియోగం, మొక్కలు నాటడం వంటివాటిపై ఆయా పురపాలక సంస్థలు ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్రం సూచిస్తోంది. జిల్లాకో ప్రత్యేక అధికారిని నియమించి మోదీ సర్కారు చేస్తున్న కసరత్తు ఏ మేరకు ప్రభావాన్వితం అవుతుందో చూడాలి!

ప్రపంచ జనావళిలో 18 శాతానికి ఆవాసమైన ఇండియాకు నీటి వనరుల్లో నాలుగు శాతమే అందుబాటులో ఉన్నాయి. మనకన్నా ఎంతో తక్కువ నీటి వసతి ఉన్న ఇజ్రాయెల్ లాంటి దేశాలూ ధీమాగా పురోగమించగలుగుతుంటే, ప్రాణాధార జలాల ఆరోగ్యకర నిర్వహణను దశాబ్దాలుగా పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఇండియా నేడు పెను సంక్షోభం ముంగిట నిలిచింది! ప్రపంచంలోనే అత్యల్పంగా భారత్ కేవలం ఎనిమిది శాతం వాన నీటినే సంరక్షించగలుగుతోంది. గ్రామసీమల్లో 23 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 88 లక్షల వాననీటి సంరక్షణ నిర్మాణాల నిమిత్తం కేంద్రం బృహత్ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు 2017 మార్చిలోనే సంబంధిత మంత్రి లోక్‌సభకు తెలిపారు. భూగర్భ జలశాస్త్రవేత్తలు, నిపుణుల సహకారంతో కేంద్ర భూగర్భ జల బోర్డు రూపొందించిన మాస్టర్ ప్లాన్ అనుసారం గ్రామాల్లో ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాములు, కాలువ కట్టలు సహా మరెన్నింటినో ఆనాడు ప్రతిపాదించారు. యుద్ధప్రాతిపదికన ఆ ప్రణాళికలు పట్టాలకెక్కి ఉంటే- నేడు గ్రామీణ, పట్టణ ప్రాంతాలు ఒక్కతీరుగా నీటి అవసరాల కోసం గుక్కపట్టేవే కావు! దేశవ్యాప్తంగా 4,378 పురపాలికల్లో 756 (17శాతం) తీవ్ర నీటిఎద్దడి ఎదుర్కొంటున్నాయంటూ ఇప్పుడు వాటిపైనే దృష్టి సారిస్తామనడంలోని సమగ్ర దృక్పథం ప్రస్ఫుటం కావడం లేదు! వాటిలో మెజారిటీ (518) తమిళనాడు, రాజస్థాన్, యూపీ, పంజాబ్, కర్ణాటకల్లోనే పోగుపడ్డాయి. నిరుపయోగంగా మారిన జలవనరులు అత్యధికంగా కర్ణాటక (51 శాతం), రాజస్థాన్ (40), ఆంధ్రప్రదేశ్ (32), తమిళనాడు (30), ఉత్తరాఖండ్ (29), గుజరాత్ (23 శాతం)లలో ఉన్న వాస్తవాన్ని గుర్తించి, స్థానిక సంస్థలకు దన్నుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిలిచి జాతికి జలసౌభాగ్యం అందించే భగీరథ యత్నాన్ని విజయవంతం చేయాలి!

అయిదు దశాబ్దాల క్రితంతో పోలిస్తే, కురిసే వానల్లో 24 శాతం కొరత కనిపిస్తోంది. తలసరి నీటిలభ్యతా నాలుగోవంతు కంటే దిగువకు పడిపోయింది. హైదరాబాద్, చెన్నై, దిల్లీ, బెంగళూరు వంటి 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలమట్టాలు వచ్చే ఏడాదికే సున్నా స్థాయికి చేరుకొంటాయన్న ప్రమాద ఘంటికల్ని ఏ మాత్రం పెడచెవిన పెట్టే వీల్లేదు. వచ్చే పదేళ్లలో నీటి అవసరాలు రెట్టింపు కానున్నాయన్న అంచనాలు భీతిల్లజేస్తున్నాయి. ఇంతటి సంక్షుభిత పరిస్థితుల్లో రాష్ట్రాలతో కలిసి 2024 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ఇళ్లకూ కుళాయి నీటిని అందించాలన్న మహాసంకల్పాన్ని మోదీ ప్రభుత్వం ప్రకటించింది. దాన్ని సుసాధ్యం చెయ్యాలంటే దేశంలో ఏటా కురిసే 428 శతకోటి ఘనపుటడుగుల వాననీటిని సాధ్యమైనంత అధికంగా ఒడిసిపట్టాలి. ఆ మహాక్రతువు ఏదో ఒకచోట అన్నట్లు కాకుండా సంపూర్ణ ప్రజాఉద్యమ పంథాలో మొదలై నీటి పొదుపు జాతి సంస్కృతిగా స్థిరపడేలా సుదృఢ సంకల్ప దీక్షతో సాగాలి! తెలంగాణవ్యాప్తంగా 46వేల చెరువుల్ని పునరుద్ధరించిన మిషన్ కాకతీయ, ఏపీలో భూగర్భ జలమట్టాల్ని పెంచిన సాంకేతికత, వాటర్‌షెడ్, నీటిబడ్జెట్ నిర్వహణలో మహారాష్ట్రలోని హివారే బజార్ గ్రామస్తుల చైతన్యం, ఇష్టారాజ్యంగా భూగర్భ జలాల్ని తోడేయడంపై చట్టబద్ధ నిషేధం- వంటివన్నీ యావద్దేశానికీ ఆదర్శప్రాయమైనవే. పంటల సాగులో చైనా, ఇజ్రాయెల్, అమెరికాలతో పోలిస్తే మూడు నుంచి అయిదింతలు ఎక్కువగా నీటి వాడకాన్ని నిలువరించేలా కర్షక సోదరులకు అవసరమైన పరిజ్ఞానం, సాధన సంపత్తిని విస్తృతంగా పొలంగట్లకు చేర్చాల్సిందే! ఈ బృహత్ యజ్ఞం ఏ దశలోనూ నిధుల్లేక నీరసించిపోకుండా కాచుకోవాల్సింది కేంద్రప్రభుత్వమైతే, అవినీతి పాలబడి సమున్నత లక్ష్యాలు నీరుగారకుండా రాష్ట్ర ప్రభుత్వాలు పూనిక వహించాలి.

# ఆలోచనే అసలు పెట్టుబడి



డాక్టర్ ఎస్.అనంత్

ప్రస్తుతం ఉద్యోగార్థుల అడ్డాగా ఉన్న భారత్‌ను ఉద్యోగ సృష్టికర్తల గడ్డగా మార్చడానికని 2016లో ఎన్డీయే ప్రభుత్వం అట్టహాసంగా స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించింది. భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రణాళిక అయితే ఏకంగా 50,000 అంకుర (స్టార్టప్) పరిశ్రమలను, వాటికి వెన్నుదన్నుగా 500 కొత్త ఇంక్యుబేటర్లు, ఫెసిలిటేటర్లను నెలకొల్పుతామని, 100 నవీకరణ మండలాలను స్థాపిస్తామని వాగ్దానం చేసింది. ఈ ఏటి బడ్జెట్‌లో అంకుర పరిశ్రమలకు ఊతమిచ్చే ప్రతిపాదనలు కొన్ని ఉన్నాయి. దూరదర్శన్ ఛత్రం కింద అంకుర పరిశ్రమలకు కావలసిన సమాచారాన్ని అందించడానికి ప్రత్యేక ఛానల్ ప్రారంభిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. కిరాణా సరకులు, ఈ-కామర్స్, ఆహార పదార్థాల బట్వాడా విభాగాల్లో అంకుర పరిశ్రమల స్థాపనకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సడలించారు. ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమలో అంకుర పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు కల్పించారు. ఫైనాన్స్ టెక్నాలజీ రంగంలో అంకుర పరిశ్రమల విస్తరణకు వీలు కల్పించే విధంగా డిజిటల్ చెల్లింపుల విధానానికి తగు మార్పుచేర్పులు చేశారు. ఆదాయ పన్ను విభాగం నుంచి ఏంజెల్ పన్ను విషయంలో చిక్కులు చికాకులను నివారించే చర్యలు తీసుకున్నారు. బడ్జెట్‌కు ముందు పరిస్థితిని చూస్తే పారిశ్రామిక విధానం-ప్రోత్సాహక విభాగం (డీపీపీ) 2018 వరకు 14,036 అంకుర పరిశ్రమల దరఖాస్తులను ఆమోదించిందని ప్రభుత్వ నివేదిక తెలిపింది. స్టార్టప్ ఇండియా కేంద్రం 660 అంకుర పరిశ్రమల స్థాపనకు సలహాసహకారాలు అందజేసింది. అంకుర పరిశ్రమలకు నిధులు అందించడానికి ప్రభుత్వం చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (సిడ్బి)కి రూ.10,000 కోట్ల మహానిధిని సమకూర్చింది. మరో 32 ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులకు రూ.1,611 కోట్లు అందించింది. ఈ సంస్థలు 170 అంకుర పరిశ్రమల ఆవిర్భావానికి నిధులు ఇచ్చాయి. కొత్త కొత్త ఆలోచనలు చేసే పాఠశాల విద్యార్థుల కోసం ప్రయోగశాలలను నెలకొల్పడానికి ప్రభుత్వం నిధులిచ్చింది. ఈ పథకం కింద 5,441 పాఠశాలల్లో 5,000 ప్రయోగశాలలను నెలకొల్పి, వాటికి తలా రూ.12 లక్షల చొప్పున గ్రాంట్లు మంజూరు చేసింది. ఇంతా చేసినా, దేశంలో అంకుర పరిశ్రమల విప్లవం సంభవించిందని చెప్పలేం.

## ఆశయం ఆచరణల మధ్య అగాధం

దేశంలో వ్యవస్థాపక సామర్థ్యానికి కొదవ లేదు. దానికి కార్యరూపం ఇవ్వడంలో మాత్రం చాలావరకు విఫలమవుతున్నాం. అంకుర పరిశ్రమలను విజయవంతంగా నడిపే కార్యశూరుల వల్ల ఇతరులకు ఉపాధి అవకాశాలు, దేశానికి పన్నుల వసూళ్లూ పెరుగుతాయి. వారికి తగు అండదండలిచ్చే బాధ్యత మాత్రం ప్రభుత్వం తీసుకోవాలి. ప్రాథమిక రంగమైన వ్యవసాయం, గనులు, ద్వితీయ రంగమైన పరిశ్రమలు, నిర్మాణ కార్యక్రమాలకన్నా తృతీయ రంగమైన సేవారంగమే అంకుర సంస్థలకు అత్యంత అనువైనది. నేడు దేశంలో ఉన్న 5.85 కోట్ల వ్యాపార, పారిశ్రామిక సంస్థల్లో 57.68 శాతం సేవారంగంలోనే ఉన్నాయి. వాటిలో అంకుర పరిశ్రమల శాతం ఇప్పటికీ స్వల్పమే. సమర్థంగా నడిచే అంకుర సంస్థలు భారీయెత్తున ఉద్యోగాలు కల్పించగలవు. ఓలా, ఫ్లిప్‌కార్ట్ సంస్థలు దీనికి విశిష్ట ఉదాహరణలు. నేడు ఈ రెండు సంస్థలు చిన్న పట్టణాలు మొదలు, మహా నగరాల వరకు వేలాది ఉపాధి అవకాశాలను కల్పించాయి. ఏదైనా అంకుర పరిశ్రమ 100 కోట్ల డాలర్ల (రూ.7,000 కోట్ల) విలువను అందుకొంటే, దాన్ని యూనికార్న్ అంటారు. 2024కల్లా 100 యూనికార్న్‌లను స్థాపించాలని భారత్ లక్షిస్తోంది. అది నెరవేరడానికి తగిన వాతావరణం దేశంలో నెలకొన్నప్పుడు పెట్టుబడులు పెద్దయెత్తున ప్రవహించి వ్యవస్థాపకులను వెన్నుతట్టి ముందుకు నడిపిస్తాయి. అందుకు తగిన విధానాలను ప్రభుత్వం రూపొందించి అమలు చేయాలి. వాస్తవంలో అలా జరగడం లేదు. అంకుర పరిశ్రమలను ప్రోత్సహించడానికి రూ.10,000 కోట్లతో నెలకొల్పిన మహా నిధి నిర్వహణ బాధ్యతను సిడ్బికి అప్పగించడం పొరపాటు. సిడ్బి అనేది కేవలం రుణాలిచ్చే సంస్థ తప్ప, నష్టాలకు వెరవకుండా అంకుర సంస్థలకు నిధులు సమకూర్చే సాహసిక స్వభావం దానికి లేదు. ఇంతవరకు చిన్న పరిశ్రమలకు, మైక్రో ఫైనాన్స్ కంపెనీలకు, ఇతర చిన్న వ్యాపారాలకు మాత్రమే నిధులిచ్చిన చరిత్ర సిడ్బిది. నవీకరణ సారథులైన అంకుర పరిశ్రమలకు నిధులిచ్చి ముందుకు నడపడానికి అది సరైన సంస్థ కాదు. కొత్త ఆలోచనలకు పాదు చేసి, వాటిని ఆచరణలోకి తీసుకురావడంలో కష్టనష్టాలను బేరీజు వేసి, విజయావకాశాలను అంచనా వేయగల ప్రత్యేక సంస్థకు అంకుర పరిశ్రమల బాధ్యతను అప్పగించి ఉండాల్సింది. ఒక అంకుర సంస్థ విజయానికి పెట్టుబడులే కీలకం కావు. అవి చివరి మెట్టు మాత్రమే. మొదట ఒక ఆలోచన మెదలాలి, అది ఆచరణీయమైనదై ఉండాలి, విపణిలో నెగ్గగలిగేదై ఉండాలి. అప్పుడు పెట్టుబడులు సమకూర్చుకుని పకడ్బందీగా అమలు చేయాలి. అది విజయవంతం కాగానే మలి అంచెకు వ్యాపారాన్ని విస్తరించగలగాలి. ఈ లక్షణాలన్నీ ఉన్న సంస్థను ప్రోత్సహించడానికి ప్రత్యేక సంస్థను నెలకొల్పడమే ఉత్తమం. కానీ, భారత్‌లో ఈ ప్రక్రియ సక్రమంగా సాగడం లేదు. అంతర్జాతీయంగా మూడు విభాగాలు (విశ్వవిద్యాలయాలు, సైన్యం, ప్రభుత్వ-ప్రైవేటు రంగ సంస్థలు, వ్యక్తులు) ఆర్థికంగా, పరిశోధనల పరంగా ఇచ్చే అండదండలే అంకుర సంస్థల విజయానికి కీలకమవుతున్నాయి. అన్నింటినీ మించి విద్యా వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలి. సొంతంగా, సృజనాత్మకంగా ఆలోచించే మెరికల్లాంటి యువతను విద్యావిధానం తయారు చేయగలగాలి. అంటే మన విశ్వవిద్యాలయాలు, కళాశాలలు నిజమైన విజ్ఞాన సముపార్జన కేంద్రాలుగా, ప్రతిభావంతులను ప్రోత్సహించే ప్రయోగశాలలుగా ఎదగాలి. సృజనశీలురు తమ భావాలను ఆచరణలో పెట్టగల వాతావరణాన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వం కల్పించాలి. భారతదేశంలో సరిగ్గా ఇదే కొరవడింది. మన విద్యావ్యవస్థ కులం, మతం, ప్రాంతీయ బేధాల్లో కూరుకుపోయి కొత్త భావాలను వికసించనివ్వడం లేదు. బట్టీ చదువులకు, మార్కులకు పెద్ద పీట వేస్తూ సృజనాత్మకంగా, విమర్శనాత్మకంగా ఆలోచించే సత్తాను ఎదగనివ్వడం లేదు.



అంకుర పరిశ్రమలు - ప్రోత్సాహక మార్గాలు

## అనుకరణలతో చేటు

విద్యకు కేవలం ఎక్కువ నిధులిస్తే చాలదు. పైన చెప్పుకొన్న లోపాలను తొలగించడం చాలా ముఖ్యం. విదేశాల్లో అంకురాల వ్యవస్థాపకులు స్థానిక సామాజిక, ఆర్థిక అవసరాలను తీర్చగల వ్యాపారాలను, పరిశ్రమలను స్థాపించి నెగ్గుకొచ్చారు. స్థానిక పరిస్థితులను సునిశితంగా విశ్లేషించే సామర్థ్యాన్ని వారికి అలవరచింది విద్యారంగమే. ఈ సత్తా మన దేశంలో కనిపించడం లేదు. పాశ్చాత్య దేశాల్లో, ముఖ్యంగా అమెరికాలో విజయవంతమైన నమూనాలనే మనవాళ్లు అనుకరించి అంకురాలు స్థాపిస్తున్నారు. కానీ, అమెరికా నమూనాల అనుకరణకన్నా వాటి విజయానికి దోహదపడిన అంశాలను అలవరచుకోవడం చాలా చాలా ముఖ్యం. మొదట- విద్యార్థులను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దడమెలా అన్నది అమెరికాలోని స్టాన్‌ఫర్డ్, ఎమ్ఐటీ, హార్వర్డ్, క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయాల నుంచి నేర్చుకోవాలి. ఈ నాలుగు విశ్వవిద్యాలయాలు కలిసి 2006-2018 మధ్యకాలంలో 9,621 కోట్ల డాలర్ల మూలధనాన్ని సేకరించి 3,770 కంపెనీల స్థాపనకు తోడ్పడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా 25 అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు ఇదే కాలంలో 28,800 కోట్ల డాలర్లకు పైగా మూలధనాన్ని సమీకరించి 11,481 కంపెనీల ఆవిర్భావానికి ఊతమిచ్చాయి. ఈ 25 విశ్వవిద్యాలయాల్లో రెండు ఇజ్రాయెల్‌లో ఉంటే, మిగతావన్నీ అమెరికాలోనే ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక అంకుర సంస్థలను స్థాపించిన ఘనత స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థులకే దక్కుతుంది. ఒక్క 2018లోనే 1,178 మంది స్టాన్‌ఫర్డ్ వ్యవస్థాపకులు 1,015 అంకుర సంస్థలను స్థాపించారు.

అమెరికా, ఇజ్రాయెల్, రష్యా, చైనాలతోపాటు పలు పాశ్చాత్య దేశాల్లో సైన్యం నూతన ఆవిష్కరణలను, వాటిని ఆచరణలోకి తీసుకొచ్చే అంకుర సంస్థలను ప్రోత్సహిస్తాయి. అమెరికా సైన్యం, జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఎస్ఏ)లు ఈ విషయంలో అగ్రగణ్యులు. భావి యుద్ధాల్లో గెలిపించే అస్త్రశస్త్రాల కోసం అవి పరిశోధనలకు, అంకురాలకు నిధులు, ఇతర విధాలైన అండదండలనిస్తున్నాయి. నేడు ప్రపంచంలో మేటి సంస్థలుగా నిలుస్తున్న ఫేస్‌బుక్ తదితర సంస్థలకు ఈ అండదండలే ఊతమిచ్చాయి. చైనా, రష్యా, ఇజ్రాయెల్ దేశాలు కృత్రిమ మేధ, సైబర్ భద్రత, బయోమెట్రిక్స్ వంటి అధునాతన సాంకేతికతల సృష్టి, అన్వయాల కోసం పరిశోధకులను, అంకురాలను ప్రోత్సహిస్తున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం దీనికి ఏకంగా 'యూనిట్ 8,200' అనే ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పింది. అది విశ్వవిద్యాలయాలతో, పరిశోధక సంస్థలతో కలిసి నవతరం ఆయుధ వ్యవస్థల రూపకల్పనకు కృషి చేస్తుంది. చిన్న విషయానికి, పెద్ద విషయానికి పాశ్చాత్య దేశాలను అనుకరించే భారతదేశం అంకుర సంస్థల విషయంలోనూ ఉత్తమ గుణాలను అలవరచుకోవలసిన సమయమిది.

(రచయిత– ఆర్థిక సామాజిక రంగ నిపుణులు)

### వనరులు పరిమితం




దేశ ప్రజానీకంలో వ్యవస్థాపక సామర్థ్యం దండిగా ఉన్నా అంకుర పరిశ్రమలు ఊపందుకోవడం లేదు. అవి వికసించే వాతావరణం ఇక్కడ లేకపోవడం ప్రధాన లోపం. ఇతర దేశాల్లో అంకురాలు ఎలా విజయవంతమవుతున్నాయో తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్ దేశాల విజయాలు ఎంతో స్ఫూర్తిదాయకం. చైనాలోనూ అనేక అంకురాలు భారీ సంస్థలుగా విస్తరించినా, ప్రభుత్వం ఆర్థికంగా, సాంకేతికంగా, ఇతరత్రా అందించిన భూరి సహాయంతోనే అది సాధ్యపడింది. అంకుర సంస్థలకు చైనా అడుగడుగునా అండదండలిస్తోంది. భారత్ వంటి వర్ధమాన దేశాలు అంత సహాయం అందించలేకపోవచ్చు. తన దగ్గర ఉన్న పరిమిత వనరులను వివిధ రంగాలకు కేటాయించవలసి ఉన్నందున చైనా మాదిరిగా భారత్ అంకురాలకు మరీ పెద్ద మొత్తాలను మంజూరు చేయలేకపోవచ్చు.

## అంతులేని అవినీతి

ఇంటా బయటా లెక్కల్లోకి రాని ధనాన్ని లెక్కించే శాస్త్రమేదీ లేదని పార్లమెంటరీ స్థాయీసంఘం తేల్చి చెప్పింది. స్థిరాస్తి, గనులు, ఫార్మా, విద్య, సినిమా, పాన్‌మసాలా, గుట్కా, పొగాకు వంటి రంగాలన్నీ నల్లధనం కేంద్రాలుగా మారుతున్నాయని అది కుండ బద్దలుకొట్టింది.

రాజకీయాల మాటగాని, నాయకుల ఊసుగాని ప్రస్తావించకపోవడమే కాసింత విడ్డూరంగా తోచిన విషయం.

అన్ని రకాల అవినీతికీ తల్లివేరు రాజకీయ అవినీతి అనే సత్యం జగద్విదితం. ఎన్ని స్థాయీసంఘాల్ని నెలకొల్పినా, మరింకెన్ని కమిటీలను ఏర్పకూర్చినా- అవినీతి అంతు లోతూ ఎవ్వరికీ అందదు. అథవా తెలుసుకుందామన్నా మనలాంటివారికి ఆ అంకెల్ని విని తట్టుకునే చేవ ఉందా? '15 లక్షల నుంచి 34 లక్షల కోట్ల రూపాయల' దాకా ఆ సొమ్ము ఉండవచ్చన్న వార్త చదవగానే గుండెలవిసిపోయి, గుడ్లు తేలేసేవారెందరో! చదువుకున్నవారు సైతం, నెమ్మది నెమ్మదిగా కాలిక్యులేటర్లు, కంప్యూటర్ల సాయంతో గుణించుకోవాల్సిన అంకెలవి! అటువంటిది- 'ఆమ్ ఆద్మీ'కి ఈ లెక్కాడొక్కలు అంతుపడతాయా?

'యుగసహస్ర యోజన పరభాను' అని సూర్యుడికి మనకూ మధ్యఉన్న దూరాన్ని తులసీదాసు చెబితే నమ్మామా? 'నాసా'వారు అది నిజమన్నాకే కదా మనం ఒప్పుకొన్నాం. అదే మన లక్షణం. మనవారి గొప్పతనాన్ని చచ్చినా ఒప్పుకోం. ఏ విదేశీ సంస్థో గుర్తించి చెబితే అప్పుడు గర్విస్తాం... డప్పు కొడతాం. 'అచ్చివస్తే హనుమంతుడి మూర లేకపోతే కోతిమూర' అని ఊరకే అనలేదు. ఇప్పటికైనా ఈ నివేదికను నమ్మాలా అంటే సందేహమే అని ఆ స్థాయీసంఘమే సన్నాయి నొక్కు నొక్కడం కొసమెరుపు!



కట్‌మనీ తిరిగొచ్చిన వేళ...

'కడుపు కూటికేడిస్తే కొప్పు పూలకేడ్చింది' అన్నట్లు, ప్రవేశాలు లేని కళాశాలల్ని మూసెయ్యండహో అని మొత్తుకుంటుంటే, పేరున్న కాలేజీలు లక్షలకొద్దీ డొనేషన్లు దండుకుంటున్నాయి. 'ఇష్టారాజ్యం... భరతుడి పట్టం' లా ఉంది- వృత్తివిద్యా కళాశాలల తీరు. వీళ్ల అడ్డగోలుగా పెంచిన రుసుములపై సాక్షాత్తు సుప్రీంకోర్టే కొరడా ఝుళిపించడం- 'కూరకు తాలింపు, చీరకు జాడింపు లాగా మన కాలేజీలకు వాయింపూ అవసరమే' అని ఘంటాకంఠంగా తేల్చినట్లయింది!

కచోరీవాలా కరోడ్‌పతి అయ్యాడు, మిర్చీలమ్మేవాడు, మిలియనీర్‌లయ్యాడు... సంస్కరణల ఫలితాలు అందరికీ అందుతున్నాయనడంలో ఇంకా సందేహమా, మరింకెందుకు ఈ గోల? మొన్నటికి మొన్న కోల్‌కతా దీదీ కోపగించిన ఘటన అంత త్వరగా మరచిపోయేదేనా? 'పాతిక శాతం'గా దోచుకున్న 'కట్‌మనీ'ని వెనక్కి ఇచ్చేయాలని పార్టీ నాయకులకు గుడ్లురుమి మరీ తేల్చిచెప్పారామె! 'ఇవ్వకపోతే పార్టీ మారాల్సి వస్తుంది... జాగ్రత్త' అనీ బెదిరించారు.

'గాడిదలతో సేద్యం చేస్తూ కాలితన్నులకు భయపడితే ఎలా' అని అనుకున్నట్లున్నారు కాని, ఇంకో ఏడాదికో ఏణ్నర్థానికో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలున్నాయి. కాబట్టి అక్కడి నాయకులు ఎదురుతిరిగారు! ఇలానే కొనసాగితే, జనంలో సానుభూతి సంగతి దేవుడెరుగు... పోటీలో నిలపడానికి అభ్యర్థులే దొరకని స్థితి వస్తుందని గుర్తించిన దీదీ- మాటమార్చేసింది. తమ పార్టీలో కొనసాగుతున్నవారంతా సచ్ఛీలురే అని అనేసింది.

దీదీ అలా ఉంటే, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉద్యోగస్తులను దారిలో పెడతామంటున్నారు. 'గట్టివి వదిలి పొట్టుకోసం పోరాడినట్లు... పనులు చేసిపెట్టి జనం ఇచ్చే తృణమో పణమో తీసుకుంటాం, దానికే ఇంత రాద్ధాంతం చెయ్యాలా? మొగుడు ఏదో అంటే బిచ్చగాడూ అదే అన్నట్లయింది మా పరిస్థితి. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటెయ్యడానికి ఓటుకు అయిదు వందలనుంచి అయిదు వేల రూపాయల దాకా గుమ్మరించి జనానికీ మప్పారుగా డబ్బురుచి. ఇకపై వారు ఎవ్వర్నీ ఏమీ అనలేని పరిస్థితి కల్పించారు' అని ఉద్యోగులు వాపోతున్నారు.

పశ్చిమ్ బంగలో ప్రజలు చైతన్యవంతులు కావడంతో 'కట్‌మనీ'ని వెనక్కి పొందారు కదా అని... దేశమ్మొత్తానికి అదే పద్ధతి విస్తరిస్తామంటే అయ్యే పని కాదు. మన జనానికి ఆ స్థాయి రావడానికి ఇంకా చాలా సమయముంది. ఇంట్లో కరెంటు కావాలన్నా, మనకు డ్రైవింగు లైసెన్సులు రావాలన్నా, భవనాలు బ్రిడ్జిలు కట్టాలన్నా... ఇలా ఏ పనికైనా, ఏ శాఖలోనైనా నజరానాలిస్తేనే పనులయ్యేది. 'జీతం లేకుండా తోడేలు మేకల్ని కాస్తా' అన్నట్లు- అసలు జీతమే అవసరం లేని ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. ఇలా ఎన్ని ఉన్నా, అవన్నీ ఉల్లిగడ్డ మీది పొట్టుతో సమానం. 'అడవి పంది చేను మేసిపోతే, ఊరపంది చెవులు కోసినట్లు' పైయెత్తున లోపాలన్నీ పెట్టుకుని ఉద్యోగస్తులమీద పడితే ఏమొస్తుంది? ముందుగా స్థాయీసంఘం చెప్పిన రంగాలను సంస్కరిస్తే, ఆ తరవాత మిగిలిన వారి గురించి ఆలోచించవచ్చు!

వీటన్నింటికీ తలమానికంగా జీఎస్టీ వచ్చి చేరింది. ఇడ్లీ హోటల్ దగ్గరినుంచి ఇనప కొట్టు దాకా, సులభ్ కాంప్లెక్సు నించి సుజుకీ షోరూమ్‌ల దాకా ప్రతివాడూ మన దగ్గరినుంచి జీఎస్టీ వసూలు చేసేవాడే! వసూలు చేసిన దాంట్లో ప్రభుత్వానికి ఎంత జమ అవుతోందన్నది ఇప్పటికీ 'బ్రహ్మపదార్థమే'! సరిగ్గా జమచేశారా లేదా అని నిర్ధారించే లేక నియంత్రించే యంత్రాంగమేదీ లేదని పార్లమెంటు లోపలా బయటా అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం జవాబు చెప్పింది! మరి దీన్ని లెక్కెయ్యడానికి 'ఏ స్థాయి' సంఘం కావాలి? ఇలా దాచిన సొమ్ములో కొంత, ఏ లెక్కలూ అక్కర్లేని, ఎవరూ అడగని 'ఎలక్టోరల్ బాండ్స్' రూపంలో జమ అవుతాయి. 'గొర్రె కొవ్వితే దాని యజమానికే లాభమన్నట్లు'- ఎంత సొమ్ము ఈ ఎలక్టోరల్ బాండ్స్‌లో చేరితే పార్టీలకు అంత లాభం మరి!

లెక్కలు తేలని ఇటువంటి ఎన్నో రకాల సొమ్ముల సంగతేమిటి? జనానికి ఎంతటి చైతన్యం వస్తే ఈ లెక్కల అంతుతేలాలి? పశ్చిమ్ బంగ ప్రజల్ని దేశమంతటా తిప్పి జనంలో స్ఫూర్తి నింపాలా లేక ఎక్కడికక్కడ ప్రజలే స్వయంగా చైతన్యం పొందుతారా? వేచి చూడాల్సిందే!

– ఎమ్.ఎస్.ఆర్.ఎ.శ్రీహరి

## ఈనాడు లేఖలు

### 'గాంధీ'రహిత కాంగ్రెస్ సాధ్యమా?

సార్వత్రిక ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తూ రాహుల్‌గాంధీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయడం ఓ మంచి నిర్ణయం. ఆ నిర్ణయంలో నిజాయతీ ఏ మేరకు ఉందనేదీ తెలియాలంటే మరికొంత కాలం ఆగాలి. తనలాగే చాలామంది ఓటమికి బాధ్యత వహించాల్సి ఉంటుందన్న ఆయన మాటలు సత్యదూరం కావు. ఏ జాతీయ పార్టీ అయినా బలహీనపడటం దేశానికి మంచిది కాదు. అధికారపక్షానికి ఎదురుగా బలమైన ప్రతిపక్షం ఉన్నప్పుడే ప్రజలకు మేలు జరుగుతుంది. ఈ మాట ప్రతిపక్షాలనుద్దేశించి సాక్షాత్తూ ప్రధాని మోదీయే చెప్పారు. పార్టీ పదవుల ఎంపికల్లో పారదర్శకత, అంతర్గత ప్రజాస్వామ్య ధోరణులు ప్రతిబింబించాలి. కాంగ్రెస్ సమూల ప్రక్షాళనకు, పునరుజ్జీవానికి ఇదే మంచి సమయం.

- డాక్టర్ డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం, విజయనగరంజిల్లా

### ప్లాస్టిక్‌పై నిషేధాన్ని అమలు చేయాలి

పర్యావరణానికి హాని చేసే పాలిథిన్ కవర్లను నిషేధించినా, అవి తెలుగు రాష్ట్రాల్లో అడుగడుగునా కనిపిస్తూనే ఉన్నాయి. నిషేధాన్ని వ్యాపారులెవరూ పట్టించుకోకపోవడం ప్రమాదకరంగా పరిణమించింది. అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్నవారిపై నామమాత్రపు అపరాధ రుసుములు విధించి సరిపెడుతున్నారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నవారిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి. అవి అంత త్వరగా భూమిలో కలవవు. భూసారాన్ని దెబ్బ తీస్తాయి. వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా అడ్డుపడతాయి. పలురకాల పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ సీసాలు, వాటిలోని రసాయనాలు పంటకాల్వల్లో, నాలాల్లో పేరుకుపోయి నీటివనరులను కలుషితం చేస్తున్నాయి. ప్రజారోగ్యానికి కంటగింపుగా మారుతున్నాయి. ఎన్నో అనర్థాలకు కారణమవుతున్న ప్లాస్టిక్ కవర్లపై నిషేధం పూర్తిస్థాయిలో అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కారంపూరి నవీన్, హైదరాబాద్

## జ్ఞాన వార్ధక్యం

### అంతర్యామి

వార్ధక్యం సహజమైన శారీరక పరిణామ దశ. అది జీవితపు అనుభవాలతో నిండి ఉంటుంది. మృత్యువు గురించి భయం, భవిష్యత్తుపై చింత, జీవితంలో కోల్పోతున్నదంతా తిరిగి పొందాలనే తపన దాని లక్షణాలు. వార్ధక్యంతో మాత్రమే మనిషికి పరిపక్వత రాదు.

పరిపక్వత రావాలంటే మనిషిలో జ్ఞాన జిజ్ఞాస కలగాలి. తపనే తపస్సుగా మారినట్లు, జ్ఞానంతో మనిషి అమృతత్వానికి చేరాలి.

దోసపాదు నుంచి పండు తనంతట తానే తొడిమను కోల్పోయి తీగకు దూరం కావడం పరిపక్వ దశకు ఉపమానంగా పెద్దలు చెబుతారు. జ్ఞానమనే అనుభవంతో వైరాగ్య భావంతో, బంధాల నుంచి విడివడి సమాజ శ్రేయస్సును చేరడమే పరిపక్వ దశకు కొలమానం. వారే జ్ఞానవృద్ధులు. వారికి వయసుతో సంబంధం లేదు. తమలోని జ్ఞాన తృష్ణను సమాజ శ్రేయస్సుకై ధారపోస్తారు.

ఎవరికైనా రాసులకొద్దీ గ్రంథ పఠనం వల్ల జ్ఞానం లభించదు. వేలకొద్దీ ప్రవచనాల వల్ల మార్పు రాదు. జ్ఞానమార్గంలోకి సాధారణ మానవులను మరలించాలంటే ఆచరణే శ్రేయో మార్గం. నీళ్లలోకి దిగితేనే ఈత వస్తుంది. తాను చేయవలసిన పని గురించి ఎంత విషయ సేకరణ చేసినా, శిక్షణ పొందినా పని ప్రారంభించకుండా నైపుణ్యం సిద్ధించదు.

తపస్సు వల్ల తాపసి కాగలడు, యోగం వల్ల యోగిగా మారగలడు. నిరంతరం తాను సంపాదించిన జ్ఞానాన్ని సమాజపరంగా ఆచరణలోకి తెచ్చినప్పుడే జ్ఞాని కాగలడు.

ప్రహ్లాదుడు జన్మతః జ్ఞానవృద్ధుడు. తల్లి గర్భంలోనే నారాయణ మంత్రాన్ని నారదుడి ద్వారా పొందాడు. నిద్రలోనూ మరువని నామస్మరణతో భక్తాగ్రేసరుడైనాడు. భగవంతుడి అనుగ్రహాన్ని పొంది తరించాడు. చిన్న కోరికతో తపస్సు చేసిన ధ్రువుడు పసిబాలుడే. తపస్సు చేత జ్ఞానాన్ని పొంది, రాజుగా ప్రజలను మెప్పించి, చివరకు ధ్రువతారగా ప్రకాశించాడు.

అతి చిన్న వయసులోనే ఆసేతు హిమాచల ప్రయాణంచేసి ఆధ్యాత్మిక భావాలను నలుదిక్కులా వెదజల్లి ఆత్మవిశ్వాసమనే పంటను సమాజపరం గావించిన విశిష్ట వ్యక్తి వివేకానందుడు. మనిషిని తట్టి లేపి, సరైన మార్గంలోకి నడిపేదే ఆధ్యాత్మికత. 'లే! నడుం బిగించు. నీ కర్తవ్యాన్ని కొనసాగించు... అడ్డంకులు, నిరాశావాదాన్ని లెక్కచేయక సత్యమార్గంలో సాగు. విజయాన్ని సాధించు' అంటూ దేశంలోని యువతకు జ్ఞానమార్గాన్ని పంచిన వివేకానందుడు జ్ఞానవృద్ధుడు.



సనాతన ధర్మంలోని స్తుతులు, స్తోత్రాలు, ప్రబంధాలు, సిద్ధాంతాలకు అర్థమయ్యే భాష్యాన్ని రచించిన ఆది శంకరులు జ్ఞానవృద్ధులు. వారు పెట్టిన జ్ఞానభిక్ష దేశాన్ని సుసంపన్నం గావించింది. మనిషి జన్మ నుంచి మరణం వరకు అనుభవించేదంతా సమాజం నుంచి లభించేదే! భోగభాగ్యాలు, సుఖసంతోషాలు జీవిత పరమార్థాలు అన్నీ సామాజికమైనవే. జ్ఞానం కూడా ప్రకృతి వరప్రసాదమే.

తన జ్ఞానాన్ని తిరిగి సమాజపరం చేయడమే సరైన కృతజ్ఞత. గాలి, నీరు, నిప్పు సహా పంచభూతాత్మకాలు మనిషికి భగవంతుడిచ్చిన దివ్య వరాలు. జీవితాన్ని ఇచ్చి, ఉన్నత స్థాయికి చేర్చి, ఇంట, వెంట, కంట కాపాడిన సమాజానికి తమ జ్ఞానాన్ని పంచడం జ్ఞానవృద్ధుల కర్తవ్యం.

పదిమందికి మేలు చేస్తుందనే నమ్మకంతో, తనకు ఆపద కలుగుతుందని తెలిసినా ఉన్నత శిఖరాన్ని ఎక్కి మంత్రాన్ని లోకక్షేమం కోసం అరిచి చెప్పిన శ్రీ రామానుజుల మార్గం- సమాజ శ్రేయస్సు.

జ్ఞానాన్ని తనలోనే దాచుకోవడం దొంగతనం. ఆడంబర ప్రదర్శన అహంకారం. పదిమందిని చీకటి నుంచి వెలుగుకు ప్రయాణింపజేయడం స్ఫూర్తిదాయకం. ఆనాటి జ్ఞానవృద్ధులే నేటికీ చిరస్మరణీయులు.

– రావులపాటి వెంకట రామారావు

## 10 రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీలు

- 2018-19 ఆర్థిక సంవత్సరంలో 239 కోట్ల విడుదల
- తెలంగాణకు రూ.450 కోట్లు ఏపీకి రూ.15 కోట్లు

ఈనాడు, దిల్లీ: దేశంలోని 10 రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.5,239 కోట్లు విడుదల చేసినట్లు ఆర్థికశాఖ సహాయమంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ తెలిపారు. ఇందులో అత్యధికంగా త్రిపురకు రూ.1858.70 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఆ రాష్ట్రంలో జరుగుతున్న వివిధ పనులకు పెట్టుబడి కోసం ఏకకాలం సాయం కింద ఈ మొత్తాన్ని ఇచ్చామన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన అర్ధకుంభమేళా పనుల కోసం రూ.1,200 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి ప్యాకేజీ కింద బిహార్‌కు రూ.739 కోట్లు, అరుణాచల్‌ప్రదేశ్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు కోసం రూ.309 కోట్లు ఇచ్చామన్నారు. విదేశీ ఆర్థికసాయంతో చేపట్టిన ప్రాజెక్టుల కోసం చెల్లించిన వడ్డీ రీఎంబర్స్‌మెంట్ కోసం ప్రత్యేక ప్యాకేజీ కింద ఏపీకి రూ.15.81 కోట్లు ఇచ్చినట్లు వెల్లడించారు. అలాగే ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం తెలంగాణకు రూ.450 కోట్లు విడుదల చేశామన్నారు. వివిధ ప్రాజెక్టుల కోసం జమ్మూకశ్మీర్‌కు రూ.285 కోట్లు, నాగాలాండ్‌కు రూ.226 కోట్లు, రాజస్థాన్‌కు రూ.146 కోట్లు, ఉత్తరాఖండ్‌కు రూ.8 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది జులై 5వరకు ప్రత్యేక సాయం కోసం మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, బిహార్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, త్రిపుర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తదితరాల నుంచి విజ్ఞాపనలు వచ్చినట్లు వెల్లడించారు.

# విత్తనాలడిగితే లాఠీలతో కొడతారా?

- తుగ్లక్‌లా జగన్ పరిపాలన
- పోలవరం జాప్యానికి మీ తండ్రే కారణం
- తెదేపా నాయకుల ధ్వజం

ఈనాడు - అమరావతి

రైతులకు విత్తనాలను అందించలేని వైకాపా ప్రభుత్వం రైతు దినోత్సవం జరపడం హాస్యాస్పదమని తెదేపా నాయకులు ధ్వజమెత్తారు. 'విత్తనాలడిగితే లాఠీలతో కొడుతున్నారు. పోలీస్‌స్టేషన్లలో విత్తనాలను సరఫరా చేస్తున్నారు. పొలాల్లో ఉండాల్సిన రైతుల్ని రోడ్డెక్కించారు. విత్తనాల తయారీ అంటే ఇడ్లీ, ఉప్మా చేసినట్లు కాదని వ్యవసాయ శాఖ మంత్రే వ్యంగ్యంగా వ్యాఖ్యానించడం రైతులపట్ల వారి నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం' అని మండిపడ్డారు. తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సోమవారం గుంటూరులోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు, అధికార ప్రతినిధులతో సమావేశమయ్యారు. జగన్ పరిపాలన తుగ్లక్ పాలనలా ఉందని తెదేపా నేతలు విమర్శించారు. 'వైఎస్ హయాంలో టెండర్లను ప్రిక్లోజర్ చేయడం వల్లే పోలవరం ప్రాజెక్టులో జాప్యం జరిగింది. అప్పుడే పనులను వేగంగా చేసి ఉంటే ఈ పాటికి ప్రాజెక్టు పూర్తయ్యేది. నాలుగేళ్లలో 70శాతం పనులను పూర్తి చేసిన మమ్మల్ని ఎలా విమర్శిస్తారు? పోలవరం ప్రాజెక్టులో ఎక్కడ అవినీతి జరిగిందో వెతకాలని అధికారుల్ని బతిమాలుతున్నారు. అవార్డులు, రివార్డులు ఇస్తామంటున్నారు.




పార్టీ ఓటమిపై చంద్రబాబు వద్ద కన్నీళ్లు పెట్టుకున్న ఓ కార్యకర్త

అంటే ఇన్నాళ్లూ మీరు మాపై చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలే కదా?' అని పేర్కొన్నారు. 'మీరు కోట్లు ఖర్చు పెట్టి ఇళ్లు కట్టుకోవచ్చు. మీ టాయిలెట్లకు రూ.30 లక్షలు ఖర్చు పెడతారు. పేదవాడి ఇంట్లో మాత్రం టాయిలెట్ ఉండకూడదా? నాణ్యమైన సింక్, టైల్స్‌తో చక్కటి ఇల్లు కడితే దానిపై అవినీతి బురద చల్లుతారా?' అని ధ్వజమెత్తారు. 'మీరు చెప్పిన రాజన్న రాజ్యంలోనే 14 లక్షల ఇళ్లు మాయమయ్యాయి. రూ.5వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారు. మీ నాయన కట్టిన ఇళ్లు పిచ్చుక గూళ్లని, మంచం కూడా పట్టదని అనేవారు గుర్తుందా? ఏ ఇళ్లు బాగున్నాయో వెళ్లి చూసొద్దామా?' అని ముఖ్యమంత్రి జగన్‌ను ఉద్దేశించి తెదేపా నాయకులు వ్యాఖ్యానించారు. 'పింఛనును రూ.3వేలు చేస్తానని చెప్పి కేవలం రూ.250 మాత్రమే పెంచి వృద్ధులు, దివ్యాంగులు, అనాథ మహిళల్ని మోసం చేశారు. పింఛను రూ.వెయ్యి నుంచి రూ.2,250కి పెంచానని చెప్పడం జగన్‌మోహన్‌రెడ్డి వక్రబుద్ధికి నిదర్శనం. పింఛను రూ.2వేలు చేసింది చంద్రబాబునాయుడే అన్నది అందరికీ తెలిసిన సత్యం' అని పేర్కొన్నారు. 'బీమా క్లెయింలను నిలిపేశారు. సీఎంఆర్ఎఫ్ చెల్లింపులను ఆపేశారు. పెళ్లి కానుకలు, రంజాన్ కానుకలను నిలిపేశారు. ఇది నిలిపివేతల ప్రభుత్వమే తప్ప చెల్లింపుల ప్రభుత్వం కాదనేది 40 రోజుల్లోనే తేలిపోయింది' అని తెదేపా నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావు, జవహర్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### వైకాపా దుందుడుకు చర్యలను అడ్డుకుంటాం

వైకాపా దుందుడుకు చర్యలను అడ్డుకుంటామని తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన కార్యకర్తలతోపాటు తెలంగాణలోని ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన వందలాది మంది కార్యకర్తలు, మహిళలు సోమవారం గుంటూరులోని పార్టీ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. కంభంపాడులో వైకాపా కార్యకర్తలు దాడులకు పాల్పడుతుంటే తెదేపా కార్యకర్తలు ఊరు వదిలి వెళ్లిపోతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు స్పందిస్తూ... వైకాపా దుష్ట పాలనపట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఎవరూ భయపడొద్దని, పూర్తి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన కార్యకర్తలు మాట్లాడుతూ నాయకులు వెళ్లినా కార్యకర్తలందరం పార్టీ వెన్నంటి ఉన్నామని చెప్పారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలందరికీ న్యాయం జరిగే విధంగా అండగా ఉంటానని చంద్రబాబు వారికి ధైర్యం చెప్పారు.

### తెదేపాను వీడే ప్రసక్తే లేదు: ప్రత్తిపాటి

కొందరు తెదేపా నేతలు భాజపాలో చేరుతున్నారంటూ అసత్యాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. 40 శాతం ఓటు బ్యాంకు ఉన్న తెదేపాను ఖాళీ చేయడం ఎవరికీ సాధ్యం కాదని స్పష్టం చేశారు. తాను తెదేపాను వీడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. గుంటూరులోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండీ జగన్ పచ్చి అబద్ధాలాడుతున్నారని విమర్శించారు.

### కిషన్‌రెడ్డిని మర్యాదకే కలిశా: ఎమ్మెల్యే వల్లభనేని వంశీ

ఈనాడు డిజిటల్, అమరావతి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డిని తాను మర్యాదపూర్వకంగానే విజయవాడలో కలిశానని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తెలిపారు. 'నేను ఎప్పటికీ చంద్రబాబుకు, తెదేపాకు విధేయుడినే' అని వంశీ తెలిపారు.

# మెడ్‌టెక్.. ఓ మయసభ!

- ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు
- రాతపూర్వక జవాబులు కోరిన కమిటీ

ఈనాడు, అమరావతి: 'అదో మయసభలా ఉంది. లోపల ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. అక్కడ కనిపించిన దానికి, అధికారులు చెప్పే దానికి పొంతన కనిపించలేదు. ప్రభుత్వ ప్రాజెక్టుకు సంబంధించి ఇటువంటి పరిస్థితి రావడం బాధాకరమే. అనివార్య పరిస్థితుల్లో లిఖితపూర్వకంగా ప్రశ్నలు వేసి జవాబులు కోరాం' అని రాష్ట్రంలోని వైద్య రంగంలో సంస్కరణలపై ఏర్పాటైన కమిటీ మెడ్‌టెక్ జోన్‌పై పేర్కొంది. కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ విశ్రాంత కార్యదర్శి సుజాతారావు నేతృత్వంలోని కమిటీ సభ్యులు గతవారం విశాఖ కేజీహెచ్, మెడ్‌టెక్ జోన్ వంటి వాటిని సందర్శించారు. వివాదాస్పదంగా మారిన మెడ్‌టెక్ జోన్‌లో ఎదురైన పరిణామాలపట్ల నివ్వెరపోయారు. ఈ సంస్థ సీఈవో జితేందర్ కుమార్ శర్మ సభ్యులు అడిగిన సందేహాలకు సరైన జవాబులు ఇవ్వలేకపోయారు. వైద్య పరికరాల తయారీ సంస్థగా పేర్కొనే ఈ మెడ్‌టెక్ జోన్ కార్యకలాపాల కోసం ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడతల వారీగా రూ.400 కోట్లు ఇచ్చారు. అయితే.. అక్కడ పట్టుమని 10 మంది కూడా ఉద్యోగులు లేరని, క్యాంటీన్‌లో 25 మంది ఉన్నారని కమిటీ గుర్తించింది. ఎన్ని సంస్థలు ఇక్కడ కార్యకలాపాలను ప్రారంభించేందుకు ముందుకొచ్చాయి? ఒప్పందాలెలా జరిగాయి? ఎంత మందికి ఉద్యోగాలు లభిస్తున్నాయి? త్రీడీ మిషన్ ఉపయోగం ఏంటి? ఇన్ని సౌకర్యాలను కల్పిస్తే ప్రభుత్వానికి నెలకు కోటి రూపాయల వరకు ఆదాయం వస్తుందని చెప్పడం ఏమిటని కమిటీ ప్రశ్నించింది. అయితే అవతలి వైపు నుంచి స్పష్టత లేని సమాచారం వచ్చిందని తెలిసింది. విసుగెత్తిన కమిటీ ప్రశ్నలను సంధించి జవాబులను తెప్పించాలని ప్రభుత్వ వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డిని కోరింది. ఈ సంస్థకు సంబంధించిన కార్యకలాపాలు ఇద్దరు, ముగ్గురి మధ్యనే రహస్యంగా జరిగినట్లు తెలుస్తోందని కమిటీ వర్గాలు వ్యాఖ్యానించాయి. ఇప్పటివరకు కమిటీ సభ్యులు విడివిడిగా, కలిసి విశాఖ జిల్లా అనకాపల్లి, పాడేరు, అరకు, మినములూరు, విజయనగరం, శ్రీకాకుళం, ప్రకాశం, కృష్ణా ఇతర జిల్లాల్లోని వివిధ రకాల ప్రభుత్వాసుపత్రులను సందర్శించారు. విశాఖ జిల్లా అనకాపల్లి ఆసుపత్రిలో ఓపీ రద్దీ బాగా ఉందని, ఇంకా అభివృద్ధి చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

## భారతీయ భాషలనే భావన రావాలి

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఈనాడు, దిల్లీ: కొన్ని భాషలను కేవలం ప్రాంతీయ భాషలుగానే పరిగణిస్తూ మాట్లాడుతున్నారని, వాటిని కూడా భారతీయ భాషలుగా మనసా, వాచా భావించాలనీ ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు కోరారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వాడుకలో ఉన్న భాషల్లో మాట్లాడడానికి సభ్యులు అనుమతి కోరుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వాటిని భారతీయ భాషలనే భావనతోనే సంభాషించాలని ఆయన ఆకాంక్షించారు. వాటిని ప్రాంతీయ భాషలుగా పేర్కొంటూ ఉంటే తన మనసు చిన్నబోతోందని ఉపరాష్ట్రపతి చెప్పారు.

భారతీయ భాషల్లోని వైవిధ్యానికి సోమవారం రాజ్యసభ వేదికైంది. రాజ్యసభలో పలువురు సభ్యులు భగేలి, సంస్కృతం, కొంకణి భాషల్లో మాట్లాడడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. శూన్య గంటలో భాజపా సభ్యుడు అజయ్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ...భగేలి భాషను ఎనిమిదో షెడ్యూల్లో పొందుపరచాలని డిమాండు చేశారు. భగేలి భాషలో మాట్లాడిన సభ్యుడిని తొలుత అభినందించిన వెంకయ్యనాయుడు... 22 షెడ్యూల్డు భాషల్లో భగేలీ లేకపోవడంతో వెంటనే అనువాదం వీలుకాదన్నారు. గోవా సభ్యుడు వినయ్ దిను కొంకణి భాషలో మాట్లాడడానికి యత్నించగా అనువాదకుడు అందుబాటులో లేకపోవడంతో హిందీలోనే ప్రసంగించాల్సి వచ్చింది. ప్రత్యేక ప్రస్తావన సమయంలో భాజపా సీనియర్ సభ్యుడు సత్యనారాయణ్ జతియా సంస్కృతంలో మాట్లాడారు. అనంతరం భాజపా సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ.. ఉభయసభల్లోని ప్రశ్నలకు సమాధానాలు మాతృభాషలో ఇవ్వాలని కోరారు. జీవీఎల్ సూచనను పరిగణనలోకి తీసుకుంటామని, సాధ్యాసాధ్యాలను బట్టి సమాధానాలను ఆయా సభ్యుల మాతృభాషల్లో అందించే అవకాశం లేకపోలేదని వెంకయ్యనాయుడు తెలిపారు.

## అక్టోబరు 2 నుంచి కొత్తవారికి పింఛన్లు

- దరఖాస్తులు స్వీకరించనున్న ప్రభుత్వం
- గ్రామ వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దే అందజేత
- అభయహస్తం పింఛనుదారులకు రూ.2,750

ఈనాడు డిజిటల్, అమరావతి: సామాజిక భద్రత పింఛన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకొనేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. అర్హుల ఎంపిక తర్వాత వాలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే పింఛను పంపిణీ చేస్తారు. అక్టోబరు 2 నుంచి ఈ కొత్తవారికి పింఛన్లను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల హామీ నేపథ్యంలో ఇప్పటికే సామాజిక భద్రత పింఛన్ల అర్హత వయసును 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించింది. వీరితో పాటు తలసేమియా, పక్షవాతం, కుష్ఠు వ్యాధిగ్రస్తులకు అందించనుంది. ఇవేకాకుండా కొంతమంది 65 ఏళ్లు పైబడిన వారికి అర్హత ఉన్నా గత ప్రభుత్వంలో పింఛన్లు అందలేదని భావిస్తున్న ప్రభుత్వం వారికి దరఖాస్తు చేసుకోవడానికి మరోమారు అవకాశం కల్పించనుంది. గ్రామ/వార్డు వాలంటీర్ల నియామకం తర్వాత వారి ద్వారా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది.

**10 లక్షల మందికి పైగా అర్హులు:** ప్రజా సాధికారిక సర్వే ప్రకారం 65 నుంచి 60 ఏళ్ల మధ్య 5.49 లక్షల మంది ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తలసేమియా, పక్షవాతం, కుష్ఠు వ్యాధిగ్రస్తులతో పాటు 65 ఏళ్లు పైబడిన వారికి దరఖాస్తుకు అవకాశం ఇస్తే మరో 4 నుంచి 5 లక్షల మంది అర్హులు వచ్చే అవకాశం ఉందని గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ(సెర్ప్) అధికారుల అంచనా వేశారు.

డ్వాక్రా సంఘాల్లోని 18 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న మహిళలు ఏటా రూ.365 చెల్లిస్తే... 60 ఏళ్లు దాటిన తర్వాత వారికి అభయహస్తం పథకం కింద ప్రతినెలా రూ.500లు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ మొత్తం కూడా బీమా కంపెనీల ద్వారా అందుతోంది. ఇలా 60 వేల మందికి పైగా ప్రతి నెలా పింఛను పొందుతున్నారు. ప్రస్తుతం పింఛన్ల అర్హత వయసును 60 ఏళ్లకు తగ్గించిన నేపథ్యంలో వారికి ప్రస్తుతం వస్తున్న రూ.500తో పాటు వృద్ధాప్య పింఛను కింద ప్రభుత్వం చెల్లించే రూ.2,250లు కలిపి రూ.2,750లు అందించాలని యోచిస్తోంది. ఒకే ఇంట్లో రెండో పింఛను ఉండకూడదన్న నిబంధన కారణంగా 60 వేల మందిలో 40 వేల మందికి అందే అవకాశం లేదు. మిగిలిన 20 వేల మంది ప్రస్తుత పింఛనుకు అర్హత సాధిస్తారని సెర్ప్ అధికారులు గుర్తించారు.

### కర్ణాటక పరిణామాలతో కేంద్రానికి సంబంధం లేదు

- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ



దిల్లీ: కర్ణాటకలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. పార్టీ మారాలని ఏ ఎమ్మెల్యేపైగానీ, ఎంపీపైగానీ ఒత్తిడి తేలేదని అన్నారు. పార్లమెంటు పవిత్రతను కాపాడడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. సోమవారం లోక్‌సభలో శూన్యగంటలో కాంగ్రెస్ సభ్యుడు అధీర్ రంజన్ చౌధరి ప్రస్తావించిన అంశానికి సమాధానంగా రాజ్‌నాథ్ ఈ వివరణ ఇచ్చారు. తొలుత చౌధరి మాట్లాడుతూ కర్ణాటక, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలను కూల్చివేయడానికి కేంద్రం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కర్ణాటక గవర్నర్‌ను ఎమ్మెల్యేలు కలిసిన మరుక్షణమే వాహనాలు, విమానాలు, హోటళ్లు సిద్ధమయ్యాయని వ్యాఖ్యానించారు. దీనిపై రాజ్‌నాథ్ స్పందిస్తూ రాహుల్ గాంధీతోనే కాంగ్రెస్‌లో రాజీనామాలు ప్రారంభమయ్యాయని అన్నారు. పెద్ద నాయకులంతా రాజీనామా చేస్తున్నారని చెప్పారు. అనంతరం కాంగ్రెస్ సభ్యులు 'ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

# కాంగ్రెస్ మంత్రుల రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

రాజీనామాలు చేశారు. ఉపముఖ్యమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్, మంత్రులు డి.కె.శివకుమార్, కృష్ణబైరేగౌడ తదితరులంతా తమ రాజీనామా పత్రాలను సీఎల్పీ నేత సిద్ధరామయ్యకు ఇచ్చారు. మంత్రులుగా ఉన్న ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు మాత్రం రాజ్‌భవన్‌కు చేరుకుని పదవులకు రాజీనామా సమర్పించారు. మరోవైపు విదేశాల నుంచి ఆదివారం రాత్రి నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి కుమారస్వామి జనతాదళ్, కాంగ్రెస్ నేతలతో నిరంతరం చర్చిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న జేడీఎస్ సభ్యులను అధిష్ఠానం కొడుగు రిసార్ట్‌కు తరలించింది.

### భయ పెట్టి రాజీనామాలు

ప్రజా ప్రభుత్వాన్ని పరిహాసం చేయటమే భాజపా లక్ష్యం చేసుకుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ధ్వజమెత్తారు. ఇప్పటికే ఆరుసార్లు 'ఆపరేషన్ కమల' చేపట్టిందని, మరోమారు ఈ ప్రయోగం విఫలమవుతుందని హెచ్చరించారు. తమ ఎమ్మెల్యేలను ప్రత్యేక విమానాల్లో ముంబయికి పంపారని, గన్‌మెన్‌ల మధ్య కట్టడి చేశారని వివరించారు. ఐటీ, ఈడీ, సీబీఐలతో తమ ఎమ్మెల్యేలను కేంద్రం భయపెట్టిందని ఆరోపించారు. అవసరమైతే ముంబయికి వెళ్లిన వారితో మంత్రివర్గాన్ని భర్తీ చేసేందుకు సహకరిస్తామని కాంగ్రెస్- జేడీఎస్ సమన్వయకర్త, మాజీ ముఖ్యమంత్రి, సీఎల్పీ నేత సిద్ధరామయ్య స్పష్టం చేశారు. వారిలో అర్హులకు తప్పక అవకాశం ఉంటుందన్నారు.

### ముంబయి వదలం..

'మాకు మంత్రి పదవులు అవసరం లేదు. మేము ముంబయి విడిచి వచ్చే ప్రసక్తే లేదు' అని అసమ్మతి ఎమ్మెల్యేలు మరోమారు స్పష్టం చేశారు. నగరంలోనే ఉన్న మరో ఎమ్మెల్యే రామలింగారెడ్డితో ముఖ్యమంత్రి కుమారస్వామి, సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే ప్రత్యేకంగా మాట్లాడినా నిర్ణయాన్ని మార్చుకోలేదు. సోమవారం రాజీనామాలు చేసిన మంత్రులు నగేశ్, ఆర్.శంకర్ వేర్వేరు విమానాల్లో ముంబయికి వెళ్లారు.



మంత్రి పదవులకు రాజీనామా చేసిన స్వతంత్ర సభ్యులు, మంత్రులు నగేశ్, శంకర్

### నేడే స్పీకర్ స్పందన

రాజీనామా చేసిన ఎమ్మెల్యేలకు స్పీకర్ రమేశ్‌కుమార్ మంగళవారం నోటీసులిచ్చి విచారించనున్నారు. విచారణలో ఆయన కీలకాంశాలపై ప్రశ్నించనున్నారు. నేరుగా తనకే ఎందుకు రాజీనామా పత్రాలు సమర్పించలేదని, స్వచ్ఛందంగా ఇచ్చారా? లేదా? అని తెలుసుకోనున్నారు. రాజీనామాలు సరైన పద్ధతితో ఇవ్వలేదని భావిస్తే విచారణను వాయిదా వేసే అవకాశం ఉంది. స్పీకర్ విచారణకు గడువూ ఉండదు. విచారణను వాయిదా వేసినా, స్పీకర్‌పై న్యాయస్థానంలో సవాలు చేసే వీలు లేదు. విచారణలో స్పీకర్ జాప్యం చేస్తే ఆయనపై ప్రతిపక్ష భాజపా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

### చట్టపరమైన అంశాలు

ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 164-1బి అంశాన్ని తెరపైకి తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా పార్టీ ఫిరాయింపులకు ప్రయత్నించిన శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు విన్నవించనుంది. రాజీనామా చేసిన వారంతా తొలి విడతలో ఒకే విమానంలో వెళ్లటం కూడా వీరిపై చర్యలకు అనువైన అంశంగా కాంగ్రెస్ భావిస్తోంది. మంగళవారం సీఎల్పీ సమావేశానికి హాజరవ్వాలని నోటీసులు పంపటం, విప్ జారీ తదితర అస్త్రాలను సంధించాలని అధిష్ఠానం చూస్తోంది. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు న్యాయ నిపుణులతోనూ చర్చిస్తోంది. స్పీకర్ రమేశ్‌కుమార్ నిర్ణయంపైనే ప్రభుత్వ భవిత ఆధారపడి ఉంది.

#### రాజీనామాలను స్పీకర్ అంగీకరిస్తే పార్టీల సంఖ్యా బలం

- మొత్తం సభ్యులు: 224
- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన వారు: 14
- మంత్రి పదవికి రాజీనామా చేసిన స్వతంత్రులు: 2
- సభలో మిగిలే సభ్యుల సంఖ్య: 210 (స్పీకర్‌తో కలిపి)
- భాజపా: 107 (మంత్రులు నగేశ్, శంకర్ మద్దతు ప్రకటించడంతో)
- కాంగ్రెస్: 67
- జేడీఎస్: 34
- బీఎస్పీ: 1
- స్పీకర్: 1
- మేజిక్ నంబరు: 106

## ఆడిట్ నివేదిక సమర్పిస్తే నిధులు

### పోలవరంపై కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్

ఈనాడు, దిల్లీ: పోలవరం కోసం 2014 మార్చి 31 వరకు చేసిన వ్యయానికి ఆడిట్ నివేదిక సమర్పిస్తే తదుపరి నిధులు విడుదల చేస్తామని కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. పోలవరానికి కేంద్ర నిధుల విడుదలపై తెదేపా రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు. 2014 ఏప్రిల్1 నాటికి పోలవరానికి కేంద్ర సాయంగా రూ.6764.16 కోట్లు విడుదల చేశామని తెలిపారు. నిధుల విడుదలకు ఆడిట్ నివేదిక, 2013-14 ధరల ఆధారంగా సవరించిన అంచనాలు సమర్పించాలని సూచించామని పేర్కొన్నారు.

- విశాఖలో క్యూబిక్ మీటర్ గాలిలో సూక్ష్మధూళి కణాల(పీఎం 10) సంఖ్య 2016లో 77గా ఉంటే 2017లో 73కి తగ్గాయని, 2018లో మళ్లీ 77గా ఉన్నాయని పర్యావరణ శాఖ సహాయ మంత్రి బాబుల్ సుప్రియో తెలిపారు. విజయవాడలో పీఎం 10.. 2017లో 99, 2018లో 77గా నమోదైనట్లు చెప్పారు.
- జాతీయ రహదారుల అభివృద్ధికి అయిదేళ్లలో ఏపీకి రూ.8,728 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. కృష్ణా నదిలో విజయవాడ- ముక్త్యాల మధ్య జలరవాణా అభివృద్ధికి ఇప్పటివరకు రూ.37 కోట్లు వెచ్చించినట్లు మంత్రి మన్‌సుఖ్ ఎల్.మాండవ్య తెలిపారు. కాకినాడ-ఎన్నోర్ మార్గం అభివృద్ధికి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఏపీకి 2016-17 నుంచి 2018-19 వరకు యువజన, క్రీడల శాఖలో వివిధ పథకాల కింద రూ.42.94 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

## అభివృద్ధిలో అగ్రగామి ఏపీ

### వైఎస్ జయంతి వేడుకల్లో ఎంపీ విజయసాయిరెడ్డి ఆకాంక్ష

ఈనాడు, దిల్లీ: అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి కానుందని వైకాపా పార్లమెంటరీ పార్టీ నేత, ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి విజయసాయిరెడ్డి తెలిపారు. సోమవారమిక్కడ ఏపీ భవన్‌లో వైఎస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ అడుగుజాడల్లో ఆంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి జగన్ అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. వైకాపా లోక్‌సభాపక్షనేత మిథున్‌రెడ్డి, పార్టీ విప్ మార్గాని భరత్, ఎంపీలు పాల్గొన్నారు.

## లోక్‌సభ రాజకీయ వ్యవహారాల విభాగం డైరెక్టర్‌గా రంగారావు

ఈనాడు, దిల్లీ: లోక్‌సభ సచివాలయం రాజకీయ వ్యవహారాల విభాగం డైరెక్టర్‌గా ఒంగోలుకు చెందిన గుమ్మడిదల రంగారావు నియమితులయ్యారు. ఈ మేరకు సభాపతి ఓం బిర్లా ఆదేశాలిచ్చారు. లోక్‌సభ సచివాలయంలోని రాజకీయ వ్యవహారాల విభాగం, మెంబర్స్ రిఫరెన్స్ సర్వీసు (పొలిటికల్, పార్లమెంటరీ అఫైర్స్ డెస్క్) డైరెక్టర్‌గా రంగారావు విధులు నిర్వర్తించనున్నారు. ప్రకాశం జిల్లా బ్రాహ్మణ నిడమానూరుకు చెందిన రంగారావు దిల్లీలోని జేఎన్‌యూ విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్ చదివారు. అనంతరం లోక్‌సభ సచివాలయంలో పరిశోధన, సమాచార విభాగంలో ఉద్యోగంలో చేరారు. సుమారు మూడు దశాబ్దాల పాటు సేవలందించిన ఆయన డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. ఈ స్థానానికి చేరుకున్న తొలి తెలుగు వ్యక్తి ఆయనే. కొంతకాలం ఆయన ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖలోనూ సేవలందించారు.

# ఇన్సులిన్ ఇంజక్షన్లకు కొరత

- నాణ్యత లేదని వినియోగం నిలిపివేత
- టీడీ మందు సరఫరా లేదు
- రోగులు, గర్భిణులకు సమస్యలు

ఈనాడు, అమరావతి: మధుమేహ (షుగర్) వ్యాధి నివారణ కోసం ఉపయోగించే ఇన్సులిన్ ఇంజక్షన్లకు ప్రభుత్వాసుపత్రుల్లో కొరత ఏర్పడింది. రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ద్వారా జిల్లాలకు వెళ్లిన ఇన్సులిన్ ఇంజక్షన్‌ను ఉపయోగించవద్దని ఆదేశాలు రావడంతో వాటిని పక్కనపెట్టారు. దీంతో అవసరాలకు తగ్గట్లు రోగులకు ఇంజక్షన్లు అందజేయలేకపోతున్నామని ఓ ఆసుపత్రి నిర్వహణ అధికారి తెలిపారు. కొన్నిచోట్ల ఇప్పటికిప్పుడు సమస్య లేకున్నా రానున్న రోజుల్లో ఇన్సులిన్ కొరత తీవ్రతరం కానుందన్నారు. ప్రైవేట్ మందుల దుకాణాల్లో వారానికే వందల రూపాయలు వెచ్చించి ఇంజక్షన్లను కొనుక్కోవాల్సి రావడంతో రోగులపై ఆర్థిక భారం పెరుగుతోంది.

ఓ జిల్లాలో ఔషధాల సరఫరాను పర్యవేక్షించే అధికారి మాట్లాడుతూ "యథావిధిగానే జిల్లాలకు ఇన్సులిన్ ఇంజక్షన్లు సరఫరా చేశారు. అయితే వాటిలో నాణ్యత లేదని తెలియడంతో వాడొద్దని సమాచారమిచ్చారు. ఇప్పుడు వాటిని పక్కనబెట్టడంతో రానున్న రోజుల్లో ఇన్సులిన్ కొరత సమస్యగా మారబోతుంది" అని పేర్కొన్నారు. ఇన్సులిన్ ఇంజక్షన్లలో నాణ్యత లేదని పరీక్షల్లో నిర్ధారించడంతో సరఫరాకు కొత్త సంస్థను ఎంపిక చేయాల్సి ఉంది. దీనికి కొంత సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయాల ద్వారానైనా వెంటనే ఇన్సులిన్ ఇంజక్షన్లను సరఫరా చేయకపోతే ఇబ్బందులు పడతామని వైద్యులు.. వైద్య మౌలిక సదుపాయాల సంస్థను కోరుతున్నారు. ప్రకాశం జిల్లాలో ఇన్సులిన్ ఇంజక్షన్ సమస్య క్రమంగా పెరిగిపోతుందని, ఈ జిల్లాలో పారసిటమాల్, దగ్గు మందు (సీపీఎం) కొరత కూడా తీవ్రంగా ఉందని వైద్య వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు కర్నూలు, ప్రకాశం జిల్లాలో పలు ప్రభుత్వాసుపత్రులకు ఇంకా కుక్కకాటు ఇంజక్షన్లు రాలేదని సిబ్బంది చెబుతున్నారు.



### టీటీ బదులు టీడీ ఇస్తామని..

కేంద్ర మార్గదర్శకాల ప్రకారం గర్భిణులకు టీటీ బదులు టీడీ వాడాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారులకు తెలిపింది. ప్రస్తుతం ఆసుపత్రుల్లో ఉన్న టీటీ వ్యాక్సిన్‌ను పూర్తిగా వాడేసినట్లు సమాచారమిస్తే వెంటనే టీడీ పంపిస్తామని సూచించింది. మహిళలు గర్భం దాల్చినప్పుడు తొలిసారి, మలి విడత మరోసారి టీటీ ఇస్తారు. అలాగే పాఠశాల విద్యార్థుల్లో పదేళ్లు పైబడిన వారికి కూడా ఈ ఇంజక్షన్ వాడుతున్నారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో టీటీ నిల్వలు నిండుకున్నాయి. కానీ టీడీ మందు పంపిణీ కాలేదు. ఈ జిల్లాలో నెలకు 20 వేల డోసులు అవసరం ఉంది. టీటీ లేక, టీడీ మందు రాక.. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఇక్కడి ఓ మండల వైద్యాధికారి చెప్పారు. ఇదే సమస్య ఇతర జిల్లాల్లో ఇప్పుడిప్పుడే మొదలవుతున్నట్లు తెలుస్తోంది. అన్ని రాష్ట్రాలు టీటీ నిల్వలు పూర్తిగా వాడేసినట్లు నిర్ధారిస్తేనే టీడీ పంపిస్తామని కేంద్రం సూచించిందని, దానిలో జాప్యం వల్లే టీడీ పంపిణీ జరగలేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నాయి.

## వైఎస్ చిరస్థాయిగా నిలిచారు

### ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, అమరావతి: పేదల సంక్షేమం కోసం ఆరోగ్యశ్రీ, రచ్చబండ, విద్యార్థులకు బోధనారుసుముల చెల్లింపు, రైతులకు ఉచిత విద్యుత్ పథకాలు ప్రవేశపెట్టి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని ఏపీఎన్జీవో కార్యాలయంలో వైఎస్ జయంతిని నిర్వహించారు. చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. రాజశేఖర్‌రెడ్డి ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించేవారని, ప్రతి ఉద్యోగికి ఇంటి స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సీఎం జగన్ ఉద్యోగులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తానని చెప్పారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన నవరత్నాల అమలుకు ఉద్యోగులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. జలయజ్ఞం పేరుతో పోలవరం సహా ఎన్నో నీటిపారుదల ప్రాజెక్టులకు వైఎస్ శంకుస్థాపన చేశారని ఏపీ ఎన్జీవో ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అందుకే వైఎస్ జయంతిని సీఎం రైతు దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. సమావేశంలో ఏపీ ఎన్జీవో నేతలు జి.గంగిరెడ్డి, అజయ్‌కుమార్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDUCATION
★ MBBS, BVSc, GUIDANCE SEATS AVAILABLE 7989662404/9989747483



# నికరంగా దక్కేది నష్టమే!

- కంటితుడుపుగా కేంద్రం మద్దతు ధర
- రాష్ట్ర సిఫారసులు గాలికి
- సాగు వ్యయానికి, పంట ధరకు కుదరని పొంతన
- కొనుగోలులోనూ సహకారం కరవు
- అన్నదాత ఆరుగాలం శ్రమ..ఆవిరి
- వ్యవ'సాయం'పై రైతన్న ఆందోళన

**క్వింటా వరి పండించడానికి రూ.2,316 ఖర్చవుతుంటే.. కేంద్రం తాజాగా ప్రకటించిన మద్దతు ధర కేవలం రూ.1,815. నారు పోత నుంచి కుప్ప నూర్పిడి దాకా ఆరుగాలం శ్రమించి.. ఎకరాకు సగటున 24 క్వింటాళ్ల లెక్కన దిగుబడి తీసి, మద్దతు ధరపై అమ్ముకుంటే రూ.12,024 నష్టపోవాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉత్పత్తయ్యేది 123.70లక్షల టన్నుల ధాన్యం.. అంటే రూ.6,197.37 కోట్లు పెట్టుబడిపై ఆశలు వదులుకోవాలి. వ్యవ'సాయం' అంటే ఇదేనా? నష్టం వస్తుందని తెలిసీ సాగు చేయాలా? ఇవి రైతుల ప్రశ్నలు!**

ఈనాడు – అమరావతి

విత్తనాలు, ఎరువుల నుంచి కూలి రేట్ల దాకా ఏటికేడు పెరుగుతున్నాయి. మరోవంక, వాతావరణం అనుకూలించక దిగుబడులు దిగజారుతున్నాయి. ఉత్పత్తి వ్యయానికి, కేంద్రం ఇచ్చే మద్దతు ధరలకు పొంతన కరవవుతోంది. రాష్ట్రాల సిఫారసులను పట్టించుకోవటం లేదు. మార్కెట్లో ధరలు తగ్గినపుడు పంట ఉత్పత్తుల కొనుగోలుకు సహకరించడం లేదు. వీటన్నింటి మధ్య గిట్టుబాటు ధరలు దక్కక రైతులు నష్టాలబారిన పడుతున్నారు.

## పెట్టుబడులు పైపైకి..

కౌలుకు తీసుకోవాలంటేనే తక్కువలో తక్కువగా ఎకరాకు రూ.10వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఎరువుల ధరల్లోనూ ఎకరాకు రూ.1,500 వరకు పెరుగుదల ఉంది. డీజిల్ ధరల పెరుగుదల నేపథ్యంలో దుక్కి దున్నించడం నుంచి గొర్రు తోలించడం, ఇతర సాగు ఖర్చులు పెరిగాయి. కూలీకి రోజుకు రూ.300 చొప్పున చెల్లించాల్సి వస్తోంది. నాలుగైదేళ్ల కిందటితో పోలిస్తే పంటల సాగు వ్యయం గణనీయంగా పెరిగింది.

వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రం మద్దతు ధరలు ప్రకటిస్తున్నా కొనేందుకు ముందుకు రావడం లేదు. 2014-15 నుంచి 2018-19 మధ్య 9.27 లక్షల టన్నుల ఉత్పత్తిని రాష్ట్రమే సొంతంగా సేకరించింది. గత రెండేళ్లలో కంది, మినుము, మొక్కజొన్న, జొన్నల భారం రాష్ట్రంపై పడింది.

## మద్దతు లెక్కన మిగిలేది నష్టమే

- ఎకరా కంది సాగుకు రూ.10వేల కౌలు, రూ.4,000 ఖర్చులు అవుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలు, నూర్పిడి, రవాణా రూపంలో రూ.8వేల వరకు పెట్టుబడి పెట్టాలి. మొత్తంగా రూ.22వేలు అవుతున్నాయి. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాయలసీమలో ఎకరాకు 2 క్వింటాళ్లు వచ్చే పరిస్థితి లేదు. ఇలా చూసినా ఎకరా పంటను మద్దతు ధరపై అమ్మితే వచ్చేది రూ.11,600 మాత్రమే.
- క్వింటా పత్తి తీస్తే కూలీలకు కిలోకు రూ.12 చొప్పున రూ.1,200 అవుతోంది. పెట్టుబడి, కౌలు కలిపితే రూ.30వేల వరకు ఖర్చు చేస్తున్నారు. వర్షాధార ప్రాంతాల్లో 3 నుంచి 4 క్వింటాళ్లే వస్తోంది. సగటున చూస్తే ఎకరాకు రూ.22వేలే లభిస్తోంది. ఈ ధరల చొప్పున ఎకరాకు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు నష్టమే.
- ఉత్పత్తి వ్యయం, రైతు శ్రమకు 50శాతం కలిపి మద్దతు ధర ఇవ్వాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసింది. కేంద్రం ప్రకటించిన ధరలు పరిశీలిస్తే అధికశాతం పంటలకు ఉత్పత్తి వ్యయమైనా దక్కే పరిస్థితి లేదు.

**క్వింటాకు ఉత్పత్తి వ్యయం, రాష్ట్ర సిఫారసు, కేంద్రం ఇచ్చిన ధరలు (రూ.ల్లో)**

| పంట | ఉత్పత్తి వ్యయం | రాష్ట్ర సిఫారసు | కేంద్రం ప్రకటించింది |
|---|---|---|---|
| వరి(గ్రేడ్-ఏ) | 2,316 | 3,475 | 1,835 |
| జొన్న | 2,141 | 3,211 | 2,550 |
| సజ్జ | 1,935 | 2,903 | 2,000 |
| మొక్కజొన్న | 1,751 | 2,626 | 1,760 |
| రాగి | 2,403 | 3,605 | 3,150 |
| కంది | 6,069 | 9,104 | 5,800 |
| పెసర | 5,996 | 8,994 | 7,050 |
| మినుము | 5,221 | 7,831 | 5,700 |
| వేరుశనగ | 5,190 | 7,785 | 5,090 |
| సోయా | 3,071 | 4,606 | 3,710 |
| పొద్దుతిరుగుడు | 5,510 | 8,264 | 5,650 |
| నువ్వులు | 6,580 | 9,869 | 6,485 |
| పత్తి (పొడుగుపింజ) | 5,355 | 8,033 | 5,550 |
| (పొట్టిపింజ) | 5,256 | 7,884 | 5,255 |

### క్వింటా ధాన్యానికి రూ.2,500 ఉండాలి



వరిలో పెట్టుబడులు ఏటేటా పెరుగుతున్నాయి. ఎకరం సాగు చేయాలంటే రూ.30వేలు పెట్టుబడి అవుతుంది. కౌలు కింద రూ.15వేల వరకు ధాన్యం రూపంలో చెల్లించాలి. ఎకరానికి ఖరీఫ్‌లో 28 నుంచి 30, రబీలో 35 నుంచి 40 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుంది. పెట్టుబడులకు, ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలకు పొంతన ఉండటం లేదు. క్వింటాకు మొక్కుబడిగా రూ.65 పెంచితే సరిపోదు. మద్దతు ధర రూ.2,500గా ఉండాలి.

*– యాండ్ర గోపాలకృష్ణ, రైతు, ఆర్.ఏనుగుపల్లి, తూ.గో.జిల్లా*

### ఎకరాకు 4 బస్తాలూ రావడం లేదు



కూలి ఖర్చులే మనిషికి రోజుకు రూ.300 అవుతున్నాయి. వేరుశనగ విత్తన ధరలు పెరిగాయి. ఎకరాకు 4 బస్తాలైనా దిగుబడి రావడం లేదు. క్వింటాకు రూ.6,500 అయినా ఇస్తేనే కాస్త గిట్టుబాటు అవుతుంది.

*– రామమూర్తి, లత్తవరం, ఉరవకొండ మండలం, అనంతపురం జిల్లా*

### ఎరువుల ధరలు పెరిగాయి



ఎరువుల ధరలు పెరిగాయి. డీఏపీ కొనాలంటే రూ.1,400 అవుతోంది. కూలీల ఖర్చూ పెరిగింది. వానల్లేకపోతే పత్తి దిగుబడులు తగ్గిపోతున్నాయి. పత్తికి క్వింటాకు కనీసం రూ.6,000 అయినా ఉండాలి.

*– హనుమంతు, ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా*

# ఆసియాలోనే హత్యలు తక్కువ

## అమెరికా ఖండాల్లో అత్యధికం: ఐరాస

ఐరాస: ప్రపంచంలో 60% జనాభా ఉన్న ఆసియాలోనే హత్యలు తక్కువని ఐరాస వెల్లడించింది. అమెరికా ఖండాల్లో మాత్రం ఇవి ఎక్కువగా ఉన్నట్లు ఆందోళన వ్యక్తం చేసింది. 'ద గ్లోబల్ స్టడీ ఆన్ హోమిసైడ్-2019' నివేదికను సోమవారం ఐరాస మాదక ద్రవ్యాలు-నేర నియంత్రణ విభాగం విడుదల చేసింది. 2017లో ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకున్న హత్యల పరంపరను ఇందులో విశ్లేషించింది.

- 2017లో మొత్తం 4,64,000 మంది హత్యలకు గురయ్యారు. వీరిలో 81% పురుషులే. 87,000 మంది బాలికలు, మహిళలు ఉద్దేశపూర్వక హత్యలకు గురయ్యారు. వీరిలో 58% మంది సొంత కుటుంబ సభ్యులు, భాగస్వాముల చేతిలోనే చనిపోయారు!
- ఆసియాలోనే మహిళల హత్యలు ఎక్కువని... రాన్రాను ఆడవారికి వారి గృహాలే ప్రమాదకరంగా మారుతున్నాయని అధ్యయనకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వికాసానికి ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు.

**2017లో ఇన్ని హత్యలా!**

| ఖండం | హతుల సంఖ్య | హత్యల రేటు |
|---|---|---|
| అమెరికా | 1,73,000 | 17.2 |
| ఆఫ్రికా | 1,63,000 | 13 |
| ఆసియా | 1,04,000 | 2.3 |

- (హత్యల రేటు: లక్ష మంది జనాభాలో హత్యలకు గురైనవారి సగటు సంఖ్య)

# ఐఎంఏ కేసులో బెంగళూరు జిల్లా అధికారి అరెస్టు

ఈనాడు డిజిటల్, బెంగళూరు: కర్ణాటకను కుదిపేసిన ఐఎంఏ నగల సంస్థల ఆర్థిక నేరాల కేసులో బెంగళూరు జిల్లా అధికారి విజయ్ శంకర్‌ను సిట్ అధికారులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. ఐఎంఏ వ్యవహారాలపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం గతంలో ఉప విభాగాధికారి నాగరాజ్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన ఐఎంఏ యజమాని మన్సూర్ ఖాన్ నుంచి రూ.1.5 కోట్లు లంచం తీసుకుని కేసును నీరుగార్చారు. 4 రోజుల కిందట నాగరాజ్‌ను అరెస్టు చేశారు. ఇదే కేసులో విజయ్ శంకర్‌కు సంబంధం ఉందన్న అనుమానంతో అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు.

# న్యాయ నియామకాల్లో సామాజిక సమతూకం

## అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరాం వెల్లడి

ఈనాడు, అమరావతి: న్యాయ విభాగంలో జరిపే నియామకాల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సూత్రం పాటించారని అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల చేపట్టిన 17 మంది జీపీల నియామకాల్లో ఇద్దరు ఎస్సీలు, నలుగురు బీసీలు, ఎస్టీ, మైనార్టీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించినట్లు వివరించారు. ఇదే తీరులో స్టాండింగ్ కౌన్సిల్, ఏజీపీల నియమకాల్లోనూ 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కేటాయిస్తామన్నారని ప్రకటనలో తెలిపారు.

# స్కూల్‌అసిస్టెంటు లాంగ్వేజ్ పోస్టులకు పదోన్నతులు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో 2017 ఫిబ్రవరి 5 వరకున్న స్కూల్ అసిస్టెంట్ హిందీ, తెలుగు, ఉర్దూ పోస్టులకు పదోన్నతులు కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. ఎస్జీటీ, భాషా పండితులకు కామన్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించనున్నారు.

# హత్య కేసు నిందితులను పట్టిచ్చిన 'మేక'

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఎలాంటి ఆధారాలు లభించక ఓ హత్య కేసు సంక్లిష్టంగా మారిన క్రమంలో సీసీ టీవీ దృశ్యాల్లో కనిపించిన మేక నిందితులను పట్టించింది. కర్నూలు జిల్లాలో సంచలనం సృష్టించిన తుగ్గలి మండలం సూర్యతండాకు చెందిన మేకల కాపరి రాము నాయక్ హత్య కేసులో మిస్టరీ వీడింది. ఈనెల 4న ప్యాపిలికి చెందిన కొండపాటి కృష్ణ కాంత్ (21), పోదొడ్డి చెన్ను (20) మేకల కాపరి రాము నాయక్‌ను హత్య చేసి మేకలను ట్రాలీలో హైదరాబాద్‌కు తరలించి అమ్ముకున్నారు. ఈ హత్యపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు అమకతాడు టోల్‌ప్లాజావద్ద సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించగా ఓ ట్రాలీలో ఉన్న మేక తల బయటకు పెట్టి కనిపించింది. దీంతో ఆ వాహనం నంబరు (ఏపీ 26 టీటీ 9723) ఆధారంగా యజమానిని గుర్తించారు. అతడిచ్చిన సమాచారంతో కొండపాటి కృష్ణకాంత్, పోదొడ్డి చెన్నులను అరెస్టు చేశారు. ఈ వివరాలను కర్నూలులో ఎస్పీ కె.ఫక్కీరప్ప సోమవారం వెల్లడించారు.

# కశ్మీర్‌లో స్తంభించిన జనజీవనం

## బుర్హాన్ హతమైన రోజు సందర్భంగా బంద్ • అమర్‌నాథ్ యాత్ర నిలిపివేత

శ్రీనగర్: హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్రవాది బుర్హాన్ వానీ భద్రతా దళాల చేతిలో హతమై మూడేళ్లు అయిన సందర్భంగా వేర్పాటువాదులు బంద్‌కు పిలుపునివ్వడంతో సోమవారం కశ్మీర్‌లో జనజీవనం స్తంభించింది. వ్యాపార సంస్థలు, పెట్రోలు బంకులు మూతపడ్డాయి. మరోవైపు భద్రతా దళాలు అత్యంత అప్రమత్తత ప్రకటించాయి. ముందుజాగ్రత్త చర్యగా అమర్‌నాథ్ యాత్రను, జాతీయ రహదారిపై భద్రతా దళ వాహనశ్రేణి కదలికను నిలిపివేశాయి. అమర్‌నాథ్ యాత్ర మంగళవారం పునఃప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. శ్రీనగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం ఆంక్షలు విధించింది. 2016 జులై 8న అనంత్‌నాగ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో బుర్హాన్ వానీ హతమయ్యాడు. ఇది కశ్మీర్‌లో తీవ్ర నిరసనలకు దారితీసింది. దీర్ఘకాలం కర్ఫ్యూలు, బంద్‌లు జరిగాయి.

# పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ విభజనకు ఆమోదం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ ఆస్తులు, అప్పుల విభజనకు సంబంధించిన తుది ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నిపుణుల కమిటీ ఛైర్మన్ సిఫార్సుల మేరకు ఏపీ విభజన చట్టంలోని షెడ్యూల్ తొమ్మిదిలోని ప్రాతిపదికల ప్రకారం ఈ సంస్థ విభజనకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ సోమవారం ఉత్తర్వులిచ్చారు.

# ఐఐఎం కోజికోడ్‌లో ఏడాది ఎంబీయే

కోజికోడ్: కార్పొరేట్ సంస్థలలో పనిచేసే ఉద్యోగులకు నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఐఐఎం కోజికోడ్ ఏడాది ఎంబీయే కోర్సును ప్రవేశపెట్టింది. ఇప్పటికే వ్యాపారరంగంలో ఉండి, సరికొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాలనుకునే వారికోసం ఈ కోర్సు రూపొందించారు. ఏడాదిపాటు ఐఐఎం వసతిగృహంలోనే ఉండి ఈ కోర్సు పూర్తిచేయాల్సి ఉంటుంది. దీనివల్ల పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలలో ఉన్నతోద్యోగాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని ఐఐఎం కోజికోడ్ సంచాలకుడు ప్రొఫెసర్ దేబాశీష్ ఛటర్జీ వివరించారు. ఇప్పటికే అనుభవం ఉన్నవారిని మరింత సామర్థ్యం గలవారిగా తీర్చిదిద్దడానికే ఈ కోర్సును రూపొందించామని ఆయన చెప్పారు. తమ సంస్థలో పనిచేసే ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచి, వారే ఉన్నత నాయకత్వ స్థానాలు చేపట్టేలా చూడాలని పలు కార్పొరేట్ సంస్థలు భావిస్తున్నాయి.

# టీసీఎల్ పనులకు తొలగిన అడ్డంకులు

## సీఎం ఆదేశాలతో రైతులకు పరిహారం

ఈనాడు, అమరావతి: టెలివిజన్ తయారీ రంగంలో దిగ్గజ కంపెనీ టీసీఎల్ (టెలిఫోన్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్) తిరుపతిలో ఏర్పాటుచేస్తున్న యూనిట్‌కు ఇప్పటివరకున్న అడ్డంకులు తొలగాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలపై ఆర్థిక శాఖ అధికారులు కదిలారు. బాధిత రైతులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేశారు. రైతుల బ్యాంకు ఖాతాల్లోకి సోమవారం ఆ నిధులు జమయ్యాయని చిత్తూరు జిల్లా ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

# ఇసుకపై నిర్ణయం తీసుకోండి

## ముఖ్యమంత్రి జగన్‌కు కన్నా లేఖ

ఈనాడు, అమరావతి: ఇసుక విక్రయాలపై తక్షణం విధానపరమైన నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కోరారు. రాష్ట్రంలో ఇసుక విక్రయాలు నిలిపేయటం వల్ల నిర్మాణరంగంపై ఆధారపడిన వర్గాలు ఇబ్బంది పడుతున్నాయని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇసుక విక్రయాల ధరలను ఖరారు చేసి కార్మికులు, నిర్మాణ రంగాన్ని కాపాడాలని లేఖలో కోరారు.

# ఇలా చేస్తే 'గోదావరి' సద్వినియోగం

- వడ్డే, కంభంపాటి సూచనలు

ఈనాడు – అమరావతి

**ఆంధ్రప్రదేశ్ భూభాగం నుంచే గోదావరి జలాలు కృష్ణమ్మకు మళ్లించాలని వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అభిప్రాయపడ్డారు. గోదావరి జలాలు సోమశిలకు మళ్లిస్తూ దిగువ అవసరాలు తీర్చుకోవాలని, ఆ మేరకు ఎగువన శ్రీశైలం జలాలను రాయలసీమ, తెలంగాణ ఎగువ ప్రాజెక్టులకు వినియోగించుకోవాలని జలవనరులశాఖ నిపుణులు కంభంపాటి పాపారావు పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి, ఇతర పథకాలకు తెలంగాణ వారి భూభాగం నుంచి గోదావరి జలాలు మళ్లించుకోవచ్చని అభిప్రాయపడ్డారు.**

## సంయుక్త ప్రాజెక్టులు కాదు-స్వతంత్ర ప్రాజెక్టులతోనే..



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సంయుక్తంగా కొత్త ప్రాజెక్టులు నిర్మించకుండా, ఎవరికి అవసరమైన మేరకు వారు స్వతంత్రంగా కొత్త ప్రాజెక్టులు ఏర్పరుచుకుని గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవచ్చు. ఇలా చేస్తే ఏ రకంగాను ఒకరిపై మరొకరు ఆధారపడాల్సిన అవసరం ఉండదు.

- శ్రీశైలం ప్రాజెక్టు ఎగువన తెలంగాణ రాష్ట్రానికి బీమా (20టీఎంసీలు), నెట్టెంపాడు (25), కల్వకుర్తి(25) ఎస్ఎల్‌బీసీ(30)లకు మొత్తం 100 టీఎంసీల అవసరం ఉంది. తెలంగాణ కొత్త ప్రాజెక్టులు పాలమూరుకు 90టీఎంసీలు, కల్వకుర్తి-2కు 30 టీఎంసీలు మొత్తం 120 టీఎంసీలు కావాలి.
- శ్రీశైలం దిగువన కృష్ణా నదిలో మొత్తం 463 టీఎంసీల నీటి అవసరాలు ఉన్నాయి. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద తెలంగాణకు 99 టీఎంసీలు, ఏపీకి 33 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. సాగర్ కుడి కాలువ కింద 132 టీఎంసీలు ఏపీకి, కృష్ణా డెల్టా వ్యవస్థకు 181 టీఎంసీలు, హైదరాబాద్ తాగునీటికి 19 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. ఈ 463 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి దిగువకు వదలకుండా 118 టీఎంసీలు తెలంగాణ, 345 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్ వినియోగించుకోవాలి.
- గోదావరి జలాలను వివిధ మార్గాల ద్వారా రెండు రాష్ట్రాలు మళ్లించుకోవాలి. తెలంగాణ అవసరాల కోసం దుమ్ముగూడెం నుంచి సాగర్ టెయిల్‌పాండ్‌కు 118 టీఎంసీలు, తుపాకులగూడెం నుంచి 120 టీఎంసీలు (పాలమూరు ఎత్తిపోతల, కల్వకుర్తి -2 ఎత్తిపోతల కోసం), సీతారామ ఎత్తిపోతల ద్వారా మరో 20 టీఎంసీలు తీసుకోవాలి. ఏపీ అవసరాల కోసం పోలవరం జలాశయం నుంచి 400 టీఎంసీలు సోమశిలకు మళ్లించుకోవాలి.
- కృష్ణాలో 75శాతం విశ్వసనీయ లభ్యత మేరకు మరో 200 టీఎంసీల మిగులు జలాలు వస్తే వాటిని ఏపీ అవసరాల కోసం వినియోగించుకోవచ్చు. ఎలాగూ ఎగువ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు నీరు అందే అవకాశం ఉంది కాబట్టి కృష్ణా మిగులు జలాలు ఇలా వాడుకోవచ్చు. ఇలా చేస్తే ఇక శ్రీశైలం జలాశయానికి ప్రత్యేకంగా గోదావరి నుంచి మళ్లింపు అవసరం ఉండదు.

**- కంభంపాటి పాపారావు, జలవనరుల నిపుణులు**

(విశ్రాంత ఇంజినీరు, గోదావరి పెన్నా అనుసంధాన ప్రతిపాదనపై ఒక ముసాయిదా సిద్ధం చేశారు. హంద్రీనీవా ఎత్తిపోతల ప్రణాళికలోనూ భాగస్వాములు)

## ఆంధ్రప్రదేశ్ భూభాగం నుంచే మళ్లించాలి



పోలవరం కుడి కాలువ కుడి గట్టు ఆధారంగా మరో సమాంతర కాలువను ఏర్పరచాలి. ఆ నీటిని కృష్ణా నదిలోకి తీసుకురావాలి. వైకుంఠపురం వద్ద బ్యారేజి నిర్మించే పనులకు ఇప్పటికే టెండర్లు అప్పగించారు. ఆ బ్యారేజిలోకి మళ్లించాలి. అక్కడి నుంచి పులిచింతల డ్యామ్‌లోకి ఎత్తిపోయాలి. అక్కడి సమీపంలోని నాగార్జునసాగర్ కాలువలోకి నీటిని ఎత్తిపోతల ద్వారా మళ్లించాలి. ఈ నీటి ద్వారా నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టు అవసరాలు తీర్చుకోవాలి. మొదట్లో ప్రతిపాదనలు రూపొందించినా అనంతర కాలంలో పక్కకు పెట్టిన నాగార్జునసాగర్ రెండో దశ పనులు కూడా ఈ నీటితో చేపట్టే ఆస్కారం ఉంటుంది.

★ ఈ ప్రణాళిక వల్ల ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 512 టీఎంసీల కృష్ణా జలాల్లో కనిష్ఠంగా 200 టీఎంసీలు నీటి అవసరాలను గోదావరి జలాల ద్వారా వినియోగించుకోవచ్చు. ఇక్కడ ఇలా 200 టీఎంసీలు వినియోగించుకుంటే ఆ మేరకు ఆ నీటిని శ్రీశైలం నుంచి హంద్రీ నీవా, గాలేరు నగరి, వెలిగొండ ప్రాజెక్టులకు వినియోగించుకోవచ్చు. తెలంగాణ చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి, నెట్టెంపాడు, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులకు అవసరమైన నీటిని గోదావరి నుంచి ఆ ప్రభుత్వ ఖర్చుతో మళ్లించుకోవడం సముచితంగా ఉంటుంది.

**- వడ్డే శోభనాద్రీశ్వరరావు, వ్యవసాయశాఖ మాజీ మంత్రి**

# పోలవరంపై సీల్డ్ కవర్‌లో నివేదిక

- రేపు జలవనరులశాఖ ప్రత్యేక కార్యదర్శికి అందజేత

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల్లో అవకతవకలను నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ తొలుత పోలవరంపై తన నివేదికను అందిస్తోంది. ఈ నివేదికను కమిటీ సభ్యులు విశాఖ నుంచి సీల్డ్ కవర్‌లో చీఫ్ టెక్నికల్ ఎగ్జామినర్ ప్రసాద్‌కు మంగళవారం పంపనున్నారు. ఆయన బుధవారం జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్‌కు దీనిని అందిస్తారని సమాచారం. ఆదిత్యనాథ్ దీన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అందిస్తారు. మరోవైపు నిపుణుల కమిటీ సభ్యులంతా మంగళవారం పోలవరం ఎడమ కాలువలోని ఏడు ప్యాకేజీ పనులు ఎలా జరుగుతున్నాయో పరిశీలిస్తూ పోలవరం ప్రధాన డ్యామ్ వద్దకు చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేసి బుధవారం పోలవరం ప్రధాన డ్యామ్ పనులను నిశితంగా పరిశీలిస్తారని సమాచారం.


ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ
(ఆం.ప్ర. ప్రభుత్వ యాజమాన్య సంస్థ)
O/o చీఫ్ ఇంజినీర్ (S), మంగళగిరి
ce1.apiic@nic.in, gnagabhushanam@gov.in
'e' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు నోటీసు నెం. 04/CE (S)/ APIIC/2019-20, తేదీ: 2-7-2019
చీఫ్ ఇంజినీర్ (సౌత్)/APIIC లిమిటెడ్, మంగళగిరి వారు పనుల కొరకు టెండరును కోరుతున్నారు.
టెండరు నోటీసు నెం. 04: చిత్తూరు జిల్లా, యేర్పేడు (మం), పగలి (గ్రా), పగలి బ్లాక్-II ఇండస్ట్రియల్ పార్క్ వద్ద CD పనులతో కలిపి అంతర్గత BT రోడ్ల ఏర్పాటు. అంచనా విలువ రూ. 2,22,71,467.00 బిడ్ల దాఖలుకు చివరి తేదీ: 23-7-2019 మ.గం. 3.00 వరకు. టెండరు నోటీసు వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్‌ను వెబ్‌సైట్ www.apeprocurement.gov.in (లేదా) https://tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
సం/- చీఫ్ ఇంజినీరు (S), APIIC లి., మంగళగిరి




తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
టెండరు ఆహ్వాన ప్రకటన (NIT) (ఆన్‌లైన్ వెర్షన్)
Roc.No. TTD-34023(31)/12/2019-WH SEC-TTD తేది. 6-7-2019
"ఒక సంవత్సరం వ్యవధికి అనగా 2019-2020 కొరకు తిరుమల మరియు తిరుపతి నందు TTD మార్కెటింగ్ గోడౌన్లు, అలిపిరి సమీపాన, తిరుపతి వద్ద మరియు వివిధ TTD ఇనిస్టిట్యూషన్లకు సరుకుల కొరకు లోడింగ్ మరియు అన్‌లోడింగ్ సర్వీసులను ఏర్పాటు చేయుట" నిమిత్తం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (వేర్‌హౌసింగ్), మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్, TTD, తిరుపతి వారిచే ఇ-టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరముల కొరకు వెబ్‌సైట్ https://www.tirumala.org లేదా https://tender.apeprocurement.gov.in లను చూడండి. current Tenders A.P. మీద క్లిక్ చేయండి మరియు "more" మరియు "Tirumala Tirupati Devasthanams- Marketing" లను ఎంపిక చేసుకోండి. తదుపరి వివరముల కొరకు సంప్రదించండి ఫోన్ నెంబర్లు - 0877 2264456, 2264079 మరియు ఫ్యాక్స్ నెంబరు. 0877 2264554
షెడ్యూల్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది మరియు ముగింపు తేది: 8-7-2019 నుండి 7-8-2019, మ॥1-00 గం॥ వరకు.
టెక్నికల్ బిడ్ తెరుచు తేది: 7-8-2019, మ॥ 3-30 గం॥లకు
ధరావతు: రూ. 2,37,000/- (రెండు లక్షల ముప్పై ఏడు వేల రూపాయలు మాత్రమే)
Roc.No.PR4/13908/Adv.No.158/PRO/2019, Dated: 08.07.2019 కార్యనిర్వహణాధికారి


# జిల్లా విద్యాధికారుల కార్యాలయాలకు ప్రతిభా పత్రాలు

ఈనాడు, అమరావతి: జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్షకు ఎంపికైన విద్యార్థుల ప్రతిభా పత్రాలను జిల్లా విద్యాధికారికి పంపించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ.సుబ్బారెడ్డి తెలిపారు. డీఈవో కార్యాలయాలనుంచి వాటిని ప్రధానోపాధ్యాయులు తీసుకొని విద్యార్థులకు అందించాలని కోరారు.

# కిరాయి ముఠాలతో రామ్‌ప్రసాద్ హత్య

- పోలీస్ అధికారి సాయంతో వేధించినందుకే
- రెండు నెలల క్రితమే సుపారీ ఇచ్చిన వ్యాపార భాగస్వామి
- అప్పట్నుంచి వ్యాపారిని అనుసరిస్తున్న హంతకులు
- హైదరాబాద్ పోలీసుల అదుపులో కోగంటి సత్యం, శ్యామ్, రమేష్, చోటూ

ఈనాడు – హైదరాబాద్

హైదరాబాద్‌లో శనివారం దారుణ హత్యకు గురైన విజయవాడ వ్యాపారి రామ్‌ప్రసాద్ కేసును పంజాగుట్ట పోలీసులు ఛేదించారు. ఆయన్ని పథకం ప్రకారం హత్య చేయించారనే ఆధారాలు సేకరించారు. ఈ హత్యతో సంబంధం ఉందనే సమాచారంతో మృతుని వ్యాపార భాగస్వామి కోగంటి సత్యం, శ్యామ్, చోటూ, రమేష్‌లను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. పంజాగుట్ట, టాస్క్‌ఫోర్స్ పోలీసులు రహస్య ప్రాంతాల్లో వారిని విచారిస్తున్నారు. హత్యకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు సేకరించామని, ఒకటి, రెండు అంశాల్లో స్పష్టత వచ్చిన వెంటనే నిందితులను అరెస్ట్ చేస్తామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ తెలిపారు. హత్యానంతరం నిందితులు ఉపయోగించిన వాహనాన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించామని, దాని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టామని పశ్చిమ మండలం డీసీపీ ఎ.ఆర్.శ్రీనివాస్ తెలిపారు.

## గుట్టువిప్పిన కీలక వ్యక్తి

రామ్‌ప్రసాద్‌ను హత్య చేసేందుకు అతని వ్యాపార భాగస్వాముల్లో ఒకరు కసిగా ప్రయత్నించారని పోలీసుల అదుపులో ఉన్న కీలక వ్యక్తి చెప్పినట్టు తెలిసింది. "విజయవాడలో ఉన్న ఓ పోలీస్ అధికారి సాయంతో రామ్‌ప్రసాద్, తన వ్యాపార భాగస్వామిని వేధించాడు. చీటికిమాటికి పోలీస్ స్టేషన్‌కు పిలిపించడం, రౌడీషీట్ తెరిపించడం వంటి చర్యలకు పూనుకున్నాడు. అవి ఇద్దరి మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యేందుకు కారణమయ్యాయి. వేధింపులు తట్టుకోలేకనే వ్యాపార భాగస్వామి ఒకరు ఆయన్ని హత్య చేయించాలన్న నిర్ణయానికి వచ్చారు. రెండు నెలల క్రితం విజయవాడకు చెందిన కిరాయి ముఠాలకు సుపారీ ఇచ్చారు" అని ఆ వ్యక్తి ఆధారాలతో సహా వివరించినట్టు విశ్వసనీయ సమాచారం. అతనిచ్చిన సమాచారం ఆధారంగా హైదరాబాద్, విజయవాడ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## రెండు నెలలుగా వెన్నంటే హంతకులు

- గృహ ప్రవేశానికీ హాజరు

సుపారీ తీసుకున్న వెంటనే నిందితులు హత్యకు కార్యాచరణ ప్రారంభించారు. విజయవాడలో ఉంటున్న ప్రధాన నిందితుడి సన్నిహితులు, కిరాయి ముఠా సభ్యులు రామ్‌ప్రసాద్ కదలికలపై నిఘా వేశారు. ఆయన ఎవరితో మాట్లాడుతున్నారు? ఎవరెవరిని కలుస్తున్నారు? ఎక్కడెక్కడికి వెళ్తున్నారన్న సమాచారాన్ని సేకరించారు. "రామ్‌ప్రసాద్ గచ్చిబౌలిలో కొత్తగా ఇల్లు నిర్మించాడు. నాలుగు రోజుల క్రితమే గృహప్రవేశం చేశాడు. ఆ కార్యక్రమానికి కూడా హంతకులు హాజరయ్యారు. అప్పట్నుంచి హైదరాబాద్‌లోనే ఉండిపోయారు" అని పోలీసులు దర్యాప్తులో గుర్తించినట్టు తెలిసింది. శుక్ర, శనివారాల్లో రామ్‌ప్రసాద్ క్రమం తప్పకుండా పంజాగుట్టలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్తున్నట్టు గుర్తించిన హంతకులు పలుమార్లు రెక్కీ నిర్వహించారని, అనుకున్నట్టుగానే శనివారం రాత్రి గుడికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న ఆయనపై కత్తులతో దాడి చేశారనే ఆధారాలనూ పోలీసులు సేకరించినట్టు సమాచారం.

## సత్యమే చంపించాడు: హతుని కుమారుడు

కోగంటి సత్యమే తన తండ్రిని హత్య చేయించాడని రాంప్రసాద్ కుమారుడు అఖిల్ సోమవారం మీడియా ఎదుట ఆరోపించాడు. విదేశాల్లో ఉన్న తన మావయ్య రాగానే అన్ని విషయాలను పోలీసులకు, మీడియాకు వెల్లడిస్తామని వివరించాడు.

## వజ్రాసనం

తిన్న ఆహారం సరిగా జీర్ణంకాక కడుపుబ్బరం, తేన్పులతో బాధపడుతున్నారా? అయితే వజ్రాసనం వేయటం సాధన చేయండి. అతి ముఖ్యమైన యోగాసనాల్లో ఇదొకటి. ఇది మలద్వారం, జననాంగాలకు మధ్య ఉండే వజ్రనాడిని ప్రభావితం చేస్తుంది. కాబట్టే దీనికి వజ్రాసనం అని పేరు. భోజనం చేసిన తర్వాత వేసే ఆసనం ఇదొక్కటే.

### ఎలా చేయాలి?

రెండు కాళ్లను తిన్నగా చాచి కూర్చోవాలి. ఒకదాని తర్వాత మరో కాలును మోకాళ్ల దగ్గర వంచుతూ వెనక్కి తీసుకురావాలి. పాదాలను పిరుదుల కిందికి తీసుకురావాలి. మడమలు ఎడంగా ఉంచుతూ.. బొటనవేళ్లు తాకేలా చూసుకోవాలి. అరచేతులను మోకాళ్ల మీద ఆనించి ఉంచాలి. శరీర బరువు పిరుదుల మీద సమానంగా పడేలా చూసుకోవాలి. తల, వెన్నెముక నిటారుగా ఉంచాలి. కళ్లు మూసుకొని నిదానంగా శ్వాసను తీసుకోవాలి. కొద్దిసేపు అలాగే ఉండి తిరిగి మామూలు స్థితికి చేరుకోవాలి. కష్టంగా అనిపిస్తే ముందు ఒక పాదం మీద కూర్చోవటం సాధన చేయాలి. అనంతరం రెండు పాదాల మీద కూర్చోవాలి. వజ్రాసనం వేసేటప్పుడు ధ్యాసను శ్వాస మీద కేంద్రీకరించాలి. మోకాళ్ల నొప్పులు ఎక్కువగా ఉన్నవారు నొప్పి తగ్గేంతవరకు దీన్ని వేయకపోవటం మంచిది.



### ప్రయోజనాలు

- తొడలు, మోకాళ్లు, పిక్కలను బలోపేతం చేస్తుంది.
- ఆహారం జీర్ణం కావటానికి తోడ్పడుతుంది. భోజనం చేసిన 5-20 నిమిషాల తర్వాత వేస్తే ఎంతో మేలు చేస్తుంది. మలబద్ధకం, పులితేన్పులు, మొలలు, హెర్నియా నివారణకు తోడ్పడుతుంది.
- గర్భిణులకు కాన్పు తేలికగా అవటానికి దోహదం చేస్తుంది.
- వెన్నెముక కీళ్ల నాడులను నొక్కటం వల్ల వచ్చే సయాటికా నొప్పి తగ్గుముఖం పడుతుంది.

**సంతానానికి సరైన సమయం?**

# ఆలస్యం అమృతం కష్టం!

**ఆలస్యం అమృతం విషం. అంటే ఆలస్యమైనకొద్దీ అమృతం విషమవుతుందని అర్థం. ఉద్దేశం ఏదైనా ఇది పిల్లల్ని కనే వయసుకూ వర్తిస్తుంది. మన శరీరంలోని అవయవాలు, కణాలన్నీ నిర్దిష్ట కాల పరిమితికి లోబడే పనిచేస్తుంటాయి. ఇవి వయసు మీద పడుతున్నకొద్దీ క్షీణించటం ఆరంభిస్తాయి. సంతాన భాగ్యాన్ని సాకారం చేసే జననాంగ భాగాలు, అండం, వీర్య కణాలూ అంతే. కాలం గడుస్తున్నకొద్దీ వీటి పనితీరూ మందగిస్తుంది. క్రమంగా సంతానం కలగటమూ కష్టమైపోతుంది. ప్రస్తుతం చదువులు, ఉద్యోగాలు, కెరీర్ పేరుతో వివాహాలను, పిల్లలను కనటాన్ని వాయిదా వేసుకుంటూ పోతున్న ఎంతోమంది ఎదుర్కొంటున్న పెద్ద సమస్య ఇది.**




ఏ వయసుకు ఆ ముచ్చట! ఇది ఒకప్పటి మాట. పిల్లలు పెళ్లీడుకు రాగానే సంబంధాలు వెతకటం, వీలైనంత త్వరగా మూడు ముళ్లు వేయించటం.. అనంతరం సీమంతాలు, పురుళ్లు. వయసుకు వచ్చిన పిల్లలు, కొత్త జంటలతో కళకళలాడే ప్రతి ఇంటా ఇలాంటి వాతావరణమే కనబడేది. కానీ ఇప్పుడో? 30 ఏళ్లు దాటినా ఎవరూ పెళ్లి మాటే ఎత్తటం లేదు. పెళ్లి చేసుకున్నా వీలైనంతవరకు సంతానాన్ని వాయిదా వేసుకోవటానికే ప్రయత్నిస్తున్నారు. ఆయుర్దాయం పెరగటం, సామాజిక, ఆర్థిక పరిస్థితులు మారటం.. మొత్తంగా సమాజంలో మహిళల పాత్ర, ప్రాధాన్యం పెరగటం వంటి అంశాలెన్నో ఇందుకు దోహదం చేస్తున్నాయి. సురక్షితమైన, సమర్థవంతమైన, చవకైన గర్భనిరోధక మాత్రలు అందుబాటులోకి రావటమూ పెద్ద మార్పే తీసుకొచ్చింది. మహిళలు సంతానాన్ని కనటంపై సొంత నిర్ణయం తీసుకోవటానికీ వీలు కల్పించింది. తల్లిదండ్రులు సైతం అమ్మాయిలను ముందుగా ఉన్నత చదువులు పూర్తి చేయటానికే ప్రోత్సహిస్తున్నారు. ఒకప్పటిలా కాకుండా అబ్బాయిలతో సమానంగా ఉద్యోగాలను ఎంచుకోవటానికి, కెరీర్‌ను మలచుకోవటానికి స్వేచ్ఛనిస్తున్నారు. జీవితంలో ఎదగటానికి అవసరమైన తోడ్పాటు అందిస్తున్నారు. మహిళల స్వావలంబన, ఆర్థిక స్థిరత్వం, ఆత్మ గౌరవాల పరంగా చూస్తే ఇది మంచి పరిణామమే. కాదనటానికి లేదు. ఈ క్రమంలో స్త్రీ జీవితంలో సంతానాన్ని కనటానికి అనువైన, విలువైన కాలం మించిపోతుండటమే విచారకరం. శారీరకంగా స్త్రీలకు 18-30 ఏళ్ల వయసు సంతానానికి అనువైన కాలం. మంచి ఆరోగ్యవంతమైన సంతానాన్ని కనటానికి ఇంతకు మించిన సమయం లేదనే చెప్పుకోవాలి. జీవితంలో పూర్తిగా స్థిరపడిన తర్వాతే పిల్లలను కనాలని భావిస్తున్న ఎంతోమంది దీన్ని పట్టించుకోవటమే లేదు. 35 ఏళ్లు దాటినా సంతానం వైపు చూడటం లేదు. ఆనక సంతానం కలగటం లేదని మథనపడుతూ.. కృత్రిమ గర్భధారణ పద్ధతులను ఆశ్రయిస్తున్నవారు ఎందరో. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా చూసుకోవటమే అన్నింటికన్నా ఉత్తమం. వీలున్నప్పుడే సంతానాన్ని కనొచ్చని, వచ్చిన ఇబ్బందేమీ లేదనే అపోహలు తొలగించుకోవాలి. ప్రస్తుతం అధునాతన కృత్రిమ గర్భధారణ పద్ధతులు అందుబాటులో ఉండటం నిజమే కావొచ్చు. ఇవి ఎందరికో సంతాన భాగ్యాన్నీ ప్రసాదిస్తుండొచ్చు. అయినా వీటికీ ఒక పరిమితి ఉందన్నది కాదనలేని సత్యం. వయసు పెరుగుతున్నకొద్దీ మామూలుగానే కాదు, కృత్రిమ పద్ధతులతోనూ గర్భధారణ కష్టమవుతుందనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఒకవేళ గర్భం ధరించినా తల్లికీ బిడ్డకూ సమస్యలు, సవాళ్లు ఎదురవ్వొచ్చునీ గుర్తించాలి.



డా॥ ఎ. ప్రణతీ రెడ్డి
క్లినికల్ డైరెక్టర్
మాటర్నల్ ఫీటల్ మెడిసిన్
రెయిన్‌బో హాస్పిటల్స్
హైదరాబాద్

**శారీరకంగా స్త్రీలకు 18-30 ఏళ్ల వయసు సంతానానికి అనువైన కాలం. మంచి ఆరోగ్యవంతమైన సంతానాన్ని కనటానికి ఇంతకు మించిన సమయం లేదనే చెప్పుకోవాలి.**

## వయసు తంటా..

వయసు పెరుగుతున్నకొద్దీ సంతాన సామర్థ్యమూ తగ్గుతూ వస్తుంటుంది. ముఖ్యంగా 30ల్లోకి అడుగిడుతూనే పిల్లలు పుట్టే అవకాశం సన్నగిల్లటం మొదలవుతుంది. ఏదైనా నెలలో 30 ఏళ్లలోపు మహిళలకు గర్భధారణ అవకాశాలు 20% వరకు ఉంటే.. 40 ఏళ్లు దాటితే ఇది 5 శాతానికి పడిపోతుండటం గమనార్హం. అధునాతన కృత్రిమ గర్భధారణ పద్ధతులను ప్రయత్నించినా సంతానం కలిగే అవకాశాలు తక్కువే. గర్భస్రావమయ్యే ముప్పూ పెరుగుతుంది. అండాశయాల పనితీరు మారిపోవటం, అండం విడుదల అస్తవ్యస్తం కావటం, ఇతరత్రా జబ్బుల వంటివెన్నో ఇందుకు దోహదం చేస్తాయి.

### అండాశయాల్లో మార్పులు

నెలసరి సరిగా రావటం, అండం విడుదల కావటంలో మన మెదడులోని హైపోథలమస్, పీయూష గ్రంథులు కీలకపాత్ర పోషిస్తాయి. హైపోథలమస్ నుంచి సంకేతాలు అందగానే పీయూష గ్రంథి వెంటనే ఫాలికల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (ఎఫ్ఎస్‌హెచ్), ల్యూటినైజింగ్ హార్మోన్(ఎల్‌హెచ్)లను విడుదల చేస్తుంది. అండం పరిపక్వం కావటానికి, ఈస్ట్రోజెన్ హార్మోన్ ఉత్పత్తికి తోడ్పడేవి ఇవే. సాధారణంగా రజస్వల సమయంలో అండాశయాల్లో సుమారు 3లక్షల అండాలుంటాయి. వీటిల్లోంచి నెల నెలా ఒక అండం పరిపక్వమై, విడుదలవుతుంది. ఈ క్రమంలో దాదాపు 500-1000 అండాలు పూర్తిగా పరిపక్వం కాకుండానే ఉండిపోతాయి. వీటిని శరీరం గ్రహించేస్తుంది. ఇలా నెల నెలా అండాల సంఖ్య తగ్గుతూ.. నెలసరి నిలిచిపోయే సమయానికి చేరుకుంటున్నకొద్దీ (40-56 ఏళ్లు) కొన్ని వేల అండాలే మిగులుతాయి. పైగా ఇవి ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్ హార్మోన్లకు అంతగా స్పందించవు. దీంతో పీయూష గ్రంథి మరింత ఎక్కువగా ఈ హార్మోన్లను విడుదల చేయటం ఆరంభిస్తుంది. నెలసరి మొదలైన మూడో రోజున ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్ హార్మోన్ల స్థాయిలు చాలా ఎక్కువగా ఉంటున్నట్టయితే వీటికి అండాశయాలు స్పందించటం లేదనే అర్థం. ఇది అండం నాణ్యత తగ్గిందనటానికీ సంకేతమే. ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్ల ఉత్పత్తీ తగ్గుముఖం పడుతుంది. అండాశయాల 'వయసుడిగిపోయే' ముప్పు మనదేశ మహిళలకు మరింత ఎక్కువ కూడా. ఐరోపా వాసులతో పోలిస్తే మనదేశ మహిళల్లో ఆరేళ్ల ముందుగానే అండాశయాల సామర్థ్యం తగ్గుతున్నట్టు అధ్యయనాలు చెబుతుండటం గమనార్హం.

### అండం ఫలదీకరణ తగ్గుముఖం

వయసు పెరుగుతున్నకొద్దీ అండాల పనితీరూ మారుతుంది. వీర్యకణంతో జతగూడి, ఫలదీకరణ చెందే సామర్థ్యం తగ్గుతుంది. ఇలాంటి అండాలతో జన్యు సమస్యల ముప్పూ పెరుగుతుంది. క్రోమోజోమ్ మార్పులతో కూడిన అండాలు ఫలదీకరణ చెందితే పిండం మనుగడ, ఎదుగుదల కూడా కష్టమే. ఫలితంగా గర్భస్రావ ముప్పూ ఎక్కువవుతుంది. 40 ఏళ్లు పైబడినవారిలో గర్భధారణ అవకాశాలు తగ్గటానికి చాలావరకు అస్తవ్యస్త క్రోమోజోమ్‌లతో కూడిన అండాల సంఖ్య ఎక్కువగా ఉండటమే కారణం. దురదృష్టవశాత్తు- వయసుతో పాటు అండాల నాణ్యత పడిపోవటాన్ని నివారించుకోవటానికి మనం చేయగలిగిందేమీ లేదు. నిజానికి గర్భధారణకు వయసు అడ్డంకి కాకపోవచ్చు గానీ 40 ఏళ్లు దాటిన తర్వాత కృత్రిమ గర్భధారణ పద్ధతులూ (దాతల అండంతో తప్ప) అంతగా పనిచేయవు.

### ఇతర సమస్యలు

వయసు పెరుగుతున్నకొద్దీ కటిభాగ ఇన్‌ఫెక్షన్లు, ఎండోమెట్రియోసిస్ వంటి సమస్యల ముప్పూ పెరుగుతూ వస్తుంది. ఇవి సంతాన సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. ఎండోమెట్రియోసిస్‌లో గర్భాశయ గోడ మాదిరి పొర అండాశయాలకు లేదా ఫలోపియన్ ట్యూబులకు అతుక్కుపోయి గర్భధారణకు అడ్డంకిగా పరిణమిస్తుంది. వీటికి తోడు వయసుతో పాటు వచ్చే అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలూ చిక్కులు తెచ్చిపెడతాయి. ఇటీవల ఊబకాయం బాగా పెరిగిపోతుండటమూ సమస్యాత్మకంగా పరిణమిస్తోంది. 35 ఏళ్లు పైబడినవారిలో మాతృ మరణాల సంఖ్య ఎక్కువ. 40 ఏళ్ల దాటినవారిలోనైతే ఇది మరింత ఎక్కువ. వీటికి చాలావరకు గుండెజబ్బులు, మధుమేహం, మాయ చిరిగిపోవటం, సిజేరియన్ దుష్ప్రభావాలే కారణమవుతున్నాయి. ఆలస్యంగా గర్భం ధరించినవారిలో రక్తం పరిమాణం పెరగటం, గుండె మరింత ఎక్కువగా రక్తాన్ని పంప్ చేయాల్సి రావటం, ఇన్సులిన్ నిరోధకత వంటివి పెను సవాళ్లుగా మారుతున్నాయి. ఇతరత్రా సమస్యలతో బాధపడే గర్భిణులకు గర్భస్రావం, నెలలు నిండకముందే కాన్పు కావటం, పిల్లలు తక్కువ బరువుతో పుట్టటం వంటి ముప్పులూ పెరుగుతాయి.

### మగవారి వయసూ కీలకమే

మగవారికి వయసు మీద పడ్డా సంతానం కనటానికి వచ్చిన ఇబ్బందేమీ లేదని చాలామంది భావిస్తుంటారు. ఇది నిజం కాదు. సంతాన సామర్థ్యంపై మగవారి వయసూ ప్రభావం చూపుతుంది. వయసు పెరుగుతున్నకొద్దీ వృషణాల పనితీరు మారిపోవచ్చు. టెస్టోస్టీరాన్ హార్మోన్ స్థాయులు తగ్గిపోవచ్చు. వీర్యకణాల సంఖ్య.. వాటి కదలికలు, నాణ్యత పడిపోవచ్చు. సాధారణంగా మగవారిలో 34 ఏళ్ల వయసు వరకూ వీర్యం విషయంలో పెద్దగా మార్పులేవీ ఉండవు. ఆ తర్వాత.. ముఖ్యంగా 40ల్లో వీర్యం చిక్కదనం, మోతాదు, వీర్యకణాల సంఖ్య, కదలికలు తగ్గుతూ వస్తాయి. వీర్యకణాల్లో జన్యుమార్పులూ తలెత్తొచ్చు. ఇవన్నీ సంతాన అవకాశాలను దెబ్బతీసేవే. పుట్టబోయే పిల్లల్లో జన్యు సమస్యలు తలెత్తొచ్చు. ఆలస్యంగా తండ్రులైన వారికి పుట్టిన పిల్లలకు ఆటిజమ్, స్కిజోఫ్రినియా, బైపోలార్ డిజార్డర్ వంటి సమస్యల ముప్పూ పెరుగుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. కొన్నిసార్లు కాన్పు సమయంలో శిశువులు మరణించొచ్చు.

### పెంపకంలోనూ ఇబ్బందులే

ఆలస్యంగా సంతానం కలిగితే పిల్లల పెంపకమూ కష్టమే. అప్పటికే వయసు మీద పడటం, పదవీ విరమణ పొందటం వంటివన్నీ పిల్లల పెంపకాన్ని సంక్లిష్టం చేసేవే. ఆలస్యంగా తల్లిదండ్రులైనవారు.. ముఖ్యంగా తొలిసారి సంతానాన్ని కన్న తల్లులు చాలా చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పిల్లల అవసరాలకు అనుగుణంగా జీవనశైలిని పూర్తిగా మార్చుకోవటంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇంట్లో ఇతరుల తోడు లేకుంటే మరింత కష్టంగానూ మారుతుంది. మానసిక ఒత్తిడికీ దారితీస్తుంది. ఇది పిల్లల ఆలన, పాలనపై విపరీత ప్రభావం చూపుతుంది.

### జాగ్రత్తలు తప్పనిసరి

- ఆలస్యంగా గర్భధారణకు ప్రయత్నించే మహిళలు ముందు విధిగా డాక్టర్ సలహా తీసుకోవాలి. గర్భధారణకు అడ్డుపడే సమస్యలేవైనా ఉంటే గుర్తించటానికి, అవసరమైతే తగు చికిత్సలు తీసుకోవటానికి వీలవుతుంది.
- గర్భధారణకు ప్రయత్నించటానికి ముందు నుంచే రోజూ ఫోలిక్ యాసిడ్ వంటి విటమిన్ మాత్రలు వేసుకోవాలి. దీంతో పిల్లల్లో జన్యు సమస్యలు తలెత్తకుండా చూసుకోవచ్చు.
- గర్భధారణకు ప్రయత్నిస్తున్నప్పుడు 6-12 నెలలు దాటినా ఫలితం కనబడకపోతే సంతాన సాఫల్య నిపుణుల సలహా తీసుకోవటం మంచిది. వయసుతో పాటు గర్భధారణ అవకాశాలు సన్నగిల్లుతాయి కాబట్టి అవసరమైన అన్ని పరీక్షలు చేయించుకోవాలి. ఇవి చాలావరకు మూడు నెలల్లోపే పూర్తవుతాయి. వీటి పరిశీలన పూర్తయిన వెంటనే తగు చికిత్సలు తీసుకోవాలి.
- సాధారణ పరీక్షలతో పాటు నెలసరి సమయంలో ఎఫ్ఎస్‌హెచ్, ఈస్ట్రోజెన్ స్థాయులనూ చూసుకోవాల్సి ఉంటుంది. దీంతో అండాశయాలు హార్మోన్లకు స్పందిస్తున్న తీరు బయటపడుతుంది. 40 ఏళ్లు పైబడినవారిలో నెలసరి తొలిరోజుల్లో ఈ హార్మోన్ల స్థాయులు చాలా ఎక్కువగా ఉంటే వీటికి అండాశయాలు సరిగా స్పందించటం లేదని, దీంతో గర్భం ధరించే అవకాశం గణనీయంగా తగ్గుతుందని గుర్తించటం అవసరం. కృత్రిమ గర్భధారణ పద్ధతులు ఎంతవరకు సఫలీకృతమయ్యే వీలుందనేది తెలుసుకోవటానికీ ఇది ఉపయోగపడుతుంది.
- అప్పటివరకు అధిక రక్తపోటు, మధుమేహం లేకపోయినా 35 ఏళ్ల తర్వాత గర్భం ధరించినవారికి వీటి ముప్పు ఎక్కువ. కాబట్టి వీరి విషయంలో మరింత శ్రద్ధ అవసరం.

**ఇప్పుడప్పుడే సంతానం వద్దనుకునేవారికి అండాలను భద్రపరచుకునే పద్ధతి (ఎగ్ ఫ్రీజింగ్) అందుబాటులో ఉంది. ఇందులో ముందుగానే అండాలను తీసి, శీతలీకరించి భద్రపరుస్తారు. సంతానాన్ని కనాలని అనుకున్నప్పుడు వీటిని గర్భసంచిలో ప్రవేశపెడతారు.**

### జీవనశైలిని మార్చుకుంటే మేలు

- ఆరోగ్యకరమైన, పౌష్టికాహారం తీసుకోవటం మంచిది. తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి. పొట్టు తీయని ధాన్యాలు తీసుకోవటం మంచిది.
- ఊబకాయం గర్భధారణకు అడ్డు తగులుతుంది. కాన్పు సమయంలో చిక్కులూ తలెత్తొచ్చు. కాబట్టి బరువు అదుపులో ఉండేలా చూసుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఇది బరువు తగ్గటానికి, శరీర సామర్థ్యం ఇనుమడింప చేయటానికే కాదు.. సంతాన అవకాశాలు మెరుగుపడటానికి, గర్భం ధరించిన తర్వాత కాన్పుకు అనుగుణంగా శరీరం తయారు కావటానికీ తోడ్పడుతుంది. కండరాలను పరిపుష్టం చేసి కాన్పు సమయంలో నొప్పిని తట్టుకోవటానికీ దోహదం చేస్తుంది.
- ఒత్తిడిని తగ్గించుకోవటం ముఖ్యం. ఇందుకు యోగా, ధ్యానం, ప్రాణాయామం బాగా ఉపయోగపడతాయి.
- రోజూ రాత్రిపూట 7-8 గంటల సేపు నిద్రపోయేలా చూసుకోవాలి. ఇది ఒత్తిడి, ఆందోళన తగ్గటానికి.. గుండె కణజాలం, రక్తనాళాలు మరమ్మతు కావటానికి చాలా అవసరం.
- మద్యం, పొగ, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకపోవటం ఉత్తమం. ఒకవేళ అలాంటి అలవాట్లుంటే వెంటనే మానెయ్యాలి.



## క్యాన్సర్‌పై బ్యాక్టీరియా బాణం!

మందులతో పనిలేకుండా క్యాన్సర్ కణితులను నిర్మూలిస్తే? ఆశ్చర్యంగా అనిపించినా ఇది సాధ్యమేనని నిరూపించారు కొలంబియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు. ఇందుకు ఇ-కొలి బ్యాక్టీరియాను అస్త్రంగా మలచుకొన్నారు. కొన్నిసార్లు మన రోగనిరోధక కణాలు తమకు తామే క్యాన్సర్ కణాలను గుర్తించి, చంపేస్తుంటాయి. అయితే కణితులు వీటి కంట పడకుండా తప్పించుకోవటానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటాయి. సీడీ47 అనే జన్యువు నుంచి విడుదలయ్యే ప్రోటీన్లను తమ మీద పొరలా అమర్చుకొని రోగనిరోధక వ్యవస్థ కళ్లు గప్పేస్తుంటాయి. దీన్ని ఛేదించటానికే శాస్త్రవేత్తలు ఇ-కొలి బ్యాక్టీరియాను ఉపయోగించుకున్నారు. వీటిని జన్యుపరంగా మార్పు చేసి.. ఎలుకల కణితుల్లోకి జొప్పించారు. వీటి నుంచి వెలువడే నానోబాడీలు క్యాన్సర్ కణాలకు అతుక్కుపోయి సీడీ47 ప్రోటీన్ల పొరను కప్పేస్తాయి. దీంతో రోగ నిరోధక కణాలు క్యాన్సర్ కణాలను గుర్తించి, వాటి పని పడతాయి. వినూత్నమైన ఈ పద్ధతి ఇప్పటికిప్పుడు అందుబాటులోకి రాకపోయినా మున్ముందు సంప్రదాయ మందుల దుష్ప్రభావాలేవీ లేకుండా క్యాన్సర్లకు కచ్చితమైన చికిత్స చేయటానికి ఉపయోగపడగలదన్నది పరిశోధకుల భావన.

## అర్ధరాత్రి కడుపునొప్పి..?

**సమస్య - సలహా**

**సమస్య:** నా వయసు 30 సంవత్సరాలు. నాకు రోజూ అర్ధరాత్రి పూట తీవ్రమైన కడుపు నొప్పి వస్తుంది. మూత్రానికి వెళ్లి వచ్చాక తగ్గిపోతుంది. అంతేకాదు, మూత్రం చాలాసార్లు వస్తుంటుంది. విసర్జన సమయంలో మంటగానూ అనిపిస్తుంది. డాక్టర్‌కు చూపించుకుంటే ఎలాంటి సమస్య లేదని చెప్పారు. చాలా పరీక్షలు చేశారు. నాకు మధుమేహం కూడా లేదు. నా సమస్యకు పరిష్కారమేంటి? – రాజేశ్, విశాఖపట్నం

**సలహా:** మూత్రాశయం మూత్రంతో నిండిపోయినప్పుడు తెలియకుండానే నొప్పి రావొచ్చు. మూత్రం పోసిన తర్వాత నొప్పి తగ్గుతుంది. కొన్నిసార్లు మూత్రాశయం నుంచి కిడ్నీలోకి మూత్రం వెనక్కి వెళ్లినప్పుడూ నొప్పి రావొచ్చు. ఇది మూత్రం పోశాక తగ్గిపోవచ్చు. మూత్ర ఇన్‌ఫెక్షన్ల మూలంగానూ మూత్రాశయం ఉబ్బినప్పుడు నొప్పి రావొచ్చు. నిజానికి ఇలాంటి నొప్పి పగలు, రాత్రి ఎప్పుడైనా వస్తుంది. కేవలం అర్ధరాత్రి పూటే ఎందుకు వస్తుందనేది ఆశ్చర్యకరం. బహుశా మీరు పగటి పూట మూత్రం వస్తున్నట్టు అనిపించగానే విసర్జన చేస్తుండొచ్చు. రాత్రిపూట గాఢ నిద్రలో ఉన్నప్పుడు మూత్రాశయం బాగా నిండిపోయేంత వరకూ తెలియకపోవటం వల్ల నొప్పి వస్తుండొచ్చని అనిపిస్తోంది. దీంతో నొప్పితో మెలకువ వచ్చే అవకాశముంది. కాబట్టి మీరు పడుకునేముందు మూత్రం పోసి పడుకోవటం, సాయంత్రం 7 గంటల తర్వాత ఎక్కువగా ద్రవాలు తీసుకోకపోవటం వంటి జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. అలాగే అలారం పెట్టుకొని మధ్యలో ఒకసారి లేచి మూత్ర విసర్జన చేయాలి. దీంతో మూత్రాశయం పూర్తిగా నిండిపోకుండా చూసుకోవచ్చు. అప్పటికీ ఉపశమనం కలగకపోతే మూత్రం ఉత్పత్తిని తగ్గించే మాత్రలు వేసుకోవాల్సి ఉంటుంది. ఇవి రాత్రంతా ఎక్కువ మూత్రం ఉత్పత్తి కాకుండా చూస్తాయి. అయితే అంతకన్నా ముందు ఇతరత్రా మూత్రకోశ సమస్యలేవీ లేవని నిర్ధారించుకోవటం ముఖ్యం. ఇందుకోసం కొన్ని పరీక్షలు చేయాల్సి ఉంటుంది. మీరు చాలా పరీక్షలు చేశారని చెబుతున్నారు గానీ అవేంటో తెలుపలేదు. మూత్రాశయం, కిడ్నీ వంటి భాగాల్లో నొప్పి వస్తున్నప్పుడు అల్ట్రాసౌండ్ పరీక్ష చేస్తే మూత్రాశయ సామర్థ్యం, కిడ్నీలో వాపు, రాళ్ల వంటివేమైనా ఉంటే తెలుస్తాయి. మూత్రం కల్చర్ పరీక్ష చేస్తే ఇన్‌ఫెక్షన్ ఉంటే బయటపడుతుంది. అవసరమైతే ఎంసీయూజీ పరీక్ష చేసి మూత్రం వెనక్కి వెళ్తుందేమో కూడా చూడాల్సి ఉంటుంది. ఇవన్నీ నార్మల్‌గా ఉన్నప్పుడు చివరికి మూత్రాశయంలోకి గొట్టాన్ని పంపించి (సిస్టోస్కోపీ) పరిశీలిస్తారు. ఆయా కారణాలను బట్టి చికిత్స చేస్తారు. ఒకవేళ పరీక్షల ఫలితాలన్నీ నార్మల్‌గా ఉంటే తీవ్రమైన సమస్యలేవీ లేవనే అనుకోవచ్చు. అప్పటికీ నొప్పి వస్తుంటే నాడులు నొక్కుకుపోవటం కారణం కావొచ్చు. దీనికి మందులతో మంచి ఫలితం కనబడుతుంది. ఏదేమైనా నిర్లక్ష్యం చేయకుండా మీరు ఒకసారి నిపుణులైన యూరాలజిస్టును సంప్రదించటం మంచిది. పరీక్షల రిపోర్టులనూ వెంట తీసుకెళ్లాలి.



– డా॥ కె.సుబ్రహ్మణ్యం
సీనియర్ యూరాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను, సందేహాలను పంపాల్సిన చిరునామా
సమస్య – సలహా **సుఖీభవ** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512 email: sukhi@eenadu.in



ఈనాడు సినిమా



రామ్‌చరణ్

## ఇన్‌స్టాలో రామ్‌చరణ్

అభిమానులకు అనుసంధానంగా ఉండేందుకు సినీ తారలు ఎంచుకొంటున్న దారి... సామాజిక మాధ్యమాలు. ట్విటర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర వేదికల్లో చేరి వాటిలో సినిమాలతో పాటు వ్యక్తిగత విషయాల్ని పంచుకొంటుంటారు. అభిమానుల నుంచి వచ్చే స్పందనని, వారి అభిప్రాయాల్ని ప్రత్యక్షంగా తెలుసుకొంటుంటారు. రామ్‌చరణ్ ఇప్పటికే ఫేస్‌బుక్‌లో చేరారు. అప్పుడప్పుడు తన అభిప్రాయాల్ని, విశేషాల్ని అందులో పంచుకొంటుంటారు. అక్కడ ఆయన్ని 5 మిలియన్ల మంది అనుసరిస్తున్నారు. తాజాగా మరో ప్రముఖ సామాజిక వేదిక ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు చరణ్. ఆల్వేజ్ రామ్‌చరణ్ అనే పేరుతో ఆయన ఖాతా తెరిచారు. వెంటనే వేల సంఖ్యలో అభిమానులు అనుసరించడం మొదలుపెట్టారు. రామ్‌చరణ్ ట్విట్టర్‌లో ఇంకా చేరలేదు. అక్కడ చరణ్‌కి సంబంధించిన విషయాల్ని ఆయన అర్ధాంగి ఉపాసన పంచుకొంటుంటారు. ప్రస్తుతం ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న 'ఆర్ ఆర్ ఆర్'లో నటిస్తున్నారు రామ్‌చరణ్. మరో పక్క తండ్రి చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న 'సైరా నరసింహారెడ్డి'ని నిర్మిస్తున్నారు.

## ఇంతకీ ఆయన ఎవరు?



సూర్య

సూర్య కథానాయకుడిగా నటించిన చిత్రం 'బందోబస్త్'. మోహన్‌లాల్, ఆర్య, సాయేష సైగల్ కీలక పాత్రధారులు. కె.వి.ఆనంద్ దర్శకుడు. సుభాస్కరన్ నిర్మాత. ఇటీవల 'బందోబస్త్' టీజర్‌ని రానా విడుదల చేశారు. "పాత్రకు తగినట్టు తనని తాను మలుచుకోవడంలో సూర్య సిద్ధహస్తుడు. కమాండో, ఖదీర్, సుభాష్...ఇలా మూడు గెటప్పుల్లో సూర్య కనిపించబోతున్నారు. ఈ మూడింటిలో ఆయనెవరన్నది ఆసక్తికరం. మోహన్‌లాల్ నటన మరోసారి ఆకట్టుకుంటుంది. హారీస్ జయరాజ్ సంగీతం ప్రధాన ఆకర్షణ. ఆగస్టు 30న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు నిర్మాత. సముద్రఖని, బొమన్ ఇరానీ, పూర్ణ, నాగినీడు కీలక పాత్రధారులు.



పూజా హెగ్డే

## వెండితెరపై త్రీడీ రామాయణం



అల్లు అరవింద్

రామాయణాన్ని ఎంతోమంది దర్శకులు ఎన్నో రకాలుగా వెండితెరపై చూపించారు. ఇప్పుడు మరోసారి రామాయణం తెరకెక్కబోతుంది. అయితే ఈసారి పూర్తిస్థాయి త్రీడీలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది 'రామాయణ'. 'దంగల్' దర్శకుడు నితీష్ తివారి, 'మామ్' దర్శకుడు రవి ఉద్యావార్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్.. నమిత్ మల్హోత్ర, మధు మంతెనతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. మొత్తం రూ.1500 కోట్ల భారీ బడ్జెట్‌తో ఒక్కో భాగం రూ.500 కోట్లతో తెరకెక్కే ఈ చిత్రం మూడు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు, హిందీ, తమిళం, మరాఠీ, గుజరాతీ, పంజాబీ భాషలకు చెందిన ప్రముఖ నటులు ఈ చిత్రంలో నటించబోతున్నారు. భారతీయులకు రామాయణం గొప్ప కావ్యమే కాదు మన సంస్కృతిలో భాగం కావడంతో మరింత బాధ్యతగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాల్సిన అవసరం ఉందంటున్నారు నితీష్. "ఎంతో గొప్పదైన రామాయణాన్ని తెరకెక్కించే విషయంలో నిర్మాతలు మాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. సమయం, డబ్బు విషయంలో రాజీపడొద్దంటూ ప్రోత్సహించడంతో మరింత కన్నులవిందుగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం" అన్నారు నితీష్. మరో దర్శకుడు రవి ఉద్యావార్ మాట్లాడుతూ "అందరికీ తెలిసిన గొప్ప కథ రామాయణం. పసిపిల్లలు కూడా చూసి ఆనందించేంత అద్భుతమైన కథ ఇది. దాన్ని అంతకంటే గొప్పగా విజువల్ హంగులతో తీర్చిదిద్దుతున్నాం" అన్నారు. డిసెంబరు నుంచి ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. తొలి భాగాన్ని 2021లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు.

## ఇప్పుడా బెంగ లేదు

విజయాలూ, వైఫల్యాలు.. రెండూ స్వల్ప కాలికమే కాబట్టి వాటికి అతీతమైన ప్రయాణాన్ని తాను ఇష్టపడతాను అంటోంది పూజా హెగ్డే. తెలుగుతో పాటు హిందీలోనూ అవకాశాల్ని అందుకొంటున్న నాయిక ఈమె. ప్రస్తుతం అల్లు అర్జున్, ప్రభాస్ లాంటి అగ్ర కథానాయకులతో సినిమాలు చేస్తోంది. జీవితంలో ప్రతి విషయాన్నీ ఓ కొత్త కోణంలో చూడటం తన అలవాటు అంటోంది పూజ. మీకు అంత సులభంగా విజయాలు దక్కలేదు కదా అని అడిగితే... "విజయం అనేది ఎప్పుడూ నెమ్మదిగానే వస్తుంది. కానీ అది అందించే రుచే వేరు. నేనూ విజయం కోసం ఆత్రుతగా ఎదురు చూసినదాన్నే. కానీ అది చేతికందాక నా ఆలోచనలు పూర్తిగా మారిపోయాయి. ఒక విజయాన్ని మహా అంటే పది రోజులు ఆస్వాదిస్తామేమో, అదే చేస్తున్న పనిపై ప్రేమ, ఇష్టం ఉంటే రోజూ ఆస్వాదించొచ్చు అనిపించింది. అప్పట్నుంచీ ప్రయాణం మరింత ఆనందకరంగా మారింది. పని చేయడమే తప్ప ఫలితం గురించి ఇప్పుడు నాకు బెంగ లేదు" అని చెప్పింది పూజాహెగ్డే.



ఆర్.నారాయణమూర్తి

## ఈ రాజకీయం మారాలి

ఆర్.నారాయణమూర్తి స్వీయ దర్శకత్వంలో నటిస్తూ నిర్మించిన చిత్రం 'మార్కెట్లో ప్రజాస్వామ్యం'. ఈనెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సినీ ప్రముఖుల కోసం ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. ప్రముఖ నటుడు కైకాల సత్యనారాయణ మాట్లాడుతూ "ప్రజలకు ఉపయోగపడే కథా వస్తువుని ఎంచుకుని సినిమాగా మలుస్తాడు నారాయణమూర్తి. తన చిత్రాలంటే నాకు చాలా ఇష్టం. ఇలాంటి చిత్రాల్ని తాను మాత్రమే తీయగలడు. 'మార్కెట్లో ప్రజాస్వామ్యం' చూస్తుంటే రూ.వంద కోట్ల విలువైన సినిమాని చూసిన అనుభూతి కలిగింద"న్నారు. నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ "సామాజిక స్పృహ కలిగిన చిత్రాలు ఈమధ్య కాలంలో రావడం లేదు. ఆ లోటుని తీర్చిన చిత్రమిది. అంకిత భావంతో సినిమాలు తీస్తారు నారాయణ మూర్తి. ఆయన ధైర్యానికి హ్యాట్సాఫ్" అన్నారు. పోకూరి బాబూరావు మాట్లాడుతూ "నారాయణ మూర్తి చిత్రాల్లో పాటలు బాగుంటాయి. ప్రజాకవులు ప్రజల్లో మమేకమై గీతాలు రాస్తారు. అందుకే అవి అంతగా నిలిచిపోతాయ" న్నారు. "ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు ఈ చిత్రం అద్దం పట్టింద"న్నారు జెమిని కిరణ్. "ప్రజాస్వామ్యం ధన స్వామ్యంగా మారిపోయింది. ఎన్నికలంటేనే రూ.వేల కోట్ల వ్యాపారం అయిపోయింది. ఈ రాజకీయం మారాలని చెప్పే చిత్రమిద"న్నారు నారాయణమూర్తి.



విశాల్

## పోలీస్ 'అయోగ్య'

విశాల్ కథానాయకుడిగా తమిళంలో తెరకెక్కిన చిత్రం 'అయోగ్య'. రాశీ ఖన్నా కథానాయిక. వెంకట్‌మోహన్ దర్శకుడు. ఠాగూర్ మధు తమిళంలో నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగులో ప్రశాంత్ గౌడ్ విడుదల చేస్తున్నారు. 12న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. నిర్మాత ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ "తమిళనాడులో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా పతాక సన్నివేశాల్ని తెరకెక్కించారు. తమిళంలో మంచి వసూళ్లు సాధించింది. పోలీసు పాత్రలో విశాల్ నటన ప్రేక్షకుల్ని అలరించింది. తెలుగు ప్రేక్షకుల్నీ తప్పక మెప్పిస్తుంది" అన్నారు.

## 24 గంటల్లో ఏం జరుగుతుంది?

ఈషారెబ్బా కథానాయికగా నటించిన చిత్రం 'రాగల 24 గంటల్లో'. సత్యదేవ్ ప్రధాన పాత్రధారి. శ్రీనివాసరెడ్డి దర్శకత్వం వహించారు. కానూరి శ్రీనివాస్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. సెప్టెంబరు 5న ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. దర్శకుడు మాట్లాడుతూ "చాలాకాలం విరామం తరవాత నేను చేస్తున్న సినిమా ఇది. వినోదాత్మక కథల్ని ఎంచుకునే నేను తొలిసారి ఓ ఉత్కంఠ భరితమైన చిత్రాన్ని చేస్తున్నా. స్క్రీన్‌ప్లే గమ్మత్తుగా ఉంటుంది. 24 గంటల్లో ఏం జరుగుతుందన్నది ఆసక్తికరం. హాస్య నటుడు కృష్ణ భగవాన్ ఈ చిత్రానికి మాటలు రాయడం ప్రత్యేకతను సంతరించుకుంద"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "అనుకున్న సమయానికి, అనుకున్న బడ్జెట్‌లో చిత్రాన్ని పూర్తి చేయగలిగాం. శ్రీనివాసరెడ్డితోనే మరో సినిమా నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నామ"న్నారు. శ్రీరామ్, ముస్కాన్, గణేష్ వెంకట్రామన్, కృష్ణభగవాన, అనురాగ్, అజయ్, రవి ప్రకాష్ తదితరులు నటించారు. సంగీతం: రఘు కుంచె



ఈషారెబ్బా, సత్యదేవ్



సందీప్‌కిషన్

## 14 సినిమాలకు డబ్బులు తీసుకోలేదు

'స్నేహగీతం', 'ప్రస్థానం' చిత్రాలతో మంచి నటుడు అనిపించుకున్నాడు సందీప్ కిషన్. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'తో హిట్ హీరోల జాబితాలో చేరిపోయాడు. అటు కమర్షియల్ కథానాయకుడిగానూ ఎదుగుతున్న సమయంలో వరుస పరాజయాలు తన కెరీర్‌కి స్పీడ్ బ్రేకర్లుగా మారిపోయాయి. రెండేళ్ల నుంచీ సినిమాలకు దూరమయ్యాడు సందీప్. ఇప్పుడు 'నిను వీడని నీడను నేనే'తో హిట్టు కొట్టాలన్న కృత నిశ్చయంతో ఉన్నాడు. ఈ చిత్రానికి నిర్మాత కూడా తనే. శుక్రవారం ఈ చిత్రం విడుదల అవుతోంది. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ ఏమన్నాడంటే...

"హారర్ సినిమాలు చూడ్డానికి ఇష్టపడతాను. కానీ నటించాలని ఎప్పుడూ అనుకోలేదు. ఓ నటుడికి హారర్ సినిమాలో కొత్తగా చేయడానికి ఏమీ ఉండదని అనుకునేవాణ్ని. కానీ 'నిను వీడని నీడను నేనే' కథ నా ఆలోచన మార్చింది. ఇది కేవలం హారర్ చిత్రమే కాదు. వినోదం, సోషియో ఫాంటసీ అంశాలున్నాయి, అన్నింటికంటే మించి ఓ ఎమోషన్ ఉంది. ఓ మంచి సినిమా చూశాం అనే తృప్తితో జనాలు థియేటర్ నుంచి బయటకు వస్తారు".

**నచ్చినట్టు తీసుకోవచ్చని...:** "రెండేళ్ల నుంచీ నన్ను నేను వెండి తెరపై చూసుకోలేదు. గత చిత్రాలు సరిగా ఆడలేదు. దాంతో నిరుత్సాహానికి గురయ్యాను. ఇక్కడ ఉంటే అదే ఆలోచనతో ఉంటానేమో అని భయపడి, విదేశాలకు వెళ్లాను. తిరిగొచ్చాక దాదాపు ముప్ఫై కథలు విన్నాను. అందులో నాకు బాగా నచ్చిన కథ ఇది. గత పరాజయాలు చాలా పాఠాలు నేర్పాయి. సినిమా జరుగుతుండగానే 'ఇది ఆడదు' అనే నిజం తెలిసిపోయేది. నేను ఎక్కడైతే లోపాలు ఉన్నాయనుకున్నానో, చివరికి ఆ లోపాలే జనాలు, సినీ విశ్లేషకులు చెప్పేవారు. 'ఇలా చేయండి.. అలా చేయండి' అంటూ దర్శక నిర్మాతలకు సలహాఇస్తే.. 'జోక్యం' చేసుకుంటున్నానే అపవాదు మోయాల్సివస్తుంది. నా సినిమా నేనే తీసుకుంటే, నాకు నచ్చినట్టు చేసుకోవచ్చనే నిర్మాతగానూ మారాను. ఓ రకంగా ఈ సినిమా నా నమ్మకానికి పరీక్షలాంటిది".

**ఇంట గెలవాలి:** "ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు. కానీ నేను అందుకు రివర్స్. తమిళంలో నాకు మంచి సినిమాలు పడ్డాయి. ఒప్పుకోవాలే గానీ, నాలుగైదు తమిళ చిత్రాలు రెడీగా ఉన్నాయి. హిందీలోనూ హిట్టు కొట్టాను. అమేజాన్‌లో ఓ వెబ్ సిరీస్ కూడా చేశాను. తెలుగులోనే సరైన సినిమా రాలేదు. అందుకే ఇప్పుడు 'ఇంట గెలిచి తీరాలి' అనుకుని ఈ సినిమా చేశాను. ఈ సినిమాను హిందీలో చేస్తామంటూ ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ముందుకొచ్చింది."

**డబ్బులు ఎగ్గొట్టారు:** "నలుగురూ మనల్ని గుర్తించాలనే ఏ నటుడైనా అనుకుంటాడు. ఆ గుర్తింపుని కూడా దక్కించుకున్నాను. ఒంటికి గాయాలైనా లెక్క చేయలేదు. ఇప్పటివరకూ పద్నాలుగు సినిమాలు ఫ్రీగా చేసుంటాను. నేనేదో త్యాగం చేశానని చెప్పడం లేదు. ఆ కథలు నచ్చడంతోనే డబ్బులు తీసుకోకుండా నటించాను. 'సినిమా హిట్టైతే డబ్బులు ఇస్తాం' అని నిర్మాతలు చెప్పారు. అందులో సగం ఫ్లాప్ అయ్యాయి. సగం మంది ఎగ్గొట్టారు. ప్రస్తుతం 'తెనాలి రామకృష్ణ ఎల్.ఎల్.బీ' చేస్తున్నా. ప్రేక్షకుల్ని నవ్వించే సినిమా అది. మరో సినిమా కూడా సిద్ధంగా ఉంది".

### గీతోపదేశం

| | |
|---|---|
| పెద్దవాళ్లకెపుడూ నువ్వు శిరసు వంచరా<br>చిన్నవాళ్లనెపుడూ ఆశీర్వదించరా<br>లేనివాళ్లనెపుడూ నువ్వు ఆదరించరా<br>ప్రతిభ ఉన్నవాళ్లనెపుడూ నువ్వు ప్రోత్సహించరా | గీతం: కొడితే కొట్టాలిరా...<br>చిత్రం: ఠాగూర్<br>రచన: చంద్రబోస్ |

– పంపినవారు: చందు, విజయవాడ

## ఓ రాజా... ఓ రాణీ



కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్

కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్ జంటగా నటించిన చిత్రం 'రాజావారు రాణిగారు'. రవికిరణ్ కోలా దర్శకుడు. మనో వికాస్ నిర్మాత. సోమవారం హైదరాబాద్‌లో టీజర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "పదేళ్ల క్రితం ఇంటర్నెట్, సెల్‌ఫోన్లు అంతగా లేని సమయంలో ఇద్దరు యువతీయువకుల మధ్య నడిచే అందమైన ప్రేమకథ ఇది. పల్లెటూరి వాతావరణంలో సాగుతుంది. తూర్పుగోదావరి జిల్లాలోని కపిలేశ్వరపురంలో చిత్రీకరణ జరిపాం. ఆగస్టులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. "దర్శకుడు సినిమాను చక్కగా తెరకెక్కించారు. అనురాగ్ కులకర్ణి పాటలు ఆకట్టుకుంటాయి. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తామ"న్నారు నిర్మాత. కిరణ్ మాట్లాడుతూ "థియేటర్లో సినిమా చూసే ప్రతి ప్రేక్షకుడూ తమ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటార"న్నారు. గాయకుడు అనురాగ్ కులకర్ణి, స్వరకర్త జయ్ క్రిష్, ఛాయాగ్రాహకులు విద్యాసాగర్, అమర్‌దీప్, శ్రీనివాస్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## సంగీతం + ప్రేమ

ఉమాపతి, రేష్మా జంటగా తమిళంలో తెరకెక్కిన 'గిటార్' అదే పేరుతో తెలుగులో రాబోతోంది. ఆర్.ఇన్బశేఖర్ దర్శకుడు. నిర్మాత యం.రవి శేఖర్‌రెడ్డి వచ్చే నెలలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. చిత్ర సమర్పకుడు వానపల్లి బ్రహ్మాజీ మాట్లాడుతూ "సంగీతం నేపథ్యంగా సాగే చిత్రమిది. కథానాయకుడు గిటార్ వాద్యకారుడు. ప్రాణంతో సమానంగా భావించే గిటార్ అతన్నుంచి దూరమవుతుంది. దాన్ని తిరిగి ఎలా పొందాడనేది ఆసక్తికరం. ఇందులో ఒక మంచి ప్రేమకథ కూడా ఉంద"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "డి.ఇమాన్ సంగీతం ప్రధాన ఆకర్షణ. త్వరలోనే పాటల్ని విడుదల చేస్తామ"న్నారు. "సంగీత ప్రధానమైన చిత్రాల్ని ప్రేక్షకులు ఆదరిస్తుంటారు. ఈ చిత్రం విజయవంతం కావాల"న్నారు నిర్మాత మోహన్ వడ్లపట్ల.



రేష్మా

# వసుంధర





కొత్త ట్రెండ్ ఏదయినా కాలేజీ అమ్మాయిల నుంచే మొదలవుతుంది. కాఫ్తాన్‌ల నుంచి ట్యూనిక్‌ల వరకూ, టీషర్ట్ నుంచి కేప్ వరకూ ప్రతి డ్రెస్ భిన్నంగా ఎంచుకుంటూ తమదైన స్టైల్ స్టేట్‌మెంట్‌తో అదరగొట్టేస్తారు. అలా కొందరు కాలేజీ అమ్మాయిలు అనుసరిస్తోన్న నయా ఫ్యాషన్‌ల హంగామా తెలుసుకుందామా!

కాలేజీ స్టైల్

## టాపు లేసిపోద్ది!

పిస్తా గ్రీన్ ఫ్రిల్డ్ క్రాప్ టాప్‌నకు జతగా నీలంరంగు డెనిమ్ సస్పెండర్స్ అదరహో అనిపిస్తోంది కదూ! ఓవర్‌సైజ్డ్ కళ్లద్దాలు, ఒక చేతికి రిస్ట్‌బ్యాండ్, కాళ్లకు ఫ్లిప్‌ఫ్లాప్ చెప్పులు కొత్తగా కనిపించేలా చేస్తున్నాయి.



నలుపురంగు జీన్స్‌పై పోల్కాడాట్లు, పూలప్రింట్లు ఉన్న డబుల్ లేయర్డ్ పెప్లమ్ టాప్... ఆకట్టుకోవడమే కాదు, ఆధునికంగానూ ఉంటుంది.

ముదురు వంగపూవు రంగు జెగ్గింగ్‌పైకి లేతగులాబీ రంగు టాప్ చక్కటి మేళవింపు. ఈ టాప్‌పై ముత్యాలను పోలిన పూసల అమరిక, అంచు, చేతులకు ఫ్రింజెస్ సొగసులు... జెగ్గింగ్ జేబులకు గుండీల డిజైను స్టైలిష్ లుక్ తెచ్చిపెట్టింది. కాళ్లకు తెలుపు రంగు కాన్వాస్ బూట్లు, చెవులకు స్టడ్స్ అదనపు ఆకర్షణగా నిలుస్తాయి.

కాస్త సృజనాత్మకంగా ఆలోచిస్తే... ఇలాంటి మేళవింపులు ఎవరైనా చేసుకోవచ్చు. కాలేజీలో ఆకట్టుకునేలా కనిపించొచ్చు.



నలుపు రంగు జీన్స్ ప్యాంటుపై పొడవు చేతులున్న కౌల్‌నెక్ టీషర్టు. ఓ చేతికి కడియం, మరోచేతికి వాచీ. సాదాగా కనిపించాలను కునేవారికి ఈ మేళవింపు చక్కని ఎంపిక.



లేత నీలం రంగు సాదా టీషర్టుపై పూల ప్రింటు ఉన్న ముదురు నీలం పలాజో. అదీ టక్ చేసినట్లుగా...





నలుపురంగు టోర్న్‌డ్ జీన్స్‌పై పొడవు చేతుల టాప్‌నకు కేప్ తరహాలో జత చేసిన లేస్‌కోటు. కాన్వాస్ బూట్లు. ఇది కాస్త భిన్నంగా కనిపించేందుకు అంచుల్లో జీన్స్ మడత పెట్టుకుంటే చాలు.



పాలిపోయినట్లు ఉండే జీన్స్‌పైకి నలుపురంగు టీషర్టు. అదనంగా నలుపు, తెలుపు అడ్డచారలున్న పొడవాటి కోటు. సాదా ఫ్లిప్‌ఫ్లాప్స్, చెవులకు స్టడ్స్, చేతికి వాచీ నిండుదనం తెస్తాయి. ఈ వస్త్రశ్రేణి ఆధునిక లుక్‌ని తెచ్చిపెడుతుంది.

## తడిస్తే... తలస్నానం

**వర్షాకాలంలో జుట్టు తడవడం మామూలే. ఇంటికొచ్చాక తల తుడుచుకుని వదిలేయడం వల్ల ప్రయోజనం ఉండదు. అదనంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు కొన్ని ఉన్నాయి.**

- కొబ్బరి లేదా ఆవనూనెను గోరువెచ్చగా చేసి, తలకు రాసి మర్దన చేసుకోవాలి. అరగంట తరువాత తలస్నానం చేయాలి. తల్లో రక్తప్రసరణ సజావుగా సాగుతుంది. జుట్టు పట్టులా ఉంటుంది.
- వర్షపునీరు వల్ల తల జిడ్డుగా మారకుండా ఉండాలంటే... పెరుగు, గుడ్డు పూత వేయాలి. పావుకప్పు పెరుగులో ఒక గుడ్డు తెల్లసొన కలిపి తలకు రాసుకోవాలి. అరగంటయ్యాక గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేయాలి.
- గ్రీన్ టీ డికాషన్‌ను తలకు రాసుకుని పావుగంట అయ్యాక కడిగేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే జుట్టు ఆరోగ్యంగా, పట్టులా కనిపిస్తుంది.



- ఈ కాలంలో హెన్నా పెట్టడం సరికాదు. జుట్టు పొడిబారి, ఎండిపోయినట్లు కనిపిస్తుంది. దానికి బదులు స్నానానికి ముందు కలబంద గుజ్జు రాసుకోవడం మంచిది.
- తలస్నానం చేశాక కండిషనర్‌ని తప్పనిసరిగా వాడాలి. కచ్చితంగా రెండు నిమిషాలు అయ్యాక మళ్లీ తల కడుక్కోవాలి. అప్పుడే జుట్టుకు పోషణ అంది, ఆరోగ్యంగా కనిపిస్తుంది.

## అప్పుడు తినకండి!

**ఒత్తిడిగా ఉన్నప్పుడు, మరేదయినా సమస్య ఎదురైనప్పుడు కొంతమంది చేసే పని ఏదో ఒకటి తినడం. ఎమోషనల్ ఈటింగ్‌గా చెప్పుకొనే ఈ సమస్య కొనసాగితే అధిక బరువు పెరగడం ఖాయం అంటారు పోషకాహార నిపుణులు. దీన్ని నియంత్రించుకునేందుకు ఏం చేయాలో చూడండి.**

- మొదట మీరు ఎలాంటి ఆహార పదార్థాలంటే ఇష్ట పడుతున్నారో, ఏ సమయాల్లో ఎక్కువగా తింటున్నారో ఓ చోట రాసుకోండి. మీకంటూ ఓ అవగాహన వస్తుంది. ఆ పదార్థాలు మీకు అందుబాటులో లేకుండా చూసుకోండి. వీలైనంతవరకూ జంక్‌ఫుడ్ తినకుండా ఉండేందుకు ప్రయత్నించండి.
- పనిలో భాగంగా ఒత్తిడికి గురైనా, బాధలో ఉన్నా ఏదో ఒకటి తినేస్తుంటే ఓ పని చేయండి. వేళకు అల్పాహారం మొదలు భోజనం వరకూ చేయండి. చిరుతిళ్లు ఏవి పడితే అవి కాకుండా... పోషకాహారానికే ప్రాధాన్యం ఇవ్వండి. మీ వెంట బాదం, కీరదోస, క్యారెట్ ముక్కలు... వంటివి తీసుకెళ్లాలి.



- బాధ, విసుగు, చిరాకు, కోపం... వంటివి అధిగమించే ప్రయత్నం చేయండి. యోగా, ధ్యానం చేయడం వల్ల కొంతవరకూ మార్పు కనిపిస్తుంది. ఉద్వేగాలకు లోనవుతున్నప్పుడు తినడం కన్నా... మరేదైనా వ్యాపకం కల్పించుకోండి. ఓ పుస్తకం చదవడం, తోటపని... వంటివాటితో మార్పు ఉంటుంది.
- కోపంలో ఏదో ఒకటి తినాలని అనుకున్నప్పుడు ముందు రెండుగ్లాసుల నీరు తాగండి. తరువాత కప్పు గ్రీన్‌టీ లేదా ఏదయినా పండు తీసుకోండి. మనసు ప్రశాంతంగా మారుతుంది. ఆకలీ తగ్గుతుంది.

## పెళ్లి చేసుకుని వదిలేశాడు!

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

? నేను, ఒకబ్బాయి నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నాం. చదువు అయిపోయాక పెళ్లి చేసుకోవాలనుకున్నాం. అంతా సవ్యంగా సాగుతోందనుకున్న సమయంలో అతడికి మరో ఇద్దరు అమ్మాయిలతోనూ సంబంధం ఉందని తెలిసింది. నిలదీస్తే... మాయమాటలు చెప్పాడు. నాతో మాట్లాడిన వీడియో కాల్స్ రికార్డు చూపించి, లొంగదీసుకున్నాడు. చివరకు నా ఒత్తిడిమీద రహస్యంగా పెళ్లి చేసుకున్నాడు. ఆ ఫొటోలు తన దగ్గరే ఉన్నాయి. ఇప్పుడు మా ఇంట్లో నాకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఇంటికి వచ్చి మాట్లాడమని అడుగుతోంటే... మరో అమ్మాయినీ పెళ్లిచేసుకున్నానని అంటున్నాడు. మా మధ్య ఛాటింగ్‌లు ఆధారాలుగా ఉన్నాయి. వాళ్ల నాన్న కానిస్టేబుల్. ఆయనకు ఫోన్ చేసి ఇవన్నీ చెప్తే కొడుకునే వెనకేసుకొస్తున్నాడు. మా ఇంట్లో ఇవన్నీ చెప్పినా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి రారు. నా పేరు బయటకు రాకుండా అతడిని శిక్షించే అవకాశం ఉంటుందా?

**- ఓ సోదరి**

✔ అమ్మాయిలు ఎంత సులువుగా ఆకర్షణలకు లొంగిపోతారో మీ ఉత్తరం తెలియజేస్తోంది. నాలుగు గోడల మధ్య తాళి కట్టడం, గుడిలో దండలు మార్చుకోవడం నిజమైన పెళ్లి కాదు. హిందూ వివాహ చట్టం ప్రకారం పెళ్లికి కొన్ని నియమ నిబంధనలున్నాయి. అలా జరిగితేనే ఆ పెళ్లికి గుర్తింపు ఉంటుంది. ఇలాంటి మోసాలు జరగకుండా ఉండేందుకు పెళ్లి రిజిస్ట్రేషన్ తప్పనిసరని చట్టం చెబుతోంది. మీతో శారీరక సంబంధం పెట్టుకొని ఉంటే అదీ నేరమే. అంతమంది అమ్మాయిలను మోసం చేస్తుంటే అందరూ మీలాగే తమ పేరు బయటకు రాకూడదని పోలీస్ స్టేషన్‌లో అతడిపై ఫిర్యాదు చేయకుండా వదిలేశారేమో! కుదిరితే అంతా కలిసి ఆ పనిచేయండి. పెళ్లి పేరుతో అమ్మాయిలను వంచిస్తున్నందుకు భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 420, 375, 493, 496 కింద పోలీసులు అతడిపై కేసులు నమోదు చేస్తారు. అతడు ఉద్యోగం చేస్తూ ఉంటే... అక్కడికీ వెళ్లి ఆ ఉన్నతాధికారులకు విషయం చేయండి. మహిళా కమీషన్‌లోనూ ఫిర్యాదు చేయొచ్చు. ఎక్కడైనా సరే... మీ పేరు బయటకు రాకుండా చేయాలనుకునే ప్రయత్నాలు సఫలం కాకపోవచ్చు. పోలీసు స్టేషను చుట్టూ తిరిగితేనే పనులు అవుతాయి. మీలాంటి బాధితులు రెగ్యులర్ లేదా స్పీడ్ పోస్టుల రూపంలో చేసే ఫిర్యాదులు చాలావరకూ చెత్త బుట్ట దాఖలయ్యే అవకాశాలెక్కువ. మీకు తాళి కట్టినా... దానికి న్యాయబద్ధత (లీగాలిటీ) లేదు కాబట్టి మీరు భార్యగా నిరూపించుకోలేరు. అవకాశం ఉంటే... ఈ విషయం పెద్ద మనుషుల పంచాయతీలోనూ పెట్టి చూడండి. మోసపోయినవారందరినీ కూడగట్టండి. మరే అమ్మాయికీ ఇలా జరగకూడదనే ఉద్దేశంతోనే మీరు ముందుకొచ్చారని చెప్పండి. ఇలాంటి మనస్తత్వం ఉన్న అబ్బాయితో మీరు ఇప్పుడే ఇబ్బందులు పడుతున్నారు... పెళ్లి చేసుకున్నా సక్రమంగా కాపురం చేస్తాడనే నమ్మకం మీకు ఉందా... లేకపోతే మాత్రం వదిలేయడం మంచిది. మీకు వేరే వాళ్లతో పెళ్లయినా అతడు మీ జోలికి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడమూ ముఖ్యమే.

మీ ప్రశ్నలు ఇకపై vasulegal@eenadu.net కు పంపించగలరు.

## తెలుగమ్మాయి బైక్ కనిపెట్టిందోచ్

**ఆర్టీసీ బస్సులో 5 కి.మీ ప్రయాణించాలంటే కనీసం రూ.10 ఖర్చవుతుంది. ప్రైవేటు వాహనాల్లో ఇది మరింత ఎక్కువ. అలాంటిది అతి తక్కువ వ్యయంతో ఎక్కువ దూరం ప్రయాణించేలా ఫెడరల్ బైక్‌ను రూపొందించింది సికింద్రాబాద్ వారసిగూడకు చెందిన చింతల రమ్యప్రియ. ఇంధనంతో నడిచే వాహనాలకు బదులు కరెంట్‌తో నడిచే వాహనాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ ఆశయానికి ఈ బైక్ సరిగ్గా సరిపోతుంది. మరి ఆ విశేషాలేంటో చదివేయండి మరి.**

రమ్యప్రియ హైదరాబాద్‌లో ఇంటర్ వరకు చదివింది. తరువాత తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీలో 2012లో బీబీఏ పూర్తి చేసింది. డిగ్రీ అయిపోయాక తల్లి పద్మావతి నిర్వహిస్తున్న ట్రావెల్ సంస్థలో పనిచేయడం మొదలుపెట్టింది. ఆ సమయంలో కొంత మంది వినియోగదారులు ఇప్పుడున్న వాహనాలలో అదనంగా మరికొన్ని సౌకర్యాలు ఉంటే బాగుంటుందని కోరేవారట. కారు అద్దెకు తీసుకుని దూర ప్రాంతాలకు ప్రయాణిస్తున్న సమయంలో చివరి వరకు కూర్చోలేక ఇబ్బంది పడుతున్నామని, పడుకునేందుకు అనువుగా, వాష్‌రూంతో కూడిన కారు ఉంటే బాగుంటుందని చెప్పేవారట. అవన్నీ విన్న రమ్య అలాంటి వాహనాలను తాను ఎందుకు తయారు చేయకూడదని ఎప్పుడూ ఆలోచించేది. అమెరికా వంటి అగ్ర దేశాల్లోనే ఇటువంటి వాహనాలు తయారు చేయడానికి అనువైన శిక్షణ సంస్థలు ఉన్నాయని తెలుసుకుంది. భారత దేశంలో అలాంటి సంస్థల గురించి అంతర్జాలంలో ఆరాదీస్తే దిల్లీలోని ఎరోనాక్ సంస్థలో ఉందని తెలుసుకుంది. వెంటనే అందులో చేరి 'ఆటోమోటివ్ ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్ మాడిఫికేషన్' అనే అంశంలో మూడు నెలలు తర్ఫీదు పొందింది. కొంత కాలం ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేసింది. సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా ముందుగా చిన్న బైక్‌ల తయారీ మొదలుపెడదామని నిర్ణయించుకుంది. అలా వచ్చిన ఆలోచనే ఫెడరల్ బైక్. దీన్ని రూపొందించడానికి కావాల్సిన పరికరాలు దిల్లీలో కొనుగోలు చేసింది. మూడు నెలలు శ్రమించి ఎట్టకేలకు తయారు చేసింది.

### ఇవే ప్రత్యేకతలు...

రమ్యప్రియ పర్యావరణ హితంగా తయారుచేసిన ఫెడరల్ బైక్‌ను రెండు విధాలుగా ఉపయోగించొచ్చు. మూడు గంటల పాటు ఛార్జింగ్ పెడితే 40 కిలోమీటర్ల వరకూ ప్రయాణించొచ్చు. అదీ కేవలం 6 రూపాయల ఖర్చుతోనే. మెట్రో స్టేషన్లలోనూ దీనికి ఛార్జింగ్ పెట్టుకునే సదుపాయం ఉంది. పెట్రోల్‌తోనూ నడిపించవచ్చు. ప్రయాణిస్తున్న సమయంలో దానికదే ఛార్జింగ్ అవుతుంది. బైక్‌లో ఇంధనం లేకుంటే సైకిల్‌లా తొక్కుకుంటూ వెళ్లొచ్చు. ప్రస్తుతం ఎలక్ట్రికల్ వాహనాల ధర రూ.70 వేల నుంచి 80 వేల వరకు ఉంది. ఈ బైక్ మాత్రం రూ.23 వేలల్లో లభిస్తుంది. దీన్ని మరికొన్ని నెలల్లో మార్కెట్‌లోకి తీసుకురానుంది. 'పోస్టుమ్యాన్, ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వస్తువులను ఇళ్లకు చేర్చే బాయ్స్, ఇతర సామగ్రి సరఫరా చేసేవారికి ఉపయుక్తంగా ఉండాలనే ఉద్దేశంతో దీన్ని తయారు చేశా. ఎవరైనా సరే ఈ బైకును ఉపయోగించొచ్చు...' అని చెబుతుంది రమ్యప్రియ.

– ముడుసు కృష్ణమూర్తి, బౌద్ధనగర్ న్యూస్‌టుడే




## బంగారం వెండి

8న ముగింపు-క్రితం

| | హైదరాబాద్ | | విజయవాడ | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | 35,720 | 35,570 | 35,720 | 34,100 |
| ఆర్నమెంట్ | 33,340 | 33,170 | 33,100 | 31,600 |
| వెండి (కిలో) | 39,050 | 38,900 | 39,200 | 39,000 |
| | ప్రొద్దుటూరు | | రాజమహేంద్రవరం | |
| బంగారం(24క్యా) | 34,250 | 34,200 | 35,660 | 35,570 |
| ఆర్నమెంట్ | 31,650 | 31,570 | 33,030 | 32,810 |
| వెండి (కిలో) | 38,900 | 38,800 | 39,100 | 38,900 |
| | విశాఖపట్నం | | తమిళనాడు | |
| బంగారం(24క్యా) | 35,480 | 35,300 | ------- | ------- |
| ఆర్నమెంట్ | 32,980 | 32,830 | 3,303 | 3,281 గ్రా |
| వెండి (కిలో) | 39,500 | 39,000 | 41.00 | 40.61 గ్రా |

# మెయిన్స్ పోటీకి దీటైన వ్యూహం!



ఏపీపీఎస్సీ గ్రూప్-1 గైడెన్స్

**ఏపీపీఎస్సీ గ్రూప్-1లో ఆర్డీవోలాంటి ఉన్నతస్థాయి పోస్టుల సంఖ్య కొద్దిగా ఎక్కువగా ఉండటంతో ఈసారి పోటీ పెరిగింది. ముఖ్యంగా సాధారణ అభ్యర్థులు సివిల్స్ వారితో తలపడాల్సి ఉంది. ఇంకా పరీక్షలకు దాదాపు 150 రోజులుంది. ప్రిపరేషన్ లోపాలను పసిగట్టి తగిన వ్యూహాలను రూపొందించుకోడానికి ఈ సమయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.**

ప్రిలిమినరీ పరీక్షలో మంచి మార్కులు సాధించిన అభ్యర్థులు ఇప్పటికే మెయిన్స్ సన్నద్ధత ప్రారంభించారు. దాంతోపాటు నమూనా పరీక్షలను సాధన చేస్తున్నారు. అయితే 'ప్రిలిమినరీలో క్వాలిఫై అవుతామా? లేదా?' అనే సందేహంతో ఉన్నవారిలో చాలామంది ఇంకా ప్రిపరేషన్‌కి సిద్ధపడలేదు. ప్రిలిమినరీ నుంచి మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసే నిష్పత్తిపై కొంత సందేహం ఉండటం వల్ల ఇంకొందరు అభ్యర్థులు చదవాలా లేదా అని ఇంకా తడబడుతున్నారు.

గ్రూపు-1 పరీక్షను లక్ష్యంగా నిర్దేశించుకున్నవారు ఎటువంటి సందేహం లేకుండా మెయిన్స్‌కు సిద్ధపడటం మంచిది. ఒకవేళ మెయిన్స్‌కి అర్హత పొందలేకపోయినా ఏదో ఒకరకంగా ఆ పరిజ్ఞానం ఉపయోగపడుతుంది.

గ్రూప్స్ అభ్యర్థులకు ఎప్పుడూ సివిల్స్ వారి నుంచి పోటీ ఎదురవుతూనే ఉంటుంది. ఈసారి టాప్ పోస్టుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పోటీ మరీ పెరిగింది. గత గ్రూప్-1 నోటిఫికేషన్‌లో సివిల్స్ అభ్యర్థులు అత్యధికంగా ఎంపిక కావడంతో ఈసారి వారికి మరింత ప్రోత్సాహక వాతావరణం ఏర్పడింది. అయితే సివిల్స్ అభ్యర్థులు ఒక విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. గతంలో డేటా ఇంటర్‌ప్రెటేషన్ పేపర్ ఉండటం వల్ల స్థానిక విషయాల మీద పెద్దగా పట్టు లేకపోయినా రాణించారు. కానీ ఈసారి అటువంటి పరిస్థితి కనిపించదు. అందువల్ల సివిల్స్ అభ్యర్థులు గ్రూప్స్ సాధించాలంటే స్థానిక విషయాలైన ఆంధ్రప్రదేశ్ చరిత్ర, ఆంధ్రప్రదేశ్ భౌగోళికాంశాలు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, విభజన అనంతర సమస్యలపై గట్టి పట్టు పెంచుకోవాలి. తగినంత సమయం ఉండటం వల్ల ప్రిపరేషన్‌ను మెరుగు పరుచుకోడానికి వీలుంది.

## పేపర్-1: వ్యాసంపై నిర్లక్ష్యం వద్దు

ఇక గ్రూప్-1 పరీక్షలను మాత్రమే నమ్ముకొని ఇప్పటి వరకూ ప్రయత్నాలు చేస్తున్నవారు కొన్ని విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వ్యాస రచనలో సరైన మెలకువలు పాటించాలి. అవి తెలియకపోవడంతో చాలామంది మార్కులు సాధించలేకపోతున్నారు. అభ్యర్థుల దగ్గర తగిన సమాచారం ఉంటుంది కానీ, దాన్ని వ్యాస రూపంలో ఏవిధంగా పొందుపరచాలో అవగాహన ఉండటం లేదు. ఫలితంగా మార్కులు కోల్పోతున్నారు. అందువల్ల వ్యాసరచన లాంటి అంశాన్ని చివరి మూడు నెలల్లో చదువుదామని అనుకోవద్దు. దీనిపై సమగ్రంగా తయారవ్వాలి. సరైన సాధన ఇప్పటి నుంచే చేయాలి.



## పేపర్-2: కొత్తగా భౌగోళికాంశాలు

కొత్తగా ఆంధ్రప్రదేశ్ భౌగోళిక అంశాలను చేర్చారు. దాదాపుగా చాలా మంది భారతదేశ, ఆంధ్రప్రదేశ్ భౌగోళిక విశేషాలను ఆబ్జెక్టివ్ కోణంలో చదువుతారు. దీంతో 10 మార్కుల ప్రశ్నలకు అవసరమైన సమాచారాన్ని రాసేందుకు తగిన నైపుణ్యాన్ని పొందలేకపోతున్నారు. అందువల్ల ఈ సమయంలో అటువంటి పరిజ్ఞాన సంబంధిత విషయాల మీద దృష్టిపెడితే మంచి ఫలితాలను పొందవచ్చు.

## పేపర్-3: సమాచార సేకరణకు తగినంత సమయం

సివిల్స్ వారు మినహా గ్రూప్-1 మాత్రమే రాసే అభ్యర్థులకు గవర్నెన్స్, ఎథిక్స్ అనే విభాగంపై కొంత ఆందోళన కనిపిస్తోంది. సరైన సమాచారం లేకపోవడం, తెలుగులో మెటీరియల్ దొరక్కపోవడం, అప్లికేషన్ ధోరణితో సమాధానాలు రాసేందుకు సరైన మార్గదర్శకత్వం కొరవడటం అనే సమస్యలు దీనికి కారణం. ఇప్పుడు దొరికిన ఈ సమయాన్ని ఈ విభాగంలో గట్టి పట్టు సాధించేందుకు చక్కగా ఉపయోగించుకోవాలి. నిపుణుల సాయంతో సిలబస్ ప్రకారం సమాచారాన్ని సేకరించుకొని ప్రిపేర్ కావాలి.

## పేపర్-4: డైనమిజం కావాలి

ఎకానమీలో ఉండే డైనమిజాన్ని అందుకోవటంలో అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వానికి ఒక ప్రత్యేకమైన విజన్, పథకాలు ఉన్నాయి. వాటిని అర్థం చేసుకుని తమ సమాధానాల్లో పొందుపరచాలి. గత ప్రభుత్వపు విజన్‌నీ, పథకాలనూ, దృక్పథ పత్రాలనూ నామమాత్రంగా వినియోగించాలి. అందుకు అనుగుణంగా సమాచారాన్నీ, గణాంకాల్నీ సేకరించుకోవాలి. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి దృక్కోణాలు, దృక్పథాలు మారకపోయినా గణాంకాలు మారుతున్నాయి. కాలంతో పాటు వచ్చే ఈ మార్పులను పసిగట్టి ప్రిపరేషన్లో భాగంగా అనుసంధానించటం అవసరం. కేవలం పుస్తక సమాచారానికే పరిమితమై ప్రిపేరయ్యే ధోరణి నుంచి బయటికి వచ్చి ఈ డైనమిజాన్ని అలవర్చుకోడానికి అందుబాటులో ఉన్న ఈ సమయాన్ని వినియోగించుకోవాలి.



## పేపర్-5: అన్వయ ధోరణిపై దృష్టి

శాస్త్ర సాంకేతిక విషయాలంటే కొందరు అభ్యర్థులు ఇబ్బంది పడుతుంటారు. ముఖ్యంగా అన్వయ కోణాన్ని అలవర్చుకోవటంలో తడబడుతున్నారు. ఇప్పుడున్న సమయాన్ని ఉపయోగించుకుని అప్లికేషన్ ధోరణిలో తయారయ్యేందుకు అభ్యర్థులు వ్యూహాన్ని సిద్ధం చేసుకోవాలి. ముఖ్యంగా ఆర్ట్స్ గ్రాడ్యుయేషన్ నేపథ్యమున్న అభ్యర్థులు ఈ పేపర్‌ని నిర్లక్ష్యం చేస్తే ఆశించిన ఫలితం దాదాపు అందదని గుర్తుంచుకోవాలి. బీటెక్ లాంటివి చదివిన అభ్యర్థులైతే బయో సైన్స్ ఆధారిత శాస్త్రసాంకేతిక విషయాలను అర్థం చేసుకోడానికి కష్ట పడుతున్నారు. ఇలాంటి చిక్కులను అధిగమించేందుకు సరైన ప్రణాళికను ఈ సందర్భంలో రూపొందించుకోవచ్చు.

అందుబాటులో ఉన్న అయిదు నెలల సమయంలో మొదటి రెండు నెలలను వ్యక్తిగతంగా గమనించిన లోపాలను సరిదిద్దుకోడానికి ఉపయోగించుకోవాలి. మిగతా సమయంలో పూర్తిస్థాయి ప్రిపరేషన్‌ను సాగించాలి.

## సొంత నోట్సుతో ఎన్నో లాభాలు

గ్రూప్-1 మెయిన్స్ వంటి పరీక్షలకు రాత సాధన ఎంతో ముఖ్యం. తగినంత సమయం ఉంది కాబట్టి సొంత నోట్స్ తయారు చేసుకోవడంపై దృష్టిపెడితే, అది రాత సాధనలాగా కూడా ఉపయోగపడుతుంది. సొంత నోట్స్ వల్ల సమాధానంలో తాజాదనం కనిపిస్తుంది. సహజత్వాన్ని, కొత్తదనాన్ని ఎగ్జామినర్ గుర్తించే అవకాశం ఉంది. నోట్సు రాసుకోవటం వల్ల వివిధ విషయాలను తేలికగా గుర్తుంచుకునే వీలు కలుగుతుంది. అందువల్ల ఈ అయిదు నెలల సమయాన్ని సమర్థంగా వినియోగించుకోవాలి. ఇప్పటికే సొంత నోట్సు తయారుచేసుకుని అన్ని రకాలుగా సిద్ధపడిన అభ్యర్థులు ఈ సమయంలో మాక్ పరీక్షలకు హాజరై తమ లోపాలను గ్రహించి, సవరించుకోవటంపై దృష్టి పెట్టాలి. వచ్చిన మార్కుల స్థాయి పరిశీలించుకుని మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఏం చేయాలో చూసుకోవాలి.



- కొడాలి భవానీ శంకర్

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**బార్క్‌లో స్టైపెండరీ ట్రైనీలు**

భారత అణుశక్తి విభాగానికి చెందిన కల్పక్కంలోని బాబా అటమిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు-ఖాళీలు:** ప్లాంట్ ఆపరేటర్-07, ల్యాబొరేటరీ అసిస్టెంట్-04, ఫిట్టర్-12, వెల్డర్-02, టర్నర్-01, ఎలక్ట్రీషియన్-04, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-08, ఎలక్ట్రానిక్ మెకానిక్-04, ఏసీ మెకానిక్-01

**మొత్తం ఖాళీలు:** 43 **అర్హత:** హెచ్ఎస్సీ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ సర్టిఫికెట్ ఉండాలి. **వయసు:** 18-22 ఏళ్ల మధ్య ఉండాలి.

**ఎంపిక:** రాతపరీక్ష (ప్రిలిమినరీ, అడ్వాన్స్‌డ్ టెస్ట్), ట్రేడ్/ స్కిల్ టెస్ట్ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** జులై 8 నుంచి ఆగస్టు 7 వరకు. **వెబ్‌సైట్:** https://recruit.barc.gov.in/

**సీపీసీబీ, దిల్లీ**

దిల్లీలోని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు-ఖాళీలు:** రిసెర్చ్ అసోసియేట్-01, కన్సల్టెంట్ (ఏ, బి, ఏ/ బి)-41 **మొత్తం ఖాళీలు:** 42 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, కంప్యూటర్ పరిజ్ఞానం, అనుభవం. **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా.

**దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. **చివరితేది:** జులై 27 (ఈ ప్రకటన వెలువడిన తేది నుంచి 21 రోజుల్లోపు). **చిరునామా:** సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఈస్ట్ అర్జున్ నగర్, దిల్లీ-110032.

**వెబ్‌సైట్:** https://cpcb.nic.in/

### ప్రవేశాలు

**కాకతీయ యూనివర్సిటీ, వరంగల్**

వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ లర్నింగ్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ (ఎస్‌డీఎల్‌సీఈ) 2019-20 సంవత్సరానికిగానూ కింది కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ❖ యూజీ, పీజీ ప్రోగ్రాములు

**కోర్సులు:** బీఏ, బీకాం, బీబీఏ, ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ

**విభాగాలు:** కంప్యూటర్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిందీ, హిస్టరీ, సంస్కృతం, ఇంగ్లిష్, రూరల్ డెవలప్‌మెంట్, తెలుగు, సోషియాలజీ, జర్నలిజం, సైకాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ తదితరాలు.

**అర్హత:** యూజీ ప్రోగ్రాములకు ఇంటర్మీడియట్, పీజీ ప్రోగ్రాములకు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్

**దరఖాస్తుకు చివరితేది:** ఆగస్టు 28 http://www./sdlceku.co.in/

### వాక్-ఇన్స్

**ఎఫ్‌సీఆర్ఐ, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ)... ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి వాక్‌ఇన్ నిర్వహిస్తోంది. **పోస్టులు-ఖాళీలు:** ప్రొఫెసర్-01, అసిస్టెంట్ ప్రొఫెసర్-07, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-01, మెడికల్ ఆఫీసర్-01.

**విభాగాలు:** సాయిల్ సైన్స్, బయోడైవర్సిటీ, ఎకనామిక్స్ అండ్ మార్కెటింగ్ తదితరాలు. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, నెట్, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్, అనుభవం. **వాక్‌ఇన్ తేది:** జులై 15 **వేదిక:** ఎఫ్‌సీఆర్ఐ, తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ, దూలపల్లి, కొంపల్లి, హైదరాబాద్. **వెబ్‌సైట్:** www.fcrits.in

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

## ఉత్తీర్ణత పొందితే ఉద్యోగానికి అర్హత

కేంద్రప్రభుత్వం పర్యటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో దేశంలో హోటల్ పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందుతోంది. యువతీ యువకులు దీన్ని కెరియర్‌గా ఎంచుకుని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు చేస్తున్నారు. భారత పర్యటక మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్ఎంసీటీ) వీరికోసం దేశవ్యాప్తంగా అనేక కళాశాలలను ఏర్పాటుచేసింది. అందులో చదువుకునే విద్యార్థుల కోసం ప్రతిభగల అధ్యాపకులను అందించాలనే లక్ష్యంతో ఏటా ఎన్‌హెచ్‌టెట్‌ను నిర్వహిస్తున్నారు. అందులో ఉత్తీర్ణులైన వారికే టీచింగ్ పోస్టులను కేటాయిస్తున్నారు. ఎన్‌సీహెచ్ఎంసీటీకి అనుబంధంగా 21 కేంద్ర, 25 రాష్ట్ర, 20 ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్‌మేనేజ్‌మెంట్ (ఐహెచ్ఎం) కళాశాలలున్నాయి.

**ఎవరు అర్హులు?:** హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్/ హోటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో 55 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్ (10+2+3)/ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులు అర్హులు. హాస్పిటాలిటీ పరిశ్రమలో రెండేళ్ళ పని అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలతో మూడు పేపర్లుగా పరీక్ష ఉంటుంది.

**ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేది:** జులై 09 **ఆఫ్‌లైన్ దరఖాస్తు పంపేందుకు చివరి తేది:** జులై 12. **వెబ్‌సైట్:** http://www.ihmhyd.org/

### ప్రభుత్వ సంస్థల్లో..

హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ/ పీజీ తర్వాత టీచింగ్ రంగంలో ప్రభుత్వ ఉద్యోగం చేయాలనుకునేవారు ఈ పరీక్ష రాయవచ్చు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు కేంద్ర, రాష్ట్ర ఐహెచ్ఎంలలో ఉద్యోగాలున్నాయి. ప్రిపరేషన్‌కు ప్రత్యేక పుస్తకాలంటూ ఏమీ లేవు. గ్రాడ్యుయేషన్‌లో చదివిన సిలబస్ నుంచే ప్రశ్నలు వస్తాయి. టీచింగ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, ఇంగ్లిష్ కోసం పుస్తకాలు చదవాల్సి ఉంటుంది. -

- సంజయ్ ఠాకూర్, ప్రిన్సిపల్, ఐహెచ్ఎం హైదరాబాద్.

# ఉద్యోగాలకు నవోదయం!

### 2370 పోస్టులకు ప్రకటన విడుదల

**ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకుండా పిల్లల్లో ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో నవోదయ విద్యాసంస్థలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారిలోని ప్రతిభకు పదును పెట్టవచ్చని ఇక్కడి సిబ్బంది నిరూపిస్తున్నారు. ఈ యజ్ఞంలో భాగస్వాములుగా చేరే అవకాశం ఇప్పుడు వచ్చింది. నవోదయ సంస్థల్లో ఖాళీలకు ప్రకటన వెలువడింది. రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో మెరిట్ సాధిస్తే ఈ ఉద్యోగాలను సాధించుకోవచ్చు.**



పోస్టు గ్రాడ్యుయేట్, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లతోపాటు స్టాఫ్‌నర్సు, ఎల్‌డీసీ...మొదలైన ఉద్యోగాల భర్తీకి నవోదయ విద్యాలయ సమితి ప్రకటన వెలువరించింది. మొత్తంగా 2370 ఖాళీలు ఉన్నప్పటికీ వీటిలో సింహభాగం ఉపాధ్యాయ పోస్టులే!

### పరీక్ష విధానం

**పీజీటీ పోస్టులకు:** రీజనింగ్ ఎబిలిటీ 15, జనరల్ అవేర్‌నెస్ 15, టీచింగ్ ఆప్టిట్యూడ్ 20, సబ్జెక్టు పరిజ్ఞానం (అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న పోస్టు) నుంచి వంద ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నపత్రం 150 మార్కులకు ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష వ్యవధి 3 గంటలు. లాంగ్వేజ్ కాంపిటెన్సీ పరీక్షను 30 మార్కులకు నిర్వహిస్తారు. 30 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ఇంగ్లిష్, హిందీ ఒక్కో సబ్జెక్టు నుంచి 15 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. ఈ విభాగంలో సాధించిన మార్కులను పోస్టు ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు. అయితే అర్హత సాధించడం తప్పనిసరి. రెండు సబ్జెక్టుల్లోనూ విడిగా 33.33 శాతం మార్కులు పొందితేనే మిగిలిన ప్రశ్నపత్రాన్ని మూల్యాంకనం చేస్తారు.

**టీజీటీ పోస్టులకు:** రీజనింగ్ ఎబిలిటీ 10, జనరల్ అవేర్‌నెస్ 10, టీచింగ్ ఆప్టిట్యూడ్ 15, దరఖాస్తు చేసుకున్న సబ్జెక్టు నుంచి వంద చొప్పున 135 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. పరీక్ష వ్యవధి 3 గంటలు. మరో విభాగం లాంగ్వేజ్ కాంపిటెన్సీకి 45 మార్కులను కేటాయించారు. ఇందులో ఇంగ్లిష్, హిందీతోపాటు ప్రాంతీయ భాషలో 15 చొప్పున 45 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. తుది ఎంపికలో ఈ మార్కులు పరిగణనలోకి తీసుకోరు. ఈ విభాగంలోని ప్రతి సబ్జెక్టులోనూ 33.33 శాతం మార్కులు సాధించడం తప్పనిసరి. పరీక్షలో నిర్ణీత కటాఫ్ మార్కులు పొందినవారికి ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టుల్లోకి తీసుకుంటారు.

➤ ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: 10.07.2019

➤ ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 09.08.2019

➤ పరీక్ష తేది: 2019 సెప్టెంబరు 5-10 మధ్య

➤ తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం

### విభాగాలవారీగా పోస్టులు

అసిస్టెంట్ కమిషనర్: 05 ❑ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ): 430 ❑ ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ): 1154 ❑ మ్యూజిక్ టీచర్: 111 ❑ ఆర్ట్ టీచర్: 130 ❑ పీఈటీ మేల్: 148 ❑ పీఈటీ ఫిమేల్: 105 ❑ లైబ్రేరియన్: 70 ❑ ఫిమేల్ స్టాఫ్ నర్స్: 55 ❑ లీగల్ అసిస్టెంట్: 01 ❑ క్యాటరింగ్ అసిస్టెంట్: 26 ❑ లోయర్ డివిజన్ క్లర్క్: 135.

రాతపరీక్షలో ప్రతిభ, స్కిల్‌టెస్టు లేదా ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. లీగల్ అసిస్టెంట్, స్టాఫ్ నర్స్, క్యాటరింగ్ అసిస్టెంట్ ఖాళీలను రాతపరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. ఎల్‌డీసీ పోస్టులకు స్కిల్/ట్రేడ్ టెస్టు ఉంటుంది. మిగిలిన పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

❖ పీజీటీ పోస్టులకు సంబంధిత విభాగాల్లో కనీసం 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు బీఎడ్ పూర్తిచేసి ఉండాలి. గరిష్ఠ వయసు 40 ఏళ్లు.

❖ టీజీటీ పోస్టులకు సంబంధిత లేదా అనుబంధ సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు బీఎడ్. గరిష్ఠ వయసు 35 ఏళ్లు.

పీజీటీలకు రూ.47,600, టీజీటీలకు రూ.44,900 మూలవేతనం లభిస్తుంది. దీనితోపాటు డీఏ చెల్లిస్తారు. ఎంపికైన ఉపాధ్యాయులకు నవోదయ విద్యాలయాల్లోనే ఉచితంగా వసతి సౌకర్యం కల్పిస్తారు.




# మహా సంక్లిష్టం.. ఈ చంద్ర యాత్ర!

మానవ మేధస్సుకు పట్టం కట్టే మహోజ్జ్వల ఘట్టానికి తెర లేస్తోంది! ఒకప్పుడు రాత్రయిందంటే చాలు.. సుదూర తీరంలో ఊరిస్తూ, ఉడికిస్తుండే చందమామ గురించి ఏవేవో కథలు చెప్పుకోవటమే తప్పించి అసలక్కడికి ఓ బుజ్జి యంత్రాన్ని పంపించి బోలెడంత సమాచారం సేకరించొచ్చన్నది ఊహించటమే కష్టం. ఇప్పుడీ కలలను నిజం చేయబోతోంది మన ఇస్రో! నిజానికి ఇస్రో ఈ నెల 14 అర్ధరాత్రి దాటాక ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభమవుతున్న చంద్రయాన్‌-2 యంత్ర యాత్ర... అంతరిక్ష చరిత్రలో అత్యంత సంక్లిష్టమైన, కష్టసాధ్యమైన ప్రయోగమని చెప్పుకోక తప్పదు! ఎందుకో చూద్దాం!!!

**భూమి నుంచి అంతరిక్షంలోకి దూసుకుపోయి చంద్రుడి మీద దిగే వరకూ.. చంద్రయాన్‌-2లో చాలా దశలూ, అంచెలూ ఉన్నాయి. ఇందులో ప్రధానంగా 3 కీలక విభాగాలున్నాయి.**

1. మనం పంపించే రాకెట్‌ నుంచి విడివడి.. చంద్రుడి వరకూ వెళ్లి.. అక్కడ కక్ష్యలోనే తిరుగుతుండే ఆర్బిటర్‌
2. ఆ ఆర్బిటర్‌ నుంచి విడిపోయి జాబిల్లి మీద మృదువుగా దిగే ల్యాండర్‌.. 'విక్రమ్‌'
3. ఆ ల్యాండర్‌ నుంచి నిదానంగా దొర్లుకుంటూ బయటకొచ్చి.. చిన్నచిన్న చక్రాలేసుకుని చంద్రుడి నేలపై కలియ తిరిగే రోవర్‌.. 'ప్రగ్యాన్‌. ఈ మూడింటినీ కలిపి 'కాంపోజిట్‌ మాడ్యూల్‌' అంటారు. ఇలా వేర్వేరు దశల్లో, వేర్వేరు పనులు చేస్తుండే మూడింటిని కలిపి ఏకకాలంలో.. ఒకే వ్యోమనౌక కింద ప్రయోగిస్తుండటం వల్లే ఈ ప్రయోగం అత్యంత సంక్లిష్టంగా మారింది.

## నేల నుంచి జాబిల్లిని చేరేదిలా..

⇩ జీఎస్‌ఎల్‌వీ మార్క్‌-3 రాకెట్‌ ద్వారా చంద్రయాన్‌-2 శ్రీహరికోట నుంచి పయనమవుతుంది. ఈ రాకెట్‌ భూమి చుట్టూ దీర్ఘవృత్తాకారంలో తిరుగుతూ 170 కి.మీ.× 20,000 కి.మీ. దీర్ఘవృత్తాకార భూకక్ష్యను చేరిన తర్వాత.. అక్కడ చంద్రయాన్‌-2 మాడ్యూల్‌ను కక్ష్యలోకి వదిలేస్తుంది.

⇩ ఇక అక్కడి నుంచి చంద్రయాన్‌-2 మాడ్యూల్లో ఉంచిన చిన్నచిన్న రాకెట్ల ద్వారా దాని కక్ష్యను శాస్త్రవేత్తలు దశలవారీగా పెంచుతారు. ప్రతి దశలోనూ కక్ష్యను మరింత దీర్ఘవృత్తాకారంగా పెంచుకుంటూ పోతారు. ఇలా 16 రోజుల పాటు ఈ వ్యోమనౌక భూమి చుట్టూనే తిరుగుతూ ఉంటుంది.

⇩ కక్ష్యలో ఆశించిన ఎత్తుకు చేరాక ఈ వ్యోమనౌక భూమి కక్ష్య నుంచి మెల్లగా చంద్రుడి దిశగా మళ్లుతుంది. దీనికి సుమారు 5 రోజులు పడుతుంది.

⇩ ఇప్పుడు మరోసారి రాకెట్‌ను మండించి.. దాన్ని చంద్రుడి కక్ష్యలోకి చేరుస్తారు. అప్పటికి ఇది భూమి నుంచి బయల్దేరి 20-21 రోజులవుతుంది.

⇩ ఇక అక్కడి నుంచి కక్ష్యలో క్రమంగా కిందకి దిగుతూ మెల్లగా జాబిల్లి ఉపరితలానికి 100 కిలోమీటర్ల ఎత్తులో నిలకడగా తిరగటం మొదలుపెడుతుంది. ఈ స్థితికి చేరుకోటానికి మరో 27 రోజులు పడుతుంది. దీంతో ఆర్బిటర్‌ నుంచి ల్యాండర్‌ విడిపోయే ఘట్టానికి రంగం సిద్ధమైనట్లే.

⇩ కక్ష్యలో స్థిరంగా తిరుగుతున్న ఈ దశలో.. ఆర్బిటర్‌ నుంచి ల్యాండర్‌ విడిపోయేలా ఇస్రో ఆదేశాలు పంపుతుంది. దీంతో ల్యాండర్‌ చంద్రుడికి మరింత దగ్గరగా ప్రయాణం మొదలుపెడుతుంది. ఆర్బిటర్‌ మాత్రం వంద కి.మీ. ఎత్తులో అలా చంద్రుడి చుట్టూ తిరుగుతూనే ఉంటుంది.

⇩ మెల్లగా ల్యాండర్‌ చంద్రుడి వైపు పయనించటం మొదలుపెడుతుంది. ఇలా చంద్రుడి ఉపరితలానికి 30 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకున్నాక... ఈ ప్రయోగం మొత్తంలోనే అత్యంత కీలక దశ ఆరంభమవుతుంది. ఈ దశలో వేగాన్ని తగ్గించే రాకెట్లు మండుతాయి. చంద్రుడిపై గాలి ఉండదు కాబట్టి.. కక్ష్య నుంచి శరవేగంతో దూసుకొచ్చే ల్యాండర్‌ను ఆపటానికి పారాచూట్లు సైతం ఉపయోగపడవు. అందుకే ఈ ప్రత్యేక రాకెట్లు! ఈ దశల్లో భూమి నుంచి మనం దాన్ని నియంత్రించలేం. పూర్తిగా తన సొంత బుర్రతోనే ల్యాండర్‌ నిర్ణయాలు తీసుకోవటం మొదలుపెడుతుంది.

⇩ ఉపరితలానికి చేరువయ్యాక.. క్రమేపీ ల్యాండర్‌ తన వేగాన్ని గంటకు 3.6 కిమీ కన్నా తక్కువకు తగ్గించుకుంటుంది. కొంతసేపు దాదాపు నిశ్చల స్థితిలో ఉంటూ అక్కడి నేలను స్కాన్‌ చేయటం మొదలుపెడుతుంది. తాను ఎక్కడ దిగితే మంచిదో అన్వేషణ ఆరంభిస్తుంది. తనకు అమర్చిన కెమేరాల సాయంతో కింద రాళ్లురప్పల్లాంటి అవరోధాలేమీ లేకుండా, సూర్యకాంతి బాగుండే ప్రాంతాన్ని చూసుకుని.. అక్కడ దిగుతుంది. ల్యాండర్‌ క్షేమంగా చంద్రుడిపై కాలు మోపిన తర్వాత.. ఇక రోవర్‌ కథ మొదలవుతుంది.

⇩ ల్యాండర్‌ ఉంచి జారుడుబల్ల లాంటి ఒక ర్యాంప్‌ తెరుచుకుంటుంది. అందులోంచి ఆరు చక్రాల బుజ్జి రోవర్‌ మెల్లగా జారుకుంటూ కిందకు దిగుతుంది. అలా వస్తున్నప్పుడే దానికి ఉన్న సౌర ఫలకం విచ్చుకుంటుంది. సెప్టెంబర్‌ 6 లేదా 7 తేదీల్లో జరిగే ఈ ప్రక్రియ అంతా... ఓ 15 నిమిషాల్లోనే పూర్తవుతుంది! అక్కడి నుంచీ గట్టి బుర్ర గల రోవర్‌ యంత్రం... చంద్రుడిపై 14 రోజుల పాటు తిరుగాడుతూనే... రకరకాల సమాచార సేకరణలో నిమగ్నమవుతుంది!




### 15 నిమిషాలు.. అత్యంత కీలకం!

ల్యాండింగ్‌ ప్రక్రియలో జాబిల్లికి 30 కిలోమీటర్ల ఎత్తు నుంచి విక్రమ్‌ కిందకి దిగే దశ అత్యంత కీలకమైంది. ఇది 15 నిమిషాల పాటు సాగుతుంది. భూమి మీద నుంచి మనం పంపే సంకేతం జాబిల్లిని చేరుకోవడానికి దాదాపు 15 నిమిషాలు పట్టడం వల్ల ఈ ల్యాండింగ్‌లో ఈ దశను ఇక్కడి నుంచి శాస్త్రవేత్తలు నియంత్రించడం అసాధ్యం. అందువల్ల ల్యాండర్‌కే సొంత మేధస్సును ఏర్పాటు చేశారు. అదే సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ క్షేమంగా కిందకు దిగుతుంది. చివరి 15 నిమిషాల పాటు ఇస్రో శాస్త్రవేత్తలు కూడా మౌనంగా నిరీక్షించడం మినహా చేసేదేమీ ఉండదు.

మొన్న ఏప్రిల్‌లో ఇజ్రాయెల్‌ శాస్త్రవేత్తలు పంపిన బెరెషీట్‌ వ్యోమనౌక చంద్రుడిపై దిగే క్రమంలో కూలిపోయింది. అందులో ల్యాండింగ్‌ ప్రక్రియను ఇంజినీర్లే నియంత్రించటానికి ప్రయత్నించారు. కానీ దానికి భూకేంద్రం సంకేతాలు అందడంలో జాప్యం జరగటంతో అది విఫలమై, కూలిపోయింది. చంద్రయాన్‌-2కు ఈ ఇబ్బంది ఉండదు!

## చంద్ర కక్ష్యలోకి వెళ్లే ఆర్బిటర్‌



ఆర్బిటర్‌ చంద్రుడి చుట్టూ కక్ష్యలోనే తిరుగుతూ అక్కడి నుంచే ఫొటోలు, డేటాను సేకరించి భూమికి పంపుతుంది. చంద్రుడి ఉపరితలాన్ని స్కాన్‌ చేసి, అనేక చిత్రాలను, మ్యాప్‌లను అందిస్తుంది. ఇది ఒక రకంగా మునుపటి చంద్రయాన్‌-1 తరహాలోనిదే కాబట్టి దీని రూపకల్పనలో ఇస్రోకు పెద్దగా ఇబ్బందులేం ఎదురుకాలేదు.

## జాబిల్లి మీద దిగే ల్యాండర్‌



పిరమిడ్‌ ఆకారంలో ఉండే ల్యాండర్‌ను చంద్రుడిపై ఒక రోజు (అంటే మన భూమిపై 14 రోజులన్న మాట) పనిచేసేలా రూపొందించారు. ఇస్రో రూపొందించిన అత్యంత సంక్లిష్ట సాధనాల్లో ఇదొకటి. నాలుగు కాళ్లు ఉండే ఈ యంత్రానికి చంద్రుడిపై మృదువుగా దిగే సామర్థ్యం ఉంది. ల్యాండింగ్‌కు సంబంధించిన ఆల్గోరిథమ్‌ను భారత్‌ పరిశోధకులే రూపొందించారు. దీనిలోని విశిష్ట సెన్సర్లు, సాఫ్ట్‌వేర్‌.. దీనికి స్వీయ మేధస్సును తెచ్చిపెట్టాయి.

చంద్రుడిపై సాఫీగా దిగడం కోసం ఇందులో ప్రత్యేకంగా మండే రాకెట్లను (థ్రాటల్‌ ఏబుల్‌ ఇంజిన్లను) ఇస్రోనే అభివృద్ధి చేసింది. ఇవి అవసరం మేరకే మండుతూ ల్యాండర్‌ వేగాన్ని తగ్గిస్తూ.. దాని కదలికలను నియంత్రిస్తాయి. కింద పరిస్థితులను చూసుకుంటూ సాఫీగా దిగేందుకు ఇందులోని ప్రత్యేక నేవిగేషన్‌, గైడెన్స్‌, కంట్రోల్‌ (ఎన్‌జీసీ) సెన్సర్లూ ఉపకరిస్తాయి.

## చంద్రుడి మీద దిగే రోవర్‌



ల్యాండర్‌ నుంచి బయటకొచ్చి.. చంద్రుడిపై తిరిగే ప్రగ్యాన్‌ రోవర్‌.. కొంత ఇస్రో పంపే ఆదేశాలకు అనుగుణంగా, కొంత సొంత బుర్రతో పనిచేస్తుంది. ఇది బ్రీఫ్‌ కేస్‌ అంతే ఉంటుంది. చంద్రుడి నేలను దగ్గరగా పరిశీలించి, ఆ డేటా భూమికి పంపుతుంది. కదలిక కోసం ఈ యంత్రంలో అల్యూమినియంతో తయారైన ఆరు ప్రత్యేక చక్రాలు అమర్చారు. ఏ దారిలో వెళ్లాలో తేల్చుకునేందుకు దీనిలో నేవిగేషన్‌ కెమెరా, ఇన్‌క్లైనోమీటర్‌ ఉన్నాయి. చంద్రుడి నేలలో కూరుకుపోకుండా నడిచేలా దీని చక్రాలను విడివిడి మోటార్లతో రూపొందించారు. మలుపు తిరగడానికి, ప్రమాదాల నుంచి తప్పించుకోవడానికి అవి 'స్కిడ్‌-స్టీరింగ్‌' సూత్రాన్ని అనుసరిస్తాయి. ఈ రోవర్‌ సెకనుకు 1-2 సెంటీ మీటర్ల దూరమే ప్రయాణిస్తుంది. ఉపరితలాన్ని శోధించి, అక్కడ నీరు, ఇతర రసాయనాలను గుర్తించడంలో సాయపడుతుంది. ఇది 15 రకాల పరీక్షలను అక్కడికక్కడే చేస్తుంది.

**- ఈనాడు ప్రత్యేక విభాగం**

# 'కృష్ణా ట్రైబ్యునల్‌ అవార్డు'పై విచారణ వాయిదా

**ఈనాడు, దిల్లీ:** కృష్ణా ట్రైబ్యునల్‌ అవార్డును సవాల్‌ చేస్తూ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణలు దాఖలు చేసిన వివిధ పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. సంబంధిత పిటిషన్లను సోమవారం జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌, జస్టిస్‌ ఇందిరా బెనర్జీలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపీ తరఫు న్యాయవాదులు జీఎన్‌ రెడ్డి, ఉమాపతి, కర్ణాటక తరఫున న్యాయవాదులు వీఎన్‌ రఘుపతి, డీఎం నార్‌గోల్కర్‌, తెలంగాణ తరఫున న్యాయవాది కృష్ణమూర్తిస్వామి తదితరులు హాజరయ్యారు. ఆయా పిటిషన్లపై విచారణ ప్రారంభించడానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. విచారణ ఎప్పటి నుంచి ప్రారంభించేది సెప్టెంబరు 16న నిర్ణయిస్తామని పేర్కొన్న ధర్మాసనం అనంతరం విచారణను వాయిదా వేసింది.

## రూ.641 కోట్ల ఉపాధి నిధులు విడుదల

**ఈనాడు, దిల్లీ:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ. 641,39,52,000 నిధులను కేంద్రం విడుదల చేసింది. 2019-20 ఆర్థిక సంవత్సరం రెండో వాయిదాలో మొదటి విడతగా మెటీరియల్‌, అడ్మినిస్ట్రేటివ్‌ కాంపొనెంట్‌ కింద ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ పేర్కొంది. ఉపాధి పథకం అమలు నిమిత్తం ఈ నిధులకు రాష్ట్ర వాటాను కలిపి స్టేట్‌ ఎంప్లాయిమెంట్‌ గ్యారంటీ ఫండ్‌కు మూడు రోజుల్లో జమ చేయాలని స్పష్టం చేసింది. జమచేయని పక్షంలో తదుపరి నిధుల విడుదల నిలిపివేయాల్సి ఉంటుందని ఆదేశాల్లో పేర్కొంది.

## ఇంటర్‌ ప్రవేశాలకు 31వరకు గడువు

**ఈనాడు, అమరావతి:** ఇంటర్‌ మొదటి ఏడాది రెండో విడత ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు ఇంటర్‌ విద్యామండలి కార్యదర్శి కాంతిలాల్‌దండే ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు తదుపరి ఎలాంటి గడువు పొడిగింపు ఉండదని వెల్లడించారు.

*డీఈవో పూల్‌లో ఉన్న వారికి పోస్టింగ్‌ ఇవ్వాలి*

జిల్లా విద్యాధికారి(డీఈవో) పూల్‌లో ఉన్న ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు ఇవ్వాలని ఎమ్మెల్సీ ఏఎస్‌ రామకృష్ణ కోరారు. ఉపాధ్యాయుల పదవీవిరమణతో జిల్లాల్లో అనేక ఖాళీలు ఏర్పాడ్డాయని, వీటిల్లో డీఈవో పూల్‌లో ఉన్న ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు.

## ఆ 2 బిల్లులు రద్దయ్యాయి: కేంద్రం

**ఈనాడు, దిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రీయ, గిరిజన విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన 2 బిల్లులను 16వ లోక్‌సభలో ప్రవేశపెట్టినప్పటికీ ఆమోదం లభించకపోవడంతో రద్దయ్యాయని కేంద్రం పేర్కొంది. తెదేపా సభ్యుడు గల్లా జయదేవ్‌ అడిగిన ప్రశ్నకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి రమేశ్‌ నిశాంక్‌ పోఖ్రియాల్‌ సోమవారం లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

**కేంద్ర ప్రాయోజిత సంస్థలకు భూ కేటాయింపుల్లో ఆలస్యం:** కేంద్ర ప్రాయోజిత విద్యా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వాల భూకేటాయింపుల్లో ఆలస్యం జరుగుతోందని కేంద్రం తెలిపింది. తద్వారా ఆయా సంస్థల నిర్మాణం మరింత భారం అవుతోందని పేర్కొంది. వైకాపా సభ్యురాలు వంగా గీతా అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి పోఖ్రియల్‌ సమాధానమిచ్చారు.

**రాయితీ సిలిండర్ల అమ్మకానికి 'ప్రైవేటు' ప్రతిపాదన లేదు:** రాయితీ గ్యాస్‌ సిలిండర్ల అమ్మకాన్ని ప్రైవేటు సంస్థలకు ఇచ్చే ప్రతిపాదనేదీ ప్రభుత్వంవద్ద లేదని పెట్రోలియం సహజ వాయువులశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ తెలిపారు.

★ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, ఆదోనిలోని ఈఎస్‌ఐ ఆసుపత్రుల్లో 26 మంది మెడికల్‌ ఆఫీసర్లు, 335 మంది పారామెడికల్‌ సిబ్బంది ఖాళీలున్నాయని అవినాశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్‌ కుమార్‌ గంగ్వార్‌ సమాధానమిచ్చారు.

## ముఖ్యమంత్రిని కలిసే వరకు వెళ్లం

### తాడేపల్లిలో ఉద్యోగ సంఘాల స్పష్టీకరణ

**తాడేపల్లి, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి సోమవారం అనేక మంది ఉద్యోగులు, పరీక్షలు రాసిన అభ్యర్థులు తరలివచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి తమ సమస్యలు వివరించే వరకు వెళ్లేది లేదని పలు సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ★ కొందరు కక్షసాధింపు చర్యల్లో భాగంగా అవినీతి నిరోధకశాఖ దాడుల్లో చిక్కామని పలువురు పేర్కొన్నారు. తప్పులను పెద్ద మనసుతో క్షమించి న్యాయం చేయాలని, ఏసీబీ కేసుల్లో చిక్కిన చిరుద్యోగులను రక్షించాలని కోరారు. ఈ మేరకు 94 మంది సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించారు. ★ సహాయ ఆచార్య పోస్టులు భర్తీ చేయాలని ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర, ఆచార్య నాగార్జున వర్సిటీల పరిధిలో అర్హత పొందిన అభ్యర్థులు సీఎం కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ★ గోపాలమిత్రలు రెండో రోజూ ఆందోళన కొనసాగించారు. గ్రామ సచివాలయాల్లో వెటర్నరీ సూపర్‌వైజర్‌ అసిస్టెంట్లుగా గోపాలమిత్రలను నియమించాలని డిమాండ్‌ చేశారు. ★ గ్రామ సచివాలయాల్లోని వీఆర్వోల పోస్టులను డైరెక్ట్‌ రిక్రూట్‌మెంట్‌ ద్వారా వచ్చిన వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని ఏపీ డైరెక్ట్‌ రిక్రూట్‌మెంట్‌ వీఆర్‌ఏల అసోసియేషన్‌ కోరింది.

## వైఎస్‌ ఆశయాలను కొనసాగిస్తాం: రఘువీరా

**ఈనాడు డిజిటల్‌, అమరావతి:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తెలిపారు. వైఎస్‌ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఎంతో ఆదర్శనీయమని, వాటి ఫలాలు అన్ని వర్గాలకు అందాయన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో నిర్వహించిన వైఎస్‌ జయంతి వేడుకల్లో రఘువీరా పాల్గొన్నారు. వైఎస్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీ కేవీపీ రామచంద్రరావు పాల్గొన్నారు.

## కొండపిలో రైతు దినోత్సవం ఉద్రిక్తం

### ఎమ్మెల్యే స్వామిని అడ్డుకున్న వైకాపా శ్రేణులు


ఎమ్మెల్యేను అడ్డుకుంటున్న వైకాపా వర్గీయులు

**కొండపి, న్యూస్‌టుడే:** ప్రకాశం జిల్లా కొండపిలో రైతు దినోత్సవ కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెదేపా ఎమ్మెల్యే శ్రీబాల వీరాంజనేయస్వామికి చేదు అనుభవం ఎదురైంది. కార్యక్రమం జరుగుతున్న స్థానిక కల్యాణమండపం గేటు వద్దకు ఎమ్మెల్యే చేరుకోగానే వైకాపా నాయకులు, కార్యకర్తలు ఆయన్ను అడ్డుకున్నారు. 'గోబ్యాక్‌ స్వామి' అంటూ నినాదాలు చేశారు. దాంతో సుమారు 2గంటల పాటు కల్యాణమండపం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఓ సమయంలో ఎమ్మెల్యే స్వామిపై వైకాపా నాయకులు దాడికి యత్నించారు. పోలీసు బలగాలు స్వామిని కల్యాణమండపంలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా ఉపయోగం లేకపోయింది. కొండపి తహసీల్దారు శ్రీనివాస్‌ విన్నపం మేరకు ఎమ్మెల్యే వెనుదిరిగారు. అనంతరం చీరాల ఎమ్మెల్యే కరణం బలరాంతో కలిసి ఎస్పీ సిద్ధార్థ్‌ కౌశల్‌కు ఫిర్యాదు చేశారు.

## ప్రజాప్రతినిధికి ఇచ్చే గౌరవం ఇదేనా?

### అధికారుల తీరుపై జనసేన ఎమ్మెల్యే ఆగ్రహం


వ్యవసాయశాఖ ఏడీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

**రాజోలు, న్యూస్‌టుడే:** తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలం శివకోటిలో సోమవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్‌ రైతు దినోత్సవం, పించన్ల పంపిణీ కార్యక్రమం ప్రొటోకాల్‌ వివాదంతో రసాభాసగా మారింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, మత్స్యశాఖల అధికారులు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త బొంతు రాజేశ్వరరావు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనిపై జనసేన శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. ఫ్లెక్సీని తొలగించే వరకు కార్యక్రమాన్ని ప్రారంభించేది లేదని జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అధికారులకు స్పష్టం చేశారు. వాటిని తొలగిస్తే ధర్నాకు దిగుతామంటూ వైకాపా శ్రేణులు చెప్పడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫ్లెక్సీని తొలగించకపోవడంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే.. కార్యక్రమాన్ని ప్రారంభించకుండానే వెనుదిరిగారు.


వైఎస్‌ఆర్‌ రైతునేస్తం పురస్కారాల గ్రహీతలతో శాస్త్రవేత్త ఖాదర్‌వలి, ఆలిండియా కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రైతునేస్తం వ్యవస్థాపక అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ, వ్యవసాయశాఖ డీడీ తిరుపతయ్య

# ఆహారంలో నాణ్యతకు దూరం

- **వైఎస్‌ఆర్‌ రైతునేస్తం పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో ఖాదర్‌వలి**

**గుంటూరువారితోట, న్యూస్‌టుడే:** అధిక పెట్టుబడుల నినాదంతో నాణ్యమైన ఆహారానికి దూరమవుతున్నామని ఆరోగ్య, ఆహార నిపుణులు, శాస్త్రవేత్త డాక్టర్‌ ఖాదర్‌వలి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి జయంతి, రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సిరి ధాన్యాల విత్తనాల పంపిణీ, యంత్ర పరికరాల ప్రదర్శన, వైఎస్‌ఆర్‌ రైతునేస్తం పురస్కారాల ప్రదాన కార్యక్రమం జరిగింది. రైతునేస్తం మాసపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆ పత్రిక సంపాదకులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలి మాట్లాడుతూ.. వరి, గోధుమ నీరెక్కువగా కోరుకునే పంటలని, సిరి ధాన్యాలకు దాని అవసరం తక్కువని చెప్పారు. చిన్న రైతులు పండించే పంటలను సైతం ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు యలమంచిలి శివాజీ మాట్లాడుతూ వైఎస్‌ఆర్‌ బాటలో ముఖ్యమంత్రి జగన్‌ రైతులను ఆదుకోవాలని కోరారు. వైఎస్‌ఆర్‌ జయంతిని రైతు దినోత్సవంగా ప్రకటించడం అభినందనీయమని ఆలిండియా కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. రైతులకు భరోసా కల్పించేలా మున్ముందు జగన్‌ మంచి పరిపాలన అందిస్తారని శాసనసభ్యుడు ముస్తఫా ఆకాంక్షించారు. అనంతరం వైఎస్‌ఆర్‌ రైతునేస్తం పురస్కారానికి ఎంపికైన ఎం. శ్రీదేవి(కృష్ణా), టి.శివరామిరెడ్డి(గుంటూరు), పి.శరత్‌(ప్రకాశం), బి.శశిధర్‌(శ్రీకాకుళం), టి.మురళీరెడ్డి(నెల్లూరు), ఎల్‌.అచ్చెంనాయుడు(విశాఖ), కె.క్రాంతికుమార్‌రెడ్డి(పశ్చిమ గోదావరి), ఎం.రాంబాబు(తూర్పు గోదావరి), కె.సంధ్య(పశ్చిమ గోదావరి), పి.చిట్టిబాబు(చిత్తూరు), టిసాయినాథ్‌ రెడ్డి(కడప), ఎ.బాలయ్య(కర్నూలు), ఆర్‌.జ్యోతి(అనంతపురం), డి.హన్మంతురాజు(విజయనగరం), కైలాష్‌సాహు(శ్రీకాకుళం)లకు పురస్కారంతోపాటు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.


వైఎస్‌ జయంతిని పురస్కరించుకొని ఏపీ భవన్‌లో కేకు కోస్తున్న విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి తదితరులు

## పార్లమెంటు ప్రాంగణంలో వైఎస్‌ విగ్రహం ప్రతిష్ఠించాలి: ఎంపీ బాలశౌరి

**ఈనాడు, దిల్లీ:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని పార్లమెంటు ప్రాంగణంలో ప్రతిష్ఠించాలని వైకాపా ఎంపీ బాలశౌరి కోరారు. ఈ మేరకు లోక్‌సభ సభాపతి ఓం బిర్లాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైఎస్‌ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారంటూ పలు అంశాలు ఆ లేఖలో ప్రస్తావించారు.

# సినిమా చూపిస్త మామా..

- **వినోదరంగంలో భారీగా పన్ను ఎగవేతలు**
- **పన్ను మదింపుల్లో అధికారుల ఉదాసీనత**
- **కాగ్‌ నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రభుత్వం**



**ఈనాడు, దిల్లీ:** వినోదరంగంలో పెద్దమొత్తంలో పన్ను ఎగవేతలు జరుగుతున్నట్లు కాగ్‌ గుర్తించింది. టెలివిజన్‌, రేడియో, మ్యూజిక్‌, ఈవెంట్‌ మేనేజ్‌మెంట్‌, సినిమాలు, యానిమేషన్‌, విజువల్‌ ఎఫెక్ట్స్‌, బ్రాడ్‌కాస్టింగ్‌, స్పోర్ట్స్‌, అమ్యూజ్‌మెంట్‌ రంగాలు దేశంలో నానాటికీ విస్తరిస్తున్నప్పటికీ వాటినుంచి వచ్చే ఆదాయాలు మాత్రం ఆ స్థాయిలో ఉండటంలేదని పేర్కొంది. ఈ రంగం నుంచి వస్తున్న ఆదాయాల గురించి తెలుసుకోడానికి కాగ్‌ 2013-14 నుంచి 2016-17 వరకు ఆడిటింగ్‌ నిర్వహించింది. ఆదాయపు పన్నుశాఖ ఎంత సమర్థంగా పనిచేస్తుందో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని శాఖలు ఎంత సమన్వయంతో ఉన్నాయో, ఎంతమేరకు పన్ను ఎగవేత జరిగిందో తెలుసుకోడానికి కాగ్‌ ఈ ప్రయత్నం చేసింది. పన్ను నిబంధనల్లో ఉన్న అస్పష్టత, లోపాల ఆధారంగా ఎంతమేరకు పన్ను ఎగవేత జరుగుతుందో కనిపెట్టడానికి కసరత్తు చేసింది. 2013-14 నుంచి 2016-17 మధ్యకాలంలో దాఖలైన 13,031 అసెస్‌మెంట్లలో 6,516 అసెస్‌మెంట్లను తనిఖీచేసింది. అందులో 726 చోట్ల లోపాలున్నట్లు తేలిందని కాగ్‌ తెలిపింది. దీనివల్ల ప్రభుత్వానికి రూ. 2,267.82 కోట్లమేర ఆదాయం నష్టం జరిగినట్లు వెల్లడించింది. తాము కొన్నింటిని మాత్రమే పరిశీలించామని, ఇప్పటికైనా కేంద్ర ఆర్థికశాఖ మొత్తం అన్ని అసెస్‌మెంట్లను తనిఖీ చేయించాలని కాగ్‌ సిఫార్సు చేసింది. వినోదరంగానికి సంబంధించిన అసెసీలు సమర్పించిన అసెస్‌మెంట్లపై కాగ్‌ జరిపిన పరిశీలన నివేదికను కేంద్ర ఆర్థికశాఖ సోమవారం పార్లమెంటు ముందు పెట్టింది. కాగ్‌ తన పరిశీలనలో హైదరాబాద్‌ కేంద్రంగా పనిచేస్తున్న కొన్ని వినోదరంగ సంస్థల అసెస్‌మెంట్లలోని లోపాలను కనిపెట్టింది. కాగ్‌ రిపోర్టులో కె.వేణుగోపాల్‌ (కేవీ ఫిలిమ్స్‌), వీర వెంకట దానయ్య దాసరి (డీవీవీ దానయ్య)లతో పాటు ఆర్కా లీజర్‌ అండ్‌ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్‌, సెలెబ్రిటీ క్రికెట్‌ లీగ్‌, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ప్రైవేట్‌ లిమిటెడ్‌, ప్రకాశ్‌ ఆర్ట్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ వంటి పలు సంస్థలకు చెందిన అసెస్‌మెంట్‌ లోపాలను ఎత్తిచూపింది.

# అమ్మో..కృష్ణపట్నం రైల్వే కంపెనీయా..

- **అందులో పెట్టుబడులు పెట్టలేం**
- **చేతులెత్తేసిన ఎన్‌ఎండీసీ: కాగ్‌ వెల్లడి**

**ఈనాడు, దిల్లీ:** కర్ణాటక నుంచి ఇనుప ఖనిజం ఎగుమతులను నిషేధిస్తూ 2012లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభావం కృష్ణపట్నం రైల్వేలైన్‌పై పడినట్లు కాగ్‌ తెలిపింది. ప్రస్తుతం ఆ మార్గం లాభదాయకంగా లేదని, దానిపై ఎన్‌ఎండీసీ పెట్టిన పెట్టుబడులకు ప్రతిఫలం రావడంలేదని పేర్కొంది. ఫలితంగా మార్గం నిర్మాణం కోసం ఏర్పాటైన కృష్ణపట్నం రైల్వే కంపెనీ లిమిటెడ్‌లో పెట్టుబడులు పెట్టలేమని ఎన్‌ఎండీసీ చేతులెత్తేసినట్లు పేర్కొంది.

*'చెన్నై పోర్టు నుంచి నిషేధించడంతో..*

"చెన్నై పోర్టు నుంచి 2004-05 నుంచి ఇనుప ఖనిజం ఎగుమతులను నిషేధించాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో ఎన్‌ఎండీసీతోపాటు, భారతీయ ఖనిజ పరిశ్రమల సమాఖ్యకు సంబంధించిన ఖనిజాన్ని ఎగుమతి చేయడానికి నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టును గుర్తించారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఓబుళవారిపల్లె నుంచి నెల్లూరు జిల్లా కృష్ణపట్నం మధ్య రూ.587.49 కోట్ల ఖర్చుతో రెండు దశల్లో 113 కిలోమీటర్ల మేర రైల్వేలైన్‌ నిర్మించాలని తీర్మానించారు. అయిదున్నరేళ్లలో పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ సంస్థను రైల్‌ వికాస్‌ నిగం లిమిటెడ్‌, కృష్ణపట్నం పోర్టుకంపెనీ, గవర్నమెంట్‌ ఆఫ్‌ ఆంధ్రప్రదేశ్‌ కలిపి 30:30:13 మూలధన నిష్పత్తితో 2006 అక్టోబరులో ఏర్పాటుచేశాయి. మిగిలిన 27శాతం ఈక్విటీని ఇనుపఖనిజం ఎగుమతిదారులు, వ్యూహాత్మక పెట్టుబడిదారులకు వదిలిపెట్టాయి. రూ.40 కోట్లు చెల్లించి అందులో 15% ఈక్విటీని ఎన్‌ఎండీసీ తీసుకుంది. వెంకటాచలం-కృష్ణపట్నంపోర్టు మధ్య 20 కిలోమీటర్ల పనులు తొలిదశలో 2013 మార్చికల్లా పూర్తయ్యాయి.

*సరైన ప్రతిఫలం లేకపోవడంతో..*

ఓబుళవారిపల్లె, వెంకటాచలం మధ్య 93 కిలోమీటర్ల రెండోదశ పనులు 2018 మార్చికల్లా పూర్తవ్వాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికీ సాగుతున్నాయి. సరైన ప్రతిఫలం పొందలేకపోవడంతో..ఇకపై కృష్ణపట్నం రైల్వే కంపెనీ లిమిటెడ్‌లో పెట్టుబడులు పెట్టబోవడంలేదని ఎన్‌ఎండీసీ లేఖ రాసింది' ' అని కాగ్‌ పేర్కొంది. నివేదికను కేంద్ర గనులశాఖ సోమవారం పార్లమెంటుకు సమర్పించింది.

ఈనాడు బిజినెస్

# స్టీవ్‌జాబ్స్ వల్లే యాపిల్ బతికింది



## బిల్‌గేట్స్ ప్రశంస

వాషింగ్టన్: ఉద్యోగులకు ప్రేరణ కలిగించి మరిన్ని ఎక్కువ గంటలు ఉత్సాహంగా పనిచేసేలా చూసే అద్భుత చాతుర్యం స్టీవ్‌జాబ్స్‌లో అమితంగా ఉండేదని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ ప్రశంసించారు. యాపిల్ ముఖ్యకార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా వ్యవహరించిన, స్టీవ్‌జాబ్స్ పాంక్రియాటిక్ క్యాన్సర్‌తో 2011లో మరణించిన సంగతి విదితమే. నాయకత్వంపై సీఎన్ఎన్ చేసిన ఇంటర్వ్యూలో బిల్‌గేట్స్ ఈ వ్యాఖ్యలు చేశారు. మూసివేసే దశకు చేరుతున్న యాపిల్‌ను నిలబెట్టి, అత్యంత విలువైన సంస్థగా తీర్చిదిద్దడంలో స్టీవ్‌జాబ్స్ అసమాన నాయకత్వ ప్రతిభ చూపారని బిల్‌గేట్స్ వివరించారు. 'స్టీవ్‌జాబ్స్ అద్భుత చాతుర్యం కలిగిన నిపుణుడు. ఆయన ధాటికి ప్రజలు మైమరచిపోయేవారు. అయితే నేను కూడా చిన్నపాటి మాంత్రికుడిని కావడం వల్ల, నేను మాత్రం బయట పడ్డాను' అని బిల్‌గేట్స్ పేర్కొన్నారు. నైపుణ్యాన్ని వెలికితీసి, మరింతగా ప్రేరణ కలిగించే స్టీవ్‌జాబ్స్ వంటి మరో వ్యక్తిని మళ్లీ కలవలేదు' అని గేట్స్ తెలిపారు. అలాంటి వ్యవహారశైలి వల్లే, ఎనలేని సానుకూల పరిణామాలను స్టీవ్ ఆవిష్కరించగలిగారని ప్రశంసించారు. స్టీవ్‌జాబ్స్ తరవాత యాపిల్ సీఈఓగా టిమ్ కుక్ వ్యవహరిస్తున్న సంగతి విదితమే. మీ నాయకత్వ శైలి ఎలా ఉంటుందన్న ప్రశ్నకు బిల్‌గేట్స్ బదులిస్తూ 'న్యాయశాఖ తీర్పులో మినహా, ఖాతాదార్లు లేదా విలేకరులు ఎవరూ కూడా నేను నిరంకుశంగా, మొరటుగా, ఆజ్ఞాపించేలా వ్యవహరిస్తాను అని చెప్పలేదు' అని తెలిపారు.

# రూ.1.60 లక్షల కోట్లు వెనక్కి

## జూన్‌లో మ్యూచువల్ ఫండ్ల నుంచి తీసుకున్న మదుపర్లు

దిల్లీ: మ్యూచువల్ ఫండ్‌ల జోరుకు కళ్లెం పడింది. జూన్‌లో మ్యూచువల్ ఫండ్ పథకాల నుంచి మదుపర్లు రూ.1.60 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నారు. మేలో రూ.76,989 కోట్లు చొప్పించడం గమనార్హం. డెట్ పథకాలపై మదుపర్ల విశ్వాసం తగ్గడమే దీనికి కారణంగా తెలుస్తోంది. భారత మ్యూచువల్ ఫండ్‌ల సంఘం (యాంఫీ) వద్ద లభ్యమవుతోన్న తాజా గణాంకాల ప్రకారం.. మేలో డెట్ పథకాల్లో రూ.70,119 కోట్లు చొప్పించన మదుపర్లు, గత నెలలో మాత్రం రూ.1.71 లక్షల కోట్లు ఉపసంహరించుకున్నారు. మొత్తం మ్యూచువల్ ఫండ్‌ల నుంచి తీసుకున్న మొత్తం రూ.1,59,814.40 కోట్లుగా నమోదైంది. ఒక్క లిక్విడ్ ఫండ్‌ల నుంచి రూ.1.52 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నారు.

## ఘనం (+)

| నిఫ్టీ | 8న | మార్పు% |
|---|---|---|
| YES BANK | 93.15 | 5.67 |
| HCL TECH | 1039.05 | 2.23 |
| BHARTI INFRATEL | 262.50 | 0.57 |
| TCS | 2175.40 | 0.57 |

## గ్రహణం (-)

| నిఫ్టీ | 8న | మార్పు% |
|---|---|---|
| BAJAJ FINSERV | 7593.05 | -9.99 |
| BAJAJ FINANCE | 3413.30 | -8.22 |
| ONGC | 152.40 | -5.63 |
| INDIAN OIL CORP | 144.05 | -5.35 |
| INDIABULLS HSG | 689.00 | -5.27 |
| HERO MOTOCORP | 2380.15 | -5.26 |
| NTPC | 129.60 | -5.05 |
| MARUTI SUZUKI | 6038.70 | -5.05 |
| LARSEN & TOUBRO | 1490.35 | -4.36 |

## విదేశీ మారకపు రేట్లు



(థామస్ కుక్) (రూ.లలో)

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం | కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|---|
| అమెరికా డాలరు | 62.44 | 72.41 | బహ్రెయిన్ దీనార్ | 169.01 | 193.37 |
| పౌండ్ స్టెర్లింగ్ | 78.19 | 90.69 | కువైట్ దీనార్ | 186.59 | 232.34 |
| యూరో | 70.11 | 81.32 | ఒమన్ రియాల్ | 165.38 | 189.45 |
| జపనీస్ యెన్/100 | 57.60 | 66.80 | సౌదీ రియాల్ | 16.61 | 19.68 |
| ఆస్ట్రేలియా డాలరు | 43.61 | 50.46 | యూఏఈ దిర్హమ్ | 16.99 | 19.87 |
| సింగపూర్ డాలరు | 45.86 | 54.33 | మలేషియా రింగిట్ | 14.76 | 18.15 |
| థాయ్ బాత్/100 | 202.68 | 242.32 | చైనీస్ యువాన్ | 7.05 | 11.43 |



## 8న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 429 | వరంగల్ | 432 |
| చిల్లరగా(ఒక గుడ్డు) | 4.90 | విశాఖపట్నం | 444 |
| బెంగళూరు | 455 | చెన్నై | 475 |
| 9వ తేదీకి... | | చిత్తూరు | 468 |
| విజయవాడ/గోదావరి | 420 | నమక్కల్ | 465 |

జనరిక్ ఔషధాలకు

# కళ తగ్గుతోంది..

● యూఎస్‌లో ధరల ఒత్తిడి ● ప్రత్యామ్నాయాలపై కసరత్తు చేస్తున్నాం: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ యాజమాన్యం

ఈనాడు, హైదరాబాద్: మనదేశానికి చెందిన ఫార్మా కంపెనీలకు యూఎస్ జనరిక్ ఔషధాల మార్కెట్ అతిపెద్ద ఆకర్షణ. కానీ గత కొంతకాలంగా అక్కడ జనరిక్ ఔషధాల ధరలు తగ్గుతున్నాయి. అదేసమయంలో పోటీ బాగా పెరిగిపోయింది. దీంతో దేశీయ ఫార్మా కంపెనీలు ఆశించిన రీతిలో ఆదాయాలు, లాభాలు నమోదు చేయలేకపోతున్నాయి. ఈ సమస్య ఇప్పటికీ తీవ్రంగానే ఉన్నట్లు, దీన్ని అధిగమించటానికి అనువైన వ్యూహాలపై దృష్టి సారించినట్లు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ పేర్కొంది. తమకే కాకుండా పరిశ్రమ మొత్తానికి ఈ సమస్య ఉన్నట్లు డాక్టర్ రెడ్డీస్ 2018-19 వార్షిక నివేదికలో కంపెనీ ఛైర్మన్ కె.సతీష్ రెడ్డి, సహ-ఛైర్మన్ జి.వి.ప్రసాద్ వివరించారు. తక్కువ పోటీ ఉన్న సంక్లిష్టమైన తుది ఔషధాలను (ఫార్ములేషన్లు) ఆవిష్కరించటమే దీనికి ఒక పరిష్కార మార్గమని అభిప్రాయపడ్డారు. జనరిక్ ఔషధాల విభాగంలో కనిపిస్తున్న ఆదాయాల క్షీణతను కొత్త ఫార్ములేషన్ల ద్వారా పూడ్చుకోవలసి ఉన్నట్లు తెలిపారు. ఈ దిశగా చేస్తున్న ప్రయత్నాలను విశ్లేషించారు.

- ✦ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ దాదాపు 110 జనరిక్ ఔషధాలకు అనుమతి కోసం అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) వద్ద దరఖాస్తు చేసింది. ఈ అనుమతులు కోసం సంస్థ ఎదురుచూస్తోంది.
- ✦ అతి తక్కువ వ్యయాలతో ఈ ఔషధాలను తయారు చేసి యూఎస్ మార్కెట్లో క్రమం తప్పకుండా విడుదల చేయగలిగితే ఆదాయాలు పెంచుకునే అవకాశం వస్తుంది.
- ✦ యూఎస్ మార్కెట్లో సవాళ్లు అధికం అయిన నేపథ్యంలో డాక్టర్ రెడ్డీస్ గత కొంతకాలంగా ఇతర దేశాల్లో అమ్మకాలు పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది. ప్రధానంగా చైనా, రష్యా, మరికొన్ని ఇతర దేశాల్లో బ్రాండెడ్ జనరిక్ ఔషధాల అమ్మకాలు పెంచుకునే లక్ష్యంతో పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలు ముమ్మరం చేయాలని భావిస్తున్నారు.




### దేశీయ మార్కెట్‌పై గురి

2018-19 ఆర్థిక సంవత్సరంలో దేశీయ మార్కెట్లో డాక్టర్ రెడ్డీస్ ఆదాయాలు 12 శాతం పెరిగాయి. ఇదే విధంగా దేశీయ అమ్మకాలను ఏటేటా పెంచుకునేందుకు ప్రయత్నాలు చేయాలని యాజమాన్యం భావిస్తోంది. మరోపక్క పీఎస్ఏఐ (ఫార్మాసూటికల్ సర్వీసెస్ అండ్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్) వ్యాపారాన్ని కూడా విస్తరించాలనేది ఆలోచన. దీనివల్ల యూఎస్ మార్కెట్‌పై అధికంగా ఆధారపడవలసిన పని ఉండదని భావిస్తున్నారు.

### దువ్వాడ సమస్య పరిష్కారం

డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన మిర్యాలగూడ, శ్రీకాకుళంలోని ఏపీఐ యూనిట్లు, దువ్వాడ లోని ఆంకాలజీ ఫార్ములేషన్ల తయారీ యూనిట్లకు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ నుంచి అభ్యంతరాలు, ఆంక్షలు ఎదురైన విషయం విదితమే. తాము తీసుకున్న దిద్దుబాటు చర్యలతో ఈ యూనిట్లపై యూఎస్ఎఫ్‌డీఏ ఆంక్షలు తొలగిపోతున్నట్లు సతీష్‌రెడ్డి, జీవీ ప్రసాద్ వివరించారు. మిర్యాలగూడ ఏపీఐ యూనిట్‌ను ఈ ఏడాది జనవరిలో యూఎస్ఎఫ్‌డీఏ బృందం తనిఖీ చేసినట్లు, ఆ తర్వాత మే నెలలో ఈఐఆర్ (ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్) జారీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా దువ్వాడ ఆంకాలజీ యూనిట్‌కు కూడా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈఐఆర్ జారీ అయినట్లు తెలిపారు. శ్రీకాకుళం ఏపీఐ యూనిట్ విషయంలో మలిదశలో లేవనెత్తిన అభ్యంతరాలకు తాము సమాధానం ఇచ్చినట్లు, దీనిపై మరోసారి తనిఖీకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ తర్వాత దీనికి కూడా ఆంక్షలు తొలగిపోతాయని ఆశిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న చర్యలతో మంచి ఫలితాలు వచ్చినట్లు, ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంకా మెరుగైన వృద్ధిపై ఆశాభావంతో ఉన్నట్లు తెలిపారు.

5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధనకు

# 13-14% వృద్ధి అవసరం

ఈనాడు, హైదరాబాద్: మనదేశంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు గత దశాబ్దకాలంగా 6-7 శాతానికి కాస్త అటూఇటుగా ఉంటోందని, ఇదే స్థాయి వృద్ధి రేటుతో 2024 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాకారం చేయలేమని కేంద్ర ఆర్థిక మంత్రి మాజీ సలహాదారు, సెంటర్ ఫర్ పాలసీ ఆల్టర్నేటివ్స్ ఛైర్మన్ మోహన్ గురుస్వామి అన్నారు. అందుకు 13-14 శాతం వృద్ధి రేటు అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటే అంత అధిక వృద్ధి రేటు సాధించే అవకాశాలు లేవని వివరించారు. కేంద్ర బడ్జెట్‌పై ఫిక్కీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సోమవారం ఇక్కడ నిర్వహించిన చర్చాగోష్ఠిలో మోహన్ గురుస్వామి మాట్లాడారు.

పొదుపు జీడీపీ నిష్పత్తి తగ్గిపోతోందని, ఇది తాజాగా 28 శాతానికి పతనం అయినట్లు ఆయన పేర్కొన్నారు. పొదుపు జీడీపీ నిష్పత్తి పెరగని పక్షంలో మూలధన వ్యయం పెరగదని, అప్పుడు కొత్త ఉద్యోగాల కల్పన కూడా ఉండదన్నారు. ఈ చిక్కుముడికి బడ్జెట్‌లో పరిష్కారం కనిపించలేదని వివరించారు. 2024 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కావాలంటే పొదుపు జీడీపీ నిష్పత్తి 40 శాతం ఉండాలని స్పష్టం చేశారు. 'ఆర్థిక సర్వే' ప్రస్తావించిన అంశాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకున్నట్లుగా కనిపించలేదని విశ్లేషించారు. యథాతథ స్థితిని కొనసాగిస్తున్నట్లు ఉంది తప్పిస్తే బడ్జెట్‌లో కొత్తదనం లేదన్నారు. అందుకే స్టాక్‌మార్కెట్ వ్యతిరేకంగా స్పందిస్తోందని వివరించారు. జీడీపీలో 11.4 శాతం ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలకు, పెన్షన్లకు సరిపోతోందని, ఇక ఇతర విభాగాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఎక్కడ ఉంటాయని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంత ఆదాయాల్లో కొంత వృద్ధి కనిపిస్తోందని, దీనికి ప్రభుత్వ సబ్సిడీలు కారణమని వివరించారు. కానీ దీర్ఘకాలిక ఆస్తుల కల్పన మాత్రం జరగటం లేదన్నారు.




బడ్జెట్‌పై చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న మోహన్ గురుస్వామి. వేదికపై టి.మురళీధరన్, ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌వీజీ కులకర్ణి, ఆదిత్య బజోరియా.

ఫిక్కీ తెలంగాణ ఛైర్మన్ మురళీధరన్, ఐఎంటీ-హైదరాబాద్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, యర్నెస్ట్ అండ్ యంగ్ పార్టనర్ ఆదిత్య బజోరియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీనియర్ ఉపాధ్యక్షుడు ఆర్‌వీజీ కులకర్ణి తదితరులు ఈ చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు.

## మార్కెట్ కబుర్లు

- ✦ మలేసియాలోని **బయోకాన్**‌కు చెందిన మూడు ప్లాంట్లలో తనిఖీల అనంతరం 12 అభ్యంతరాలను అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) గుర్తించింది. అలాగే ఫారం 483ని కూడా జారీ చేసినట్లు కంపెనీ అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని వీటికి పరిష్కారం కనుగొనేందుకు తగువిధంగా చర్యలు చేపడతామని తెలిపారు.
- ✦ బంగ్లాదేశ్ సైనికా దళం (ఆర్మీ) నుంచి 200 యూనిట్ల టాటా హెక్సా కార్ల సరఫరా నిమిత్తం ఆర్డరు వచ్చిందని **టాటా మోటార్స్** వెల్లడించింది. ఆ దేశ ఆర్మీ అవసరాలకు తగ్గట్లుగా తగిన ప్రత్యేకతలతో ఈ వాహనాలను అందిస్తామని పేర్కొంది.
- ✦ పబ్లిక్ ఇష్యూకు వెళ్లేందుకు **స్టెర్లింగ్ అండ్ విల్సన్**‌కు సెబీ నుంచి అనుమతులు లభించాయి. ప్రతిపాదిత తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా దాదాపు రూ.4,500 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది.
- ✦ మెడికల్ అండ్ సర్జికల్ సెంటర్‌లో మొత్తం వాటాను దాదాపు రూ.74 కోట్లకు విక్రయించడాన్ని అనుబంధ సంస్థ ఫోర్టిస్ హెల్త్‌కేర్ ఇంటర్నేషనల్ పూర్తిచేసిందని **ఫోర్టిస్ హెల్త్‌కేర్** ప్రకటించింది.
- ✦ మైండ్‌ట్రీలో మెజార్టీ వాటాను కొనుగోలు చేసినప్పటికీ తమ అనుబంధ ఐటీ సంస్థలతో దీనికి సంబంధం ఉండదని **ఎల్‌అండ్‌టీ** స్పష్టం చేసింది. ఎల్‌అండ్‌టీకి ఎల్‌అండ్‌టీ ఇన్ఫోటెక్, ఎల్‌అండ్ టెక్నాలజీ సర్వీసెస్‌లు అనుబంధ సంస్థలుగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఆ సంస్థలు, మైండ్‌ట్రీ వేర్వేరు సంస్థలుగానే కార్యకలాపాలు నిర్వహిస్తాయని పేర్కొంది.
- ✦ వినియోగదారు వ్యాపారం నుంచి వైదొలగడంతో **టాటా కెమికల్స్** పూర్తిస్థాయి రసాయనాల సంస్థగా మారిందని సంస్థ ఎండీ, సీఈఓ ఆర్.ముకుందన్ వెల్లడించారు.
- ✦ **ఎన్ఐఐటీ టెక్నాలజీస్**‌లో మరో 26 శాతం వాటా కొనుగోలుకు హల్సీ బీవీ ఓపెన్ ఆఫర్ ఈ నెల 15 నుంచి ప్రారంభమై 26న ముగియనుంది

## మా ఉద్యోగాలు పోతాయేమో!

### ఎయిరిండియా ప్రైవేటీకరణను వ్యతిరేకించిన ఉద్యోగ సంఘాలు

ముంబయి: ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న ఎయిరిండియాను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తూనే ఉంది. గత ఏడాది బిడ్డర్ల నుంచి సరైన స్పందన రాకపోవడంతో ప్రక్రియ నిలిపేసిన సంగతి తెలిసిందే. తాజాగా మళ్లీ బిడ్లను ఆహ్వానించబోతోంది. అయితే తమ ఉద్యోగాలకు ఎక్కడ ఎసరు పెడతారో అనే భయంతో డజనుకు పైగా ఉద్యోగ, అధికార సంఘాలు ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గత శుక్రవారం ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎయిరిండియాను ప్రైవేటీకరణ చేస్తామనే సంకేతాలు వెలువడటంతో, ఎయిరిండియా ఛైర్మన్ అశ్వని లోహానీ వెంటనే ఉద్యోగ సంఘాలతో ప్రైవేటీకరణ ప్రణాళికపై చర్చించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విమానయాన వ్యాపారం నుంచి బయటపడాలని ప్రభుత్వం దశాబ్దాలుగా భావిస్తున్న సంగతి తెలిసిందే.

## స్థిరమైన ధరతో ఓఫూ క్యాబ్స్

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), న్యూస్‌టుడే: రోజు మొత్తంలో ఎప్పుడైనా ఒకే ధరకు క్యాబ్ సేవలను అందించేందుకు కొత్త అంకురం ముందుకు వచ్చింది. రద్దీ సమయాల్లో క్యాబ్ ధరలు అమాంతం పెరిగిపోతుండటంతో వినియోగదారులకు పెద్ద భారంగా మారుతోంది. దీన్ని నివారించేందుకు లక్ష్యంతో తాము సేవలను అందిస్తున్నట్లు వేవ్‌నాప్ సర్వీసెస్ ఎండీ, సీఈఓ అరుణ్ తెలిపారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతోపాటు..సహ వ్యవస్థాపకులు స్టీఫెన్ రోజర్స్, అపర్ణలు మాట్లాడుతూ.. నగరంలో కొనసాగే చాలా మేర క్యాబ్‌లు సమయానుగుణంగా ధరలను పెంచుతున్నాయన్నారు. ఇలాంటప్పుడు ప్రయాణికుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే స్థిరమైన ధరను ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఓఫూ(ఓఎఫ్‌యూ) పేరుతో క్యాబ్ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. యాప్ ద్వారా కొనసాగే ఈ సేవలు 24/7 స్థిరమైన ధరలతో అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే నిమిషాల ఆలస్యానికి ఎలాంటి అదనపు వసూళ్లు ఉండవన్నారు. ముందస్తుగానే క్యాబ్‌ను బుక్ చేసుకొని సమయం వృథా కాకుండా చేస్తున్నామన్నారు. 15 నుంచి ఓఫూ క్యాబ్స్ అందుబాటులోకి వస్తాయన్నారు. గూగుల్ ప్లే, యాప్ స్టోర్‌లో తమ యాప్ అందుబాటులో ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవలను అందుబాటులోకి తేవడంతోపాటు, విస్తరణ ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు వివరించారు.

# పాఠశాల బస్సులకు పన్ను వర్తిస్తుంది



- సతీష్ సరాఫ్, చార్టర్డ్ అకౌంటెంట్

**? నర్సరీ నుంచి పదో తరగతి విద్య వరకు ఒక స్కూలును నడుపుతున్నాం. సమీప గ్రామాల విద్యార్థుల కోసం ఒక బస్సును కొనుగోలు చేశాం. ఆ సమయంలో బస్సు విక్రేత 14% సీజీఎస్‌టీ, 14% ఎస్‌జీఎస్‌టీ వసూలు చేశారు. పాఠశాలలకు జీఎస్‌టీ నుంచి మినహాయింపు ఉందని మాకు తెలిసింది. మేం కట్టిన జీఎస్‌టీని వెనక్కి ఎలా తెప్పించుకోవాలో చెబుతారా**

మీరు విన్నది నిజమే. పాఠశాలలు అందించే విద్యా సేవలకు జీఎస్‌టీ నుంచి మినహాయింపు ఉంది. అయితే విద్యా సంస్థలు కొనుగోలు చేసే వస్తువులు, సేవలకు మినహాయింపు లేదు. సీజీఎస్‌టీ(14%), ఎస్‌జీఎస్‌టీ(14%) బస్సు విక్రేత మీ దగ్గర సరిగ్గానే వసూలు చేశారు. కాబట్టి మీకు అది వెనక్కి రాదు. బస్సు కొనుగోలు చేయకుండా.. రవాణా సేవలను వేరే వారి నుంచి సేవలుగా పొందితే మాత్రం.. జీఎస్‌టీ నుంచి మీకు మినహాయింపు లభిస్తుంది.

**? బియ్యం, నూకలకు మేం కమీషన్ ఏజెంట్లుగా పనిచేస్తున్నాం. తమిళనాడు, కర్ణాటక డీలర్లకు సరఫరా చేస్తున్నాం. కర్ణాటక, విశాఖపట్నం, కృష్ణపట్నం, చెన్నై పోర్టుల నుంచి ఎగుమతి చేసే వారికి సైతం మేం వీటిని సరఫరా చేస్తున్నాం. మా కమీషన్ టర్నోవరు ఏటా రూ.40 లక్షల నుంచి 50 లక్షల వరకు ఉంటోంది. మేం జీఎస్‌టీ లైసెన్సు తీసుకోవాలా**

జీఎస్‌టీ నిబంధనల ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు కమీషన్ ఏజెంట్ లేదా బ్రోకర్లుగా వ్యవహరించే వారికి మినహాయింపు ఉంది. కానీ వ్యవసాయ ఉత్పత్తుల నిర్వచనాల్లో బియ్యం, నూకలను పేర్కొనలేదు కాబట్టి మీ సేవలపై జీఎస్‌టీ వర్తిస్తుంది. కాబట్టి జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే.




**? 2017-18లో నా టర్నోవరు రూ.6 కోట్లు. దీనిపై ఎటువంటి పన్నూ లేదు. జీఎస్‌టీఆర్9 వార్షిక ఫైలింగ్ సమయంలో జీఎస్‌టీఆర్ 2, 3బిలు సరిపోలడం లేదు. విక్రయాలకు సంబంధించి 2, 3బిల మధ్య రూ.40 లక్షల వరకు తేడా వస్తోంది. అందులో రూ.11 లక్షల(లారీ రవాణా)ను జీఎస్‌టీఆర్ 2లో తగ్గించినట్లు చూపించాను. మరో రూ.29 లక్షలకు సంబంధించి కొనుగోలు బిల్లును పొరబాటున జీఎస్‌టీఆర్ 3బిలోని విక్రయాలలో చూపించాను. దీంతో ఆ తేడా వచ్చింది. నేను ఏం చేయాలో చెప్పండి**

జీఎస్‌టీ

మీ ప్రశ్నలో గందరగోళం ఉంది. నాకు కూడా పరిష్కారం తెలియడం లేదు. ఎందుకంటే జులై 2017లో తప్ప ప్రభుత్వం జీఎస్‌టీఆర్ 2 రిటర్నులను అమలు చేయడం లేదు. జీఎస్‌టీఆర్ 2 అనేది సరఫరా(కొనుగోళ్ల)లకు సంబంధించినది. మీ ప్రశ్నలో విక్రయాలుగా చెబుతున్నారు. అందుకే నాకూ అర్థం కావడం లేదు. ఒక వేళ జీఎస్‌టీఆర్ 2ను జీఎస్‌టీఆర్ 1 రిటర్నుగా భావిస్తే అపుడు మీ ప్రశ్న అర్థవంతంగా ఉంటుంది. అదే నిజమైతే జీఎస్‌టీ-1, జీఎస్‌టీఆర్ 3బిలోని టర్నోవర్లను విస్మరించండి. జీఎస్‌టీఆర్-9 రిటర్నులో వాస్తవ టర్నోవరును నివేదించండి. ఒక వేళ అదనపు పన్ను బకాయి కనిపిస్తే డీఆర్‌సీ-03 దరఖాస్తును ఉపయోగించి వడ్డీ సహా కట్టండి.

**? సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్ సేవలను అందించే కంపెనీని నిర్వహిస్తున్నాను. వార్షిక టర్నోవరు దాదాపు రూ.30 లక్షలుగా ఉంది. 18 శాతం జీఎస్‌టీని చెల్లిస్తున్నాను. క్లయింట్లతో నాకున్న ఒప్పందం ప్రకారం.. జీఎస్‌టీతో కలిపి గంటల వారీ బిల్లింగ్ చేస్తున్నాను. సంవిధాన పథకం కింద ఇచ్చిన కొత్త నిబంధనల ప్రకారం.. వృత్తి నిపుణుల సేవలకు నేను 12 శాతం వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంది కదా. సంవిధాన పథకం(కాంపోజిషన్ స్కీమ్)లోకి మారి 18 శాతం జీఎస్‌టీకి బదులుగా 6 శాతం చెల్లించడమనేది మంచి ఆలోచనేనా**

మీ ఆలోచన మంచిదే. మీకు 12 శాతం వరకు జీఎస్‌టీ విషయంలో కలిసివస్తుంది. అయితే మీరు సంవిధాన పథకంలోకి మారే సమయంలో ఒక విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. మీ వినియోగదార్లు మీ రాష్ట్రం లేదా దేశం వెలుపల ఉంటే మాత్రం సంవిధాన పథకంలోకి మారడానికి వీలు లేదు.

**? నా స్నేహితుడు ఒకడు వారాంతపు సంతలో ఫుట్‌పాత్‌పై బట్టలు విక్రయిస్తుంటాడు. ఇపుడు దానిని విస్తరించి ఒక షాపు పెట్టాలనుకుంటున్నాడు. పాన్, జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌లను ఎలా పొందాలి. ఒక వేళ పన్ను ఏమైనా కట్టాలా? జీఎస్‌టీ ఎంత ఉంటుంది**

షాపులో వ్యాపారాన్ని ప్రారంభిస్తున్న మీ స్నేహితుడికి నా శుభాకాంక్షలు. జౌళిపై జీఎస్‌టీ 5 శాతంగా ఉంది. పాన్ ఎలా పొందాలి, జీఎస్‌టీ రిజిస్ట్రేషన్, జీఎస్‌టీ రిటర్నుల ఫైలింగ్, పన్నుల చెల్లింపుల విషయంలో మీరు జీఎస్‌టీ కన్సల్టెంటును కలిస్తే మంచిది. ఎందుకంటే ఇక్కడి పరిమిత స్థలంలో మీరడిగిన విస్తృత సమాచారం చెప్పడానికి కుదరదు.

**? నాకు 65 ఏళ్లు. ఒక కాంపోజిట్ డీలరుగా షాపును నిర్వహిస్తున్నాను. ట్రేడ్ పేరు, జీఎస్‌టీ నంబరును మార్చకుండా నేను పదవీ విరమణ చేయాలని భావిస్తున్నాను. నేను నా వ్యాపారాన్ని ఒక్కగానొక్క కుమారుడికి బదిలీ చేయవచ్చా**

మీ వ్యాపారాలను మీ ఆస్తులు, అప్పులతో పాటు అదే పేరుతో మీ కుమారుడికి బదిలీ చేయడానికి మీకు స్వేచ్ఛ ఉంది. అయితే మీ జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌ను కొనసాగించలేరు. జీఎస్‌టీ అనేది పాన్ ఆధారితంగా ఉంటుంది. మీ కుమారుడి, మీ పాన్ వేర్వేరుగా ఉంటాయి కాబట్టి.. మీరు కొత్త జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌ను తీసుకోవాల్సి ఉంటుంది.

**? మా అనుమానాల నివృత్తి కోసం మిమ్మల్ని కలవవచ్చా. కన్సల్టెన్సీ ఫీజు ఎంత? చింతపిక్కలపై జీఎస్‌టీ ఎంత ఉండొచ్చు. హెచ్ఎస్ఎన్ కోడ్ ఎంత**

ముందస్తు అపాయింట్‌మెంట్ ద్వారా మీరు నన్ను కలవవచ్చు. కన్సల్టేషన్ ఛార్జీల గురించి నా ఆఫీసు వారిని అడగవచ్చు. చింతపిక్కలపై జీఎస్‌టీకి మినహాయింపు ఉంది. హెచ్ఎస్ఎన్ కోడ్ 1209.

**మీ సందేహాలు పంపండి**

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి.. మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగాను, సరళంగాను ఉండాలి.. మా చిరునామా

eenadubusinessdesk@gmail.com; businessdesk@eenadu.net

ఈనాడు బిజినెస్

# చితక్కొట్టుడు

సెన్సెక్స్ ▼ 793 | 38721

నిఫ్టీ ▼ 253 | 11559



## బేర్ దెబ్బకు బెంబేలు

- రుచించని బడ్జెట్
- కలసిరాని ప్రపంచ మార్కెట్లు
- బ్యాంకింగ్, వాహన షేర్లు విలవిల
- రూ.3 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరి
- అధిక సంపన్న వర్గానికి సర్‌ఛార్జీ పెంపుపై ఆందోళన

తొలి ఓటమిని ఎలాగైనా తిప్పికొట్టాలనే లక్ష్యంతో సోమవారం బరిలోకి దిగిన బుల్‌సేనకు నిరాశే ఎదురైంది. ఆరంభం నుంచే బేర్ జట్టు విరుచుకుపడింది. ఇద్దరు ఓపెనర్లు బడ్జెట్, విదేశీ పరిణామాలు బ్యాట్‌ను ఝుళిపించాయి. ముఖ్యంగా బడ్జెట్ అయితే దూకుడును పెంచింది. తన అమ్ములపొదిలో నుంచి పన్నుల పెంపు అస్త్రాన్ని మళ్లీ తీసింది. శుక్రవారం ఒక కోణంలో మాత్రమే చూపించిన ఆ షాట్‌ను ఈ సారి మూడు కోణాల్లో (అధిక సంపన్నుల ఆదాయపు పన్నుపై సర్‌ఛార్జీ పెంపు, ప్రజల కనీస వాటా 35 శాతం ఉండాలనే ప్రతిపాదన, బైబ్యాక్‌పై పన్ను విధింపు) ప్రయోగించింది. అంతే అప్పటి నుంచి స్కోరు వేగం ఎక్కడా ఆగకుండా పెరుగుతూనే పోయింది. మరో వైపు నుంచి విదేశీ పరిణామాలు కూడా అడపదడపా షాట్లు కొట్టడంతో బుల్ జట్టు బౌలర్లు బిక్కచచ్చిపోయారు. ఎంత మంది బౌలర్లను వాడినా ఫలితం మాత్రం అదే. ప్రధాన బౌలర్లు కూడా చేతులెత్తయడంతో వార్ వన్‌సైడ్ అయ్యింది.

### చినుకులా మొదలై..

బేర్ ధాటికి ఉదయం సెన్సెక్స్ భారీ నష్టంతో 39,476.38 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత మరింత విశ్వరూపం చూపడంతో ఒకానొక దశలో 908 పాయింట్ల నష్టంతో 38,605.48 స్థాయికి దిగివచ్చింది. చివరకు 792.82 పాయింట్లు నష్టపోయి 38,720.57 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 252.55 పాయింట్లు కోల్పోయి 11,559 వద్ద స్థిరపడింది. బేర్ జట్టుపై బుల్ జట్టు ఇంత భారీ మార్జిన్‌తో ఓడిపోవడం ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఇదే తొలిసారి.

### ఆ మూడు తక్క...

- సెన్సెక్స్ షేర్లలో మూడు మినహా మిగిలినవన్నీ భారీగా పరుగులను (నష్టాన్ని) సమర్పించుకున్నాయి. ఈ విషయంలో బజాజ్ ఫైనాన్స్ షేరు (8.18%) ముందు వరుసలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ఓఎన్‌జీసీ (5.43%), హీరోమోటోకార్ప్ (5.31%), మారుతీ సుజుకీ (5.21%), ఎన్‌టీపీసీ (4.98%), ఎల్‌అండ్‌టీ (4.14%) ఉన్నాయి.
- హెచ్‌డీఎఫ్‌సీ (0.77%), ఎస్‌బీఐ (4.14%), యాక్సిస్ బ్యాంక్ (2.84%) కూడా భారీగా పరుగులిచ్చిన వాటిల్లో ఉన్నాయి.
- యెస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్ షేర్లు మాత్రం ఇందుకు భిన్నంగా రాణించాయి.
- బీఎస్‌ఈలో 1,953 షేర్లు ప్రతికూలంగాను, 571 సానుకూలంగాను ముగిశాయి.
- బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు వరుసగా 2%, 1.47% మేర పతనమయ్యాయి.

### భారత్ X న్యూజిలాండ్..

**ప్రపంచకప్‌లో తొలి సెమీఫైనల్ నేడే.. అందరి దృష్టి ఇప్పుడు ఈ మ్యాచ్ పైనే**

అయితే అంతకుమించి సెమీఫైనల్ మ్యాచ్ సోమవారం జరిగింది..
ఎక్కడని ఆశ్చర్యపోతున్నారా..?
దలాల్ స్ట్రీట్ మైదానంలో.. బుల్, బేర్ జట్ల మధ్య.
బుల్ సేన జోరును ఎలాగైనా నిలువరించాలని కొన్నాళ్లుగా ఎదురుచూస్తోంది బేర్ జట్టు.
గత శుక్రవారం టీంలోకి బడ్జెట్ వచ్చి చేరింది..
దీంతో బేర్ సేనలో ఎక్కడలేని నవ్యోత్సాహం వచ్చింది.
పన్నుల పెంపు లాంటి కళ్లు బైర్లు కమ్మే షాట్‌లతో బుల్ జట్టును హడలెత్తించింది.
అదే ఉత్సాహాన్ని, ఊపునూ నిన్నటి మ్యాచ్ (సోమవారం నాటి మార్కెట్)లోనూ కొనసాగించింది. ఈసారైతే విశ్వరూపమే చూపింది.
బుల్ సేనలో ప్రధాన బౌలర్లయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ,
హీరోమోటోకార్ప్‌లను ఒక ఆటాడుకుంది.
భీకరమైన షాట్లాడి వాటి బౌలింగ్‌ను తుత్తినియలు చేసింది.
ఆ దెబ్బకు అన్ని రంగాల షేర్లూ భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి.
యెస్ బ్యాంక్, టీసీఎస్‌లు కాస్త మెరుగ్గానే బౌలింగ్ చేసినా ఫలితం లేకుండా పోయింది.
దాంతో బుల్ సేన వరుసగా రెండో ఘోరమైన ఓటమిని (నష్టం) చవిచూసింది.
బుల్ జట్టు విజయం సాధిస్తుందనే ఆశతో ధనప్రయాసలకోర్చి
వీక్షించడానికి వచ్చిన మదుపర్లకు రూ.3 లక్షల కోట్ల నష్టం మిగిలింది.

### అంతా చేసింది.. ఆ ఐదే..

బుల్‌సేన ఓటమికి ప్రధానంగా ఐదు అంశాలు దోహదం చేశాయి. అవేమిటంటే..

1. అధిక సంపన్న వర్గం చెల్లించే ఆదాయపు పన్నుపై సర్‌ఛార్జీ పెంపు ఓ ముఖ్య కారణం. ఈ నిర్ణయం వల్ల దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను భారం పెరుగుతుందని భావించి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు అమ్మకాలకు పూనుకున్నారు. అయితే సర్‌ఛార్జీ పెంపుపై ఎఫ్‌పీఐల్లో నెలకొన్న ఆందోళనను సీబీడీటీ బోర్డు పరిశీలించి, త్వరలోనే స్పష్టత ఇస్తుందని సీబీడీటీ ఛైర్మన్ ప్రమోద్ చంద్ర వెల్లడించారు. అయితే ఈ అంశంపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం లేదని మరికాసేపటికే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈ ప్రకటన అనంతరం అమ్మకాల ఒత్తిడి మరింత తీవ్రమయ్యింది.
2. కంపెనీల్లో కనీస ప్రజల వాటా 35 శాతానికి పెంచాలనే ప్రతిపాదన కూడా అమ్మకాల వైపు మొగ్గు చూపేలా చేసింది.
3. షేర్ల బైబ్యాక్‌పైన పన్ను విధింపు ప్రతిపాదన కూడా సెంటిమెంటును దెబ్బతీసింది.
4. వాహనాల విక్రయాలు తగ్గినప్పటికీ ఉత్పత్తి కోతను వాహన తయారీదార్లు కొనసాగించనున్నారనే వార్తల నేపథ్యంలో దిగ్గజ వాహన కంపెనీల షేర్లు నష్టపోవడమూ ప్రభావం చూపింది.
5. అమెరికా ఫెడ్ రేట్లను తగ్గించొచ్చన్న అంచనాలతో ప్రపంచ మార్కెట్లు నష్టాల్లో కదలాడటమూ మన మార్కెట్ నష్టాలకు కారణం.

**11%**

పీఎన్‌బీ షేరు సమర్పించుకున్న నష్టం. భూషణ్ పవర్ అండ్ స్టీల్ రుణ వ్యవహారానికి సంబంధించి రూ.3,800 కోట్ల మోసాన్ని గుర్తించడంతో షేరు ఒత్తిడికి లోనయ్యింది. బీఎస్‌ఈలో 10.95% క్షీణించి రూ.72.80 వద్ద ముగిసింది.

**5%**

మారుతీ సుజుకీ షేరుకు వచ్చిన నష్టం. వరుసగా ఐదో నెలా వాహనాల తయారీని నిలిపివేడయమే ఇందుకు కారణం. బీఎస్‌ఈలో 5.21% క్షీణించి రూ.6,033.15 వద్ద ముగిసింది.

**రూ.5,00,000 కోట్లు**

స్టాక్ మార్కెట్ భారీ పతనంతో మదుపర్ల సంపద దాదాపు రూ.3 లక్షల కోట్ల వరకు ఆవిరయ్యింది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువను మదుపర్ల సంపదగా పరిగణిస్తారు. సోమవారం ఈ విలువ రూ.3,39,192.97 కోట్ల మేర తగ్గి రూ.1,47,96,302.89 కోట్లకు పరిమితమైంది. శుక్రవారం నాటి నుంచి చూస్తే గత రెండు ట్రేడింగ్ రోజుల్లో మదుపర్ల సంపద రూ.5,61,772.64 కోట్లు క్షీణించడం గమనార్హం.

**10%**

మైండ్‌ట్రీ షేరు పతనం. కంపెనీ వ్యవస్థాపకులైన కృష్ణకుమార్ నటరాజన్, పార్థసారథి ఎన్.ఎస్, రోస్తో రావణన్‌లు కంపెనీ బోర్డు, ఎగ్జిక్యూటివ్ పదవులకు రాజీనామా చేయడం ఇందుకు దారితీసింది. బీఎస్‌ఈలో 10.43% క్షీణించి రూ.773.95 వద్ద స్థిరపడింది.

## 2020కి విద్యుత్, హైబ్రిడ్ వాహన విక్రయాల లక్ష్యం 60-70 లక్షలు



దిల్లీ: నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ మిషన్ ప్లాన్ (ఎన్‌ఈఎంఎంపీ) కింద 2020 నాటికి 60- 70 లక్షల హైబ్రిడ్, విద్యుత్ వాహన విక్రయాలను సాధించడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడించింది. విద్యుత్ వాహనాల అమ్మకాలు పెంచడం, తయారీ ప్రోత్సాహించడం కోసం ప్రభుత్వం ఎన్‌ఈఎంఎంపీ 2020ని రూపొందించింది. ఫేమ్ ఇండియా మొదటి దశ తర్వాత.. విద్యుత్ వాహనాలకు అవసరమైన ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కొరతను గుర్తించామని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి అరవింద్ సావంత్ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

## హీరో బైకులు, స్కూటర్ల ధరలు ప్రియం



దిల్లీ: అన్ని మోటార్‌సైకిళ్లు, స్కూటర్ల ధరలను 1 శాతం వరకు పెంచినట్లు ద్విచక్రవాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ ప్రకటించింది. పెంచిన ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. ఎక్స్-షోరూమ్ ధరలపై 1% పెంపు ఉంటుందని, అయితే వివిధ విపణులు, మోడల్ ఆధారంగా ధరల పెంపు ఉంటుందని వెల్లడించింది. ధరల పెంపునకు కారణాలను వివరించలేదు.

## ఆర్థిక వ్యవస్థ బుల్లెట్ రైలులా పరుగెడుతుంది: సిన్హా



దిల్లీ: ఆర్థిక వ్యవస్థను భాజపా ప్రభుత్వం గాడిలో పెట్టిందని మాజీ కేంద్ర మంత్రి జయంత్ సిన్హా పేర్కొన్నారు. భాజపా ఆర్థిక వ్యవస్థను సూపర్‌ఫాస్ట్ రైలు 'రాజధాని'గా మలిచిందని, త్వరలో బుల్లెట్ రైలులా పరుగెడుతుందని వెల్లడించారు. 5 ట్రిలియన్ డాలర్ల (రూ.350 కోట్లు) ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని కేంద్రం అందుకుంటుందని, అంతే కాకుండా 10 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని సైతం అధిగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ 60 ఏళ్లలో సాధించలేనిది, భాజపా 60 నెలల్లో సాధించిందని అన్నారు.

## సిండికేట్ బ్యాంక్ గృహరుణ పథకం



దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకు సిండికేట్ బ్యాంక్ 'సిండ్‌నివాస్ టేకోవర్ ధమాకా' పేరుతో గృహరుణ పథకాన్ని ప్రకటించింది. ఇతర బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, హెచ్‌ఎఫ్‌సీల్లో ఉన్న ప్రస్తుత గృహరుణాలను టేకోవర్ చేయడమే ఈ పథకం లక్ష్యమని బ్యాంక్ ఎండీ, సీఈఓ మృత్యుంజయ్ మహాపాత్ర అన్నారు. జులై 1న ప్రారంభమైన ఈ పథకం, సెప్టెంబరు 30న ముగియనుంది. గృహరుణ వడ్డీ రేటును 8.65 శాతంగా నిర్ణయించింది. రుణ చెల్లింపు వ్యవధిని 30 ఏళ్లకు పొడిగించింది.

## కార్‌దేఖో 2000 నియామకాలు



దిల్లీ: వాహన పోర్టల్ కార్‌దేఖో గ్రూప్ విస్తరణ ప్రణాళికలు ప్రకటించింది. ఇందులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2000 మందిని నియమించుకోనున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా వివిధ విభాగాల్లో టెక్, నాన్-టెక్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించింది. బీమా, ఫిన్‌టెక్, రిటైల్, డిజిటల్ విభాగాల్లో మధ్య నుంచి సీనియర్ స్థాయి పదవుల్లో కార్‌దేఖో నియామకాలు చేపట్టనుంది. వివిధ నగరాల్లో బీ2బీ, ఛానెల్ కార్యకలాపాలు కోసం నాన్-టెక్ స్థానాలను 50 శాతం భర్తీ చేయనుంది. ఫైనాన్స్, బీమా విభాగాల్లోని బీ2బీ వ్యాపారం కోసం 1000 మందిని నియమించుకోనున్నామని కార్‌దేఖో సహవ్యవస్థాపకుడు, సీఈఓ అమిత్ జైన్ అన్నారు. ఈ ఏడాది చివరికి దాదాపు 150 కార్‌దేఖో గాడీ విక్రయశాలలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కంపెనీలో 2800కి పైగా ఉద్యోగులు ఉన్నారు.

## బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు రూ.1650 కోట్ల జరిమానా!

- 5 లక్షల మంది ప్రయాణికుల డేటా ఉల్లంఘన కేసు
- బ్రిటన్ డేటా నియంత్రణ సంస్థ హెచ్చరిక



లండన్: 5 లక్షల మంది ప్రయాణికుల డేటా ఉల్లంఘనకు సంబంధించి బ్రిటిష్ ఎయిర్‌వేస్ (బీఏ)కు 183 మిలియన్ పౌండ్ల (సుమారు రూ.1650 కోట్ల) జరిమానా విధించాలని యోచిస్తున్నట్లు బ్రిటన్ డేటా నియంత్రణ సంస్థ పేర్కొంది. నూతన డేటా నిబంధనల ప్రకారం ఇదే అధికమొత్తం జరిమానాగా చెప్పొచ్చు. హ్యాకింగ్ బారిన పడినట్లు గత సెప్టెంబరులో బీఏ ప్రకటించిన సంగతి విదితమే. బీఏ వెబ్‌సైట్‌ను బ్రౌజ్ చేయాలని ప్రయత్నించిన ఖాతాదారులు నకిలీ వెబ్‌సైట్‌కు చేరారు. అక్కడ వారు నమోదు చేసిన క్రెడిట్‌కార్డుల వివరాలు అక్రమార్కుల చేతికి చిక్కాయి. 'పౌరుల వ్యక్తిగత సమాచారం వారికి మాత్రమే చెందినది. వాటిని పరిరక్షించడంలో సంస్థ విఫలమైనపుడు, సంబంధిత పౌరులకు జరిగే నష్టం, వారి నగదు అపహరణ వంటివి అసౌకర్యం కంటే తీవ్రమైనవి' అని ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఎలిజబెత్ డెన్‌హామ్ పేర్కొన్నారు. 'మీరు పౌరుల సమాచారాన్ని సేకరిస్తున్నప్పుడు, పూర్తిగా బాధ్యత వహించాలి. మేము ప్రతిపాదించిన జరిమానా బీఏ వార్షిక టర్నోవర్‌లో 1.5 శాతానికి సమానం. ఇంత భారీమొత్తంలో ఎప్పుడూ జరిమానా ఎవరికీ విధించలేదు. డేటా పరిరక్షణకు నూతన నిబంధనలను ఐరోపా సమాఖ్య అమల్లోకి తెచ్చిన ఏడాది కాలంలో, ఈ ప్రతిపాదన చేశాం' అని వివరించారు.

- డేటా సంరక్షణకు సంబంధించి బీఏ భద్రతా ప్రమాణాలు పేలవంగా ఉన్నాయని గుర్తించారు. పేరు, చిరునామా, ప్రయాణతేదీ వివరాలు, లాగిన్ వివరాలు, కార్డుల వివరాలు కూడా సులభంగా అక్రమార్కులకు చేరాయి.

## సర్‌ఛార్జీపై త్వరలో స్పష్టత: సీబీడీటీ

దిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల(ఎఫ్‌పీఐ)పై పన్ను రేటు పెంపు విషయంలో వెల్లువెత్తుతున్న ఆందోళనల నేపథ్యంలో త్వరలోనే వీటిపై స్పష్టత ఇవ్వనున్నట్లు ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు(సీబీడీటీ) ఛైర్మన్ పీసీ మోడీ పేర్కొన్నారు. త్వరలోనే స్పష్టత ఇస్తారా లేదా పార్లమెంటులో బడ్జెట్‌పై చర్చ అనంతరం ఇస్తారా అన్నదానిపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ 'ప్రస్తుతానికి అంత అవసరం ఉందని అనుకోవట్లేద'ని అన్నారు. ధనవంతులపై పెంచిన సర్‌ఛార్జీ కారణంగా భారత్‌లో పెట్టుబడులు పెడుతున్న విదేశీ ఫండ్‌లపైనా ప్రభావం పడే అవకాశం ఉంది. ఎందుకంటే వ్యక్తులకు, హిందూ అవిభాజ్య కుటుంబాల(హెచ్‌యూఎఫ్)కు, అసోసియేషన్స్ ఆఫ్ పర్సన్స్(ఏఓపీలు)కు ఒక పన్ను నమూనా ఉంది. కొంత మంది ఎఫ్‌పీఐలు ట్రస్ట్ నమూనాను అనుసరిస్తారు కాబట్టి వారు ఏఓపీల కిందకు వచ్చే అవకాశం ఉంది. 'ఈ అంశం మా దృష్టికి వచ్చింది. త్వరలోనే దీనిపై స్పష్టత ఇస్తామ'ని సోమవారమిక్కడ జరిగిన అసోచామ్ కార్యక్రమంలో మోడీ అన్నారు. సర్‌ఛార్జీపై ఆందోళనలతో పాటు ఇతరత్రా బడ్జెట్ ప్రతిపాదనల నేపథ్యంలో సోమవారం స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయిన సంగతి తెలిసిందే.

## న్యూస్‌ప్రింట్‌పై కస్టమ్స్ సుంకం ఉపసంహరించాలి: ఐఎన్‌ఎస్

ఈనాడు, దిల్లీ: పత్రికలు ముద్రణకు వినియోగించే న్యూస్‌ప్రింట్, అన్‌కోటెడ్ పేపర్, మేగజీన్ల ముద్రణకు వినియోగించే లైట్ వెయిట్ కోటెడ్ పేపర్లపై విధించిన 10శాతం కస్టమ్స్ డ్యూటీని తక్షణమే ఉపసంహరించాలని ద ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐఎన్‌ఎస్) కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రకటన రెవెన్యూ తగ్గడం, ధరల పెరుగుదల, డిజిటలీకరణలతో పత్రికలు, మేగజీన్లు ముద్రించే ప్రచురణకర్తలు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారని పేర్కొంది. చిన్న, మధ్యతరహా పత్రికలు తీవ్రమైన నష్టాల్లో కూరుకొని చాలా వరకూ మూతపడ్డాయని తెలిపింది. దేశవ్యాప్తంగా ఏటా న్యూస్‌ప్రింట్ వినియోగం 2.50 మిలియన్ల టన్నులు ఉండగా దేశీయంగా ఒక మిలియన్ టన్ను మాత్రమే ఉత్పత్తి అవుతోందని తెలిపింది. అన్‌కోటెడ్, లైట్ వెయిట్‌కోటెడ్ పేపరును దేశీయంగా ఎవరుఉత్పత్తి చేయడం లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం చొరవ చూపి భారత వార్తాపత్రికల పరిశ్రమను కాపాడాలని, కస్టమ్స్ డ్యూటీని ఉపసంహరించుకోవాలని కేంద్రానికి సోమవారం ప్రకటనలో ఐఎన్‌ఎస్ విజ్ఞప్తి చేసింది.

## సార్వభౌమ బాండ్లతో మంచి ప్రయోజనాలు

- జారీపై ప్రభుత్వంతో చర్చిస్తాం
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



దిల్లీలో ఆర్‌బీఐ బోర్డుతో సోమవారం సమావేశమైన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. చిత్రంలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్

దిల్లీ

విదేశీ కరెన్సీ రూపంలో నిధుల సమీకరణ కోసం ప్రతిపాదించిన సార్వభౌమ బాండ్లపై ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్ తెలిపారు. ద్రవ్యలోటు లక్ష్యాన్ని ప్రస్తుత స్థాయి కంటే తగ్గించాలన్న ప్రభుత్వ ప్రణాళికను దాస్ స్వాగతించారు. ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు ఇది ఉపయోగ పడుతుందని తెలిపారు. బడ్జెట్ ముగిశాక, ఆర్‌బీఐ బోర్డుతో ఆర్థిక మంత్రి సమావేశమవ్వడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ఆర్‌బీఐ బోర్డుతో సమావేశమయ్యారు. అనంతరం దాస్ మాట్లాడుతూ విదేశాల్లో విడుదల చేయాలని తలపెట్టిన బాండ్లపై ప్రభుత్వంతో చర్చించి, అవసరమైన ప్రక్రియ చేపడతామని చెప్పారు. 'ద్రవ్యలోటును జీడీపీలో 3.4 శాతం నుంచి 3.3 శాతానికి తగ్గించాలనుకోవడం హర్షణీయం. పరిశ్రమలకు ఇది సానుకూల పరిణామం. ప్రైవేటు రంగం పెట్టుబడుల కోసం మరింత రుణాలు చేసే వీలుంటుంది. గత అయిదేళ్లుగా కూడా ప్రభుత్వం ద్రవ్యలోటు తగ్గించేందుకు కృషిచేస్తోంది. జీడీపీలో 4.5 శాతంతో ప్రారంభించి, 3.3 శాతానికి వస్తోంది. స్థూల ఆర్థిక గణాంకాలకు ఇది ఎంతో మేలు చేస్తుంది' అని ఆర్‌బీఐ గవర్నర్ వివరించారు.

- ద్రవ్యలోటు (ఖర్చులు, ఆదాయం మధ్య తేడా)ను పూడ్చుకునేందుకు దేశీయ విపణి నుంచి నిధుల సమీకరణను కొంతమేరకు తగ్గించుకునేందుకు విదేశీ బాండ్లు దోహద పడతాయి. ప్రభుత్వం తరపున ఆర్‌బీఐ ఈ బాండ్లను జారీ చేస్తుంది.
- 2020-21 నాటికి ద్రవ్యలోటును జీడీపీలో 3 శాతానికి పరిమితం చేయాలన్నది ప్రభుత్వ ప్రతిపాదన.

### అదనపు బాధ్యతలపై..

గృహరుణ కంపెనీల (హెచ్‌ఎఫ్‌సీ)నూ నియంత్రించాల్సిన అదనపు బాధ్యత ఆర్‌బీఐపై పెట్టడాన్ని ప్రస్తావిస్తూ, దీనిపై ప్రభుత్వంతో విస్తృత చర్చలకు తోడు, ఆర్‌బీఐతోనూ మాట్లాడాకే ఈ నిర్ణయం వెలువడుతుందని దాస్ తెలిపారు. ప్రభుత్వం ఆశించిన లక్ష్యాన్ని నెరవేర్చడంలో ఆర్‌బీఐ ముందుంటుందని స్పష్టం చేశారు. సహకార బ్యాంకులకు నిబంధనలను ఆర్‌బీఐ రూపొందిస్తుంటే, పర్యవేక్షణను నాబార్డ్ చేస్తోందని గుర్తుచేశారు. ఇదేవిధంగా హెచ్‌ఎఫ్‌సీలకు నిబంధనలను ఆర్‌బీఐ రూపొందిస్తే, పర్యవేక్షణను నేషనల్ హౌసింగ్ బ్యాంక్ చేస్తుందన్నారు.

### ఖాతదార్లకు త్వరగా రేట్లకోత బదలాయింపు

కీలకరేట్లను వరుసగా మూడోసారి ఆర్‌బీఐ తగ్గించిన నేపథ్యంలో, ఆ ప్రయోజనాన్ని బ్యాంకులు సత్వరం తమ ఖాతాదార్లకు బదలాయిస్తాయని ఆశిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ఇందువల్ల వ్యక్తిగత, గృహ, వాహన రుణ రేట్లు అదుపులోకి వస్తాయని పేర్కొన్నారు. 'జూన్ 6 నాటి పరపతి విధాన కమిటీ సమావేశానికి ముందే 50 బేసిస్‌పాయింట్లను ఆర్‌బీఐ తగ్గించింది. అందులో 21 బేసిస్ పాయింట్ల ప్రయోజనాన్ని బ్యాంకులు తమ ఖాతాదార్లకు బదలాయించాయి. గతంలో రెపోరేటు ప్రయోజనాన్ని ఖాతాదార్లకు బదలాయించేందుకు బ్యాంకులు 6 నెలలు సమయం తీసుకునేవి. ఇప్పుడు 2-3 నెలలకే చేయడం హర్షణీయం. గత నెలలో మరో 25 బేసిస్ పాయింట్ల మేర ఆర్‌బీఐ తగ్గించింది. అంటే మొత్తం 75 బేసిస్‌పాయింట్ల మేర బ్యాంకులకు ప్రయోజనం ఏర్పడింది. బ్యాంకులు మొత్తంమీద ఎంత ప్రయోజనాన్ని ఖాతాదార్లకు కల్పిస్తున్నాయనే సమాచారాన్ని సేకరిస్తున్నాం' అని దాస్ వివరించారు.

### నగదు చాలినంత ఉంది

వ్యవస్థలో నగదు లభ్యత చాలినంత ఉందని ఆర్‌బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. ఏదైనా బ్యాంకుకు కనుక నగదు కొరత ఎదురైతే, అందించేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా ఉందని తెలిపారు. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లను ఆర్‌బీఐ పర్యవేక్షిస్తోందని, ఇంధన ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణంపై వెంటనే ప్రభావం ఉండదని వివరించారు.

# ఛాంపియన్

● రెండు జట్ల మధ్య లీగ్ మ్యాచ్ వర్షం వల్ల రద్దయింది

● న్యూజిలాండ్‌తో చివరి పది వన్డేల్లో భారత్ 7 నెగ్గింది. రెండు కివీస్ గెలిచింది. ఒక మ్యాచ్ రద్దయింది. చివరగా కివీస్‌తో దాని సొంతగడ్డపై జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ 4-1తో గెలిచింది.

**647** ఈ ప్రపంచకప్‌లో రోహిత్ పరుగులు. సగటు 92.42. అతను 5 సెంచరీలు చేశాడు. రోహితే టోర్నీ టాప్‌స్కోరర్. విలియమ్సన్ 96.2 సగటుతో 481 పరుగులు చేసి కివీస్ టాప్‌స్కోరర్‌గా కొనసాగుతున్నాడు.




ప్రపంచకప్ తొలి సెమీఫైనల్ నేడే

మధ్యాహ్నం 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

# కోరుకున్న జట్టే.. కొట్టేయండి!

మొన్న ప్రపంచకప్ చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తల పడుతుంటే.. అర్ధరాత్రి దాటాక కూడా భారత అభిమానులంతా ఆసక్తిగా మ్యాచ్ చూశారు. సఫారీ జట్టు గెలుపు బాటలో సాగుతుంటే సంతోషించారు. ఆస్ట్రేలియా పోటీలోకి వస్తే కంగారు పడ్డారు. చివరికి దక్షిణాఫ్రికానే గెలిస్తే హమ్మయ్య అనుకున్నారు.

ఆడిన 8 మ్యాచ్‌ల్లో సాధించిన విజయాలు అయిదు.. ఆ విజయాలు కూడా తన కంటే బలహీనమైన జట్లపై సాధించినవి.. అదృష్టం కలిసొచ్చి కష్టం మీద సెమీస్ చేరింది.. కెప్టెన్‌ను మినహాయిస్తే బ్యాటింగ్ బలహీనం.. టీమ్ ఇండియాతో ముఖాముఖిలో వెనుకంజే.. చివరగా మన జట్టుతో జరిగిన సిరీస్‌లో చిత్తుగా ఓడింది. అన్నిటికీ మించి ప్రపంచకప్ సెమీఫైనల్స్‌లో పేలవ రికార్డు.. ఇదీ ప్రత్యర్థి పరిస్థితి!

అందుకే అభిమానులంతా న్యూజిలాండే మన సెమీస్ ప్రత్యర్థి కావాలని ఆశించారు. ఆశలు ఫలించాయి. కోరుకున్న జట్టుతోనే సెమీస్. కొన్నేళ్ల ఫామ్, టోర్నీలో ప్రదర్శన, బలాబలాలు.. ఇలా ఏ కోణంలో చూసినా ఒక మెట్టు పైనే ఉన్న కోహ్లీసేన, కివీస్‌ను కొట్టి ఫైనల్లో అడుగు పెట్టడం లాంఛనమే కావాలి!

కానీ ప్రత్యర్థిని తేలిగ్గా అంచనా వేస్తే ఏమవుతుందో టోర్నీలో భారత్‌కు మహా బాగా అనుభవమే. తనదైన రోజు అఫ్గానిస్థాన్ సైతం టీమ్‌ఇండియాను భయపెట్టింది. కాబట్టి ఎంతమాత్రం ఉదాసీనత దరిచేరనివ్వకుండా, పూర్తి సామర్థ్యం మేరకు ఆడటమే కోహ్లీసేనకు సవాల్! ఈ సవాల్‌ను ఛేదిస్తే మనకు, కప్‌కు మధ్య మిగిలేది ఒక్క అడుగే!




## న్యూజిలాండ్‌తో భారత్ అమీతుమీ

## ఫేవరెట్ కోహ్లీసేనే.. కివీస్‌తో తేలికేం కాదు

మాంచెస్టర్

బౌలింగ్‌లో భారత్, కివీస్ బలాబలాలు దాదాపు సమానం! బ్యాటింగ్‌లో మాత్రం భారత్‌ది స్పష్టమైన పైచేయి. టాప్‌ఆర్డరే భారత్‌కు అతి పెద్ద బలం. రోహిత్ కెరీర్లోనే అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నాడు. అతడి భాగస్వామి రాహుల్ మ్యాచ్ మ్యాచ్‌కూ మెరుగవుతున్నాడు. కోహ్లి సెంచరీ కొట్టలేదన్న మాటే కానీ మంచి లయతో ఉన్నాడు. ఈ ముగ్గురిలో ఇద్దరాడితే భారత్‌కు తిరుగుండదు. అయితే బ్యాటింగ్‌లో భారత్ ఆందోళనంతా మిడిలార్డర్ గురించే. ఇప్పటిదాకా ఏ మ్యాచ్‌లోనూ 'మిడిల్' సాధికారతతో ఆడలేదు. ధోని ఇక ఆడేది ఒకటో రెండో మ్యాచ్‌లు. వాటిలో తనదైన ముద్ర వేసి కెరీర్‌ను ముగించాలన్నది అభిమానుల ఆకాంక్ష. పంత్, పాండ్య మంచి లయతోనే కనిపిస్తున్నా.. వారి నుంచి జట్టు పెద్ద ఇన్నింగ్స్‌లు ఆశిస్తోంది. లీగ్ దశలో చెల్లిపోయింది కానీ.. నాకౌట్‌లో టాప్‌ఆర్డర్ విఫలమైతే మిడిలార్డర్ ఏమేరకు జట్టును నిలబెడుతుందన్నది ప్రశ్న. భారత్‌ను మిడిలార్డర్ ఎలా తలనొప్పిగా మారిందో.. కివీస్‌ను ఓపెనర్ల వైఫల్యం అలా వేధిస్తోంది. గప్టిల్ (8 మ్యాచ్‌ల్లో 166 పరుగులు), మన్రో (125) పేలవ ప్రదర్శన చేస్తున్నారు. ఇప్పటి దాకా వీళ్లిద్దరిలో ఒక్కరూ పెద్ద ఇన్నింగ్స్ ఆడలేదు. దీంతో విలియమ్సన్‌పై చాలా భారం పడుతోంది. సెమీస్‌లో అయినా వీరు చెలరేగాలని కివీస్ కోరుకుంటోంది.

**మనకు మిడిలార్డర్.. వాళ్లకు ఓపెనర్లు!**

## అతణ్ని పడగొట్టాలి.. ఇతణ్ని అడ్డుకోవాలి...

స్ఫూర్తిమంతమైన కెప్టెనే ప్రత్యర్థికి అతి పెద్ద బలం. గ్రూప్ దశలో కివీస్ విజయాల్లో అత్యంత కీలక పాత్ర పోషించిన విలియమ్సన్‌కు కళ్లెం వేస్తే కివీస్ అవకాశాల్ని దెబ్బ తీసినట్లే. ఓపెనర్లు ఘోరంగా విఫలమవుతున్నప్పటికీ.. వికెట్ పడగానే క్రీజులోకి వచ్చి మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్‌తో భాగస్వామ్యాలు నెలకొల్పడం ద్వారా జట్టును నిలబెడుతూ వచ్చాడు కేన్. మధ్య ఓవర్ల వరకు కేన్‌ను ఉండనిస్తే భారీ ఇన్నింగ్స్ ఆడేస్తాడు. ఇక ఫామ్‌లో లేని ఓపెనర్లు గప్టిల్, మన్రోలను బుమ్రా, షమి ఆరంభంలో ఒత్తిడికి గురి చేస్తే వికెట్లు వచ్చేస్తాయి. కివీస్ మిడిలార్డర్ కూడా ఏమంత మంచి ఫామ్‌లో లేదు కానీ.. ఆ జట్టుకు లోతైన బ్యాటింగ్ బలం ఉండటం కలిసొచ్చే అంశం. లోయర్ మిడిలార్డర్లో నీషమ్, గ్రాండ్‌హోమ్, శాంట్నర్ లాంటి ప్రమాదకారులున్నారు. ఇక కివీస్ బౌలింగ్‌లో బౌల్ట్ అందరికంటే ప్రమాదకారి. వేగం, కచ్చితత్వం ఉండే బౌల్ట్ బౌలింగ్‌ను ఆడటం అంత సులువు కాదు. తొలి స్పెల్‌లో అతడిని జాగ్రత్తగా ఆడుకోవాలి. ఇక పెద్దగా అంచనాల్లేకుండా టోర్నీలోకి వచ్చిన ఫెర్గూసన్.. బౌల్ట్ (15 వికెట్లు) కన్నా ఎక్కువగా 17 వికెట్లు పడగొట్టాడు. హెన్రీ కూడా కివీస్ బౌలింగ్ బలాన్ని పెంచేవాడే. ఐపీఎల్‌లో భారత బ్యాట్స్‌మన్ ఆట తీరును బాగా చదివేసిన స్పిన్నర్ శాంట్నర్‌తో మధ్య ఓవర్లలో జాగ్రత్తగా ఉండాల్సిందే.

## వర్షం వస్తే..?

ప్రపంచకప్‌లో సెమీస్, ఫైనల్‌కు రిజర్వ్‌డేలు ఉన్నాయి. వర్షం వల్ల తొలి రోజు మ్యాచ్ జరగకపోయినా, పూర్తి కాకపోయినా.. తర్వాతి రోజు ఆడిస్తారు. అప్పటికీ ఫలితం తేలకపోతే గ్రూప్ దశలో ఎక్కువ పాయింట్లున్న జట్టు ముందంజ వేస్తుంది. ఈ లెక్కన కివీస్‌తో సెమీస్ (11 పాయింట్లు) జరగకపోతే భారతే (15 పాయింట్లు) ఫైనల్ చేరుతుంది. మాంచెస్టర్‌లో సోమవారం జల్లులు పడ్డాయి. మ్యాచ్ రోజు కూడా వర్షం పడొచ్చు. రిజర్వ్ డే అయిన బుధవారం భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో మంగళవారం ఆట సాగకుంటే ఫలితం తేలడం కష్టమే. ఒకవేళ మ్యాచ్ టై అయితే సూపర్ ఓవర్ ఆడిస్తారు.

## పిచ్

ఓల్డ్‌ట్రాఫోర్డ్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలం. టోర్నీలో ఇక్కడ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ గెలిచింది. పాక్‌పై ఇక్కడే భారత్ 336 పరుగుల భారీ స్కోరు సాధించింది. మూడు రోజుల కిందట ఇక్కడ ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మ్యాచ్‌లో 640 పరుగులు నమోదయ్యాయి. అయితే మబ్బులు కమ్మిన వాతావరణంలో ఇక్కడ బ్యాటింగ్ కష్టమని భారత్, వెస్టిండీస్ మ్యాచ్‌లో రుజువైంది. ఆ మ్యాచ్‌లో భారత్ 268 పరుగులే చేయగా.. విండీస్ దాదాపు సగం స్కోరుకే ఆలౌటైంది. సెమీఫైనల్ సందర్భంగా పిచ్ కొంచెం నెమ్మదిగానే ఉండి ఓ మోస్తరు స్కోర్లే నమోదవచ్చు. పేసర్లు, స్పిన్నర్లకు పిచ్ సమానంగా సహకరించొచ్చు.

## టాస్ నెగ్గితే గెలిచినట్లే..

టాస్ గెలిస్తే సగం మ్యాచ్ గెలిచినట్లే. గ్రూప్ దశలో ఫలితాల్ని బట్టి చూస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. మొదట బ్యాటింగ్ చేసిన జట్లే మెజారిటీ విజయాలందుకున్నాయి. లీగ్ దశలో 41 మ్యాచ్‌లు (4 రద్దయ్యాయి) జరగ్గా.. అందులో మొదట బ్యాటింగ్ చేసిన జట్లే 27 నెగ్గాయి. ఛేదనలో వచ్చిన విజయాలు 14 మాత్రమే. మ్యాచ్ వేదిక ఓల్డ్‌ట్రాఫోర్డ్‌లో ఐదు మ్యాచ్‌లు జరగ్గా మొదట బ్యాటింగ్ చేసిన జట్టే అన్నింట్లో గెలిచింది. టోర్నీలో 250కి పైగా లక్ష్యాల ఛేదన రెండుసార్లే జరిగింది. కాబట్టి వాతావరణం మరీ మబ్బులు కమ్మి ఉంటే తప్ప సెమీస్‌లో టాస్ గెలిస్తే బ్యాటింగ్ ఎంచుకునే అవకాశాలే ఎక్కువ.

## తుది జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్, రాహుల్, కోహ్లి, పంత్, ధోని, పాండ్య, కుల్‌దీప్, చాహల్, జడేజా/భువనేశ్వర్, బుమ్రా, షమి

**న్యూజిలాండ్:** గప్టిల్, మన్రో, విలియమ్సన్, టేలర్, లేథమ్, నీషమ్, గ్రాండ్‌హోమ్, శాంట్నర్, హెన్రీ, బౌల్ట్, ఫెర్గూసన్

## ముగ్గురు స్పిన్నర్లు

పిచ్ స్పిన్నర్లకు అనుకూలించే అవకాశం ఉన్న నేపథ్యంలో జడేజాతో కలిపి ముగ్గురు స్పిన్నర్లను భారత్ ఆడించే అవకాశముంది. కార్తీక్ స్థానంలో చాహల్ జట్టులోకి రావచ్చు. భువనేశ్వర్ బదులు షమిని ఎంచుకునే అవకాశాలే ఎక్కువ.

**17** బుమ్రా వికెట్లు. భారత జట్టులో అత్యధిక వికెట్ల వీరుడు అతనే. న్యూజిలాండ్ జట్టులో ఫెర్గూసన్ కూడా 17 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు.

## కోహ్లి × విలియమ్సన్

ఒకరిలో దూకుడు ఎక్కువ. మరొకరికి ఓపిక అధికం. కాకపోతే ఇద్దరి దాహం ఒక్కటే.. పరుగులు! ఆ ఇద్దరే విరాట్ కోహ్లి.. కేన్ విలియమ్సన్. ఆటతీరు, శైలి ప్రకారం భిన్న ధ్రువాలైన కోహ్లి, కేన్‌లే తొలి సెమీస్‌లో ఇరుజట్లకు అత్యంత కీలకం. కోహ్లి బ్యాటింగ్ నైపుణ్యం గురించి కొత్తగా చెప్పాల్సిన పని లేదు. వన్డే చరిత్రలోనే అతను అత్యంత గొప్ప బ్యాట్స్‌మన్‌గా ఇప్పటికే పేరు సంపాదించాడు. ఏ బ్యాట్స్‌మెన్‌కూ లేని విధంగా ఛేదనలో ఘనమైన రికార్డుండటం అతడి ప్రత్యేకత. ప్రస్తుత టోర్నీలో కోహ్లి ఇప్పటికే 63.14 సగటుతో 442 పరుగులు రాబట్టాడు. 5 అర్ధ సెంచరీలు చేశాడు. ప్రపంచకప్‌లో సెంచరీ లోటును సెమీస్‌లో తీరుస్తాడేమో చూడాలి. ఇక విలియమ్సన్‌ది కోహ్లికి పూర్తిగా భిన్నమైన శైలి. అతను నెమ్మదస్తుడు. కివీస్ బ్యాటింగ్‌కు వెన్నుముక అతడే. 2015 ప్రపంచకప్ నుంచి ఇప్పటిదాకా విలియమ్సన్ 71 వన్డేలాడాడు. అందులో 44 సార్లు తొలి ఐదు ఓవర్లలోనే బ్యాటింగ్‌కు రావడం గమనార్హం. కివీస్ ఓపెనింగ్ జోడీ బలంగా లేకపోయినా వన్‌డౌన్‌లో కేన్ పెట్టని గోడ. ప్రపంచకప్‌లోనూ అది మరోసారి రుజువైంది. పరిస్థితుల్ని అర్థం చేసుకోవడం.. పిచ్‌ను వేగంగా చదవడం విలియమ్సన్ ప్రత్యేకత. ఎలాంటి షాట్లు ఆడాలి.. ఏ బౌలర్‌ను లక్ష్యం చేసుకోవాలని అప్పటికప్పుడు నిర్ణయించుకుని ఆడతాడు. తెలివిగా బ్యాటింగ్ చేస్తూ భాగస్వామ్యాలు అల్లుతాడు. 150 ఆటగాళ్లు బరిలో దిగిన ఈకప్‌లో అత్యధిక సగటు కేన్ (96.2)దే కావడం విశేషం.

## రోహిత్ × టేలర్




ఓపెనర్‌గా వచ్చే రోహిత్ శర్మ.. నాలుగో స్థానంలో బరిలో దిగే రాస్ టేలర్‌లు ఇరుజట్ల బ్యాటింగ్‌కు మూలస్తంభాలు. ఇన్నింగ్స్‌ను నెమ్మదిగా ఆరంభించి.. తర్వాత చెలరేగిపోవడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. పేస్, స్పిన్‌ను సమర్థంగా ఆడలగరు. ప్రపంచకప్‌లో రోహిత్ అద్భుతమైన ఫామ్‌లో ఉండటం టీమ్‌ఇండియాకు సానుకూలాంశం. 8 మ్యాచ్‌ల్లో 92.42 సగటుతో 655 పరుగులు సాధించాడు. అందులో 5 సెంచరీలు, ఒక అర్ధ సెంచరీ ఉన్నాయి. టేలర్ 37.28 సగటుతో 261 పరుగులు మాత్రమే సాధించాడు. 2 అర్ధ సెంచరీలు చేశాడు. పరుగుల వేటలో ముందున్న రోహిత్.. ఫామ్‌తో ఇబ్బందులు పడుతున్న టేలర్‌లలో ఎవరు మెరుస్తారో మరి!

## ధోని × లేథమ్




వికెట్ కీపర్లు ధోని, లేథమ్‌లకు పోలికే లేదు. అనుభవం.. బ్యాటింగ్.. కీపింగ్ నైపుణ్యంలో ధోని ఎన్నో రెట్లు ముందున్నాడు. ప్రపంచంలో అత్యుత్తమ ఫినిషర్ కూడా. మైదానంలో కెప్టెన్ కోహ్లీకి కొండంత అండ. ప్రస్తుత కప్‌లో ధోని బాధ్యతాయుతంగా ఆడుతున్నాడు. 8 మ్యాచ్‌ల్లో 44.60 సగటుతో 223 పరుగులు రాబట్టాడు. లేథమ్ పూర్తిగా తేలిపోయాడు. 8 మ్యాచ్‌ల్లో అతడు చేసింది 98 పరుగులే. సగటు 16.33 మాత్రమే. సెమీస్‌లోనూ అతడిపై పెద్దగా అంచనాల్లేవు.

## వాళ్లు.. వీళ్లు



ఆలస్యంగా అడుగుపెట్టిన రిషబ్ పంత్ ప్రపంచకప్‌పై అప్పుడే తన ముద్ర వేశాడు! ఇంగ్లాండ్‌పై 32 పరుగులతో పర్వాలేదనిపించిన రిషబ్.. బంగ్లాదేశ్‌పై 42 పరుగులతో సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజులో నిలదొక్కుకుంటే ఒంటిచేత్తో మ్యాచ్‌ను మార్చగలడు. అంచనాలకు మించి రాణిస్తున్న మరో ఆటగాడు మహ్మద్ షమి. 4 మ్యాచ్‌ల్లోనే 14 వికెట్లు తీసిన షమి ఇప్పుడు కీలక బౌలర్. ఆరంభ, మధ్య, చివరి ఓవర్లలో షమి నాణ్యమైన బౌలింగ్ టీమ్‌ఇండియాకు సానుకూలాంశం. షమి మాదిరే కివీస్‌కు పేసర్ ఫెర్గూసన్ కీలకంగా మారాడు. వికెట్లు పడగొట్టే నైపుణ్యంతో నిలకడగా రాణిస్తున్నాడు. 17 వికెట్లతో కివీస్ బౌలర్లలో ప్రథమ స్థానంలో ఉన్నాడు. సెమీస్‌లో భారత్‌కు ఫెర్గూసన్ నుంచి ప్రమాదం లేకపోలేదు.

ఫోర్త్ అంపైర్

# నువ్వా నేనా..

ప్రపంచకప్ నాకౌట్ అంకంలో తొలి పోరు.. భారత్, న్యూజిలాండ్‌ల మధ్య ఆసక్తికర సమరం.. విశ్వపోరులో సెమీస్ చేరడం భారత్‌కు ఏడోసారి కాగా.. కివీస్‌కు ఎనిమిదోసారి. అయినా.. ప్రపంచకప్ సెమీస్‌లో భారత్, కివీస్‌లు తలపడటం ఇదే తొలిసారి. మరి రెండు జట్ల బలాబలాలేంటి? ఆటగాళ్ల సత్తా ఎంత? ఎవరెవరికి పోటీ?

## హార్దిక్ × నీషమ్




ఆల్‌రౌండర్లలో సమవుజ్జీలు హార్దిక్ పాండ్య.. జేమ్స్ నీషమ్. ఒంటిచేత్తో ఇన్నింగ్స్‌ను మార్చగల సమర్థులు. బౌలింగ్‌లో వికెట్లు పడగొడుతూ.. బౌలింగ్‌లో మెరుపులు మెరిపిస్తున్నారు. హార్దిక్ 194 పరుగులు చేసి.. 9 వికెట్లు పడగొట్టాడు. నీషం 201 పరుగులు చేసి.. 11 వికెట్లు తీశాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా అలవోకగా భారీషాట్లు ఆడగలరు. సెమీస్‌లో ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి.

## బుమ్రా × బౌల్ట్




బౌలింగ్‌లో టీమ్‌ఇండియాకు బుమ్రా.. కివీస్‌కు బౌల్ట్ ప్రధానాస్త్రాలు. బౌల్ట్‌కు అనుభవమున్నా.. ప్రతిభలో బుమ్రా మిన్నగా కనిపిస్తున్నాడు. పక్కాగా స్లో బంతులు సంధించడం.. పిచ్ ఏదైనా తెలివిగా బౌలింగ్ చేయడం బౌల్ట్ ప్రత్యేకతలు. యార్కర్లు వేయడంలో బుమ్రాను మించినోడు లేడు. ఔట్ స్వింగర్లు సంధించడంలోనూ మొనగాడే. అవసరమైన సమయాల్లో స్లో బంతులతోనూ బోల్తాకొట్టిస్తాడు. ఈ కప్‌లో బౌల్ట్ 24.66 సగటుతో 15 వికెట్లు తీయగా.. బుమ్రా 19.52 సగటుతో 17 వికెట్లు నేలకూల్చాడు. కీలకమైన సెమీస్‌లో బుమ్రా, బౌల్ట్‌లు ఏం మాయ చేస్తారో!

## రాహుల్ × గప్టిల్




ఓపెనర్లలో కేఎల్ రాహుల్.. మార్టిన్ గప్టిల్‌ల మధ్య పోటీ ఆసక్తికరం. కోహ్లి, రోహిత్‌లతో సమానంగా స్ట్రోక్‌లు ఆడగల సమర్థుడు రాహుల్. మూడు ఫార్మాట్లలో రాణిస్తున్న అతికొద్ది మంది బ్యాట్స్‌మెన్‌లో రాహుల్ కూడా ఒకడు. ప్రపంచకప్‌కు ముందు కాస్త తడబడిన రాహుల్ ఇప్పుడు కుదురుకున్నాడు. ఆత్మవిశ్వాసం పెరుగుతున్నాకొద్దీ ఆటలో పరిణతి కనిపిస్తుంది. గత 2 ఇన్నింగ్స్‌ల్లో రాహుల్ సాధికారికంగా ఆడాడు. 8 మ్యాచ్‌ల్లో 51.42 సగటుతో 360 పరుగులు సాధించాడు. అందులో ఒక సెంచరీ, 2 అర్ధ శతకాలున్నాయి. ఇక గప్టిల్‌ది విస్ఫోటక శైలి. క్రీజులో కుదురుకుంటే అతడిని ఆపడం చాలా కష్టం. ఎలాంటి బంతులనైనా అలవోకగా బౌండరీ దాటించగలడు. ఐతే ఈ కప్‌లో గప్టిల్ ఫామ్‌లో లేడు. 8 మ్యాచ్‌ల్లో 23.71 సగటుతో 166 పరుగులు మాత్రమే చేశాడు. ఒకేఒక్క అర్ధ సెంచరీతో సరిపెట్టుకున్నాడు. అతడు ఫామ్‌లోకి వస్తే భారత్‌కు కష్టాలే.

## కేన్‌ను ఔట్ చేసిన కోహ్లి?

**మాంచెస్టర్:** కోహ్లి బౌలింగ్‌లో విలియమ్సన్ ఔటయ్యాడంటా! ఐతే అది ఇప్పుడు కాదు 11 ఏళ్ల క్రితం అండర్-19 ప్రపంచకప్ సెమీస్‌లో. కెప్టెన్లుగా తమ జట్లను ప్రపంచకప్ నాకౌట్‌కు చేర్చిన కోహ్లి, కేన్ విలియమ్సన్‌లు 2008 అండర్-19 ప్రపంచ కప్ సెమీస్‌లో తలపడిన సంగతి తెలిసిందే. అప్పటి విషయాలను వాళ్లు గుర్తుచేసుకున్నారు. "2008లో కాదు అంతకుముందు ఏడాది న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లాం. ఓ అండర్-19 టెస్టు మ్యాచ్‌లో విలియమ్సన్ బ్యాక్‌ఫుట్‌పై నిలబడి గొప్ప షాట్ ఆడాడు. అప్పుడు స్లిప్‌లో ఉన్న నేను అది చూసి నా పక్కన ఫీల్డర్‌తో 'అలాంటి షాట్ ఆడిన ఆటగాడిని ఇంతవరకు చూడలేదు' అని చెప్పా" అని కోహ్లి చెప్పాడు. కోహ్లి అద్భుతమైన ఆటగాడని, అతడి ఆట చూస్తుంటే ఆనందంగా ఉంటుందని అని విలియమ్సన్ పేర్కొన్నాడు. అండర్-19 ప్రపంచకప్ సెమీస్‌లో కోహ్లి బౌలింగ్‌లోనే విలియమ్సన్ ఔటయ్యాడు. "విలియమ్సన్‌ను ఔట్ చేశానా? తిరిగి అలా జరుగుతుందని అనుకోవట్లేదు. 11 ఏళ్ల తర్వాత తిరిగి జాతీయ జట్లకు కెప్టెన్లుగా సీనియర్ ప్రపంచకప్‌లో తలపడబోతుండడం గొప్పగా ఉంది" అని కోహ్లి చెప్పాడు.

# ఛాంపియన్స్

## భారత్‌వైపే పందెం రాయుళ్ల మొగ్గు

**లండన్:** ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియానే బెట్టింగ్ రాయుళ్ల ఫేవరెట్‌గా ఉంది. కప్ గెలిచే అవకాశాలు భారత్‌కే ఎక్కువగా ఉన్నాయంటూ పందెం రాయుళ్లలో అత్యధికులు కోహ్లి సేనపైనే పందెం కాస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ సంస్థలు టీమ్‌ఇండియాకు 13/8 రేటింగ్ ఇచ్చాయి. ఇంగ్లాండ్ (15/8), ఆస్ట్రేలియా (11/4), న్యూజిలాండ్ (8/1) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గెలిచే అవకాశం ఎక్కువున్న జట్టుపై బెట్టింగ్ కట్టి నెగ్గితే తక్కువ లాభం వస్తుంది. విజయావకాశాలు తక్కువున్న జట్టుపై పందెం కట్టి గెలిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయి.

## సెమీస్ కోసం ఒట్టి కాళ్లతో..




**బర్మింగ్‌హామ్:** పిచ్‌పై ఒట్టి కాళ్లతో నడిచారు.. స్టేడియమంతా అలా కలియ తిరిగారు. . అరగంటపైగా మైదానంలోనే కూర్చుని ముచ్చట్లు చెప్పుకున్నారు.. ప్రపంచకప్‌లో ప్రయాణాన్ని నెమరేసుకున్నారు.. ఇంగ్లాండ్‌తో సెమీఫైనల్ సాధన ముందు బర్మింగ్‌హామ్‌లో ఆస్ట్రేలియా ఆటగాళ్లు గడిపిన తీరిది. ఆటగాళ్ల మధ్య బంధాన్ని మరింత పెంచి.. మరో కప్పు సాధించేలా పట్టుదల పెంచేందుకు ఆస్ట్రేలియా కోచ్ జస్టిన్ లాంగర్ ఎంచుకున్న మార్గమిది. ఇలా చేయడం వల్ల ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గి స్వేచ్ఛగా ఆడతారనేది లాంగర్ నమ్మకం. "అలా పడుకుంటే.. మైదానంలో అన్ని మూలలూ కనిపిస్తాయి. మీరు ఎక్కడ ఫీల్డింగ్ చేయాలో అర్థం అవుతుంది. ఈ సెషన్ తర్వాత ఆటగాళ్లందరూ ఎంతో ఉద్వేగంగా కనిపించారు. వాళ్లు తమ అభిప్రాయాలను మనస్ఫూర్తిగా వెల్లడించారు" అని పీటర్ హ్యాండ్స్‌కాంబ్ చెప్పాడు.

## బార్టీకి షాక్

- ముగిసిన ప్లిస్కోవా, గాఫ్ కథ
- క్వార్టర్స్‌లో ఫెదరర్, నాదల్, జకో

లండన్




వింబుల్డన్‌లో పెద్ద షాక్.. టాప్ సీడ్ ఆష్లె బార్టీ (ఆస్ట్రేలియా) ఓడిపోయింది. ఇటీవలే ఫ్రెంచ్ ఓపెన్ గెలిచి జోరు మీదున్న బార్టీ.. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో 6-3, 2-6, 3-6తో అన్‌సీడెడ్ అలిసన్ రిస్కె (అమెరికా) చేతిలో అనూహ్య పరాజయం చవిచూసింది. తొలి సెట్ గెలిచి ఊపు మీద కనిపించిన బార్టీ.. అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. 2013లో యుఎస్ ఓపెన్లో ప్రిక్వార్టర్స్ చేరిన రిస్కె..ఒక గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్స్ చేరడం ఇదే తొలిసారి. మరోవైపు అమెరికా తార సెరెనా విలియమ్స్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. ఆమె 6-2, 6-2తో సూరెజ్ నవారో (స్పెయిన్)ను ఓడించింది. వింబుల్డన్ ఆడుతున్న పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించిన 15 ఏళ్ల కోరి గాఫ్ (అమెరికా) పోరాటానికి తెరపడింది. ప్రిక్వార్టర్స్‌లో గాఫ్ 3-6, 3-6తో హలెప్ (హంగేరి) చేతిలో ఓడింది. కొంటా 4-6, 6-2, 6-4తో క్వితోవాకు షాక్ ఇవ్వగా.. ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) 6-4, 5-7, 11-13తో ముచోవా (చెక్ రిపబ్లిక్) చేతిలో ఓడింది. స్వితోలినా (స్లోవేకియా), స్ట్రికోవా (చెక్ రిపబ్లిక్), జెంగ్ (చైనా) క్వార్టర్స్ చేరారు.

### ఫెదరర్, నాదల్ ముందుకు

పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ ఫెదరర్ 6-1, 6-2, 6-2తో బెరెటిని (ఇటలీ)పై గెలిచాడు. మూడో సీడ్ రఫెల్ నాదల్ (స్పెయిన్) 6-2, 6-2, 6-2తో సౌసా (పోర్చుగల్)ను ఓడించగా.. జకోవిచ్ 6-3, 6-2, 6-3తో హంబర్ట్ (ఫ్రాన్స్)పై నెగ్గాడు. బటిస్టా అగట్ (స్పెయిన్), క్వెరె (అమెరికా), గోఫిన్ (బెల్జియం) కూడా క్వార్టర్స్ చేరారు. పురుషుల డబుల్స్‌లో దివిజ్ శరణ్-మార్సెలొ డిమోలినెర్ జోడీ ఓడిపోయింది. ప్రిక్వార్టర్స్‌లో దివిజ్ జోడీ 5-7, 7-6 (8), 3-6తో కుబోట్-మెలో జంట చేతిలో ఓడింది.

## మనోళ్లు కింగులే కానీ..



ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఏడు విజయాలు.. ఇంగ్లాండ్ చేతిలో త్రుటిలో ఓటమిని మినహాయిస్తే అన్నీ విజయాలే.. పట్టికలో అగ్రస్థానం.. ఇదీ ఈ ప్రపంచకప్ లీగ్ దశలో టీమ్‌ఇండియా ప్రస్థానం! న్యూజిలాండ్ పరిస్థితి పూర్తి భిన్నం. పట్టికలో ఆ జట్టుది నాలుగో స్థానం. బలహీన జట్లపై భారీ విజయాలు సాధించి నెట్‌రన్‌రేట్ పెంచుకోవడం ద్వారా పాకిస్థాన్‌ను వెనక్కి నెట్టి ఆ జట్టు సెమీస్ చేరగలిగింది. ప్రదర్శనలో రెండు జట్లకూ పోలికే లేదు! చివరగా న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ 4-1తో గెలిచింది. ప్రపంచకప్‌లో ఇంతకుముందు ఏడుసార్లు సెమీస్ ఆడిన కివీస్.. ఒక్కసారి మాత్రమే గెలిచింది. ఇవన్నీ కూడా భారత్‌కు కలిసొచ్చే అంశాలే. కానీ చరిత్ర ఎలా ఉన్నా. . ప్రస్తుత టోర్నీలో ఎవరెలా సెమీస్ చేరినా.. ఇప్పుడు రెండు జట్లూ ఉన్నది ఒకే దశలో. అగ్రస్థానంతో నాకౌట్ చేరిందని సెమీస్‌లో టీమ్‌ఇండియాకు గ్రేస్ మార్కులేమీ కలవవు. నాలుగో స్థానంతో వచ్చిందని కివీస్‌కు కోతలేమీ పడవు. నిన్నటి వరకు సాధించిన విజయాలు, ఎదుర్కొన్న ఓటములు లెక్కలోకి రావు! అచ్చొచ్చిన రోజు ఏ జట్టయినా చెలరేగిపోవచ్చు. కలిసి రాని రోజు ఎవ్వరైనా తేలిపోవచ్చు. భీకర ఫామ్‌లో ఉన్న మన రోహిత్ శర్మ తుస్సుమనిపించవచ్చు. చెత్త ప్రదర్శన చేస్తున్న వాళ్ల గప్తిల్ రెచ్చిపోనూవచ్చు. కాబట్టి గత ప్రదర్శనతో సంబంధం లేకుండా మ్యాచ్ రోజు సత్తా చాటడం కీలకమైన విషయం. గ్రూప్ దశలో అఫ్గానిస్థాన్ నుంచి భారత్ ఓటమి ముప్పు ఎదుర్కొంది. బంగ్లాదేశ్ పోరులోనూ ఒత్తిడి తప్పలేదు. ఏ జట్టునైనా ఓడించగల వనరులు కివీస్‌కు ఉన్నాయి. కాబట్టి ఫామ్‌ను, చరిత్రను బట్టి ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయకుండా కోహ్లీసేన ఎంత అప్రమత్తంగా ఆడుతుంది, తన సామర్థ్యాన్ని ఏమేరకు ప్రదర్శిస్తుంది అన్నది కీలకం.

– ఈనాడు క్రీడావిభాగం

"సెమీస్ చేరాలన్న తొలి లక్ష్యాన్ని సాధించాం. ఇక పూర్తిగా మిగతా రెండు మ్యాచ్‌ల మీద దృష్టిసారించాలి. మా అత్యున్నత ఆటను బయటికి తీసి, మరింత తీవ్రతతో ఆడాల్సిన సమయమిది. విలియమ్సన్, టేలర్‌లను త్వరగా ఔట్ చేయడం కీలకం" –కోహ్లి

## ముగ్గురు పేసర్లు.. ముగ్గురు స్పిన్నర్లు

వసీం అక్రమ్




ప్రపంచకప్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలవడం ద్వారా భారత్.. ఇంగ్లాండ్‌తో పోలిస్తే కాస్త సులభమైన ప్రత్యర్థి న్యూజిలాండ్‌తో తలపడే అవకాశాన్ని సంపాదించింది. అన్నిటికంటే ముఖ్యంగా ఓల్డ్‌ట్రాఫోర్డ్ పిచ్ ఉపఖండ పిచ్‌లను పోలి ఉండడంతో ఇంగ్లాండ్ కన్నా కివీస్‌తోనే ఆడడం నయమని భారత్ భావిస్తుంది. ఓల్డ్‌ట్రాఫోర్డ్‌లో ఫెర్గ్యుసన్, బౌల్ట్ లాంటి పేసర్లకు పెద్దగా సహకారం దొరకకపోవచ్చు. పిచ్ నెమ్మదిగా ఉండడం వల్ల స్పిన్నర్లు పండగ చేసుకోవచ్చు. ఈ పిచ్‌పై విరాట్ ముగ్గురు స్పిన్నర్లు, ముగ్గురు పేసర్లతో బరిలో దిగితే ఆశ్చర్యపోను. అలా అయితే నేను చాహల్, జడేజా, కుల్‌దీప్, బుమ్రా, షమి, హార్దిక్‌లను ఆడిస్తా. కార్తీక్‌ను తప్పించి జడేజాను తీసుకోవడం వల్ల జట్టు సమతూకంగా ఉంటుంది. వన్డేలకు వస్తే కివీస్ ఎప్పుడూ ప్రమాదకర జట్టే. నాణ్యమైన పేస్ బౌలింగ్‌తో పాటు మెరుపు ఫీల్డింగ్ ఆ జట్టు సొంతం. వాళ్లకు బ్యాటింగే సమస్య. ముఖ్యంగా ఓపెనింగ్. అయితే విలియమ్సన్, రాస్ టేలర్, గప్తిల్, లేథమ్ లాంటి బ్యాట్స్‌మెన్ ఉన్న జట్టు ఎలాంటి జట్టుపైనైనా విరుచుకుపడగలదు. కోహ్లి భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. సెమీస్‌లో అతని ప్రదర్శనే కీలకం.

## భారత్‌దే విజయం

జెఫ్ థాంప్సన్




ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో భారత జట్టు మంగళవారం ఉపఖండంలో లాంటి పిచ్‌పై న్యూజిలాండ్‌తో సెమీఫైనల్ ఆడనుంది. మ్యాచ్ ఆరంభంలో బంతి చక్కగా బ్యాట్ పైకి వస్తుంది. తర్వాత బంతి తక్కువ ఎత్తులో వస్తుంది. స్పిన్నర్లకు సహకారం లభిస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని తెలివిగా తుది జట్టును ఎంచుకోవాలన్నది నా సూచన. నేనైతే ఎప్పుడైనా కుల్‌దీప్ బదులు జడేజాను ఆడిస్తా. దీని వల్ల లోయర్ ఆర్డర్ బలోపేతం కావడమే కాదు.. విలువైన పరుగులు ఆపే ఫీల్డర్ కూడా జట్టుకు లభిస్తాడు. మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశముంది. డకవర్త్ లూయిస్‌ను దృష్టిలో పెట్టుకుని చూస్తే.. ఛేదన మంచిదనిపిస్తోంది. ఛేదనను కోహ్లి ఎంత ఇష్టపడతాడో అందరికీ తెలుసు. వర్షం వచ్చినా రాకున్నా.. సెమీస్‌లో భారత్‌దే విజయం.

## కుల్‌దీప్‌ను విస్మరించడం కష్టం

సౌరభ్ గంగూలీ




ప్రపంచకప్‌లో భారత్ ప్రయాణం గొప్పగా సాగింది. రాబోయే వారం చాలా కీలకం. గ్రూపు దశలో అన్ని జట్లు కష్టపడింది ఈ దశకు చేరడానికే. చిన్న జట్టా.. పెద్ద జట్టా కాదు ఆ రోజు ఎలా ఆడామన్నదే కీలకం. బలమైన ఆస్ట్రేలియాను బలహీనమైన దక్షిణాఫ్రికా ఓడించడమే ఇందుకు నిదర్శనం. కివీస్ కాస్త బలహీనంగా ఉండొచ్చు.. కానీ నాకౌట్ మ్యాచ్‌ల్లో రాణించే దమ్ము వాళ్లకుంది. అందరూ కోహ్లి ఆట గురించే మాట్లాడుకుంటారు. కివీస్‌తో మ్యాచ్‌లో కార్తీక్‌ను తప్పించి జడేజాను తీసుకునే అవకాశాలున్నాయి. షమి తిరిగి జట్టులోకి రానుండగా, ఓల్డ్‌ట్రాఫోర్డ్‌లో మెరుగైన రికార్డు ఉన్న కుల్‌దీప్‌ను విస్మరించడం కష్టమే. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ తర్వాత బలమైన పేస్ దళం న్యూజిలాండ్‌కు ఉంది. ఈ పరీక్షను భారత్ ఎలా ఎదుర్కొంటుందో..?

## టాస్ కీలకమే.. కానీ!

హర్ష భోగ్లే

తమ అద్భుత ప్రదర్శనకు తోడు ప్రత్యర్థి జట్ల బలహీనతలు టీమ్‌ఇండియాను ఫేవరేట్‌గా నిలబెట్టాయి. వేగంగా రేసును మొదలెట్టి చివరి ల్యాప్‌లో వెనకబడ్డ మారథాన్ అథ్లెట్‌లాగా న్యూజిలాండ్ పరిస్థితి తయారైంది. ఆ జట్టు వరుస ఓటములు చవిచూసింది. అలాంటి స్థితిలో జట్లు ఆత్మవిశ్వాసం కోల్పోతాయి లేదా ఓడితే పోయేదేమి లేదనుకొని తెగించి




పోరాడతాయి. ఒకవేళ న్యూజిలాండ్ రెండో మార్గాన్ని ఎంచుకుంటే భారత్ జాగ్రత్తపడాలి. మ్యాచ్ ఆరంభంలోనే ఆధిపత్యం చలాయించి ఇక ఓటమి ఖాయమనుకొనేలా ప్రత్యర్థిని మానసికంగా దెబ్బతీయాలి. ఓల్డ్ ట్రాఫోర్డ్ మొదటి బ్యాటింగ్‌కు అనుకూలం. ఐతే 300 పరుగులు కూడా ఛేదించవచ్చు. టాస్ కీలకమే కానీ అది మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించబోదు.



ఉండవల్లిలోని అన్న క్యాంటీన్

## ఉండవల్లిలో మూతపడిన అన్న క్యాంటీన్

**ఈనాడు, అమరావతి:** ఉండవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి నివాసం సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ సోమవారం నుంచి మూతపడింది. ఎన్నికల ముందు వరకు ఈ క్యాంటీన్‌కి చక్కని ఆదరణ లభించింది. ముఖ్యమంత్రికి వినతులు ఇచ్చేందుకు వచ్చే ప్రజల నుంచి పోలీసు సిబ్బంది వరకు అందరికీ క్యాంటీన్ ఎంతో ఉపయోగపడేది. ఇటీవల కాలంలో ఇక్కడికి వచ్చే ప్రజల సంఖ్య క్రమంగా తగ్గడంతో కొద్దిరోజులుగా భోజన కేటాయింపులను నిర్వాహకులు తగ్గిస్తూ వచ్చారు. తగినంత హాజరు లేక క్యాంటీన్‌ను సోమవారం నుంచి నిలిపివేశామని సంబంధిత అధికారవర్గాలు ధ్రువీకరించాయి.

## 'నన్ను కలిసే తీరిక లేదా?' ఎస్సైని ప్రశ్నించిన చినరాజప్ప

**పెద్దాపురం, న్యూస్‌టుడే:** బాధ్యతలు చేపట్టి 10 రోజులైనా నియోజకవర్గ ఎమ్మెల్యేనైన తనను కలిసే తీరిక లేదా? అని పెద్దాపురం ఎస్సైగా వచ్చిన సురేష్‌ను మాజీ హోంమంత్రి, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రశ్నించారు. ఇందుకోసం సోమవారం ఆయనే స్వయంగా పెద్దాపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. 'ఏమయ్యా నేను మాజీ హోం మంత్రిని. ప్రస్తుత ఎమ్మెల్యేని. నువ్వు ఎస్సైగా విధుల్లో చేరి 10 రోజులైంది. కనీసం కలిసేందుకు తీరిక లేకపోయినా ఫోన్ చేయడానికైనా ఖాళీ లేదా?' అని ఎస్సైని ప్రశ్నించారు. గతంలో నిన్నేమీ ఇబ్బంది పెట్టలేదు కదా.. అని చమత్కరించారు.

## వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఇనామ్ భూములపై బిల్లు

**ఈనాడు, అమరావతి:** గత ఫిబ్రవరిలో ఇనామ్ భూములపై జారీ అయిన ఆర్డినెన్స్ స్థానంలో బిల్లును రానున్న శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు రెవెన్యూశాఖ కసరత్తు ముగించింది. 1956 నుంచి 2013 వరకు మంజూరైన రైత్వారీ పట్టాలు చెల్లుబాటు కావడంతోపాటు నిషిద్ధ జాబితాకు చెందిన 22-ఏ నుంచి భూములకు మోక్షం లభించేలా అప్పట్లో ఆర్డినెన్స్‌ను తెచ్చారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు కౌలుదారులకు లాభం చేకూర్చేలా 2013 చట్టాన్ని సవరించేందుకు రెవెన్యూశాఖ సన్నాహాలు చేస్తోంది. అలాగే భూములపై సర్వ హక్కులు యాజమానికి సంక్రమించేలా 'ల్యాండ్ టైటిల్' బిల్లును తీసుకురాబోతున్నారు. ఈ రెండు బిల్లులను రానున్న శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టడంపై సందిగ్ధం నెలకొంది.

# తెలంగాణ రెండు.. ఏపీ మూడు..

- గోదావరి నీటి మళ్లింపునకు అయిదు ప్రత్యామ్నాయాలు సిద్ధం
- నేడు ఉన్నత స్థాయి ఇంజినీర్ల సమావేశం

ఈనాడు – హైదరాబాద్

గోదావరి నుంచి శ్రీశైలం వరకు నీటిని మళ్లించే పలు ప్రత్యామ్నాయాలపై కసరత్తు చేసిన రెండు రాష్ట్రాల ఇంజినీర్లు, ఈ ప్రతిపాదనలపై మరింత లోతుగా చర్చించనున్నారు. ఇందుకోసం తెలుగు రాష్ట్రాల ఉన్నతస్థాయి ఇంజినీర్లు మంగళవారం హైదరాబాద్‌లో సమావేశం కానున్నారు. తెలంగాణ ఇంజినీర్లు రెండు, ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్లు మూడు రకాల ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేసి తయారు చేసిన గోదావరి-శ్రీశైలం, గోదావరి-నాగార్జునసాగర్ నీటి మళ్లింపు పథకాలపై చర్చించనున్నారు. ఈ చర్చల్లో ఒకటి లేదా రెండు ప్రతిపాదనలకు తుది రూపం ఇచ్చి మళ్లీ జరగబోయే ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశం ముందుంచనున్నారు. తెలంగాణలో గోదావరి నుంచి శ్రీశైలానికి, ఆంధ్రప్రదేశ్ పోలవరం నుంచి నాగార్జునసాగర్ ద్వారా శ్రీశైలానికి నీటిని మళ్లించే పథకాలపై రెండు రాష్ట్రాల ఇంజినీర్లు లోతుగా అధ్యయనం చేశారు. ఇతర ప్రత్యామ్నాయాలపై కూడా ప్రాథమిక అధ్యయనం చేసి నివేదికలు సిద్ధం చేసుకున్నారు. తెలంగాణ నుంచి ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్, అంతర్‌రాష్ట్ర జలవనరుల విభాగం చీఫ్ ఇంజినీరు నరసింహారావు, విశ్రాంత ఇంజినీర్లు శ్యాంప్రసాద్‌రెడ్డి, వెంకటరామారావు, చంద్రమౌళి, సత్తిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు, హైడ్రాలజీ విభాగం చీఫ్ ఇంజినీర్ కుమార్, కర్నూలు జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీరు నారాయణరెడ్డి, విశ్రాంత ఇంజినీర్లు రెహ్మాన్, రౌతు సత్యనారాయణ, సుబ్బారావు, ప్రభాకర్‌రెడ్డి, సలహాదారు రోశయ్య తదితరులు పాల్గొంటారు.

### చర్చకు వచ్చే ప్రతిపాదనలివే..

- ★ తెలంగాణ ఇంజినీర్లు గత కొన్ని రోజులుగా కసరత్తు చేసిన ప్రతిపాదనలిలా ఉన్నాయి. గోదావరి నీటిని రాంపూర్ వద్ద నుంచి మళ్లించి నల్గొండ జిల్లాలోని ఉదయసముద్రంకు తీసుకెళ్లడం, అక్కడి నుంచి ఒక కాలువను నాగార్జునసాగర్‌కు, ఇంకో కాలువను శ్రీశైలానికి మళ్లించడం. ఇందులో భారీ సొరంగం, లిఫ్టుల ద్వారా 380 కిలోమీటర్ల దూరం నీటిని మళ్లించాలి కాబట్టి సుమారు రూ.లక్షకోట్లు ఖర్చవుతుందని అంచనా.
- ★ పోలవరం నుంచి వైకుంఠపురం రిజర్వాయర్, పులిచింతల, టేల్‌పాండ్ ద్వారా నాగార్జునసాగర్, ఇక్కడి నుంచి శ్రీశైలానికి నీటిని మళ్లించేలా మరో పథకాన్ని ప్రతిపాదించారు. ఈపథకం ద్వారా శ్రీశైలానికి రోజూ 2.8 టీఎంసీలు మళ్లించవచ్చన్నది అంచనా.
- ★ పోలవరం నుంచి రెండు రాష్ట్రాల సరిహద్దు ద్వారా కృష్ణా వైపు మళ్లించి పులిచింతల వెనుకభాగంలో పోస్తే, ఇక్కడి నుంచి 12 కిలోమీటర్ల దూరంలోని టేల్‌పాండ్‌కు తీసుకెళ్లేలా ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్లు ప్రతిపాదించారు. టేల్‌పాండ్ నుంచి నాగార్జునసాగర్‌కు, ఇక్కడి నుంచి రివర్సిబుల్ టర్బైన్స్ ద్వారా శ్రీశైలానికి మళ్లించడానికి అవకాశం ఉంది.
- ★ పులిచింతల పూర్తిస్థాయి నీటిమట్టం 53.5 మీటర్లు కాబట్టి 45 మీటర్ల నుంచి నీటిని తీసుకొనేలా చేసి నదికి సమాంతరంగా 25 కి.మీ దూరం కాలువ తవ్వి 75.5 మీటర్ల పూర్తిస్థాయి మట్టంతో ఉన్న టేల్‌పాండ్‌కు తీసుకెళ్లి రివర్సిబుల్ టర్బైన్స్ ద్వారా సాగర్‌కు, తర్వాత శ్రీశైలానికి మళ్లించడం. పోలవరం నుంచి ఈ ప్రవాహమార్గం 240 కి.మీ కాగా, ఈ పథకానికి రూ.60 వేల కోట్లకు పైగా ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా.
- ★ దుమ్ముగూడెం నుంచే రోజూ నాలుగు టీఎంసీలు మళ్లించడం మరో ప్రతిపాదన. దుమ్ముగూడెం వద్ద ఆనకట్ట ఎత్తును 62 మీటర్ల మట్టానికి పెంచితే 20 టీఎంసీల వరకు నిల్వ చేయవచ్చని, ఇక్కడి నుంచి రోజూ నాలుగు టీఎంసీలు మళ్లిస్తే నాగార్జునసాగర్ ఎడమకాలువ, కుడికాలువకు ఇవ్వడంతో పాటు, హాలియా నది కుడివైపు నుంచి శ్రీశైలానికి మళ్లించడానికి అవకాశం ఉంటుందని ప్రతిపాదన.
- ★ తుపాకులగూడెం నుంచి శ్రీశైలానికి ఇంకో ప్రతిపాదన. వీటన్నింటిపైనా రెండు రాష్ట్రాల ఇంజినీర్లు చర్చించనున్నారు. ఒకే పథకం ద్వారా నీటిని మళ్లించడం లేదా తెలంగాణలోని ఒకచోట నుంచి రెండు టీఎంసీలు, పోలవరం నుంచి రెండు టీఎంసీలు మళ్లించే ప్రతిపాదనలపై ఎక్కువ చర్చ జరిగే అవకాశం ఉంది.



తుంగభద్ర జలాశయంలో చేరిన వరద నీరు

## తుంగభద్రకు వరద

**హొసపేటె (కర్ణాటక), న్యూస్‌టుడే:** తుంగభద్ర జలాశయానికి ఎట్టకేలకు వరద రాక ఆరంభమైంది. సోమవారం ఉదయం 2,500 క్యూసెక్కుల నుంచి ప్రారంభమైన వరద ప్రవాహం రాత్రి 8 గంటలకు 3,200 క్యూసెక్కులకు చేరుకుంది. జలాశయం ఎగువ ప్రాంతాలైన శివమొగ్గ, ఆగుంబె, కడూరు, గాజనూరు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో శివమొగ్గ జిల్లా గాజనూరులోని తుంగా జలాశయం పూర్తిగా నిండింది. ఆ నదినుంచి సుమారు 20 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో తుంగభద్రకు వచ్చే వరద మరింత పెరిగే అవకాశం ఉందని జలాశయం వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం జలాశయంలో 1.79 టీఎంసీల నీటి నిల్వఉంది. నిరుడు ఇదే సమయానికి 42.33 టీఎంసీలు ఉండేది.

## కాఫర్‌డ్యామ్ మార్గం మీదుగా వరద

- రక్షణ పనులకు ఆటంకం
- ఒడ్డుకు చేరిన వాహనాలు



వరద పెరగడంతో మునిగిన కాఫర్‌డ్యామ్ మార్గం

**పోలవరం, న్యూస్‌టుడే:** గోదావరికి సోమవారం ఉదయం నుంచి వరద పెరిగింది. ఫలితంగా ఎగువ కాఫర్‌డ్యామ్ రక్షణ పనులు జరిగే ప్రాంతానికి దారితీసే మార్గం మీదుగా నీరు ప్రవహిస్తోంది. ముందు జాగ్రత్తగా డ్యామ్ వద్ద రక్షణ పనులు చేస్తున్న వాహనాలను ఒడ్డుకు రప్పించారు. మధ్యాహ్నానికి వరద మరింత పెరిగి రోడ్డు మునగడంతో రక్షణ పనులు నిలిపివేశారు. మూడు రోజుల కిందటే పోలవరం అథారిటీ సభ్యులు వచ్చి కాఫర్‌డ్యామ్ పనులు పరిశీలించి వెళ్లారు. 30 వేల క్యూసెక్కుల వరద వచ్చినా రోడ్డు తట్టుకునేలా దాని అడుగున తూరలు ఏర్పాటు చేశారు. నిన్నటి వరకూ వాటి లోంచి వెళ్లిన వరద ఒకసారిగా పెరగడంతో రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణంలో భాగంగా పశ్చిమ, తూర్పు దిశల్లో 300 మీటర్ల వంతున వదిలి మిగిలిన ప్రాంతంలో పనులు చేశారు. వరద ఈ ప్రాంతాల మీదుగా పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల కాలువల గుండా సముద్రానికి చేరుతుంది. ప్రస్తుతం మునిగిన రహదారి కూడా ఈ 300 మీటర్ల పరిధిలోనే ఉంది.

### కాళేశ్వరం వద్ద మట్టికట్ట కొట్టుకుపోవడంతో...

పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం రాత్రికి 5.52 మీటర్లకు పెరిగినట్లు అధికారులు చెప్పారు. మరోవంక.. తెలంగాణలోని కాళేశ్వరం వద్ద మట్టికట్ట కొట్టుకుపోవడం వల్ల ఒక్కసారిగా వరద నీరు వచ్చి చేరిందని కేంద్ర జలసంఘం అధికారులు తెలిపారు. మంగళవారం నాటికి పోలవరం వద్ద వరద 6.30 మీటర్ల వరకు పెరిగే అవకాశం ఉందని వివరించారు.

## అచ్చెన్నాయుడు ఎన్నికను రద్దు చేయండి

### హైకోర్టులో వైకాపా అభ్యర్థి పిటిషన్

**ఈనాడు, అమరావతి:** శ్రీకాకుళం జిల్లా టెక్కలి శాసనసభ నియోజకవర్గం నుంచి తెదేపా తరపున గెలుపొందిన కింజరాపు అచ్చెన్నాయుడు ఎన్నికను రద్దు చేయాలంటూ ఆ నియోజకవర్గ వైకాపా అభ్యర్థి పేరాడ తిలక్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. 'ఓ క్రిమినల్ కేసు వివరాల్ని ఎన్నికల నామినేషన్ ప్రమాణ పత్రంలో వెల్లడించకుండా అచ్చెన్నాయుడు గోప్యంగా ఉంచారు. టెక్కలి ఠాణాలో నమోదైన క్రిమినల్ కేసును మాత్రమే ప్రస్తావించారు. అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ ఠాణాలో 2007 జులై 21న నమోదైన కేసు వివరాల్ని ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టారు. ఆ కేసులో ఆయన 21వ నిందితుడని రాయదుర్గం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు అభియోగపత్రం కూడా దాఖలు చేశారు. ఆ తర్వాత ఈ కేసు.. ప్రత్యేక కోర్టుకు బదిలీ అయ్యింది. నామినేషన్ దాఖలు చేసే సమయానికి అది ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ అంశాల్ని పరిగణనలోకి తీసుకొని అచ్చెన్నాయుడు ఎన్నికను రద్దు చేసి, టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా నేను ఎన్నికైనట్లు ప్రకటించాలి' అని వ్యాజ్యంలో తిలక్ కోరారు.

## తిరుమల జేఈవోగా ధర్మారెడ్డి!

### కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం



ఎ.వి.ధర్మారెడ్డి

**ఈనాడు, దిల్లీ, తిరుమల, న్యూస్‌టుడే:** తిరుమల, తిరుపతి దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి (జేఈవో)గా ఎ.వి.ధర్మారెడ్డి నియామక ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. కేంద్ర హోంశాఖలో సంయుక్త కార్యదర్శి హోదాలో పనిచేస్తున్న ధర్మారెడ్డిని డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇటీవల ప్రతిపాదనలు పంపింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాయడంతో పాటు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను సమ్మతిస్తూ కేంద్ర హోంశాఖ ఇచ్చిన అనుమతికి కేంద్ర సిబ్బంది వ్యవహారాలశాఖ సోమవారం ఆమోదముద్ర వేసింది. ఇదివరకు ఏపీలో పనిచేసిన కాలాన్ని పరిగణనలోకి తీసుకుని మొత్తం ఏడేళ్లపాటు ఏపీలో కొనసాగడానికి అనుమతి ఇచ్చింది. 2022 మే 14వరకూ కానీ, తదుపరి ఉత్తర్వులు జారీచేసేంతవరకూ కానీ ఆయన రాష్ట్రంలో పనిచేయవచ్చు. మంగళవారం ఉత్తర్వులు వెలువడనున్నాయి. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తిరుమల జేఈవోగా ధర్మారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయనుంది. శుక్రవారం తిరుమలలో బాధ్యతలు చేపడతారని తెలుస్తోంది. ధర్మారెడ్డి గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2004 జులై 5 నుంచి 2006 సెప్టెంబరు 9 వరకు తిరుమల జేఈవో హోదాలో ప్రత్యేకాధికారిగా పనిచేశారు. రెండో విడతగా 2008 ఏప్రిల్ 2 నుంచి 2010 ఆగస్టు 31 వరకూ విధులు నిర్వర్తించారు.

### 16న దివ్యదర్శనం, సర్వదర్శనం టోకెన్ల జారీ రద్దు

శ్రీవారి దివ్యదర్శనం, సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్ల జారీని ఈ నెల 16న రద్దు చేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. కోయిల్‌ఆళ్వారు తిరుమంజనం, చంద్రగ్రహణం కారణంగా ఈ నిర్ణయం తీసుకుంది. తిరుమంజనం కారణంగా 16న ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వదర్శనం నిలిపివేయనున్నారు. ఆ తర్వాత దర్శనం ప్రారంభించి.. చంద్రగ్రహణం కారణంగా మళ్లీ సాయంత్రం 5 గంటల తర్వాత ఆపేస్తారు. అంటే మొత్తంగా దర్శన సమయం కేవలం 5 గంటల పాటు మాత్రమే మిగులుతుంది. చంద్రగ్రహణం వల్ల రాత్రి 7 గంటల తర్వాత ఆలయ తలుపులు మూసివేసి 17న ఉదయం 5 గంటలకు తెరుస్తారు. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి.. ఆణివార ఆస్థానం పూర్తయ్యాక ఉదయం 11 గంటల నుంచి శ్రీవారి దర్శనం ప్రారంభించనున్నట్లు తితిదే వివరించింది.

## జర్మనీలో హిందుత్వం!



జర్మనీలోని హమ్‌లో డాటెల్‌హమ్ కాలువ వద్ద సోమవారం పలువురు హిందువులు ప్రత్యేక శుద్ధి పూజలు నిర్వహించారు. నదిలో స్నానాలు చేశారు. హమ్‌లోని శ్రీ కామాచి అంపాల్ ఆలయం ఐరోపాలోని అతిపెద్ద ద్రవిడ హిందూ ఆలయంగా గుర్తింపు పొందింది.

## తాడు కాదు సుమా.. మీసమే



చిత్రంలో పెద్ద మీసాన్ని కలిగి ఉన్న వ్యక్తి పేరు జగ్మల్ సింగ్ భాటీ. ఆయన మీసం పొడవు 28 అడుగులు. సోమవారం రాజస్థాన్‌లోని బీకనేర్‌లో ఇలా తన మీసం పొడవును కొలిపించుకుంటూ కనిపించారు.

## అగ్రరాజ్యంలో వరద కష్టాలు..



భారీ వర్షాలకు సోమవారం అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోని ఓ రోడ్డులో వరద నీటిలో వాహనాలు చిక్కుకున్నాయి. ఎటూ కదల్లేని పరిస్థితుల్లో వాహనదారులు ఇలా కార్లపైకి ఎక్కి ఫోన్ చేస్తూ ఆపన్నహస్తం కోసం ఎదురుచూశారు.

## వ్యక్తులనూ ఉగ్రవాదులుగా ప్రకటించే బిల్లు

దిల్లీ: ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానం ఉండే వ్యక్తులను కూడా ఉగ్రవాదులుగా ప్రకటించడానికి వీలు కలిగించే బిల్లును కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు సంస్థలనే ఉగ్రవాద సంస్థలని ప్రకటిస్తుండగా, ఇకపై వ్యక్తులకూ ఆ నిబంధనను వర్తింపజేయాలంటూ బిల్లు ప్రతిపాదించింది.

### ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్‌పర్సన్ నియామక ప్రక్రియకు సవరణ..

జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఛైర్‌పర్సన్, సభ్యుల నియామక ప్రక్రియలో మార్పులకు వీలు కల్పించే బిల్లును కేంద్రం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తిని మాత్రమే నియమించేందుకు వీలుంది. ప్రతిపాదిత బిల్లు ఆమోదం పొందితే ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్‌పర్సన్ నియామకానికి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తులను కూడా పరిగణనలోకి తీసుకునే వీలుంటుంది.

### కాంగ్రెస్ అధ్యక్షుడి శాశ్వత సభ్యత్వ హోదా తొలగింపు

దేశంలో మరో రాజకీయ దుమారం చెలరేగింది! జలియన్ వాలాబాగ్ జాతీయ స్మారక ట్రస్టులో... కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి ఉండే శాశ్వత సభ్యత్వాన్ని తొలగించే దిశగా మోదీ సర్కారు చర్యలు ప్రారంభించింది. సోమవారం లోక్‌సభలో 'జలియన్ వాలాబాగ్ సవరణ బిల్లు'ను ప్రవేశపెట్టింది. ప్రధానమంత్రి అధ్యక్షుడిగా ఉండే ఈ ట్రస్టులో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కేంద్ర సాంస్కృతికశాఖ మంత్రి, లోక్‌సభలో విపక్ష నేత, పంజాబ్ గవర్నర్, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు... కేంద్ర ప్రభుత్వం సూచించే ముగ్గురు వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. అయితే- కాంగ్రెస్ అధ్యక్షుడికి ఉండే శాశ్వత సభ్యత్వ హోదాను తొలగించాలని, లోక్‌సభలో విపక్ష నేతకు బదులు... లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నేతను సభ్యుడిగా గుర్తించాలని, నామినేటెడ్ సభ్యులను ఎప్పుడైనా తొలగించే అధికారం ట్రస్ట్ అధ్యక్షుడికి కల్పించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది.

### ఆధార్ ఇక స్వచ్ఛందమే

బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు, మొబైల్ ఫోన్ కనెక్షన్ పొందే సమయంలో ఆధార్‌ను గుర్తింపు పత్రంగా స్వచ్ఛందంగా ఉపయోగించుకునేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లును పార్లమెంటు సోమవారం ఆమోదించింది. ఈ మేరకు ఆధార్, ఇతర చట్టాల (సవరణ) బిల్లు-2019ని రాజ్యసభ సోమవారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. లోక్‌సభ ఇప్పటికే ఈ బిల్లుకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. రాజ్యసభలో బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తీర్పుల సందర్భాల్లో 'కరకు' పదాలు దొర్లకుండా చూడాలని కోరారు. ఆధార్‌పై తీర్పులో 'రాజ్యాంగ దుర్వినియోగం' అనే మాటను వాడారని గుర్తు చేశారు.

### ఇదొక త్రిశంకు బడ్జెట్!

- ధరలు తగ్గుతుంటే ఇంధనాలపై సుంకాలేంటి?
- లోక్‌సభలో కాంగ్రెస్ విమర్శ

దిల్లీ: కేంద్ర బడ్జెట్‌పై సోమవారం లోక్‌సభలో వాడిగావేడిగా చర్చ సాగింది. కాంగ్రెస్ నేత, ఎంపీ శశిథరూర్ చర్చను ప్రారంభిస్తూ... రైతుల సమస్యలు వంటి కీలక అంశాలకు బడ్జెట్‌లో చోటు దక్కలేదన్నారు. దేశానికి సవాలు విసురుతున్న అనేక అంశాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించారు. "ఎన్నికల తర్వాత తీసుకొస్తున్న మొదటి బడ్జెట్ చాలా బాగా ఆకట్టుకుంటుందని అనుకున్నాం. కానీ అత్యంత పేలవంగా; తీవ్ర నిరాశాజనకంగా ఉంది. అనవసర డిఫెన్స్ స్ట్రోకులు, క్యాచ్ మిస్సింగులు, నో బాల్స్, వైడ్ బాల్స్... చెప్పాలంటే ఇదొక త్రిశంకు బడ్జెట్! దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలపై సవతి ప్రేమ చూపించారు. మరే ప్రభుత్వ హయాంలోనూ ఇంతమంది రైతులు చనిపోలేదు. సగటు మనిషి నడ్డి విరిచేలా ఇంధన ధరలను పెంచేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతుంటే... పెట్రోలు, డీజిల్‌పై సుంకాలు పెంచడమేంటి?" అని థరూర్ అన్నారు. పలువురు విపక్ష సభ్యులు కూడా ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపట్టారు. భాజపా నేత, కేంద్ర మాజీ మంత్రి జయంత్ సిన్హా మాట్లాడుతూ... గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను భాజపా సర్కారు చక్కదిద్దిందన్నారు. రాజధాని ఎక్స్‌ప్రెస్‌లా దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ పరుగులు పెట్టిస్తున్నారనీ, త్వరలోనే బుల్లెట్ రైలులా దేశం దూసుకెళ్లడం ఖాయమన్నారు.

# కశ్మీర్‌పై మీది తప్పుడు వాదన

- ఉగ్రవాదానికి చట్టబద్ధత కల్పిస్తున్నారు
- ఐరాస నివేదికపై భారత్ మండిపాటు

జెనీవా: జమ్మూకశ్మీర్‌లో పరిస్థితిపై ఐరాస మానవ హక్కుల కమిషన్ కార్యాలయం (ఓహెచ్‌సీహెచ్‌ఆర్) విడుదల చేసిన నివేదికను భారత్ సోమవారం తీవ్రంగా ఖండించింది. ఆ రాష్ట్రంపై సాగుతున్న తప్పుడు, దురుద్దేశపూరిత వాదనకు ఇది కొనసాగింపే నని విమర్శించింది. పాకిస్థాన్ నుంచి వెలువడుతున్న ఉగ్రవాదమే అసలు సమస్య అని, దాన్ని ఈ నివేదిక విస్మరించిందని దుయ్యబట్టింది.

ఓహెచ్‌సీహెచ్‌ఆర్ గత ఏడాది మొట్టమొదటిసారిగా కశ్మీర్‌పై ఒక నివేదికను విడుదల చేసింది. దాన్ని తాజాగా అప్‌డేట్ చేసింది. కశ్మీర్‌లో పరిస్థితిని చక్కదిద్దడంలో భారత్, పాకిస్థాన్‌లు విఫలమయ్యాయని విమర్శించింది. తాము గతంలో లేవనెత్తిన అనేక ఆందోళనలను పరిష్కరించే దిశగా పటిష్ఠ చర్యలు చేపట్టలేదని వ్యాఖ్యానించింది. గత ఏడాది మే నుంచి ఈ ఏడాది ఏప్రిల్ మధ్య కాలంలో కశ్మీర్‌లో చనిపోయిన పౌరుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని పేర్కొంది. 12 నెలల కాలంలో ఇన్ని మరణాలు చోటుచేసుకోవడం గత దశాబ్ద కాలంలో జరగలేదని వివరించింది. కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనల ఆరోపణలపై స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు కోసం విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఐరాస మానవ హక్కుల మండలికి సూచించింది. భారత్, పాకిస్థాన్‌లు తప్పులు చేస్తున్నాయంటూ కొన్ని అంశాలను ప్రస్తావించింది. దీర్ఘకాలంగా సాగుతున్న ఉద్రిక్తతలను తగ్గించడానికి చర్యలు చేపట్టాలని కోరింది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌కు సంబంధించి భారత దళాలు సాగించిన ఉల్లంఘనలపై ఎవరినీ బాధ్యులుగా చేయలేదని తెలిపింది.

ఓహెచ్‌సీహెచ్‌ఆర్ నివేదికపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ మండిపడ్డారు. నివేదికలోని అంశాలు భారత సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేలా ఉన్నాయన్నారు. ఏళ్ల తరబడి పాకిస్థాన్ నుంచి వెలువడుతున్న సీమాంతర ఉగ్రవాద దాడులతో ఉత్పన్నమైన పరిస్థితిని 'విశ్లేషించి', దాని వల్ల ఉత్పన్నమైన విధ్వంసాన్ని ప్రస్తావించలేదని విమర్శించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి, బాహాటంగానే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశానికి మధ్య కృత్రిమ సారూప్యత తీసుకురావడానికి ప్రయత్నించినట్లు కనపడుతోందని దుయ్యబట్టారు. "పుల్వామాలో జరిగిన దారుణ ఉగ్రవాద దాడిని ఈ ఏడాది ఫిబ్రవరిలో ఐరాస భద్రతా మండలి ఖండించింది. జైష్ ఎ మహ్మద్ ఉగ్రవాద నాయకుడు మసూద్ అజార్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అయితే ఐరాస ఆంక్షలు విధించిన ఉగ్రవాద నాయకులు, ముఠాలను సాయుధ బృందాలుగా ఓహెచ్‌సీఆర్‌హెచ్‌ఆర్ తాజా నివేదికలో పేర్కొన్నారు. ఇది ఉగ్రవాదానికి చట్టబద్ధత కల్పించే ప్రయత్నమే. దీనికితోడు ఐరాస సభ్య దేశంలో చీలికను సమర్థిస్తున్నట్లుగా ఉంది. జమ్మూకశ్మీర్.. భారత్‌లో అంతర్భాగం. దానిలో కొంత భాగాన్ని పాక్ అక్రమంగా తన కబ్జాలో ఉంచుకుంది" అని వ్యాఖ్యానించారు.

## కిసాన్ సమ్మాన్ లబ్ధిదారుల జాబితా వెంటనే పంపించండి

### రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

దిల్లీ: రైతుల ఆదాయాన్ని పెంచటానికి ఉద్దేశించిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ పథకం లబ్ధిదారుల జాబితాను సత్వరమే పంపించాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం ఆదేశించింది. సోమవారం దిల్లీలో జరిగిన రాష్ట్రాల వ్యవసాయ మంత్రుల సదస్సులో కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ మాట్లాడుతూ ఈ పథకానికి రూ.87,000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించామని, రాష్ట్రాలు జాప్యం చేయకుండా రైతుల జాబితాలను జులై నెలాఖరుకల్లా పంపించాలని కోరారు. దీనివల్ల ఏప్రిల్-జులై విడతకు సంబంధించిన రూ.2వేలను రైతుల బ్యాంకు ఖాతాలకు వెంటనే బదిలీ చేయగలుగుతామని చెప్పారు. దేశవ్యాప్తంగా 14.5 కోట్ల మంది రైతులు ఈ పథకానికి అర్హులు. ఏడాదికి ఒక్కొక్కరికి రూ.6వేలను మూడు విడతల్లో వారి బ్యాంకు ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమ చేస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందుగా ఈ పథకాన్ని ప్రారంభించింది.

### కిసాన్ సమ్మాన్ చెల్లింపుల వివరాలివి..

- దేశవ్యాప్తంగా ఈ పథకానికి అర్హులైన రైతులు: రూ.14.5కోట్ల మంది
- తొలి విడత రూ.2వేల చొప్పున పొందింది: 3.56 కోట్ల మంది
- వారందరికీ కేంద్రం బదిలీ చేసిన మొత్తం: రూ.7,120 కోట్లు
- రెండో విడత సొమ్ము అందుకున్న అన్నదాతలు: 3.10కోట్ల మంది
- వీరి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన మొత్తం: రూ.6,200 కోట్లు
- ఈ పథకంలో చేరని రాష్ట్రం: పశ్చిమబెంగాల్

## టైర్లలో నైట్రోజన్ తప్పనిసరి!

దిల్లీ: టైర్ల తయారీ సమయంలోనే రబ్బర్‌లో సిలికాన్ కలపడం, టైర్లలో మామూలు గాలికి బదులు నైట్రోజన్ వాయువు నింపడాన్ని తప్పనిసరి చేయాలని భావిస్తున్నట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం రాజ్యసభకు తెలిపారు. ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రాజ్యసభ శూన్యగంటలో ఆయన అనుబంధ ప్రశ్నలకు సమాధానమిచ్చారు. టైర్ల తయారీ సమయంలో రబ్బర్‌లో సిలికాన్ కలపడం, టైర్లలో నైట్రోజన్ నింపడం వల్ల టైరు వేడెక్కి పేలిపోయే అవకాశాలు తక్కువ అని గడ్కరీ చెప్పారు.

## వెజ్‌బోట్ చిట్టి.. కోతలో మేటి!



పొలంలో కూరగాయలను జాగ్రత్తగా కోసే యంత్రమిది. 'వెజ్‌బోట్'గా పిలుస్తున్న ఈ రోబోను బ్రిటన్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. మెషీన్ లెర్నింగ్ కృత్రిమ మేధతో పనిచేస్తుంది. క్యాబేజీ వంటి పంటల కోతలో వెజ్‌బోట్ బాగా ఉపయోగపడుతోందని, మరిన్ని రకాల పంటల కోతకు ఉపయోగపడేలా మెరుగుపరుస్తున్నామని శాస్త్రవేత్తలు చెప్పారు.

# ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

- 29 మంది మృతి...
- 18 మందికి గాయాలు

ఆగ్రా

వేకువజాము 4.30 గంటల సమయం...ప్రయాణికులందరూ ఆదమరచి నిద్రపోతున్న వేళ...యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై ఏసీ బస్సు వేగంగా దూసుకుపోతోంది.ఒక్కసారిగా గట్టి కుదుపు. రహదారిపై ఉండాల్సిన బస్సు మురుగు కాలువలోకి పడిపోయింది. హాహాకారాలు మిన్నంటాయి. అంతలోనే బస్సులోకి మురుగు వాసనతో నీటి ప్రవాహం. చుట్టూ చిమ్మచీకటి...ఏమి జరిగిందో తెలియని పరిస్థితి. ఎలా బయటపడాలో దిక్కుతోచని స్థితి. ప్రమాద తీవ్రతకు కొందరు, ఊపిరాడక మరికొందరు ప్రాణాలు కోల్పోయారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాకు సమీప ఎత్మాద్‌పూర్‌లో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర ప్రమాదంలో 29 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో 27 మంది పురుషులు కాగా ఒక మహిళ, ఒక బాలుడు ఉన్నారు. చనిపోయిన వారిలో అత్యధికులు లఖ్‌నవూ వాసులని తెలుస్తోంది. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఏడుగురు ప్రాణాపాయస్థితిలో ఉన్నారు. యూపీ రోడ్‌వేస్‌కు చెందిన జన్‌రథ్ ఏసీ స్లీపర్ కోచ్ బస్సు (అవధ్ డిపో) లఖ్‌నవూ నుంచి దిల్లీ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతి వేగం, డ్రైవర్ నిద్రమత్తుతో కునుకు వేయటం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. సుమారు 20 అడుగుల ఎత్తు నుంచి పడిపోవటంతో బస్సు నుజ్జునుజ్జయ్యింది. బస్సు తొలుత వంతెనపై నున్న రైలింగ్‌ను ఢీకొందని, ఆ తర్వాత నేరుగా మురుగు కాలువలోకి పడిపోయిందని గాయపడిన ప్రయాణికులు కొందరు పోలీసులకు తెలిపారు. ఆ సమయంలో కాలువలో ఏడు అడుగుల లోతు వరకూ నీరు ప్రవహిస్తోంది. ప్రమాదాన్ని గమనించిన వ్యక్తులు సమీప గ్రామస్థులను అప్రమత్తం చేశారు. బస్సులో చిక్కుకుపోయిన వారిని బయటకు తీయటానికి చాలా సమయం పట్టింది.

### త్రిసభ్య కమిటీతో దర్యాప్తు

ప్రమాద కారణాలపై దర్యాప్తునకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. 24 గంటల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే ఆదిత్యనాథ్ ఆదేశాలతో ఇద్దరు సీనియర్ మంత్రులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఉత్తర్‌ప్రదేశ్ రోడ్‌వేస్ పరిహారం ప్రకటించింది.



మురుగు కాలువ నుంచి మృతదేహాలను బయటకు తీసుకొస్తున్న స్థానికులు, పోలీసు సిబ్బంది

### ప్రధాని సంతాపం

ప్రాణనష్టంపై ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, యూపీ గవర్నర్ రామ్‌నాయక్, సీఎం ఆదిత్యనాథ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక వాద్రా బాధిత కుటుంబాలకు తమ సంతాపం తెలిపారు.

## సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో పోలీసు అధికారుల నియామకం

దిల్లీ: కేసుల లిస్టింగ్‌లో అక్రమాలు జరుగుతున్నట్టు వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. వీటిని నివారించడానికి సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో సీబీఐ, దిల్లీ పోలీసు విభాగానికి చెందిన సీనియర్ ఎస్పీ స్థాయి ఉన్నతాధికారులను డిప్యుటేషన్‌పై నియమించనుంది. న్యాయవ్యవస్థ అధిపతిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి ఈ నిర్ణయం తీసుకున్నారు. వచ్చిన కేసులను వివిధ ధర్మాసనాలకు కేటాయించడంలో అవినీతి చోటు చేసుకుంటున్నట్టు ఆరోపణలు రావడంతో ఈ చర్య తీసుకున్నారని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ అధికారి చెప్పారు. కేసుల కేటాయింపులో మధ్యవర్తుల ప్రమేయం ఉందని, తమకు నచ్చిన ధర్మాసనం ముందుకు వచ్చేలా వారు చేయగలుగుతున్నారని ఇటీవల ఉత్సవ్ బయిన్స్ అనే న్యాయవాది ఆరోపించారు. దీనిపై విచారణకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.పట్నాయక్ ఆధ్వర్యంలో ఏక సభ్య విచారణ సంఘం ఏర్పాటయింది కూడా.

### సోనియా గాంధీతో రాజ్‌ఠాక్రే భేటీ

ముంబయి, న్యూస్‌టుడే: మహారాష్ట్ర నవ నిర్మాణ సేన(ఎంఎన్‌ఎస్) అధ్యక్షుడు రాజ్‌ఠాక్రే సోమవారం దిల్లీలో యూపీయే ఛైర్‌పర్సన్ సోనియా గాంధీతో భేటీ అయ్యారు. మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ భేటీ రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## తుపాకీ పేలి సైనికుడి మృతి



అశోక్‌కుమార్

అర్థవీడు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు తుపాకీ పేలి ప్రకాశం జిల్లా అర్థవీడు మండలానికి చెందిన సైనికుడు మృతి చెందారు. మండలంలోని పాపినేనిపల్లికి చెందిన తమ్మినేని అశోక్‌కుమార్(21) జమ్ములోని ఉరి సెక్టార్‌లో సైనికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి దగ్గరున్న తుపాకీ ప్రమాదవశాత్తు పేలటంతో అశోక్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సోమవారం ఆర్మీ అధికారులు బాధిత కుటుంబానికి సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని మంగళ, బుధవారాల్లో అధికారిక లాంఛనాలతో స్వగ్రామం తరలిస్తారని సమాచారం. అశోక్ తండ్రి నరసింహారావు కూడా మాజీ సైనికుడే.

## ఎం.ఫిల్ పరీక్షలు రేపటి నుంచి

ఈనాడు, హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఎం.ఫిల్ పార్ట్-1 ప్రీ పీహెచ్‌డీ పరీక్షలను ఈ నెల 10, 11, 12వ తేదీల్లో నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని మూడు కేంద్రాలకు సంబంధించినవారికి ఈ పరీక్షలు హైదరాబాద్‌లోని ప్రధాన కేంద్రంలో ఉంటాయని వర్సిటీ ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలకు పట్టం!

- 'ఇన్‌స్పైర్' పోటీలకు దరఖాస్తు గడువు ఈ నెలాఖరు
- ఎంపికైన ప్రాజెక్టులకు కేంద్ర సర్కారు సహకారం
- పేటెంట్ పొందేందుకూ అవకాశం

ఈనాడు, అమరావతి: కొత్త ఆలోచనలు, ఆవిష్కరణల కోసం కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం, జాతీయ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నిర్వహించే ఇన్‌స్పైర్ పోటీలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చు. ఈనెల 31లోపు http://www.inspireawards-dst.gov.in లో ప్రతిపాదిత ప్రాజెక్టులను ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాలి. విద్యార్థుల ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోంది. 6-10 తరగతి వరకు ఉండే ఉన్నత పాఠశాల నుంచి ఐదు, 6, 7 తరగతులుండే ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు వంతున ప్రాజెక్టులను పంపవచ్చు.

### ఉత్తమ ఆవిష్కరణలకు పేటెంట్ హక్కు.

ఇన్నోవేషన్ ఫౌండేషన్ పోటీలకు కొన్ని విషయాల(థీమ్స్)ను సూచించింది. భారత్‌లో తయారీ, స్వచ్ఛభారత్, స్వాస్థ్య భారత్, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా థీమ్స్‌తో పాటు సైన్సుకు సంబంధించిన ఏ ప్రాజెక్టునైనా పంపించవచ్చు. నిపుణుల బృందం ఎంపిక చేసిన ప్రాజెక్టుల రూపకల్పనకు కేంద్రప్రభుత్వం రూ.10 వేల వంతున ఆర్థిక సహాయం అందిస్తుంది. వీటితో ప్రాజెక్టులను తయారుచేయాలి. వాటిని జిల్లాస్థాయి పోటీల్లో ప్రదర్శించాలి. అక్కడి నుంచి 10% ప్రదర్శనలను ఎంపిక చేసి, రాష్ట్రస్థాయికి, అక్కడి నుంచి 10% ప్రాజెక్టులను జాతీయస్థాయికి పంపిస్తారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులకు శాస్త్రవేత్తలతో కలిసే అవకాశం కల్పిస్తారు. ఉత్తమ ఆలోచనల నుంచి శాస్త్రవేత్తలు ఆవిష్కరణలు తీసుకొస్తారు. ఇలాంటి వాటికి విద్యార్థుల పేరుతోనే పేటెంట్ హక్కు కల్పిస్తారు. గతేడాది జాతీయస్థాయిలో అత్యధికంగా ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రతిపాదనలు పంపిన మొదటి ఐదు జిల్లాల్లో ఏకంగా నాలుగు (నెల్లూరు, కర్నూలు, తూర్పుగోదావరి, చిత్తూరు) ఆంధ్రప్రదేశ్‌కు చెందినవే కావటం విశేషం.

## సీడీపీవోల వినతి బదిలీలకు కౌన్సెలింగ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీవోల్లో వినతి(రిక్వెస్ట్) బదిలీలకు దరఖాస్తు చేసుకున్న అధికారులకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు క్రితికా శుక్లా కౌన్సెలింగ్ నిర్వహించారు. గుంటూరులోని ఆశాఖ రాష్ట్ర కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాలు, 2, 4 జోన్లకు చెందిన సీడీపీవోలను సోమవారం కౌన్సెలింగ్‌కు పిలిచారు. వైద్య సంబంధ అంశాలు, స్పౌజ్ కేసులను తెలియజేస్తూ బదిలీ చేయాలని పలువురు విజ్ఞప్తి చేయగా.. పరిశీలిస్తామని క్రితికా శుక్లా తెలిపారు. జోన్-3లో ఉన్న గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన వారికి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మొత్తం ప్రక్రియ పూర్తయ్యాక ఒకేసారి బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తామని ఆమె 'ఈనాడు'కు తెలిపారు.

### 'దక్షిణ కోస్తా రైల్వే' ఓఎస్‌డీ బాధ్యతల స్వీకరణ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి రైల్వే మంత్రిత్వ శాఖ నియమించిన ప్రత్యేక అధికారి(ఓఎస్‌డీ)గా ధనుంజయరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఓఎస్‌డీగా ఉన్న శ్రీనివాస్‌కు గుంటూరు డీఆర్‌ఎంగా బదిలీ అయ్యారు. ధనుంజయరావు 1989 నుంచి ఆపరేషన్, కమర్షియల్, భద్రతా విభాగాల్లో విధులు నిర్వర్తించారు.

## అక్టోబరు 31 నుంచి ముంబయిలో ఏఐటీయూసీ శతాబ్ది ఉత్సవాలు




అమర్‌జీత్ కౌర్

విశాఖపట్నం(ఉక్కునగరం), న్యూస్‌టుడే: ఏఐటీయూసీ శతాబ్ది ఉత్సవాలు ఈ ఏడాది అక్టోబరు31 నుంచి నవంబరు3 వరకు ముంబయిలో జరుగనున్నాయి. ఈ మేరకు సంఘ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో తీర్మానించారు. ఈ నెల 6 నుంచి విశాఖలో నిర్వహిస్తోన్న సమావేశాలు సోమవారంతో ముగిశాయి. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఈనెల 15 నుంచి మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు నిర్వహించాలని సమావేశాల్లో నిర్ణయించారు. సంఘ జాతీయ అధ్యక్షుడు రమేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్, ఉపాధ్యక్షులు వి.వి.రామారావు, డి.ఆదినారాయణ, బి.వి.విజయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తకు మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యత!

### పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

బెంగళూరు(యశ్వంతపుర), న్యూస్‌టుడే: పరిశోధనలు చేయాల్సిన శాస్త్రవేత్తకు మరుగుదొడ్లు, దుమ్ము దులిపే నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. బెంగళూరు నగరంలోని ఎలక్ట్రానిక్స్, రాడార్ అభివృద్ధి సంస్థ(ఎల్‌ఆర్‌డీఈ)లో ఈ ఘటన చోటుచేసుకుంది. అవమానాన్ని తట్టుకోలేక బాధిత శాస్త్రవేత్త ఎస్.పి.నాగేష్ పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. 1993 నుంచి తాను ఎల్‌ఆర్‌డీఈలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నానని, తన కులాన్ని ప్రస్తావించి సీనియర్ శాస్త్రవేత్తల్లో కొందరు దూషిస్తున్నారని, అంతర్గతంగా పలు విభాగాలకు తరచూ బదిలీ చేయడంతో పాటు వేధింపులకు గురి చేస్తున్నారని వివరించారు.పోలీసులు కేసు నమోదు చేశారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00